www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 13-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 316 | వరంగల్

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: చవితి మ. 2.43 తదుపరి పంచమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర మ. 12.36 తదుపరి రేవతి; వర్జ్యం: రా.11.40-1.08; దుర్ముహూర్తం: ఉ.9.04-9.50, రా.10.20-11.09; అమృతఘడియలు: ఉ.8.16-9.42; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.47; సూర్యాస్తమయం: 6.13

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మెట్రోకు రూ.1000 కోట్లు!



ఎంపయుడీ కేటాయింపుల నుంచే అందజేత! 14

రెండు, మూడు రోజుల్లో ప్రకటించనున్న మెట్రో అధికారులు

సర్కారు నుంచి 35% నిధులు.. జైకా నుంచి 45% రుణం

మరో 15 శాతం కేంద్ర సాయం.. 5% పీపీపీకి అప్పగింత?

డీపీఆర్‌ను పూర్తి చేసే పనిలో హెచ్ఎంఆర్ అధికారులు

ఉమ్మడి రాష్ట్రంలో కంటే.. గత పదేళ్లలోనే

ఎక్కువ నష్టం

స్వతంత్ర భారత చరిత్రలో కనీవినీ ఎరుగని అవినీతి



తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసిన కేసీఆర్

కృష్ణా జలాల్లో మనకు రావాల్సిన వాటాను ఏపీ తరలించుకుపోతుంటే సహకరించారు

వైఎస్ జగన్‌తో అవగాహన కుదుర్చుకొని ఏపీ ప్రాజెక్టులకు అడ్డంకుల్లేకుండా చేశారు

కేసీఆర్ ఓడిపోతాడని తెలిసే సాగర్ ఆక్రమణ.. జగన్‌తో లాలూచీ పడినందుకు క్షమాపణ చెప్పాలి

శాసనసభలో మంత్రి ఉత్తమ్ ఫైర్.. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులపై కేంద్రాన్ని కలుస్తామని వ్యాఖ్య

కృష్ణా జలాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్.. అధికార, విపక్షాల మధ్య వాడీవేడిగా చర్చ



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో కంటే కూడా గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శాసనసభలో ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో అంతులేని అవినీతి జరిగిందన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాను ఏపీ తరలించుకుపోతుంటే.. కేసీఆర్ సహకరించారని, ఏపీ సీఎం వైఎస్ జగన్‌తో అవగాహన కుదుర్చుకొని వారి ప్రాజెక్టులు పూర్తయ్యేలా చూశారని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కృష్ణా జలాలపై తెలంగాణకు అన్యాయం జరిగిందంటూ సోమవారం శాసనసభలో ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ రూపంలో వివరించారు. దానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు బదులిచ్చేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అధికార, విపక్షాల మధ్య వాడీ వేడి చర్చ జరిగింది. ఉత్తమ్ మాట్లాడుతూ, "ఉమ్మడి రాష్ట్రంలో నదీ జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతుందన్న విషయాన్ని గుర్తించే యూపీఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది. కానీ, ఉమ్మడి రాష్ట్రంలో కన్నా కూడా

మిగతా 12వ పేజీలో...

పాపాల భైరవుడు అసెంబ్లీకి రావాల్సిందే

గత పదేళ్లలో కేసీఆర్ పాపాలపై చర్చ జరగాల్సిందే

పద్మారావుకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలి

కేసీఆర్ సీట్లో ఆయన కూర్చోవడంతో సీఎం సూచన

ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే ప్రసక్తే లేదు

తెలంగాణ, ఏపీ మధ్య నీటి వాటా తేలేదాకా ఒప్పుకోం

అసెంబ్లీలో సర్కారు తీర్మానం.. ఏకగ్రీవంగా ఆమోదం

తీర్మానానికి బీఆర్ఎస్ అనుకూలమా? వ్యతిరేకమా?

కృష్ణా ప్రాజెక్టులపై చర్చలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు

మీ ఏజెంట్లు తట్టాబుట్టా సర్ది పంపిస్తాం

కేసీఆర్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్

హుక్కా బార్లపై నిషేధం.. బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

పార్టీని చీల్చి పాపాలు కడుక్కో!

26 మందిని తెస్తే దేవాదాయ శాఖ!

మామ, బామ్మర్దిని నమ్ముకోవద్దు

హరీశ్‌కు రాజగోపాల్‌రెడ్డి సూచన

12

అవినీతిపై చర్చిద్దామంటే మరికొన్ని రోజులు సభ: దుద్దిళ్ల

సీమకు పరోక్షంగా కేసీఆర్ సహకారం: తుమ్మల

రాజకీయం చేయడానికే నల్లగొండలో సభ: పొన్నం

శ్రీకాంతాచారిని చంపింది నువ్వే! 13

నీకు పెట్రోల్ దొరికింది గానీ..

అగ్గిపెట్టె దొరకలేదా?

హరీశ్‌పై మంత్రి కోమటిరెడ్డి ఫైర్

తెలంగాణ ఏర్పాటుతో

కేసీఆర్‌కు సంబంధమే లేదు

దొంగ దీక్ష, నాటకాలేనని వ్యాఖ్య

నేడు మేడిగడ్డకు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు

మంత్రులు, ఎమ్మెల్సీలు కూడా.. అసెంబ్లీ నుంచి ఉదయం బయలుదేరనున్న బస్సులు

మధ్యాహ్నం 3 గంటలకు బ్యారేజీ వద్దకు.. అక్కడే ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

పర్యటనకు మజ్లిస్, సీపీఐ ఎమ్మెల్యేలు కూడా.. బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు దూరం

కేసీఆర్ సహా 119 మందినీ ఆహ్వానించాం: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి 12



నల్లగొండ సభ దెబ్బకే.. కేఆర్ఎంబీ తీర్మానం!

ఇది బీఆర్ఎస్ సాధించిన విజయం

తీర్మానంపై అభ్యంతరాలు.. అయినా మద్దతు

కృష్ణాజలాలపై ప్రజెంటేషన్ సత్యదూరంగా ఉంది

అధికారులపై నెపాన్ని నెట్టి తప్పించుకునే యత్నం

ప్రాజెక్టుల వారీ కేటాయింపులపై లేఖ రాయాలి

6 నెలల్లోగా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలి

అసెంబ్లీలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): "సాగునీటి ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంటే రాష్ట్ర సర్కారు నిద్రపోయింది. కృష్ణా బోర్డుకు అప్పగించేందుకు అంగీకరించింది. కానీ, నీళ్ల వాటాలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై మా అధినేత కేసీఆర్ నల్లగొండ సభకు పిలుపు ఇవ్వగానే భయపడిపోయింది. బడ్జెట్‌ను పక్కనపెట్టి మరీ కేఆర్ఎంబీ తీర్మానాన్ని తీసుకొచ్చింది. ప్రాజెక్టులను ఇవ్వబోమంటూ కేంద్రానికి లేఖ రాసింది. ఇది బీఆర్ఎస్, రాష్ట్ర ప్రజలు సాధించిన విజయం" అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కృష్ణా జలాలపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) అనంతరం బీఆర్ఎస్ తరఫున హరీశ్ మాట్లాడారు. పీపీటీ సత్యదూరంగా ఉందని ఆరోపించారు. అధికారులపై నెపం మోపి వేసి ప్రభుత్వం తప్పించుకుకోవాలని చూస్తోందని విమర్శించారు. 299 టీఎంసీల అంశానికి కాంగ్రెస్ పార్టీనే కారణమన్నారు. తమ హయాంలో కేఆర్ఎంబీపై రాసిన లేఖలను చూపించారు. ప్రాజెక్టుల అప్పగింతపై

మిగతా 13వ పేజీలో...

సీఎం, మంత్రులను హరీశ్ ఒంటిచేత్తో ఎదుర్కొన్నారు 13

కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టారు

పీపీటీ మాకే అర్థం కాలే.. జనాల సంగతేంటి: కేటీఆర్

నేడు బీఆర్ఎస్ 'చలో నల్లగొండ'

ప్రాజెక్టుల్ని బోర్డుకు అప్పగించొద్దంటూ కేసీఆర్ సభ

దక్షిణ తెలంగాణ జిల్లాల నుంచి జనసమీకరణ 12

సచివాలయ నిర్మాణ ఖర్చెంత?

లెక్కలు దేవుడికెరుక..!



ఆమోదం కంటే తక్కువే అంటున్న ఆర్అండ్‌బీ

సచివాలయ నిర్మాణానికి మంజూరు చేసింది

రూ.617 కోట్లు.. అయిన ఖర్చు 558 కోట్లు

ఆర్టీఐ ప్రశ్నకు రోడ్లు, భవనాల శాఖ జవాబు

ఏడాది క్రితం 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో

అంచనాలు పెరిగినట్టు చెప్పిన నాటి మంత్రి

ఈ రెండింటిలో ఏది నిజం? మతలబేంటి?

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నూతన సచివాలయం నిర్మాణ ఖర్చు విషయంలో అర్ అండ్ బీ అధికారులు ప్రస్తుత ప్రభుత్వానికి సరైన సమాచారం ఇవ్వట్లేదు! ఆర్టీఐ కింద అడిగితే.. గత ప్రభుత్వం దీనికోసం నిధులను కేటాయిస్తూ మంజూరు చేసిన ఒక జీవో కాపీని చూపిస్తున్నారు తప్ప.. వాస్తవంగా ఎంత అయిందనే విషయాన్ని వెల్లడించట్లేదు. సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం, అమరవీరుల స్థూపం నిర్మాణానికి అయిన ఖర్చులపై విచారణ జరుపుతామని ప్రభుత్వం హెచ్చరించినప్పటికీ.. ఇటీవల సమాచార హక్కు చట్టం కింద అడిగిన ఒక ప్రశ్నకు ఆర్ అండ్ బీ అధికారులు ఇదే తీరులో జవాబివ్వడం

మిగతా 14వ పేజీలో...



ఢిల్లీ, యూపీ సరిహద్దుల్లో రోడ్డుపై అడ్డుగా ఏర్పాటు చేసిన సిమెంటు దిమ్మెలు

ఢిల్లీ అష్టదిగ్బంధం

దేశ రాజధానిలో నెల రోజులపాటు 144 సెక్షన్ అమలు

నేడు రైతుల 'చలో ఢిల్లీ' ఆందోళన నేపథ్యంలో పోలీసుల ఆంక్షలు

భారీఎత్తున భద్రతా ఏర్పాట్లు.. ఎక్కడికక్కడ బారికేడ్ల ఏర్పాటు

జాతీయ రహదారులను మూసివేసిన ఢిల్లీ పొరుగు రాష్ట్రాలు

నగరంలోకి ట్రాక్టర్లు, ట్రక్కులు, ట్రాలీల రాకపై నిషేధం 2

20 వేలమంది రైతులు ఆందోళనలో పాల్గొనే అవకాశం

రాచకొండ సీపీగా తరుణ్ జోషి

చౌహాన్ తిరిగి జోగులాంబ జోన్‌కు

వివాదాస్పద నవీన్ డీజీపీ ఆఫీసుకు

12 మంది ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. రాచకొండ సీపీ సహా 12 మంది ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. నలుగురు నాన్ కేడర్ ఎస్పీలు, 39 మంది అడిషనల్ ఎస్పీలు, 110 మంది డీఎస్పీలకు స్థానచలనం కలిగింది. నలుగురు ఐఏఎస్‌లు కూడా బదిలీ అయ్యారు. రాచకొండ సీపీగా డాక్టర్ తరుణ్ జోషి నియమితులయ్యారు. ఇప్పటి వరకు రాచకొండ

మిగతా 14వ పేజీలో...



ఖతార్‌లో 8 మంది భారతీయుల విడుదల

అందరూ భారత నౌకాదళ మాజీ అధికారులే

గూఢచర్యం ఆరోపణలపై 18 నెలల క్రితం అరెస్టు

ప్రాథమిక విచారణ అనంతరం మరణశిక్ష ఖరారు

అనంతరం శిక్షగా మార్పు.. ఇప్పుడు విడుదల

ఇప్పటికే స్వదేశానికి తిరిగివచ్చిన ఏడుగురు 2

14న ప్రధాని దోహా పర్యటన: విదేశాంగ శాఖ

ఉద్యోగ అర్హత వయసు పెంపు

రెండేళ్లు పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు

46 ఏళ్లకు చేరిన వయో పరిమితి

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాల అర్హత వయసును రెండేళ్లు పెంచారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు (జీవో నంబరు ఎంఎస్-30) జారీ చేశారు. ఈ నిర్ణయంతో జనరల్ కేటగిరీ అభ్యర్థుల ఉద్యోగ అర్హత వయసు 46 ఏళ్లకు పెరిగింది. రిజర్వేషన్ అభ్యర్థులకు ఆయా కేటగిరీల వారీగా గరిష్ఠ అర్హత వయసు అమలు పరచనున్నారు. గ్రూపు-1 పోస్టులకు సంబంధించిన పరీక్ష రద్దు, తిరిగి నోటిఫికేషన్ జారీ

మిగతా 14వ పేజీలో...

బిచ్చగాణ్ని కర్రలతో కొట్టి చంపేశారు



పిల్లల్ని ఎత్తుకెళ్లేవాడనుకొని అపోహపడ్డ స్థానికులు

లంగా, రవిక, ముఖానికి దస్తీతో చిత్రమైన ఆహార్యం

ప్రశ్నించినా బదులివ్వకపోవడంతో అనుమానం 3

నిజామాబాద్ పట్టణంలో ఘటన.. ఐదుగురిపై కేసు

మేం పిల్లలనెత్తుకెళ్లం.. అన్నీ వదంతులే: ట్రాన్స్‌జెండర్లు



ఈ-చాపర్ల తయారీకి మారుతీ సుజుకీ రెడీ

- డ్రోన్లకన్నా పెద్దవి.. హెలికాప్టర్ల కన్నా చిన్నవి
- 'మేకిన్ ఇండియా'లో భాగంగా ఇక్కడ తయారీపై డీజీసీఏతో సుజుకీ చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఒక్కసారి ఊహించుకోండి. మీరు ఆన్‌లైన్‌లో బుక్ చేయగానే.. తేలికపాటి ఎలక్ట్రిక్ ఎయిర్‌కాప్టర్ ఒకటి వచ్చి మీ ఇంటిపైన దిగుతుంది. ఎంచక్కా మీరు మెట్లెక్కి మీ మేడ మీదకు వెళ్లి అందులో ఎక్కగానే నిట్టనిలువుగా పైకి లేచి గాల్లోకి రయ్యిన దూసుకుపోతుంది. జాయ్‌గా గాల్లోనే ప్రయాణించి మీ ఆఫీసు రూఫ్‌టాప్ మీద దిగుతుంది. ఊహించుకోవడానికి ఇదేదో హాలీవుడ్ డిస్టోపియన్ సినిమాలో సీన్‌లా అనిపించొచ్చుగానీ.. ఏమో, త్వరలోనే మీ ఇంటి పైనుంచే ఈ ఎలక్ట్రిక్ ఎయిర్‌కాప్టర్ ఎగరావచ్చు! ఎందుకంటే.. దేశంలోనే అతి పెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీ.. 'స్కై డ్రైవ్' పేరుతో ఈ తరహా ఎలక్ట్రిక్ ఎయిర్ కాప్టర్ల తయారీకి సిద్ధమైంది. ఇవి సంప్రదాయ హెలికాప్టర్లంత బరువు ఉండవు. వాటిలో సగం బరువు మాత్రమే ఉంటాయి. వాటిలాగా వీటికి ఇంధనం అక్కర్లేదు. అచ్చం డ్రోన్లలాగా బ్యాటరీ పవర్‌తో రయ్యిన దూసుకుపోతాయి. వీటిలో ముగ్గురు ప్రయాణించడానికి అవకాశం ఉంటుంది. ఇప్పుడు మనందరికీ తెలిసిన ఉబెర్, ఓలా తరహాలో.. భవిష్యత్తులో పట్టణ ప్రాంతాల్లో రవాణాకు కీలకంగా ఉపయోగపడతాయి. 2025లో జపాన్‌లో జరిగే ఒసాకా ఎక్స్‌పోలో వీటిని ప్రదర్శనకు పెట్టే అవకాశం ఉన్నట్టు సమాచారం. అయితే.. భారత్‌లోకి రావడానికి ముందు మారుతి సుజుకీ ఈ వాహనాలను అమెరికా, జపాన్ మార్కెట్లలోకి అందుబాటులోకి తేనుంది. ప్రస్తుతానికి వీటి రేంజ్ 15 కిలోమీటర్లు. అంటే ఒకసారి గాల్లోకి లేస్తే 15 కిలోమీటర్ల వరకూ వెళ్లగలవు. 2031 నాటికి 40 కిలోమీటర్లకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు సుజుకీ తెలిపింది. అలాగే.. 'మేకిన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా వీటిని భారత్‌లోనే తయారుచేయడానికి డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్)తో సంప్రదింపులు జరుపుతున్నట్టు ఒగురా వెల్లడించింది.



తమిళనాడులో మళ్లీ గవర్నర్ X సర్కార్

- అసెంబ్లీలో ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించిన గవర్నర్
- ప్రభుత్వం, స్పీకర్‌పై విమర్శలు.. సభలో రసాభాస

చెన్నై, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంపై వివాదం చోటుచేసుకుంది. గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రసంగాన్ని తన ఇష్టానుసారంగా మార్చుకుని చదివిన గవర్నర్ ఆర్ఎన్ రవి.. ఈ ఏడాది ప్రసంగ పాఠాన్ని క్లుప్తంగా చదివి, ఆపై ప్రభుత్వం, స్పీకర్‌పై కొన్ని వ్యాఖ్యలు చేసి కూర్చుండిపోయారు. దీంతో సభ దిగ్భ్రాంతికి లోనైంది. స్పీకర్ అప్పావు మైకు తీసుకుని.. గవర్నర్ ప్రసంగం తమిళ అనువాదాన్ని చదివారు. చివరన ఆయన గవర్నర్‌పై కొన్ని వ్యాఖ్యలు చేశారు. అనంతరం జాతీయ గీతాలాపన ఉంటుందని ప్రకటించారు. అయితే అప్పటి వరకూ అక్కడే కూర్చున్న గవర్నర్.. స్పీకర్ తనపై చేసిన వ్యాఖ్యల గురించి తెలుసుకుని జాతీయ గీతాలాపన ప్రారంభం కాబోతున్న సమయంలో లేచి వెళ్లిపోయారు. అనంతరం మంత్రి దురైమురుగన్ లేచి.. గవర్నర్ ప్రసంగ పాఠాన్ని యథాతథంగా ఆమోదిస్తూ తీర్మానం చేయగా, సభ్యులు మూజువాణి ఓటుతో ఆమోదించారు. అంతేగాక సభలో గవర్నర్, స్పీకర్ చేసిన కొన్ని వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగిస్తూ మరో తీర్మానం చేశారు. కాగా, సభలో జరిగిన వ్యవహారంపై రాజ్‌భవన్ వివరణ ఇచ్చింది. ప్రభుత్వం రూపొందించిన ప్రసంగంలో పలు అవాస్తవాలు, ప్రజలను తప్పుదారి పట్టించే అంశాలు ఉన్నాయన్నాయని పేర్కొంది. అయితే రాజ్‌భవన్ ప్రకటనను తమిళనాడు న్యాయశాఖ మంత్రి మూర్తి తీవ్రంగా ఖండించారు. గవర్నర్ ప్రసంగంలో ముందుగా ఎలాంటి మార్పులు చేర్పులు సూచించలేదన్నారు. ప్రసంగంలో అసత్యాలున్నాయని గవర్నర్ పేర్కొనడం సమంజసం కాదన్నారు.

ఈపీఎస్ కనీస పింఛన్‌లో మార్పు లేదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఈపీఎస్ ఉద్యోగులకు సంబంధించిన నెలవారీ కనీస పింఛన్ రూ.1000ని రెట్టింపు చేసే ప్రతిపాదనను కేంద్ర ఆర్థిక శాఖ తిరస్కరించింది. ఈ ప్రతిపాదన ప్రకారం రూ.1000గా ఉన్న కనీస పింఛను రూ.2000 కావాల్సి ఉంది. ఈ మేరకు ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌వో)కు చెందిన ఉన్నత స్థాయి నిర్ణాయక బోర్డు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్(సీబీటీ) రూ.1000 పింఛనును రూ.2000లకు పెంచాలని ఇటీవల ప్రతిపాదించగా శనివారం ఆర్థిక శాఖ దీనిని తోసిపుచ్చింది. "రిటైర్డ్ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మేం ఈ ప్రతిపాదన చేశాం. కానీ, ఆర్థిక శాఖ అంగీకరించలేదు" అని సీబీటీ తెలిపింది.

మనీష్ సిసోడియాకు మూడు రోజుల బెయిల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఢిల్లీ ఎక్సయిజ్ విధానం కుంభకోణం కేసులో అరెస్టయిన ఆప్ నాయకుడు మనీష్ సిసోడియాకు సోమవారం ఇక్కడి ప్రత్యేక కోర్టు మూడు రోజుల బెయిల్ మంజూరు చేసింది. మేనకోడలి వివాహానికి హాజరయ్యేందుకు మంగళవారం నుంచి గురువారం వరకు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. గత ఏడాది ఫిబ్రవరి 26న సీబీఐ ఆయనను అరెస్టు చేసి తీహార్ జైలుకు తరలించింది. కాగా, మనీలాండరింగ్ వ్యవహారంలో ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరేన్ ఈడీ రిమాండ్‌ను మరో మూడు రోజుల పాటు పొడిగిస్తూ రాంచీలోని ప్రత్యేకకోర్టు ఆదేశించింది. ఇదిలా ఉండగా, మనీలాండరింగ్ కేసులో విచారణ నిమిత్తం మంగళవారం శ్రీనగర్‌లోని తమ కార్యాలయానికి రావాలంటూ ఈడీ జమ్మూ-కశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా (86)కు తాజాగా సమన్లు పంపించింది.

సెంథిల్ బాలాజీ రాజీనామా?

చెన్నై, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ తన పదవికి రాజీనామా చేసినట్టు తెలిసింది. విద్యుత్తు శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పి అనేకమంది వద్ద డబ్బులు వసూలు చేసినట్టు గతేడాది ఆరోపణలు రావడంతో ఆయన నివాసం, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. ఆ తర్వాత జూన్ 14న సెంథిల్ బాలాజీని అరెస్టు చేశారు. అప్పటినుంచి ఆయన ఏ శాఖ లేని మంత్రిగా కొనసాగుతున్నారు. ఇదిలా ఉంటే, సెంథిల్ బాలాజీ బెయిల్ పిటిషన్లు ట్రయల్ కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు వరుసగా తిరస్కరణకు గురయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేసినట్టు తెలిసింది.

నేవీ మాజీ అధికారుల విడుదల

గూఢచర్యం ఆరోపణలతో 18 నెలల క్రితం ఖతార్‌లో 8 మంది భారతీయ అధికారుల అరెస్టు

- తొలుత మరణశిక్ష విధింపు
- తర్వాత జైలు శిక్షగా మార్పు
- ఇప్పుడు అందరి విడుదల


సోమవారం ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న నేవీ మాజీ అధికారులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఖతార్‌లో జైలుశిక్ష అనుభవిస్తున్న ఎనిమిది మంది భారత నౌకాదళ మాజీ సిబ్బందిని అక్కడి ప్రభుత్వం విడుదల చేసింది. వీరిలో ఏడుగురు సోమవారం తెల్లవారుజామున స్వదేశానికి తిరిగి వచ్చారు. గూఢచర్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై 2022 అక్టోబరులో వీరిని ఖతార్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణ అనంతరం కోర్టు గతేడాది అక్టోబరు 26న వీరికి మరణదండన విధించింది. ఆ తర్వాత భారత ప్రభుత్వం చేసిన దౌత్య యత్నాలు ఫలించడంతో ఈ కేసులో మరోసారి విచారణ జరిపిన న్యాయస్థానం... గత డిసెంబరు 28న మరణ దండనను జైలుశిక్షగా మార్చింది. ఇప్పుడు దాన్ని కూడా సడలిస్తూ వీరిని విడుదల చేసింది. విడుదలైన వారిలో రిటైర్డ్ కెప్టెన్లు నవతేజ్ గిల్, సౌరభ్ వశిష్ఠ్, రిటైర్డ్ కమాండర్లు పూర్ణేందు తివారీ, అమిత్ నాగ్‌పాల్, ఎస్‌కే గుప్తా, బీకే వర్మ, సుగుణాకర్ పాకాల(విశాఖపట్నం), రిటైర్డ్ సెయిలర్ రాగేశ్ ఉన్నారు. కమాండర్ తివారీ దోహాలోనే ఉండిపోయారు.

అతిపెద్ద దౌత్య విజయం

నేవీ మాజీ అధికారుల విడుదల భారత్‌కు దక్కిన అతిపెద్ద దౌత్య విజయంగా బీజేపీ అభివర్ణించింది. విడుదలైన అధికారుల కుటుంబాలకు కాంగ్రెస్ శుభాకాంక్షలు తెలిపింది. ఇందు కోసం కృషి చేసిన వారందరినీ ఆ పార్టీ అభినందించింది. ఖతార్‌తో చర్చల్లో జాతీయ భద్రతా సలహాదారు దోబాల్ కీలక పాత్ర పోషించారు.

చివరిదాకా గోప్యతే

ఖతార్ జైలులో ఉన్న నేవీ మాజీ అధికారులకు చివరి క్షణం వరకూ తాము విడుదల అవుతున్న విషయం తెలియదు. సామగ్రి ప్యాక్ చేసుకొని ఉదయం 9గంటల కల్లా సిద్ధంగా ఉండాలని ముందురోజు రాత్రి జైలర్లు వారికి సమాచారం ఇచ్చారు. దీంతో తమను ఎక్కడకు తరలిస్తున్నారోనని వారిలో టెన్షన్ మొదలైంది. మర్నాడు ఉదయం వారిని తొలుత రాయబార కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం విమానాశ్రయానికి తరలించారు. వారు ఎక్కిన ఇండిగో విమానం సోమవారం తెల్లవారుజామున 2గంటలకు ఢిల్లీలో దిగడంతో అందరూ ఒక్కసారిగా సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. 'భారత్ మాతా కీ జై' అంటూ ఢిల్లీ ఎయిర్‌పోర్టులో పెద్దపెట్టున నినాదాలు చేశారు. "మేమంతా భారత్‌కు తిరిగి రావడం చాలా సంతోషంగా ఉంది. మాతో పాటు మా కుటుంబ సభ్యులు కూడా ఈ క్షణం కోసం ఎంతోకాలంగా ఎదురు చూస్తున్నారు. ప్రధాని మోదీ వ్యక్తిగతంగా జోక్యం చేసుకోకపోతే ఇదంతా సాధ్యమయ్యేది కాదు. ఆయనకు మా కృతజ్ఞతలు' కాగా, గూఢచర్యం ఆరోపణలపై ఖతార్ కోర్టు పూర్ణేందు తివారీకి 25ఏళ్లు, మరో నలుగురికి 15 ఏళ్లు చొప్పున, ఇద్దరికి పదేళ్లు చొప్పున., రాగేశ్‌కు మూడేళ్ల జైలుశిక్ష విధించింది.

ప్రధాని మోదీ పర్యవేక్షణలోనే...: కేంద్రం

ఖతార్ జైలులో ఉన్న ఎనిమిది మంది నేవీ మాజీ అధికారులను విడిపించేందుకు భారత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను ప్రధాని మోదీ స్వయంగా పర్యవేక్షించారని విదేశాంగ శాఖ తెలిపింది. వారి విడుదల ఆయన నాయకత్వ ప్రతిభకు, భారత్-ఖతార్ మధ్య బలమైన సంబంధాలకు నిదర్శనమని పేర్కొంది. తాజా పరిణామాల నేపథ్యంలో యూఏఈ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఈ నెల 14న దోహాలో పర్యటించనున్నారని వెల్లడించారు. కాగా, నేవీ మాజీ అధికారుల విడుదల మోదీతోనే సాధ్యమైందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.

బలపరీక్ష నెగ్గిన నితీశ్!



పట్నా, ఫిబ్రవరి 12: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జేడీయూ-బీజేపీ సర్కారు బలపరీక్ష నెగ్గింది. సోమవారం బిహార్ అసెంబ్లీలో పలు నాటకీయ పరిణామాల మధ్య నితీశ్ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో విజయం సాధించింది. తొలుత సీఎం నితీశ్‌కుమార్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌ల మధ్య మాటల యుద్ధం నడిచింది. నితీశ్ సభలో మాట్లాడుతూ.. ఆర్జేడీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆర్జేడీ ప్రభుత్వ హయాంలో భారీగా అవినీతి జరిగిందని, దానిపై తమ (ఎన్డీయే) సర్కారు దర్యాప్తు చేపడుతుందని వెల్లడించారు. 2005కు ముందు బిహార్‌లో ఆర్జేడీ ప్రభుత్వ పాలనలో శాంతిభద్రతలే లేవని, మతపరమైన హింసాత్మక ఘటనలు అనేకం జరిగాయని ఆరోపించారు. ఆర్జేడీ నేత, మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్.. నితీశ్‌పై మండిపడ్డారు. 'పల్టు కుమార్' అంటూ విమర్శలు గుప్పించిన ప్రధాని మోదీతోనే నితీశ్ చేతులు కలిపారని ధ్వజమెత్తారు. నితీశ్ మళ్లీ కూటమి మారరని మోదీ గ్యారెంటీ ఇవ్వగలరా? అని ప్రశ్నించారు. బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వడం కూడా బీజేపీ-జేడీయూ డీల్‌లో భాగమేనని ఆరోపించారు. తేజస్వి ప్రసంగం తర్వాత ఆర్జేడీ, కాంగ్రెస్, లెఫ్ట్ ఫ్రంట్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. సభలో విశ్వాస పరీక్షకు ముందు స్పీకర్ అవధ్ బిహారీ చౌధరిపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఆయన ఆర్జేడీ సభ్యుడు. చౌధరికి వ్యతిరేకంగా 125 మంది సభ్యులు ఓటేయడంతో ఆయన్ను స్పీకర్‌గా తొలగించారు. అనంతరం జరిగిన బలపరీక్షలో నితీశ్ ప్రభుత్వానికి అనుకూలంగా 130 ఓట్లు లభించాయి. మొత్తం 243 మంది సభ్యులున్న శాసనసభలో మెజారిటీ మార్కు 122 కాగా.. ఆర్జేడీ, కాంగ్రెస్, లెఫ్ట్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేయడంతో జేడీయూ-బీజేపీ సర్కారుకు 130-0 ఓట్లు దక్కాయి. ఇందులో ఆర్జేడీకి చెందిన ముగ్గురు సభ్యుల ఓట్లు కూడా ఉండడం విశేషం.

కమలంలోకి కమల్‌నాథ్?

భోపాల్, ఫిబ్రవరి 12: మధ్యప్రదేశ్ మాజీ సీఎం, సీనియర్ కాంగ్రెస్ నేత కమల్‌నాథ్ బీజేపీలో చేరుతారంటూ ఊహాగానాలు వ్యాపించాయి. దాంతో ఆయనను బుజ్జగించేందుకు కాంగ్రెస్ చర్యలు ప్రారంభించిందని కూడా తెలిసింది. ఏప్రిల్ రెండో తేదీన రాష్ట్రానికి చెందిన 5 రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. అందులో 4 బీజేపీకి చెందినవి కాగా, ఒకటి కాంగ్రెస్‌ది. బీజేపీకి చెందిన ఒక రాజ్యసభ స్థానాన్ని కమల్‌నాథ్‌కు ఇస్తారంటూ వదంతులు వ్యాపించాయి. కమల్‌నాథ్ కుమారుడు నకుల్‌నాథ్ ప్రస్తుతం మధ్యప్రదేశ్ నుంచి గెలిచిన ఏకైక కాంగ్రెస్ ఎంపీగా ఉన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఆయనను చింద్వారా నుంచి బీజేపీ తరఫున పోటీ చేసేందుకు టిక్కెట్ ఇస్తారని, కేంద్ర మంత్రివర్గంలో కూడా చోటు కల్పిస్తారని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కమల్‌నాథ్ కాంగ్రెస్ అభ్యర్థిగా చింద్వారా నుంచి తొమ్మిదిసార్లు విజయం సాధించడం గమనార్హం. కమల్‌నాథ్‌ను బీజేపీలోకి తీసుకునేందుకు గతంలోనే ప్రయత్నాలు జరిగినా ఫలించలేదని సమాచారం. ఇటీవల మళ్లీ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఇతర రాష్ట్ర నాయకులు చర్చలు జరిపినట్టు తెలిసింది.

పాకిస్థానీలు భారత్‌కు అతిపెద్ద సంపద



లాహోర్, ఫిబ్రవరి 12: వివాదాలకు కేంద్రం వంటి కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి మణి శంకర్ అయ్యర్ మరోసారి తీవ్ర వివాదానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం పాకిస్థాన్‌లోని లాహోర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. పాక్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. పాకిస్థానీలు భారత్‌కు అతి పెద్ద సంపద అని అభివర్ణించారు. కరాచీలో దౌత్యవేత్తగా పనిచేసిన కాలంలో తనను, తన భార్యను ఇక్కడి వారు ఎంతో ఆప్యాయంగా చూసుకున్నారని తెలిపారు. "మీరు(పాకిస్థానీలు) ఒక విషయం గుర్తుంచుకోవాలి. భారత్‌లో మోదీకి ఎప్పుడూ మూడింట ఒక వంతు కంటే ఎక్కువ ఓట్లు రాలేదు. దీనిని బట్టి మూడింట రెండు వంతుల మంది భారతీయులు మీవైపే ఉన్నారు" అని అయ్యర్ వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌తో చర్చలు జరిపేందుకు నిరాకరిస్తూ ప్రధాని మోదీ 'అతిపెద్ద తప్పు' చేశారని అన్నారు. "మీపై సర్జికల్ స్ట్రయిక్స్ చేసే ధైర్యం మాకుంది. కానీ, కూర్చుని చర్చించుకునే ధైర్యం మాత్రం లేదు" అని చెప్పుకొచ్చారు.

కాంగ్రెస్‌కు అశోక్ చవాన్ గుడ్ బై



ముంబై, ఫిబ్రవరి 12: సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్‌కు గట్టి షాక్ తగిలింది. మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ సోమవారం ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఆయన భాజపాలో చేరే అవకాశం ఉందని సమాచారం. రాజీనామా తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి దాకా కాంగ్రెస్ కోసం నిజాయితీగా పనిచేశానని, వ్యక్తిగత కారణాల వల్ల పార్టీని వీడుతున్నానని తెలిపారు. ఆయన 2008 నుంచి 2010 వరకు సీఎంగా పనిచేశారు. 'ఆదర్శ్ హౌసింగ్ సొసైటీ స్కాం'లో ఆయన పాత్ర ఉందన్న ఆరోపణలతో సీఎం పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. భవిష్యత్తు కార్యాచరణపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని చవాన్ చెప్పారు. ఈ విషయంపై బీజేపీ నేత దేవేంద్ర ఫడణవీస్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లోని పలువురు మంచి నాయకులు బీజేపీతో టచ్‌లో ఉన్నారన్నారు. కాగా, అశోక్ చవాన్ నమ్మకద్రోహి అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. నిన్నటి వరకు సీట్ల పంపకంపై చర్చల్లో పాల్గొన్న చవాన్ కాంగ్రెస్‌ను వీడడం ఆశ్చర్యం కలిగిస్తోందని ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు.

చైనా హైపవర్ మైక్రోవేవ్ ఆయుధం

కదిలే ట్రక్కుల్లోంచి ఉపయోగించే వీలు

- డ్రోన్లు, విమానాలు, శాటిలైట్లను సైతం నిర్వీర్యం చేయగలిగే సత్తా గల వెపన్!
- అందుబాటులోకి వచ్చేది కొన్నాళ్లతర్వాతే



బీజింగ్, ఫిబ్రవరి 12: కదిలే ట్రక్కు నుంచి సైతం ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఉపయోగించగలిగే అత్యంత శక్తిమంతమైన మైక్రోవేవ్ (హెచ్‌పీఎం) ఆయుధాన్ని చైనా శాస్త్రజ్ఞులు తయారుచేయగలిగారు! ఈ తరహా ఆయుధాల తయారీలో ఎదురయ్యే ఇబ్బంది.. అత్యధిక ఉష్ణోగ్రతలు. 'స్టిర్లింగ్ ఇంజన్'ల సాయంతో ఆ అడ్డంకిని కూడా వారు అధిగమించారు. మైక్రోవేవ్ వెపన్స్‌ను వినియోగించడానికి సాధారణంగా అయ్యే శక్తిలో ఐదు వంతు శక్తి చాలు దీన్ని వాడడానికి. అంతేకాదు.. నిరంతరాయంగా నాలుగు గంటలపాటు దాన్ని వినియోగించవచ్చని దాని రూపకర్తలు చెబుతున్నారు. అలాగే.. ప్రపంచంలోనే స్టిర్లింగ్ ఇంజన్ టెక్నాలజీతో పనిచేసే తొలి హెచ్‌పీఎం ఆయుధం ఇది. ఇంతకీ ఏమిటీ మైక్రోవేవ్ ఆయుధం? అంటే.. గత ఏడాది అక్టోబరులో హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్ సరిహద్దులోని వాచ్‌టవర్లపైన, సెక్యూరిటీ కెమెరాలపైన పెద్ద సంఖ్యలో డ్రోన్‌లతో దాడులు చేశారు గుర్తుందా? వాచ్‌టవర్లు కూలిపోయి, సెక్యూరిటీ కెమెరాలు ధ్వంసం కావడంతో అసలేం జరుగుతోందో తెలుసుకోవడానికే ఇజ్రాయెల్ సేనలకు చాలా సమయం పట్టింది. ఈలోగా ఉగ్రవాదులు సరిహద్దులు దాటొచ్చి నరమేధం సాగించారు. ఇలాంటి డ్రోన్ల గుంపులను సమర్థంగా ఎదుర్కొని నాశనం చేసే సత్తా కలిగిన ఆయుధాలు.. హైపవర్ మైక్రోవేవ్ వెపన్స్. ఇలాంటి డ్రోన్లు పెద్ద సంఖ్యలో దూసుకొచ్చినప్పుడు.. శక్తిమంతమైన విద్యుదయస్కాంత తరంగాలను వాటిపైకి ప్రసరింపజేయడం ద్వారా వాటిలోని ఎలక్ట్రానిక్ వ్యవస్థలు పనికిరాకుండా చేస్తాయి. దీంతో ఆ డ్రోన్లు వాటంతటవే కింద పడి పాడైపోతాయి. ఇలాంటి ఆయుధాలను అమెరికా, చైనా, రష్యా సహా పలు దేశాలు ఈ ఆయుధాలను చాలా కాలంగా అభివృద్ధి చేస్తున్నాయి. అయితే చైనా ప్రస్తుతం తయారుచేసినట్టు చెబుతున్నది డ్రోన్లనే కాక.. శత్రువుల యుద్ధవిమానాలను, ఉపగ్రహాలను సైతం నిర్వీర్యం చేయగలదని చెబుతున్నారు. అయితే.. యుద్ధరంగంలో దాన్ని ఉపయోగించడానికి ఇంకా కొంత సమయం పడుతుందని రూపకర్తలు పేర్కొన్నారు. ప్రస్తుతానికి ఈ వెపన్ ప్రాథమిక స్థాయిలోనే ఉందని, దాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

ట్రక్కులో పట్టేస్తుంది..

సాధారణంగా హైపవర్ మైక్రోవేవ్ ఆయుధాలు పరిమాణంలో చాలా పెద్దగా ఉంటాయి. వాటిని పనిచేయించడానికి చాలా ఎక్కువ శక్తి కావాలి. అందుకు భారీగా ఖర్చవుతుంది. కానీ, తాము అభివృద్ధి చేసిన వెపన్‌కు అంత శక్తి అవసరం లేదని.. పైగా దాన్ని సులభంగా ఒక ట్రక్కులో పెట్టి ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకెళ్లి ఉపయోగించవచ్చని, ప్రయాణంలో కూడా ఉపయోగించవచ్చని చైనా శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. దీని తయారీకి వారు వాడిన అత్యంత అధునాతనమైన సూపర్ కండక్టింగ్ టేప్ (రెబ్కో టేప్) కూడా చైనాలో తయారైనదే. చైనా ఆ రెబ్కో టేప్ తయారు చేయడానికి కారణమెవరో తెలుసా? అమెరికా. కరోనాను ప్రపంచం మీదకు వదిలిందన్న కోపంతో 2017లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాపై ఆంక్షలు విధించారు గుర్తుందా? అప్పుడు తనకు కలిగిన ఇబ్బందిని సవాల్‌గా తీసుకుని చైనా ఈ టెక్నాలజీని అభివృద్ధి చేసింది.

గత ప్రభుత్వం కంటే ఎక్కువ ఉద్యోగాలిచ్చాం..: మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: తమ పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువ ఉద్యోగాలిచ్చామని ప్రధాని మోదీ అన్నారు. నియామక ప్రక్రియను పారదర్శకంగా మార్చామని.. జాప్యం లేకుండా సకాలంలో ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని చెప్పారు. 'రోజ్‌గార్ మేళా'లో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధించిన లక్షకు పైగా మందికి సోమవారం ఆయన నియామక పత్రాలను వర్చువల్‌గా అందజేశారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియను జాప్యం చేస్తూ గత ప్రభుత్వం లంచగొండితనాన్ని పెంచి పోషించిందన్నారు. యువతకు ఇప్పుడు సమాన అవకాశాలున్నాయని.. ప్రతిభ, కృషి ఉంటే ప్రభుత్వ ఉద్యోగం పొందవచ్చని నమ్ముతున్నారని చెప్పారు.

నియంతృత్వం దిశగా దేశం!

పౌర, మానవహక్కుల సంఘాలకు చెందిన నేతల ఆందోళన.. ఉపా, సీఏఏ రద్దుకు డిమాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: నియంతృత్వం దిశగా దేశం అడుగులు వేస్తోందని పౌర, మానవహక్కుల సంఘాలకు చెందిన 100 మందికిపైగా నేతలు, అఖిల భారత సర్వీసుల మాజీ అధికారులు, మీడియా ప్రతినిధులు, విద్యావేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జమ్ము కశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా అధ్యక్షతన శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు 'ప్రజాస్వామ్య సదస్సు' నిర్వహించారు. ఈ సదస్సులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సల్మాన్ ఖుర్షిద్, మనీష్ తివారీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఎంపీ కపిల్ సిబల్ సహా అనేక మంది పాల్గొన్నారు. కేంద్రం తాజాగా తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య బిల్లులపై మరోసారి సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఇవి.. కేవలం అనుమానంతో వ్యక్తులను అరెస్టు చేసేందుకు, రహదారుల దిగ్బంధం వంటి శాంతియుత నిరసనలను కూడా తీవ్రవాదంగా పరిగణించేందుకు విస్తృత అవకాశం కల్పిస్తున్నాయని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఉపా, జమ్ముకశ్మీర్ పబ్లిక్ సేఫ్టీ యాక్ట్(పీఎస్ఏ) వంటి క్రూరమైన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని విమర్శించే వారిని లక్ష్యంగా చేసుకుని మనీలాండ రింగ్ చట్టాన్ని ప్రయోగించడం మానుకోవాలన్నారు. 2019 నాటి పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

యూపీలో రాహుల్ యాత్ర కుదింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జోడో న్యాయ యాత్ర నిడివిని తగ్గించాలని ఆ పార్టీ యోచిస్తున్నట్టు తెలిసింది. దీనికోసం ఉత్తరప్రదేశ్ రూట్‌మ్యాప్ నుంచి పశ్చిమ నియోజకవర్గాలను చాలావరకు మినహాయించినట్టు సమాచారం. 'ఇండియా' భాగస్వామి ఆర్ఎల్‌డీ పార్టీ నేత, మాజీ ప్రధాని చరణ్‌సింగ్ మనవడు జయంత్ చౌధరికి ఈ నియోజకవర్గాల్లో బలం ఉంది. అయితే, ఆయన తన తాతయ్యకు భారత రత్న ప్రకటించిన నేపథ్యంలో ఎన్డీయేలోకి చేరడానికి సన్నాహాలు చేసుకుంటున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ కారణంగానే ఆ రాష్ట్రంలో యాత్ర మార్గాన్ని కుదించినట్టు వస్తున్న వార్తలను కాంగ్రెస్ వర్గాలు ఖండించాయి. ఈ మార్పులకు రెండు కారణాలు ఉన్నట్టు తెలిపాయి. రాహుల్ ఎక్కువమందిని కలిసేందుకు వీలుగా యాత్ర వేగాన్ని తగ్గించడానికే కొన్ని నియోజకవర్గాలను మినహాయించినట్టు ఈ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే, యాత్రను వీలైనంత త్వరగా ముగించుకుని లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఎక్కువ సమయం గడపాలనేదీ దీనికొక కారణమని తెలిపాయి. షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల 20వ తేదీన ముంబై చేరడంతో యాత్ర ముగియాలి. ఆ రోజు 'ఇండియా' భాగస్వాములతో ముంబైలో భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది.

ఢిల్లీ అష్ట దిగ్బంధం

- దేశ రాజధానిలో నెల రోజులు 144 సెక్షన్
- నేడు రైతుల "చలో ఢిల్లీ" నేపథ్యంలో ఆంక్షలు
- నగరంలోకి ట్రాక్టర్లు, ట్రక్కుల రాకపై నిషేధం

ఢిల్లీ, యూపీ సరిహద్దులో రోడ్డుపై కాంక్రీటుతో గోడ కడుతున్న దృశ్యం


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఇసుక సంచులు.. ముళ్ల కంచెలు, కాంక్రీట్ దిమ్మెలు.. అల్లర్ల నిరోధక బలగాలు.. ఎక్కడికక్కడ సరిహద్దుల మూసివేత.. డ్రోన్లతో నిఘా.. ప్రజలు గుమిగూడడంపై ఆంక్షలు..! ఇదీ దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుత పరిస్థితి. అన్ని పంటలకు కనీస మద్దతు ధరకు హామీనిస్తూ చట్టం తేవాలని, రుణ మాఫీ, పింఛన్లు తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ పార్లమెంటు ముట్టడికి రైతు సంఘాలు మంగళవారం "చలో ఢిల్లీ" కార్యక్రమం తలపెట్టిన నేపథ్యంలో పోలీసులు, భద్రతా దళాలు అత్యంత అప్రమత్తమయ్యాయి. నగరాన్ని అష్ట దిగ్బంధం చేశాయి. దేశ రాజధానిలో నెల రోజుల పాటు 114 సెక్షన్ అమలయ్యేలా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. యూపీ, పంజాబ్, హరియాణాతో ఉన్న సరిహద్దుల్లో జాతీయ రహదారులను పూర్తిగా మూసివేశారు. బారికేడ్లను ఏర్పాటు చేయడంతో పాటు మూడేళ్ల కిందట రైతుల సుదీర్ఘ ఆందోళనకు కేంద్రంగా మారిన సింఘూ, ఘాజీపూర్, టిక్రీల్లో భారీగా బలగాలను మోహరించారు. వాహనాలు ముందుకు కదిలితే టైర్లు పంక్చర్ అయ్యేలా రోడ్లపై మేకులు పరిచారు. ఘజియాబాద్‌తో పాటు పలుచోట్ల రోడ్లపై అడ్డంగా సిమెంటు దిమ్మెలు పెట్టి వాటి మధ్య కాంక్రీట్ మిశ్రమం నింపారు. 144 సెక్షన్ నేపథ్యంలో బహిరంగ సమావేశాల నిర్వహణ, ట్రాక్టర్లు, ట్రక్కులు, ట్రాలీల రాకను నిషేధించినట్లు ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ ఆరోరా తెలిపారు. లైసెన్స్‌డ్ తుపాకులు, మండే స్వభావం గల పదార్థాలు, కత్తులు, త్రిశూలాలు, రాడ్లు, బరిసెలను వెంట తీసుకురావొద్దని పేర్కొన్నారు. లౌడ్ స్పీకర్లపైనా ఆంక్షలు వర్తిస్తాయన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రధాన రోడ్లపైకి రావొద్దని సూచించారు. రైతుల ఆందోళన నేపథ్యంలో అటు రాష్ట్రాలు కూడా చర్యలు చేపట్టాయి. పంజాబ్‌తో అంబాలా వద్ద ఉన్న సరిహద్దును హరియాణా మూసివేసింది. కాగా, పంజాబ్ నుంచి ఇప్పటికే ఢిల్లీ దిశగా ట్రాక్టర్లు బయల్దేరాయి.

2,500 ట్రాక్టర్లు.. 20 వేల మంది రైతులు

వ్యవసాయోత్పత్తుల మద్దతు ధరలకు చట్టబద్ధత, లఖీంపూర్‌లో రైతులపై జరిగిన హత్యాకాండలో నిందితులను శిక్షించడం, నకిలీ ఎరువులు, విత్తనాల తయారీదారులపై కఠిన చర్యలు, ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానించడం కూడా రైతుల డిమాండ్లలో ఉన్నాయి. మంగళవారం చలో ఢిల్లీతో పాటు 16న గ్రామీణ భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. చలో ఢిల్లీకి 2,500 ట్రాక్టర్లలో వివిధ రాష్ట్రాలకు చెందిన 20 వేల మంది రైతులు రావొచ్చని నిఘా వర్గాలు అంచనా వేశాయి. రైతు సంఘాలు 40 సార్లు సన్నాహకం కూడా చేశాయని పేర్కొన్నాయి. దక్షిణాది రాష్ట్రాల రైతులు కూడా ఢిల్లీ చేరుకునే వీలుందని భావిస్తున్నాయి.

అరెస్టులపై ఆగ్రహం

ఆలిండియా డెమొక్రటిక్ ఉమెన్స్ అసోషియేషన్, భూమి అధికార్ ఆందోళన్ కిసాన్ సంఘర్ష్ సమితి, బీకేయూ (టికాయత్) నాయకులను మధ్యప్రదేశ్ పోలీసులు అరెస్టు చేయడాన్ని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) తీవ్రంగా ఖండించింది. కాగా, పీయూష్ గోయల్, అర్జున్ ముండా, నిత్యానందరాయ్‌లతో కూడిన కేంద్ర మంత్రుల బృందం రైతు ప్రతినిధులతో చర్చలు జరపనుంది.

డిప్యూటీ సీఎంలపై 'పిల్' తిరస్కరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఉప ముఖ్యమంత్రుల నియామకాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యా (పిల్)న్ని సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. దీంట్లో రాజ్యాంగ ఉల్లంఘనేమీ జరగలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఉపముఖ్యమంత్రి కూడా అందరు మంత్రుల్లాంటి వారేనని, వారిని ప్రత్యేక వర్గంగా గుర్తించరని తెలిపింది. ఉపముఖ్యమంత్రులను నియమించడం మంచి సంప్రదాయమేమీ కాదని, ఇది సమానత్వం అన్న రాజ్యాంగ సూత్రానికి విరుద్ధమని పేర్కొంటూ పబ్లిక్ పొలిటికల్ పార్టీ ఈ పిల్‌ను దాఖలు చేసింది.

వేయి స్తంభాల గుడి కల్యాణ మండపం పనుల పూర్తి

- 18 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు పూర్వ రూపం.. రూ.15 కోట్ల వ్యయం
- 18న ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు.. హోంమంత్రి అమిత్ షా రాక



హనుమకొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాకతీయుల కాలం నాటి శ్రీరుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. ఈ నెల 18న ప్రారంభోత్సవం నిర్వహించాలని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు నిర్ణయించారు. ముఖ్య అతిథిగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా హాజరవుతారని తెలుస్తోంది. వాస్తవానికి ప్రారంభోత్సవాన్ని మార్చిలో ప్రధాని మోదీతో నిర్వహించాలని మొదట నిర్ణయించారు. ఆలోగా లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉండడంతో ముందుగానే ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. కల్యాణ మండపానికి శిల్పులు తుదిమెరుగులు దిద్దుతున్నారు. మండపం పనుల త్వరితగతిన పూర్తి చేసేందుకు స్థపతి బాలక్రిష్ణన్ శివకుమార్ నేతృత్వంలో తమిళనాడుకు చెందిన సుమారు 40 మంది శిల్పులు రేయింబవళ్లు శ్రమించారు.

అదే సాండ్‌బాక్స్ టెక్నాలజీతో...

వేయి స్తంభాల గుడి కట్టడం చెక్కు చెదరలేదు కానీ దానికి ఎదురుగా ఉన్న ఈ కల్యాణ మండపం మాత్రం శిథిలావస్థకు చేరుకుంది. ఇందుకు కారణం దాని కింది నుంచి ప్రవహించిన నీటి పాయ గా గుర్తించారు. నీటి ప్రవాహం వల్ల పునాదిలో ఇసుక తొలగిపోయి రాతి స్తంభాలు కుంగి మండపం క్రమం గా పక్కకు ఒరిగిపోవడం మొదలైంది. అలాగే వదిలేస్తే మండపం కూలిపోయే ప్రమాదం ఉందని గుర్తించారు. దీంతో కేంద్ర పురావస్తు శాఖ 18 ఏళ్ల కిందట పునర్నిర్మాణమనే మహాఘట్టానికి శ్రీకారం చుట్టింది. పనులు చేపట్టిన తర్వాత అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. నిర్మాణంలో అత్యంత సంక్లిష్టమైన సాండ్‌బాక్స్ టెక్నాలజీ వాడారు. అంటే ఇసుకనే పునాదిగా చేసుకొని నిర్మాణం చేపట్టారు. కేంద్ర పురావస్తు శాఖ నిబంధనల ప్రకారం పునర్నిర్మాణ పనుల్లో ఎక్కడా సిమెంట్, కాంక్రీట్, ఇనుము వాడలేదు. ఇసుక పునాదిపైనే కట్టడాన్ని తిరిగి నిలబెట్టారు.

కిషన్ రెడ్డి చొరవతో...

మండపం పునర్నిర్మాణ పనులు 2006లో మొదలై 2017 వరకు సజావుగానే సాగాయి. ఆ తర్వాత స్థపతికి బిల్లుల చెల్లింపులో జాప్యం వల్ల కుంటుపడ్డాయి. ఐదేళ్లపాటు అసలు పనులే జరగలేదు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రిగా కిషన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత పనుల్లో కదలిక వచ్చింది. స్థపతికి బిల్లుల చెల్లింపుల్లో ఏర్పడిన సమస్యను ఆయన పరిష్కరించారు. దీంతో పాటు చివరి దశ పనుల పూర్తికి అవసరమైన రూ.5 కోట్ల నిధులను కూడా విడుదల చేయించారు. కాగా, ఈ మండపాన్ని పరిశీలించేందుకు కిషన్ రెడ్డి మంగళవారం వస్తున్నారు.

నేడు నాగార్జున సాగర్‌కు ఎన్‌డీఎస్‌ఏ, కేఆర్‌ఎంబీ బృందాలు

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 12: నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ), కృష్ణానది యాజమాన్య బోర్డు(కేఆర్‌ఎంబీ) బృందాలు మంగళవారం నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్‌కు చేరుకోనున్నాయి. ఈ బృందాలు మూడు రోజుల పాటు ఇక్కడ పర్యటించనున్నాయి. సాగర్ ప్రాజెక్టును కేఆర్‌ఎంబీకి అప్పగించే విషయంపై గతనెల 17వ తేదీన ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలు, సీఎస్‌లతో కేంద్ర జలశక్తి వనరుల శాఖ సమీక్ష నిర్వహించింది. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీ, ఎన్‌డీఎస్‌ఏ సభ్యులు పరిశీలిస్తారని ఆరోజు ఇరు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. ఇందులో భాగంగా ఈ నెల 6వ తేదీన శ్రీశైలం ప్రాజెక్టును ఎన్‌డీఎస్‌ఏ, కేఆర్‌ఎంబీ బృందాలు పరిశీలించాయి. ఈ క్రమంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు రెండు బృందాలు సాగర్ డ్యాంను పరిశీలించనున్నాయని ప్రాజెక్టు ఈఈ మల్లికార్జున్ తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ బృందంలో ఐదుగురు సభ్యులు, కేఆర్‌ఎంబీ బృందంలో ఇద్దరు సభ్యులు ఉంటారని, వారు మంగళవారం ఉదయం 11గంటలకు సాగర్‌కు చేరుకుంటారని చెప్పారు. మంగళ, బుధ వారాల్లో ప్రాజెక్టు పరిశీలన అనంతరం గురువారం విజయవిహార్ అతిథిగృహంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. పరిశీలనలో గుర్తించిన లోపాలపై, డ్యాం పటిష్ఠతపై తయారు చేసిన నివేదికలను ప్రభుత్వానికి బృందాలు అందజేస్తాయని ఈఈ మల్లికార్జున్ తెలిపారు.

బహ్రెయిన్ వేదికగా పొంగులేటి వారి పెళ్లి సందడి

- 14న మంత్రి పొంగులేటి సోదరుడి కుమారుడి వివాహం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్‌లోని బహ్రెయిన్ వేదికగా తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి కుమారుడైన లోహిత్‌రెడ్డి వివాహం అంగరంగ వైభవంగా జరగనుంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పి.వెంకట్రామిరెడ్డి సోదరుడు మహేందర్‌రెడ్డి కుమార్తెను లోహిత్‌రెడ్డి పెళ్లి చేసుకోనున్నారు. బుధవారం(ఈ నెల 14) రోజున వివాహ ముహూర్తం నిర్ణయించగా, ఇక్కడ భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ప్రఖ్యాత రియల్ ఎస్టేట్ సంస్థ అయిన రాజ్‌పుష్ప.. వెంకట్రామిరెడ్డి కుటుంబానికి చెందినది కాగా, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ నిర్మాణ రంగంలో ప్రముఖ సంస్థగా ఉన్న సంగతి తెలిసిందే. మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి బంధుగణసమేతంగా ఇప్పటికే బహ్రెయిన్ చేరుకున్నారు. వివాహ కార్యక్రమాల్లో వీరంతా బిజీబిజీగా ఉన్నారు. కాగా, ఈ పెళ్లి వేడుకలో పాల్గొనేందుకు తెలంగాణకు చెందిన కొందరు రాజకీయ ప్రముఖులు మంగళ, బుధవారాల్లో బహ్రెయిన్ రానున్నట్లు తెలిసింది.

కాంగ్రెస్ చేతగానితనం వల్లే.. కృష్ణా జలాల హక్కులను కోల్పోయాం

- నల్లగొండ సభకు భారీగా జనం: జగదీశ్ రెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 12: కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే కృష్ణానది జలాల హక్కులను కోల్పోయామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించే 'చలో నల్లగొండ' సభా స్థలిని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కృష్ణానది ప్రాజెక్టుల హక్కులను కాపాడుకోవడానికి నల్లగొండలో సభను నిర్వహిస్తున్నామని, దీనికి ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివస్తారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంతో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ సీఎంతో పాటు మంత్రులు సాగర్ ప్రాజెక్టును ఎందుకు సందర్శించలేదని నిలదీశారు. కృష్ణా జలాల హక్కులను కేఆర్‌ఎంబీకి అప్పజెప్పడానికి గతంలో కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చినా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒప్పుకోలేదని తెలిపారు.

పిల్లలను ఎత్తుకెళ్లడానికి వచ్చాడనుకొని..

బిచ్చగాణ్ని కర్రలతో కొట్టి చంపిన స్థానికులు.. లంగా, రవిక, ముఖానికి దస్తీతో చిత్రమైన ఆహార్యం

- ప్రశ్నించినా బదులివ్వకపోవడంతో బలపడిన అనుమానం
- నిజామాబాద్ పట్టణంలో ఘటన.. ఐదుగురిపై కేసు
- మేం పిల్లలనెత్తుకెళ్లం.. అన్నీ వదంతులే: ట్రాన్స్‌జెండర్లు
- ఎన్నికల సర్వే చేస్తున్న యువతులకు చేదు అనుభవం
- కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో ఘటన



నిజామాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌జెండర్ శ్యామల

నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్, బీర్కూర్, ఫిబ్రవరి 12: బక్క పలచటి వ్యక్తి.. అనారోగ్యంతో బాధపడుతూ శరీరం సహకరించని స్థితిలో ఉన్నాడు. స్థిరంగా కాసేపు నిల్చోనూలేడు.. చిన్నగా నెడితే పడిపోయేంతగా.. ఒక్క మాటలో చెప్పాలంటే అస్థిపంజరానికి ప్రాణం ఉన్నట్లుగా ఉన్నాడు. అతడిని చూసిన స్థానికులు.. చిన్న పిల్లలను కిడ్నాప్ చేయడానికొచ్చాడనుకొని అనుమానించారు. చుట్టూ గుమిగూడి కర్రలతో కొట్టడంతో ప్రాణాలు విడిచాడు. ఈ అమానవీయ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగింది. పట్టణంలోని గాయత్రి నగర్‌లో సోమవారం ఉదయం 8 గంటలకు ఓ వ్యక్తి గల్లీలో అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని గమనించి స్థానికులు అతడిని పరిపరి విధాలుగా స్పందించారు. అతడు ఒక్క మాటా మాట్లాడకపోవడానికి తోడు లంగా, రవికతో చిత్రమైన ఆహార్యంతో, ముఖం కనిపించకుండా దస్తీ కట్టుకోవడంతో అనుమానించారు. ఇటీవల చిన్న పిల్లలను ఎత్తుకెళ్తున్నారన్న ప్రచారం స్థానికంగా విస్తృతంగా సాగుతుండటంతో ఆ వ్యక్తిని కిడ్నాపర్‌గా భావించారు. అది పిల్లలు పాఠశాలకు వెళ్లే సమయం కావడంతో గుమిగూడిన వారిలో బడి ఈడు పిల్లల తల్లిదండ్రులే ఎక్కువగా ఉన్నారు. వారిలోనే కొందరు ఆ వ్యక్తిని కర్రలతో ఇష్టంవచ్చినట్లుగా కొట్టారు. సమాచారం అందుకున్న నాలుగో టౌన్ పోలీసులొచ్చి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. తీవ్రగాయాలు కావడం, శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండటంతో పోలీసులు అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు నిజామాబాద్ రూరల్ పరిధిలోని ఖానాపూర్‌కు చెందిన రాజుగా పోలీసులు గుర్తించారు. అతడు ఓ అనాథ అని, ఎప్పుడూ మహిళా వేషధారణలోనే ఉంటాడని స్థానికులు తెలిపారు. నిజామాబాద్‌కొచ్చి భిక్షాటన చేస్తూ పొట్ట నింపుకుంటున్నాడని ఖానాపూర్‌వాసులు తెలిపారు. ఓ అమాయక వ్యక్తిని అనుమానించి తీవ్రంగా కొట్టి ప్రాణాలు తీశారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను స్థానికులు వీడియోలు, ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. వీడియోలు, ఫొటోల ఆధారంగా ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు నగర నాలుగో టౌన్ పోలీసులు తెలిపారు.

ఇబ్బందులకు గురి చేస్తున్నారు

తమను పిల్లలనెత్తుకెళ్లేవారిగా భావించి కొందరు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని నిజామాబాద్‌లో ట్రాన్స్‌జెండర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తోటి ట్రాన్స్‌జెండర్లతో కలిసి శ్యామల, రక్ష జరీనా అనే ట్రాన్స్‌జెండర్లు సోమవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిన్నపిల్లలను ఎత్తుకెళ్తున్నామని సోషల్ మీడియాలో తమపై కొందరు ప్రచారం చేస్తున్నారని, అవన్నీ వదంతులేనన్నారు. సమాజంలో తాము కూడా మనుషులమేనని, తమను కూడా మనుషులుగా గుర్తించాలని కోరారు. 15రోజులుగా ఎక్కడికి వెళ్లినా తమను కిడ్నాపర్లుగా భావిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కిడ్నాపర్లు అనుకుని యువతులపై దాడికి యత్నం

కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో ఓ ప్రైవేట్ సంస్థ తరఫున లోక్‌సభ ఎన్నికల కోసం సర్వే చేస్తున్న ఇద్దరు యువతులకు చేదు అనుభవం ఎదురైంది. ఎన్నికలకు సంబంధించి జనాలను పలు ప్రశ్నలు అడుగుతూ.. వాళ్లు చెప్పింది నోట్ చేసుకుంటూ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్దకు సోమవారం ఇద్దరు యువతులొచ్చారు. పిల్లలను కిడ్నాప్ చేయడానికే వారొచ్చారని అనుమానించిన స్థానికులు.. ఇద్దరినీ పట్టుకుని గట్టిగా నిలదీశారు. భయబడిపోయిన ఆ యువతులు తాము ఎన్నికల సర్వే నిర్వహిస్తున్నామని చెప్పినా స్థానికులు దాడికి యత్నించారు. పోలీసులు అక్కడికి చేరుకుని యువతులను తహసీల్దార్ లత వద్దకు తీసుకువెళ్లారు. యువతులు వారి ఆధార్, సర్వే సంస్థ ఐడీ కార్డులను తహసీల్దార్‌కు చూపించారు. సర్వే చేపట్టే ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చి సర్వే చేపడితే బాగుండేదని తహసీల్దార్ వారికి సూచించారు. అనంతరం పోలీసులు ఆ యువతులను బాన్సువాడలో ఉన్న వారి సర్వే బృందం సభ్యులకు అప్పగించారు.

వేటగాళ్ల విద్యుత్ ఉచ్చుకు గ్రేహౌండ్స్ జూనియర్ కమాండర్ బలి

- భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో దుర్ఘటన



ప్రవీణ్(ఫైల్)

కాటారం/హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల కోసం వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చు తగిలి గ్రేహౌండ్స్ జూనియర్ కమాండర్ ఒకరు బలయ్యారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని అటవీ ప్రాం తంలో సోమవారం ఈ ఘటన జరిగింది. మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ బ్యారేజీని సందర్శించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు మంగళవారం వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా రాజోలుగూడకు చెంది న ఆడే ప్రవీణ్ (34)తో కూడిన 30 మంది గ్రేహౌండ్స్ బలగాల బృందం ఆదివారం రాత్రి కాటారం శివారులో కూంబింగ్ చేపట్టింది. ఈ క్రమంలో, నేలకు 2 అడుగుల ఎత్తులో సెంట్రింగ్ వైరుతో ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చుకు తాకిన ప్రవీణ్ అపస్మారక స్థితికి వెళ్లిపోయారు. చేతిపై వైరు లోతుగా దిగింది. వెంటనే తోటి పోలీసులు అంబులెన్స్‌లో తరలిస్తుండగానే ప్రవీణ్ మృతిచెందారు. గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. మేడిగడ్డ ప్రాజెక్టు వద్దకు సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు బస్సుల్లో రానుండగా కాటారం మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో గ్రేహౌండ్స్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ప్రవీణ్ మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



జూరాల ప్రాజెక్టుపై కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం

- కృష్ణా జలాలపై మాట్లాడే హక్కు కేసీఆర్‌కు లేదు
- నల్గొండ, వనపర్తి జిల్లాల్లో కిసాన్ కాంగ్రెస్ సెల్ నిరసన

అమరచింత-వరంగల్ టౌన్, ఫిబ్రవరి 12 : కృష్ణా జలాల మీద నల్గొండలో కేసీఆర్ ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభను నిరసిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ పిలుపు మేరకు సోమవారం వనపర్తి,వరంగల్ జిల్లాల్లో మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దిష్టబొమ్మలను దహనం చేశారు. కృష్ణా నది జలాలపై మాట్లాడే హక్కు ఆయనకు లేదని వనపర్తిలో అమరచింత మండలం ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై, వరంగల్‌లో వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్‌లో దిష్టిబొమ్మలను దహనం చేశారు. కృష్ణా జలాలపై మంగళవారం నల్గొండలో జరిగే కేసీఆర్ సభకు నిరసనగా కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేశం నాగరాజు గౌడ్, వేముల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. వేలాది టీఎంసీల నీరు సముద్రంపాలైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం జలయజ్ఞం కింద చేపట్టిన నెట్టెంపాడు, కల్వకుర్తి, బీమా, కోయిల్ సాగర్, ప్రాజెక్టుల పనులు 90 శాతం పూర్తికాగా, కేసీఆర్ ప్రభుత్వం 10 శాతం పనులకు పదేళ్లయినా పూర్తి చేయలేదన్నారు.

ఎక్సైజ్ శాఖలో భారీ ప్రక్షాళన

ఒకేసారి 223 మంది అధికారుల బదిలీ.. 149 మంది ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం

- ఇద్దరు డీసీలు, 9 మంది ఏసీలు, 14 మంది ఈఎస్‌లకు కూడా..
- అప్పటి మంత్రి అండతో అందలమెక్కినవారికి తప్పని బదిలీ
- లోక్‌సభ ఎన్నికల ముంగిట ఈసీ ఆదేశాల మేరకు ప్రక్రియ



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ శాఖల్లో అధికారుల బదిలీల పర్వం కొనసాగుతోంది. మరో రెండు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ఎన్నికలతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధమున్న అధికారులను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఎక్సైజ్ శాఖలో భారీ ప్రక్షాళనను చేపట్టింది. ఒకేసారి శాఖలోని 223 మందిని బదిలీ చేసింది. ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌శర్మ, ఎక్సైజ్ కమిషనర్ ఇ.శ్రీధర్ సోమవారం బదిలీలకు సంబంధించిన పలు జీవోలను జారీ చేశారు. ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మొదలు.. డిప్యూటీ కమిషనర్ల వరకు బదిలీ చేశారు. గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి ఒక మంత్రి అండదండలతో 30 మంది ఎక్సైజ్ అధికారులను బదిలీ చేసి, కీలక స్థానాల్లో పోస్టింగులు ఇచ్చారు. ఇప్పుడు అలాంటి అధికారులందరికీ బదిలీ వేటు తప్పలేదు. చాలా కాలంగా హైదరాబాద్ నగర సమీపంలో ఒకే స్థానంలో కొనసాగుతోన్న ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో ఏర్పడిన కొత్త జిల్లాకు పంపించారు. సంఘాల పేరుతో నగర సమీపంలో కొనసాగుతున్న అధికారులను కూడా బదిలీ చేశారు. చాలా కాలంగా నాన్-ఫోకల్ పాయింట్లలో పని చేస్తున్నవారినీ బదిలీ చేసి, కీలక స్థానాల్లో నియమించారు. దీంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చక్రం తిప్పిన అధికారులు ఇప్పుడు.. మారుమూల ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్(డీసీ) టి.డేవిడ్ రవికాంత్‌ను కరీంనగర్ డీసీగా, నిజామాబాద్ డీసీ పి.దశరథను రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. తొమ్మిది మంది అసిస్టెంట్ కమిషనర్లు కూడా బదిలీ అయ్యారు. బ్రూవరీస్ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) కె.వరప్రసాద్‌ను కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీగా, అక్కడున్న ఏసీ ఎ.వి జయభాస్కర్‌రెడ్డిని మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీగా, నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ ఆర్.కిషన్‌ను రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీగా, ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ జి.శ్రీనివాస్‌రెడ్డిని మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీగా, రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ ఎ.చంద్రయ్యను బ్రూవరీస్ ఏసీగా, మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ హెచ్.దత్తురాజ్‌గౌడ్‌ను టీఎస్‌బీసీఎల్ రంగారెడ్డి-1 చీఫ్ మేనేజర్‌గా, అక్కడున్న వి.సోమిరెడ్డిని నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీగా, మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ కె.రఘురామ్‌ను కమిషనర్ ఆఫీసులో డిప్యూటీ కమిషనర్‌గా, నల్లగొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ ఎ.శంభుప్రసాద్‌ను కమిషనరేట్‌లో డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు.

14 మంది ఎక్సైజ్ సూపరింటెండెంట్లకూ..

వివిధ ఎక్సైజ్ జిల్లాల్లో పనిచేస్తున్న 14 మంది జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ల(ఎక్సైజ్ సూపరింటెండెంట్లు)ను బదిలీ చేశారు. ఈఎస్‌లలో.. ఎంఏ రజాక్‌ను మెదక్ నుంచి నిర్మల్‌కు, ఎ.సత్యనారాయణ (శంషాబాద్ నుంచి జగిత్యాల), కె.అనిత (సూర్యాపేట నుంచి జనగామ), ఆర్.లక్ష్మానాయక్ (వరంగల్ రూరల్ నుంచి సూర్యాపేట), ఎస్.సైదులు (మహబూబ్‌నగర్ నుంచి యాదాద్రి), ఎస్.ఉజ్వలరెడ్డి (హైదరాబాద్-2 టీఎస్‌బీసీఎల్ నుంచి సరూర్‌నగర్), ఎస్.కృష్ణప్రియను (జనగామ నుంచి శంషాబాద్), ఎస్‌కే ఫయాజుద్దీన్ (నాగర్‌కర్నూల్ నుంచి మేడ్చల్), కె.నవీన్‌కుమార్ (యాదాద్రి నుంచి మల్కాజిగిరి), కె.విజయభాస్కర్ (మేడ్చల్ నుంచి వికారాబాద్), ఎస్.నవీన్ చంద్ర (వికారాబాద్ నుంచి సంగారెడ్డి), డి.గాయత్రి (సంగారెడ్డి నుంచి నాగర్‌కర్నూల్), డి.అరుణ్‌కుమార్ (మల్కాజిగిరి నుంచి గద్వాల్), టి.రవీందర్‌రావును సరూర్‌నగర్ నుంచి వనపర్తికి బదిలీ చేశారు. మరో నలుగురు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల(ఏఈఎస్)ను బదిలీ చేశారు. సరూర్‌నగర్ ఏఈఎస్ బి.హన్మంతరావును కామారెడ్డి ఏఈఎస్‌గా, మల్లేపల్లిలోని బ్రూవరీ ఆఫీసర్ ఎం.విష్ణుమూర్తిని యాదాద్రి ఏఈఎస్‌గా, మేడ్చల్‌లోని ఆర్‌కే డిస్టిలరీలో డిస్టిలరీ ఆఫీసర్‌గా ఉన్న జె.మర్ఫీని సిద్దిపేట ఏఈఎస్‌గా, జగిత్యాల ఏఈఎస్ డీసీబీ నాయక్‌ను నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్‌గా బదిలీ చేశారు. మల్టీ జోన్-2లోని 85 మంది ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. మల్టీ జోన్-1లోని 64 మంది ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లనూ బదిలీ చేశారు. మరో 45 మంది ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లను కూడా బదిలీ చేశారు. కాగా వీరందరూ వెంటనే తమ తమ పోస్టుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఏడుగురు చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్లకూ..

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏడుగురు చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ల(సీపీవో)ను ప్రభుత్వం బదిలీ చేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం చేసిన ఆదేశాల మేరకు ఈ బదిలీలు చేపట్టింది. ఈమేరకు రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీం సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. నల్లగొండ సీపీవో ఎం.బాలశౌరిని సంగారెడ్డికి, అక్కడి డిప్యూటీ డైరెక్టర్(సీపీవో) ఎస్.మోహన్‌రెడ్డిని అర్థ గణాంక సంచాలకుల కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. సంచాలకుల కార్యాలయంలో జేడీగా ఉన్న పి.సౌమ్యను ఖాళీగా ఉన్న రంగారెడ్డి సీపీవో పోస్టులో నియమించారు. యాదాద్రి-భువనగిరి జిల్లా సీపీవో బి.మాన్యను నల్లగొండ సీపీవోగా, సూర్యాపేట సీపీవో జి.వెంకటేశ్వర్లును యాదాద్రి-భువనగిరి సీపీవోగా బదిలీ చేశారు. సూర్యాపేట సీపీఓ కార్యాలయంలో స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా ఉన్న వి.శ్రీనివాసరావుకు సూర్యాపేట సీపీవోగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వరంగల్ సీపీవో జి.జీవరత్నంను బదిలీ చేసి, జోగులాంబ-గద్వాల సీపీవోగా, అక్కడున్న సీపీవో బి.గోవిందరాజన్‌ను వరంగల్ సీపీవోగా నియమించారు.

పంచాయతీరాజ్ శాఖలో 105 మంది బదిలీ

ఇప్పటికే డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలను బదిలీ చేసిన ప్రభుత్వం.. తాజాగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలోని జిల్లా స్థాయి అధికారులను బదిలీ చేసింది. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారులు (జడ్పీసీఈవోలు), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు (డీఆర్‌డీవోలు), జిల్లా పంచాయతీ అధికారులు (డీపీవోలు) సహా మొత్తం 105 మందిని బదిలీ చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కామారెడ్డి ఆస్పత్రికి విచారణ బృందం

రోగిపై ఎలుకల దాడి ఘటనపై వివరాల సేకరణ

నివేదిక అందిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: మంత్రి దామోదర రాజనర్సింహా

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 12: కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగిని ఎలుకలు కొరికిన ఘటనపై విచారణకు ముగ్గురు వైద్యులతో కూడిన బృందం సోమవారం ఆస్పత్రిని పరిశీలించింది. ఈ బృందంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ డాక్టర్ అనిల్ కూడా ఉన్నారు. ఇటీవల ఐసీయూలో ముజీబ్ అనే రోగిని ఎలుకలు గాయపరిచిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై బాధితుడి కుటుంబీకులతో మాట్లాడి విచారణ బృందం వివరాలు సేకరించింది. అలాగే ఘటన జరిగిన రోజు విధుల్లో ఉన్న అటెండర్ నుంచి వైద్యుల వరకు అందరిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆదివారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆస్పత్రిలో డయాలసిస్ విభాగాన్ని పరిశీలించడంతో పాటు ఎలుకలు వస్తున్న మార్గాలను పరిశీలించారు. ఎలుకల నివారణకు గతంలో శానిటేషన్ ఏజెన్సీ చేపట్టిన పనులను, ఎలుకల సంచారం ఉన్నప్పుడు శానిటేషన్ సిబ్బందికి ఏ విధంగా సమాచారమిచ్చారన్న వివరాలపై ఆరా తీశారు. అందరి నుంచి రాత పూర్వక నివేదికను తీసుకుని ప్రభుత్వానికి అందిస్తామని బృంద సభ్యులు తెలిపారు. మరోవైపు రోగిని ఎలుకలు కొరికిన ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై.. నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తెలిపారు. ఈ వ్యవహారంలో వైద్యులను సస్పెండ్ చేయడంపై తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ, టీవీవీపీ జేఏసీ కమిటీ సభ్యులు సోమవారం మంత్రిని కలిశారు. నివేదిక అందిన తర్వాత వైద్యులపై సస్పెన్షన్ ఎత్తివేస్తామని వారికి మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం, ఆరోగ్య పరిరక్షణ, వైద్య భద్రత కల్పించేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు.

సులువుగా 'ఎప్‌సెట్' అప్లికేషన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అభ్యర్థులకు దరఖాస్తు చేసుకునేందుకు మరింత అనువుగా ఉండేలా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎప్‌సెట్)-2024 ఆన్‌లైన్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు జేఎన్‌టీయూ అధికారులు తెలిపారు. గతేడాది ఎంసెట్(ప్రస్తుతం ఎప్‌సెట్) ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అప్లికేషన్ ఫార్మాట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఎంసెట్- 2023 దరఖాస్తులో ఈడబ్ల్యూఎస్ కేటగిరీని చూపకపోవడంతో పలువురు అభ్యర్థులు ఓసీ కేటగిరీ ఆప్షన్‌ను ఎంచుకోవాల్సి వచ్చింది. దాంతో సమస్యను పరిష్కరించుకునేందుకు అభ్యర్థులు ఎంసెట్ కార్యాలయాన్ని పలుమార్లు సంప్రదించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ దఫా అటువంటి సమస్య తలెత్తకుండా ఓసీ కేటగిరీ ఎంచుకున్న వెంటనే అభ్యర్థులకు ఈడబ్ల్యూఎస్ కేటగిరి ఆప్షన్ కనిపించేలా అప్లికేషన్‌లో మార్పు చేయాలని అధికారులు నిర్ణయించారు. అలాగే గతేడాది ఎంసెట్ పరీక్షలను 70 శాతం సిలబస్‌తో నిర్వహించగా, ఈ ఏడాది 100 శాతం సిలబస్‌తో పరీక్షలు నిర్వహించాలని ఎప్‌సెట్ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఇటీవల నిర్వహించిన సిలబస్ కమిటీ సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎన్నికలకు ముందు...

సాంకేతికంగా కాకపోయినా, 17వ లోక్‌సభ సభాకాలం ముగిసిపోయింది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించబోతున్నారు. ఫిబ్రవరి 10వ తారీకు శనివారం నాడు సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రసంగం ఒక అధ్యాయం ముగింపును సూచించింది. గత అయిదు సంవత్సరాల పాలనను సమీక్షించింది. అంతే కాదు, అనంతర అధ్యాయంలో కూడా తన పరిపాలనే కొనసాగుతుందన్న ధీమా కూడా ఆయన మాటల్లో వ్యక్తమైంది.

ఇదే ప్రభుత్వం మరింత బలంతో అధికారంలోకి రానున్నదన్న అభిప్రాయం సర్వత్రా వ్యాపించి ఉన్న సానుకూల వాతావరణంలో, ఎన్నికల ప్రకటన రానున్నది. పదిహేడో లోక్‌సభ కాలంలో తన ప్రభుత్వం సాధించిన కీలక విజయాల కింద ఆర్టికల్ 370 రద్దు, మహిళా రిజర్వేషన్ల బిల్లు, త్రిపుల్ తలాఖ్ నిషేధం, కొత్త నేరచట్టాల రూపకల్పనలను ప్రధాని మోదీ ప్రముఖంగా పేర్కొన్నారు. దృఢ నిర్ణయాలు తీసుకోగలిగిన బలమైన ప్రభుత్వమే ఇవి సాధించగలదని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో మరింత బలం తమకు సమకూరిస్తే, మరిన్ని సాహస నిర్ణయాలు తీసుకోగలనన్న సూచన కూడా ఆ మాటల వెనుక ఉన్నది.

సాధించిన విజయాల ప్రతిష్ఠ మీద మాత్రమే నరేంద్రమోదీ, ఆయన పార్టీ ఆధారపడదలచుకోలేదు. ఈ ఎన్నికల్లో శ్రీరాముడి అండదండలు తమకు పుష్కలంగా లభిస్తాయని, తాము ఆలయం నిర్మించినందుకు అవతారపురుషుడు తమకు ప్రతిఫలితం అందిస్తారని వారు గట్టి విశ్వాసంతో ఉన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ మొదటి రోజున నరేంద్రమోదీ లోక్‌సభలో ప్రవేశిస్తున్నప్పుడు ఆయన పార్టీ సభ్యులంతా 'జై శ్రీరామ్' అని ఉత్సాహంగా నినాదాలు ఇచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తమ మత, రాజకీయ, జాతీయతా నినాదాలన్నిటినీ 'జై శ్రీరామ్'లోనే దర్శిస్తున్నట్టు అనిపించింది. లోక్‌సభ చివరి రోజున రాష్ట్రపతికి ధన్యవాదాల తీర్మానంతో పాటు, అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ జరిగిన కార్యక్రమాన్ని శ్లాఘిస్తూ కూడా తీర్మానం ఆమోదం పొందింది. రామమందిర శ్లాఘ తీర్మానం చేయడం ద్వారా "భవిష్యత్ తరాలు తమ వారసత్వ విలువల గురించి గర్వపడడానికి రాజ్యాంగ బలాన్ని సమకూర్చినట్టయింద"ని ప్రధాని అన్నారు. అంతే కాదు, రామమందిర నిర్మాణం 'సరికొత్త తరహా ప్రజాపాలనకు, సంక్షేమానికి' దారితీస్తుందని ఆయన అన్నారు. రామమందిర తీర్మానం మీద మాట్లాడడానికి ప్రతిపక్షాలు ముందుకు రాకపోవడాన్ని ప్రధాని విమర్శించారు. అందరికీ అన్నిపనులూ చేయగలిగే ధైర్యం ఉండదని అన్నారు. ఎన్నికలకు ముందు పార్లమెంటు చివరి రోజు సమావేశాలు చూస్తే, ఇంతకాలం ప్రత్యేకంగా ఉన్న అనేక రంగాలు, వ్యవస్థలు అన్నీ కలగలసిపోయినట్టు అనిపించింది.

ఈ దేశానికి ఒకే రాజ్యాంగం ఉండాలన్న సుదీర్ఘకాలపు ఆకాంక్ష, ఆర్టికల్ 370 రద్దుతో నెరవేరిందని, ఈ చర్యతో జమ్మూకశ్మీర్ ప్రజలకు న్యాయం దొరికినట్టయిందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. శతాబ్దాలుగా నిరీక్షించిన పనులన్నీ ఈ సభాకాలంలో పూర్తయ్యాయని ఆయన సంతృప్తి ప్రకటించారు. ప్రజల దైనందిన జీవితాల నుంచి ప్రభుత్వం ఎంత తొందరగా నిష్క్రమిస్తే, అంతగా ప్రజాస్వామ్యం వర్ధిల్లినట్టు అని మోదీ ఈ సందర్భంగా ఒక వ్యాఖ్య చేశారు. మరి, ప్రజల వ్యక్తిగత జీవితాల్లో భాగమైన మతంలోకి ఈ ప్రభుత్వం ఎందుకింత గాఢంగా ప్రవేశిస్తోందో మాత్రం అర్థం కాదు.

ఈ విజయాలు, ప్రధానంగా ఉద్వేగ పూరిత విజయాలు, భారతీయ జనతాపార్టీకి అనుకున్నంత ఘనవిజయాన్ని అందిస్తాయా, వారు కోరుకుంటున్న 400 స్థానాల గమ్యాన్ని చేరుకుంటారా అన్నది చూడవలసి ఉన్నది. ఉద్వేగ పూరిత అంశాలకు, వాస్తవ భౌతిక సమస్యలకు మధ్య స్పర్థ ఏర్పడితే ప్రజల స్పందన ఎట్లా ఉంటుందో కూడా చూడాలి. కనీసమద్దతు ధర కోసం రైతాంగం దేశరాజధానిలో మళ్లీ మోహరించబోతున్నది, అందుకు తగ్గట్టుగా నిర్బంధచర్యలు కూడా కేంద్రం తీసుకుంటున్నది. ఒక్కొక్కరు జారుకోవడం, పొత్తులు కాక కత్తులు దూసుకోవడం, మహాబలశాలి బీజేపీని ఎదుర్కొనలేని నిస్సహాయతలో కూరుకుపోవడం, వీటి మధ్య ప్రతిపక్ష ఇండియా కూటమి అత్యంత బలహీనంగా కనపడుతున్నది కానీ, దైనందిన సమస్యల మీద పోరాటాలు నిర్మించగలిగితే బాధిత ప్రజానీకం అందుకు సిద్ధంగానే ఉన్నారు. ఎక్కడ ప్రజలు ఉద్వేగాలకు అతీతంగా ఆలోచిస్తారో అన్న భయంతో, మతతత్వ శక్తులు దేశంలో అక్కడక్కడా హింసను సృష్టించి, విభజన వాతావరణాన్ని సజీవంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నాయి.

అపార బలం ఉన్న ప్రభుత్వానికి ఏదైనా చేయగలిగిన సాహసం కూడా ఉంటుంది. ఆ ధైర్యసాహసాలతో అవినీతిని, నల్లధనాన్ని, ఆర్థిక అంతరాలను, సామాజిక హెచ్చుతగ్గులను కూలదోయడానికి ప్రయత్నించవచ్చు కదా అనిపిస్తుంది. కానీ, విపరీతమైన బలం కలిగిన ప్రభుత్వాలు తమ ప్రతాపాలను ఎప్పుడూ ప్రజల మీదనే చూపిస్తాయని చరిత్ర చెబుతోంది.

అద్వితీయ యశోధనుడు

ప్రస్తుత లోక్‌సభ చివరి సమావేశాలు ముగిశాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. దేశ ప్రజలు మళ్లీ ఒక్కసారి తమ భవిష్యత్తును నిర్ణయించుకునే సమయం ఆసన్నమైంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వారు అనేక పార్టీల ప్రభుత్వాలను చూశారు. 1947 నుంచి ఇప్పటి వరకూ 14 మంది ప్రధానమంత్రుల పాలనా తీరును వారు గమనించారు. అందరికన్నా ఎక్కువగా జవహర్‌లాల్ నెహ్రూ ఈ దేశాన్ని పరిపాలించారు. బ్రిటిష్ వారు అధికారంలో ఉన్నప్పుడు కూడా నెహ్రూ దాదాపు ఏడాది పాటు 1946 సెప్టెంబర్ 2 నుంచి 1947 ఆగస్టు 14 వరకు ప్రధానిగా ఉన్నారు. కాని అప్పుడు ఆయన ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రధాని కాదు. కాంగ్రెస్ పార్టీలో మెజారిటీ నేతలు సర్దార్ పటేల్‌ను, ప్రధానిగా ఎన్నుకోవాలని తీర్మానించినప్పటికీ నెహ్రూ వైపు గాంధీజీ మొగ్గు చూపించారని మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ తన పుస్తకం



■ వై. సత్యకుమార్
సత్యకాలమ్

'ఇండియా విన్స్ ఫ్రీడమ్'లో తెలిపారు. దీని మూలంగా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా 1947 నుంచి 1964లో చనిపోయే వరకు 17 సంవత్సరాలు నెహ్రూయే ప్రధానిగా కొనసాగారు. తాను జీవించి ఉన్నప్పుడే ఆయన ఇందిరాగాంధీని కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమించి పార్టీ, ప్రభుత్వం ఆమె చెప్పుచేతల్లో ఉండేలా చూశారు. అందుకే కేవలం 19 నెలలు పాలించిన లాల్ బహదూర్ శాస్త్రి మరణించగానే 1966లో ఆమెనే ప్రధానమంత్రిగా ఎన్నుకున్నారు. ఈ రకంగా దేశంలో వారసత్వ పాలనకు నెహ్రూనే నాంది పలికారు. ఇందిర 15 సంవత్సరాలు, ఆమె కుమారుడు రాజీవ్ గాంధీ మరో అయిదుసంవత్సరాలు పాలించారు. అంటే దాదాపు 38 సంవత్సరాలు నెహ్రూ–గాంధీ కుటుంబమే ఈ దేశాన్ని ఏలింది. యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 నుంచీ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పటికీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీయే నడిపారని, ఆమె కుమారుడు రాహుల్ కూడా పెత్తనం చలాయించారని దేశ రాజకీయాలు తెలిసిన వారందరికీ తెలుసు.

తమ కుటుంబానికి చెందని మాజీ ప్రధాని పి.వి. నరసింహారావును సోనియా, ఆమె వందిమాగధులు ఎన్నో ముప్పు తిప్పలు పెట్టారు. పి.వి మరణించిన తర్వాత ఆయన భౌతిక కాయాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోకి అనుమతించలేదు. ఢిల్లీలో కూడా అంత్యక్రియలకు నోచుకోకుండా చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడుగా, నిజాంకు వ్యతిరేక పోరాటం చేసిన నేతగా, ఆర్థిక సంస్కరణలతో ఈ దేశ ముఖ స్వరూపాన్ని మార్చిన మేధావిగా, సాహితీ వేత్తగా, బహుభాషా కోవిదుడుగా ఈ దేశానికి పీవీ సేవలను కాంగ్రెస్ విస్మరించింది.

పి.విని అవమానించడమే కాదు, అయనకు ముందు చరణ్ సింగ్, ఐకే



గతంలో కాంగ్రెసేతర ప్రధానమంత్రులు సంకీర్ణ ప్రభుత్వాలను నిర్వహిస్తే, నరేంద్రమోదీ సంపూర్ణ మెజారిటీ సాధించిన ఏకైక కాంగ్రెసేతర ప్రధానమంత్రి. ప్రధానమంత్రిగా నెహ్రూ రికార్డును బద్దలు చేసేందుకు మోదీ మూడో టర్మ్ అఖండ మెజారిటీతో ఎన్నిక కాబోతున్నారు. తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 364 సీట్లు సాధిస్తే ఇప్పుడు బీజేపీ స్వయంగా ఈ రికార్డును బద్దలు చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నది.

గుజ్రాల్, దేవెగౌడ ప్రభుత్వాలను ఉత్తి పుణ్యానికి పడగొట్టిన ఘనత కూడా కాంగ్రెస్‌దే సుమా! పీవీతో పాటు భారతరత్న పురస్కారాన్ని పొందిన చరణ్ సింగ్ సాధారణ నేత కాదు. గాంధీజీ ప్రేరణతో ఆయన స్వాతంత్రోద్యమంలో ప్రవేశించారు. పలుసార్లు జైలుకు వెళ్లారు. స్వాతంత్ర్య పూర్వమే యునైటెడ్ ప్రావిన్సెస్ శాసనసభ్యుడుగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి చరణ్ కృషి చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విప్లవాత్మక భూసంస్కరణల చట్టాలను ప్రవేశపెట్టేందుకు కృషి చేశారు. 1959లో నాగపూర్ కాంగ్రెస్ సదస్సులో నెహ్రూ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఉత్తరప్రదేశ్‌లో తొలి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు. ఈ నేపథ్యంలో పీవీ, చరణ్ సింగ్‌లతో పాటు మన దేశంలో హరిత విప్లవానికి కారణమైన రైతాంగ శాస్త్రవేత్త స్వామినాథన్‌కు కూడా భారత రత్న పురస్కారాన్ని అందించడం ద్వారా మోదీ ప్రభుత్వం వారి జ్ఞాపకాలను సుస్థిరం చేసిందనడంలో సందేహం లేదు.

గతంలో కాంగ్రెసేతర ప్రధానమంత్రులు సంకీర్ణ ప్రభుత్వాలను నిర్వహిస్తే, నరేంద్రమోదీ సంపూర్ణ మెజారిటీ సాధించిన ఏకైక కాంగ్రెసేతర ప్రధానమంత్రిగా చరిత్రలో నిలిచిపోయారు. 1952లో తొలి సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రధానమంత్రి అయిన నెహ్రూ 12 సంవత్సరాలు ఆ పదవిలో కొనసాగితే, నెహ్రూ రికార్డును కూడా బద్దలు చేసేందుకు మోదీ మూడో టర్మ్ కూడా ప్రజాస్వామికంగా అఖండ మెజారిటీతో ఎన్నిక కాబోతున్నారనేది ఇవాళ అందరూ అంగీకరించిన సత్యం. తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 364 సీట్లు సాధిస్తే ఇప్పుడు బీజేపీ స్వయంగా ఈ రికార్డును బద్దలు చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నది. నాడు కాంగ్రెస్‌కు ప్రతిపక్షమే లేదు కనుక అప్పటి విజయం పెద్ద గొప్పది కానే కాదు. కాని ఇప్పుడు గత పది సంవత్సరాలుగా బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలు సర్వశక్తులు ఒడ్డి, రకరకాల ఎజెండాలతో పోరాడుతున్నప్పటికీ వాటి ప్రయత్నాలను తుత్తునియలు చేసిన నరేంద్రమోదీదే నిజమైన విజయం అని చెప్పక తప్పదు.

ఈ విజయం సాధించేందుకు ప్రధాన కారణం— స్వాతంత్ర్యానంతరం ఆరుదశాబ్దాల పాటు గాంధీ కుటుంబ వారసులు నిర్వహించిన పాలనకూ మోదీ పాలనకూ ఉన్న తేడాను ప్రజలు గమనించడమే. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో ప్రజల ముందుకు వెళ్లి అమలు చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమ పథకాలను వివరించేందుకు ప్రభుత్వమే ముందుకు వస్తున్న తీరు దాని ఆత్మ విశ్వాసానికి నిదర్శనం. ఆర్థికంగా బలహీనంగా ఉన్న మన దేశాన్ని కరోనా మహమ్మారిని కూడా లెక్క చేయకుండా, కేవలం పది సంవత్సరాల్లో ప్రపంచంలో అయిదు అగ్ర ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మార్చడం సామాన్యమైన విషయం కాదు. వలస వాద పాలన నుంచి భారతదేశం బయటపడినా కాంగ్రెస్ హయాంలో ఆ వలస వాద బానిస సంస్కృతినే కొనసాగించారు. మోదీ హయాంలో భారతదేశం ఒక నిజమైన స్వతంత్ర దేశంగా ఆవతరించిందనే అభిప్రాయం ఇప్పుడు ప్రపంచమంతటా నెలకొంది. వలస పాలనకు చెందిన చట్టాలను రద్దు చేయడం, రక్షణ రంగంలో ఆత్మనిర్భరత, పటిష్ఠత, కర్తవ్య పథ్‌గా రాజ్‌పథ్ మారిన తీరు, అధునాతన పార్లమెంట్ భవన నిర్మాణం, దేశమంతటా పారిశ్రామిక, రహదారి కారిడార్లు, విమానాశ్రయాలు, ఉన్నత వైద్య, విద్యా సంస్థలు ఇవన్నీ మారుతున్న భారత్‌కు సంకేతం. భారతదేశానికి నాలుగు ప్రధాన స్తంభాలైన నారీ శక్తి, యువశక్తి, పేదలు, రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి మోదీ సర్కార్ చేపట్టిన చర్యలు గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టలేదు. దళితులు, ఆదివాసీలు, ఓబీసీల సంక్షేమానికి, కూడా గతంలో కంటే ఎన్నో రెట్లు మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. మోదీ హయాంలో ప్రభుత్వ రంగాన్ని దెబ్బతీశారని విమర్శిస్తున్న ప్రతిపక్షాలు 2014లో 234 ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు ఇప్పుడు 254కు పెరిగాయని, గత పదేళ్లలో వాటి నికర లాభాలు రూ. 1.25 లక్షల కోట్లనుంచి 2.5 లక్షల కోట్లకు పెరిగాయని, ప్రభుత్వ రంగ సంస్థల నికర విలువ రూ. 9.5 లక్షల కోట్ల నుంచి రూ. 17 లక్షల కోట్లకు పెరిగిందని ఎందుకు ప్రజలకు చెప్పడం లేదు? ప్రతిపక్షాలు నిజాలు చెప్పవని, అబద్ధాలు ప్రచారాలు చేస్తాయని ప్రజలకు తెలిసినందువల్లే ఇవాళ బీజేపీ విజయానికి ఢోకా లేకుండా పోయింది.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

కులం కదిలింది.. వర్ణం నిలిచింది.. మన చరిత్ర అదేనా?

పేరులో కులాన్ని సూచించటం మనకు కొత్తకాదు. రెడ్డి, నాయుడు, శాస్త్రి, శర్మ, త్రివేది, ద్వివేది, నాడార్, రాజ్‌పుత్, మోదీ, జోషి.. ఇలా ఎన్నో కుల సూచికలు మన పేర్ల వెనుక కనపడతాయి. ఇలాంటి సూచికలను పెట్టుకోవటం నామోషీగా భావించే వారి సంఖ్య చాలా తక్కువ. పిలుపులో సౌలభ్యం కోసం వ్యక్తుల పేర్లు పొట్టివి అవుతున్నాయి. అంతమేరకు కుల సూచికలు తొలగిపోతున్నాయి. ఆధునిక భావాల ప్రభావంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు కుల ప్రస్తావనలు లేని పేర్లను పెడుతున్నారు. సౌలభ్యం సంగతి ఎలా ఉన్నా కుల సూచికలతో ఇబ్బంది పడని వారి సంఖ్యే మనకు ఎక్కువ. ఎందుకంటే ఆ సూచికలు ఒక స్థాయిని, హోదాని వెల్లడిస్తాయి. అగ్రకులాల విషయంలో ఇది స్పష్టంగా కనపడుతుంది. దళితులకు ఈ వెసులుబాటు చాలా చోట్ల లేదు. ముఖ్యంగా తెలుగునాట ఇది కొట్టొచ్చినట్లు కనపడుతుంది. మాల, మాదిగ, ఎరుక, దొమ్మరి.. అనే పేర్లు వింటేనే తిరస్కారాన్ని, ఏహ్యతను, చిన్నచూపుని ప్రదర్శించే సంస్కృతి నిన్నమొన్నటి వరకూ అందరిలో పాతుకుపోయింది. దీన్ని నిరసిస్తూ ఒక ధిక్కార స్వరంతో తమ పేర్ల వెనుక మాల, మాదిగ అని పెట్టుకోవటం మామూలు విషయం కాదు. కులాల పేర్లను నిర్భీతిగా అసలు పేర్ల వెనుక తగిలించుకుని సముచిత గౌరవం, హక్కుల కోసం ప్రయత్నించటం 1990ల తర్వాత బాగా పెరిగింది. సామాజిక మార్పును విభిన్న రీతిలో కోరుకోవటంగా దీన్ని పరిగణించొచ్చు. అంబేడ్కర్ రాజకీయాల ప్రభావంతో మొదలైన ఈ ధోరణి సామాజిక న్యాయ ఆందోళనల్లో కొత్త ఒరవడిని సృష్టించింది.

మన చరిత్రలో దీనికి పూర్తిగా భిన్నమైన పరిణామం ఇంకోటి ఉంది. అది సుదీర్ఘకాలం జరిగింది. ఇంకా జరుగుతూనే ఉంది. సంప్రదాయ కులాల పేర్లలోనే తమను చిన్నచూపు చూసే పరిస్థితి ఉందని భావించిన వారు ఆ పేర్ల మార్పు కోసం చాలా ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వాలకు వినతిపత్రాలు, మహజర్లు సమర్పించారు. బ్రిటిషు పాలనలో అది విస్తృతంగా జరిగింది. ఆనాటి జనాభా లెక్కల సమయంలో అదొక ఉద్యమంలా సాగింది. గ్రామాల్లో వాడుకలో ఉన్న కులాల పేర్ల స్థానంలో సంస్కృత పదాలతో కూడిన కొత్త పేర్లు వచ్చాయి. గొల్ల, మంగలి, చాకలి లాంటి పేర్ల స్థానాన్ని యాదవ, నాయిబ్రాహ్మణ, రజక లాంటి పేర్లు ఆక్రమించాయి. ఇలా పేర్ల మార్పుతో మొదలై అగ్రకులాల అలవాట్లు, పద్ధతుల వైపు పరుగులెత్తటం, అందుకోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన సంఘటనలు మన చరిత్రలో చాలా కనిపిస్తాయి. అదొక సుదీర్ఘ ప్రయాణం. దేశంలో ఏదో ఒకచోట నిరంతరం సాగుతూనే ఉండేది. దీన్ని ఎలా చూడాలి? దాని ప్రాధాన్యతను ఎలా అర్థంచేసుకోవాలి? దాన్ని వివరించటానికి ఉపకరించే భావనను ఏమని పిలుచుకోవచ్చు? ఈ ప్రశ్నలను ఎంతో కొంత సమగ్రంగా అర్థంచేసుకోటానికి తోడ్పడిన పరిశోధనను చేసిన వారిలో సోషల్ ఆంథ్రపాలజిస్ట్ ఎం.ఎన్.శ్రీనివాస్‌ను ప్రముఖుడిగా భావించొచ్చు. సామాజికంగా కింది స్థాయిలో ఉన్న కులాలు పైకి ఎదగటానికి చేసే ప్రయత్నాలకు ఆయన సాంస్కృటైజేషన్ (సంస్కృతీకరణ) అని పేరుపెట్టారు. దీన్ని అర్థం చేసుకోటానికి చాతుర్వర్ణ సిద్ధాంతం చాలా అడ్డంకిగా ఉందని ఎన్నో ఉదాహరణలతో వివరించారు. అసలు ధర్మశాస్త్రాల్లో వర్ణించిన విధంగా మన సమాజం ఎప్పుడూ లేదు. ఆ గ్రంథాలన్నీ అప్పటికే ఉన్నత స్థానంలో ఉన్నవారు సమాజం ఇలా ఉండాలి... అలా ఉండాలి... అని నిర్దేశిస్తూ రాసినవిగానే చరిత్రకారులు భావిస్తారు. మన ప్రాచీన గ్రంథాల్లో వాస్తవాల వర్ణన శాతం చాలా తక్కువ. వాటిని ఆధారం చేసుకుని వివిధ ప్రాంతాలను పాలించిన రాజవంశాల పేర్లనే ఇప్పటికీ కచ్చితంగా నిర్ధారించలేం. సామాజిక జీవన చిత్రాన్ని వాటి నుంచి రాబట్టం చాలా కష్టం.



సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వ భావనలు బలమైన ఆదర్శాలుగా మన ముందుకు రానంతవరకూ కులవ్యవస్థ సృష్టించిన హెచ్చుతగ్గుల భావనలకు సవాళ్లు ఎదురుకాలేదు. వాటిని ఎదుర్కొనీ కుల భావనలు మనుగడ సాగించటం అంటే అసలైన ప్రజాస్వామ్య భావాలకు మనం చాలా దూరంలో ఉన్నట్లే లెక్క. ప్రస్తుతం మనకున్నది కుల భావనలు, కుల డిమాండ్లతో నిండిన ప్రజాస్వామ్యమే!

వర్ణాలను స్థూల శ్రమ విభజనకు నిదర్శనంగా మాత్రమే పరిగణించాలని చెప్పే వారూ ఉన్నారు. అలాగే వ్యక్తి గుణకర్మలను బట్టే వర్ణాల కేటాయింపు జరిగిందని వాదించే వారి సంఖ్యా తక్కువ కాదు. గుణకర్మలను బట్టి ఒక వర్ణం వారు ఇంకో వర్ణంలోకి మారే వెసులుబాటు ఉందని బోధించే వారూ మనకు కనపడతారు. సంప్రదాయవాదులు చేసే ఈ సమర్థనల జోలికి పోకుండా మన సమాజాన్ని అర్థం చేసుకోటానికి చాతుర్వర్ణ సిద్ధాంతం ఎలా అడ్డంకిగా మారిందో ఎం.ఎన్.శ్రీనివాస్ వివరించారు. మనది సుదీర్ఘ చరిత్ర ఉన్న కుల సమాజం. కులాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. కాలక్రమంలో కొత్త కులాలూ వచ్చాయి. కులాల స్థాయి, హోదాల గురించి పెనుగులాటలూ జరిగాయి. చాతుర్వర్ణ సిద్ధాంతం ప్రకారం చూస్తే ఇవేమీ కనపడవు. వర్ణ సిద్ధాంతం ప్రకారం నాలుగే కులాలు/వర్ణాలు ఉంటాయి. వీటి హోదాలు శాశ్వతం. దళితులకు ఈ సిద్ధాంత చట్రంలో స్థానం లేదు. సమాజంలోని వందలాది కులాలను పరిగణనలోకి తీసుకుంటే ఇది చాలా అసంబద్ధంగా తోస్తుంది. వర్ణ సిద్ధాంతంలో మార్పునకు అవకాశం లేదు. కులాల పరిస్థితి దీనికి భిన్నం. కుల సమాజంలో ఎన్నో మార్పులు జరిగాయి. హోదాల పెంపుదల కోసం ప్రయత్నాలు నిరంతరం సాగుతూనే ఉండేవి. ఆ ప్రయత్నంలో కులాల మధ్య వివాదాలు ముదిరితే విషయం రాజు దగ్గరికి వెళ్లేది. ఏ కులం పెద్దది, ఏ కులం చిన్నది.. అన్న దాంట్లో తుది తీర్పు రాజుదే. హిందూ రాజులే కాకుండా ముస్లిం రాజులు కూడా ఈ తీర్పులు ఇచ్చేవారు.

కుల వ్యవస్థకు రెండు ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. 1) బహుళ సంస్కృతులను అంగీకరించటం. అంటే ప్రతి కులానికి కొన్ని ప్రత్యేక పద్ధతులు, సంప్రదాయాలు ఉంటాయని ఆమోదించటం అన్న మాట. 2) పై స్థాయిలో ఉన్న కులాలను కింది స్థాయి వారు అనుకరించటం రెండో లక్షణం. ఈ అనుకరణ అనేది అన్నిచోట్లా సాఫీగా జరిగిందని భావించలేం. కొన్నిచోట్ల అది హింసకు, ప్రతిఘటనకు దారితీసింది. మరికొన్ని చోట్ల అంచెలంచెలుగా మాత్రమే ఆమోదం లభించింది. తమిళనాడు రామనాడ్ జిల్లాలోని కల్లాల కులస్థులు.. ఆది ద్రవిడుల విషయంలో విధించిన నిషేధాలను చూస్తే ప్రతిఘటన ఎంత తీవ్రంగా ఉండేదో తెలుస్తుంది. 1) ఆది ద్రవిడులు బంగారం, వెండి ఆభరణాలను ధరించకూడదు. 2) మగవాళ్లు నడుముకు పైభాగాన వస్త్రాలు వేసుకోకూడదు. 3) బనియన్లు, చొక్కాలు కూడా ధరించకూడదు. 4) జుట్టు కత్తిరించుకోకూడదు. 5) మట్టి పాత్రలు మినహా వేటినీ వాడకూడదు. 6) మహిళలు జాకెట్లు ధరించకూడదు. 7) పూలు పెట్టుకోకూడదు. కుంకుమపువ్వును వాడకూడదు. 8) పురుషులు గొడుగులను వాడకూడదు. చెప్పులను వేసుకోకూడదు.

దేవతారాధన, స్త్రీపురుష సంబంధాల్లో బ్రాహ్మణ పద్ధతులను అనుసరించటం చాలా చోట్ల జరిగినా అదే ఏకైక సంస్కృతీకరణ మార్గమని చెప్పలేం. కొన్ని కులాలకు ఒకప్పుడు అమ్మ దేవతలు తప్ప పురుష దేవతలే లేరు. శివాలయాలు, రామాలయాల సంగతే తెలియదు. బ్రాహ్మణులు కొలిచే దేవుళ్లకు స్థానంలేదు. ఆ వర్గ పూజారులకూ చోటు లేదు. సంస్కృతీకరణలో భాగంగా ఈ దేవుళ్లు, పూజారులు వచ్చారు. సంస్కృతీకరణలో చాలా చోట్ల ప్రధానపాత్ర



■ రాహుల్ కుమార్

ఆధిపత్య కులానిది. ప్రతి ప్రాంతంలోనూ ఒకటో రెండో ఆధిపత్య కులాలు (కమ్మ, రెడ్డి, వెలమ, కాపు, ఒక్కలిగ, మరాఠీ లాంటివి) ఉంటాయి. సాధారణంగా వీటి ఉనికి ఆయా ప్రాంతాలకే పరిమితమై ఉంటుంది. వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు ఆధిపత్య కులాలు ఉంటాయి. ఈ కులాల చేతుల్లో సారవంతమైన భూములు ఉంటాయి. సంఖ్యాబలం కూడా ఉంటుంది. వీళ్ల మీద ఆధారపడి వృత్తి, సేవా కులాలు మనుగడ సాగించేవి. ఈ ఆధిపత్య కులాలను అనుకరించటం సంస్కృతీకరణలో చాలా చోట్ల కనపడుతుంది.

రాజ్యాధికారం కులాల బలాబలాలను చాలా ప్రభావితం చేసింది. రాజ్యాలను పాలించిన వాళ్లల్లో ఎక్కువ మంది కింది కులాల నుంచి వచ్చిన వారే. అధికారాన్ని పొందిన తర్వాత వీళ్లని సచ్ఛూద్రులని అన్నారు. అధికారాన్ని సుస్థిరం చేసుకుని బ్రాహ్మణులను పోషించటం మొదలుపెట్టాక క్షత్రియ హోదాను సంపాదించారు. తాము ఎప్పటి నుంచో క్షత్రియులమని చెప్పటానికి కల్పిత వంశవరిత్రలను రాయించుకున్నారు. యుద్ధాలతో రాజ్య వ్యవస్థ నిరంతరం ఒడిదుడుకులకు లోనయ్యేది. కేంద్రీకృత రాజ్యాలు మనకు తక్కువ. పరస్పరం సంఘర్షించే రాజ్యాలే ఎక్కువ. ఈ పరిస్థితి నిరంతర సైన్య సమీకరణకు అనుకూలంగా ఉండేది. సొంత కులం నుంచి సాహసికులను సమీకరించుకుని పోరాడిన వారికి రాజ్యాధికారం కొన్నిసార్లు దక్కేది. దాంతో కుల సామాజిక హోదా పెరిగేది. భక్తి ఉద్యమం కూడా సంస్కృతీకరణకు చాలా దోహదం చేసింది. ఒక మనిషి గౌరవం పుట్టుక కంటే అతను చేసే పనులపై ఆధారపడి ఉంటుందని భక్తికవులు బలంగా చెప్పారు. భక్తికి కర్మకాండలు అవసరం లేదనీ ప్రచారం చేశారు. అందుకే కింది కులాల నుంచి కూడా భక్తికవులు వచ్చారు. సంస్కృతీకరణలో మరో కోణం కూడా ఉంది. కింది కులాల అలవాట్లను కూడా పై కులాల వాళ్లు స్వీకరించిన ఉదంతాలూ ఉన్నాయి. కేరళలో కొన్ని చోట్ల పితృస్వామ్యం నుంచి మాతృస్వామ్యానికి మారిన సంఘటనలు కనపడతాయి. ఇక కుల వ్యవస్థలేని గిరిజనులపై కూడా సంస్కృతీకరణ ప్రభావం పడింది. అంటే కులాలు లేని చోట్ల అవి ఏర్పడేలా చేసింది. ఇక్కడ అనుకరణ తెగల్లో కులాలకు దారితీసింది.

మన చరిత్రను నిశితంగా చూస్తే మార్పులకు నోచుకోని జడపదార్థాల్లాగా కులాలను భావించలేం. సంస్కృతీకరణ వల్ల అర్థమయ్యేది అదే. సంస్కృతీకరణ వల్ల కులాల స్థానాలు మారాయి. కుల వ్యవస్థ మాత్రం మౌలికంగా చెక్కుచెదరలేదు. మధ్యస్థాయి కులాలు పలుచోట్ల పైకి ఎగబాకినా ముఖ్యంగా దళితులకు ఆ అవకాశం సైతం దక్కలేదు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వ భావనలు బలమైన ఆదర్శాలుగా మన ముందుకు రానంతవరకూ కులవ్యవస్థ సృష్టించిన హెచ్చుతగ్గుల భావనలకు సవాళ్లు ఎదురుకాలేదు. వాటిని ఎదుర్కొనీ కుల భావనలు మనుగడ సాగించటం అంటే అసలైన ప్రజాస్వామ్య భావాలకు మనం చాలా దూరంలో ఉన్నట్లే లెక్క. ప్రస్తుతం మనకున్నది కుల భావనలు, కుల డిమాండ్లతో నిండిన ప్రజాస్వామ్యమే!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)


గోడల్ని పెంచుతున్న 'కుల' గురుకులాలు!

1973లో నేను ఒకటో తరగతిలో ఉన్నప్పుడు మా ఊరిలో ఒక ఆధిపత్య కుల కుటుంబంలో జరిగిన బాల్యవివాహ విందు భోజనానికి మా తాతగారిని ఆహ్వానిస్తే నన్ను కూడా వెంట తీసుకెళ్లాడు మమ్మల్ని వారి ఇంటి బయట రోడ్డుపై కూర్చోబెట్టి మాకు తగలకుండా భోజనం వడ్డించారు. నా ప్రశ్నలకు జవాబిస్తూ మా తాతగారు తక్కువ కులం వారిని ఇంట్లోకి రానివ్వరు అన్నాడు. కాలచక్రం గిర్రున తిరిగింది. నేను పదవ తరగతికి వచ్చేలోపు నా సహ విద్యార్థుల ఇండ్లలో కులంతో సంబంధం లేకుండా విందులకు వెళ్లేవారం. నేను డిగ్రీ చదివే సమయానికి కులాంతర వివాహాలు జరిగాయి. ఆ పదిహేను సంవత్సరాలలో మార్పు గురించి నేడు ఆలోచిస్తే ఆ ఆలోచనలన్నీ నేను చదివిన 'జిల్లా పరిషత్ హైస్కూల్' అనే మూలం దగ్గర ఆగినవి. గ్రామీణ పాఠశాలలు గొప్ప సామాజిక విప్లవ కేంద్రాలని అర్థం చేసుకున్నాను.

మనం చూస్తున్న గురుకులాలు. అవి రాష్ట్ర స్థాయిలో టాప్ ర్యాంక్‌కు పోటీపడి ఎన్నో ఉత్తమ ఫలితాలు సాధించాయి. ప్రస్తుత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ మహేందర్ రెడ్డి ఇక్కడి నుండి వచ్చినవారే. కాలక్రమంలో మారిన ప్రభుత్వాలు కులాలకు మతాలకు వేర్వేరు గురుకులాలను ఏర్పాటు చేశాయి. అయితే కులాల మతాల గురుకులాలను ఏ లక్ష్యాల కోసం ఏర్పాటు చేసారో, ఆ లక్ష్యాలకు భిన్నమైన ప్రతికూల ఫలితాలు రావటం ఎవరూ గుర్తించడం లేదు. విద్యావేత్తలు ఎవ్వరూ ఈ అంశంపై మాట్లాడటానికి సాహసించడం లేదు. కారణం ఇది ఒక ఓటు బ్యాంకు 'కుల' రాజకీయ సరుకుగా మారడమే.

మరోవైపు సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాలు విస్తృతంగా అందుబాటులోకి రావడంతో నిజాలకంటే అబద్ధాలే ఎక్కువగా, వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. కులచైతన్యం పేరుతో

తెలంగాణ గురుకులాల్లో విద్యార్థిని తన కులానికే పరిమితం చేస్తున్నారు. ఒక విద్యార్థి తన 'కులం' విద్యార్థులతోనే ఎక్కువ కాలం గడిపితే సామాజిక వైవిధ్యాలను ఎలా అర్థం చేసుకుంటాడు? ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన 'ఎడ్యుకేషన్ హబ్'లలో కుల గురుకులాలు వేటికవే వేర్వేరుగా ఉండాలా, లేక ఒకే గురుకులంగా ఉండాలా అనే స్పష్టత కోసం విద్య, సామాజిక రంగాలపై పరిశోధనలు చేస్తున్న మేధావులను చర్చలో విస్తృతంగా భాగస్వాములు చేయాలి.



తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా కొలువుతీరిన కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్య సంక్షేమ విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టి మండల స్థాయిలో రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుకు పూనుకోవడం ఒక మంచి అడుగు. ఈ సందర్భంలో ప్రస్తుత గురుకులాల అంతిమ లక్ష్యాల సాధనపై కూడా ఒక సమీక్ష జరగాలి.

ఇదే నేపథ్యంలో నేటి తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మంథని మధుకర్, మిర్యాలగూడ ప్రణయ్, సరూర్ నగర్ నాగరాజు పరువు హత్యలను కూడా ప్రస్తావించాల్సిందే. కులాల పుట్టుక, వాటి మధ్య ఉన్న అంతరాలపై అవగాహనా కల్పించే విద్యా బోధన లోపించటమే ఈ ఘటనల వెనుక ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. సరళీకృత ఆర్థిక విధానాలతో పుంజుకున్న ప్రైవేటు రంగ విస్తరణ విద్యారంగాన్ని సైతం లాభాల సరుకుగా మార్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యత క్రమంగా కుచించుకుపోయింది.

హైదరాబాద్ దక్కన్ నిజాం రాజ్యం భారతదేశంలో విలీనం అయిన తర్వాత ఆధునిక విద్యాలోపం వల్ల పరిపాలనలో అనేక సమస్యలు వచ్చాయి. పరిపాలన నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరతను తీర్చడానికి అందుబాటులో ఉన్న విద్యాసౌకర్యాలతో గ్రామీణ ప్రాంతంలోని మట్టిలో మాణిక్యాలను గుర్తించి వెలికితీయడానికి పీవీ నరసింహారావు విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఒక ఆలోచన చేశారు. తర్వాత ఆయన ముఖ్యమంత్రి అయ్యాకా 1971 నవంబర్ 23న దేశంలోనే తొలిసారి నల్గొండ జిల్లా సర్వేల్ నందు గురుకుల విద్యాబోధన ఏర్పాటు చేశారు. ప్రాచీన విద్యా బోధన సంస్కృతిని ప్రతిబింబించేలా ఉపాధ్యాయులూ విద్యార్థులూ ఒకే చోట ఉంటూ, ఉచిత భోజన వసతితో కూడిన ఆ గురుకుల విద్యాలయాలే నేడు

కులసంఘాల 'ఉపాధి ఉద్యమాలు' విరివిగా పెరిగాయి. పైకి కనిపించని రీతిలో కులవైషమ్యాలు స్థిరపడుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానంతో సోదర భావం పెరగాల్సిన చోట కూడా కులాల పేరుతో వాట్సాప్ గ్రూపులు ఏర్పడి కులాల మధ్య అగాధం మరింత పెరుగుతున్నది. గ్రామాలలో అన్ని వాడలు తిరగగలం అనుకునే వారికీ అగుపించని అదృశ్యపు కులగోడలు అడ్డుతగులుతున్నాయి. ఈ దూరాల్ని కులాల వారీ గురుకులాలు ఏ మాత్రం పూరించలేకపోవడమే కాకుండా వాటిని మరింత స్థిరపడేలా చేస్తున్నాయి.

ఆధునిక విద్యావిధానం అంతిమలక్ష్యం విద్యార్థి సమగ్ర మానసిక, సామాజిక వికాసాభివృద్ధిని పెంపొందించడంగా ఉండాలి. కాని తెలంగాణ గురుకులాల్లో విద్యార్థిని తన కులానికే పరిమితం చేస్తున్నారు. ఒక విద్యార్థి 11ఏళ్ళ వయసులో ఐదవ తరగతిలో గురుకుల పాఠశాలలో చేరితే 22ఏళ్ళ వరకు, అనగా డిగ్రీ వరకు, గురుకులాల్లో చదివే అవకాశాలు ఉన్నాయి. సౌకర్యాల గురించి పక్కన పెడితే, ప్రస్తుత 'కుల' గురుకుల వ్యవస్థ ఎంతవరకు విద్యార్థి సమగ్ర వికాసాభివృద్ధికి దోహదపడుతుందన్నదే పెద్ద ప్రశ్న. విద్యార్థి జీవితంలో ఎంతో కీలక దశగా విద్యావేత్తలు గుర్తించిన కౌమార దశ అనగా టీనేజ్‌లో విద్యార్థి భవిష్యత్తు నిర్ధారణ అవుతుంది. ఆ కాలంలో ఒక విద్యార్థి తన 'కులం' విద్యార్థులతోనే ఎక్కువ కాలం గడిపితే సామాజిక వైవిధ్యాలను ఎలా అర్థం చేసుకుంటాడు? సామజిక సవాళ్ళను ఎలా ఎదుర్కోగలడు? సమాజంలో ఇతర విద్యార్థులతో పోటీ పడే అవకాశం, ఇతరుల సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకునే అవకాశం కోల్పోతాడు కదా? తన 'కులం' వారే తనకు పోటీ అనే గిరిలో చిక్కుకుపోయి, రిజర్వేషన్ పరిధి దాటలేని పరిస్థితి కల్పించబడి, విద్యార్థి సమగ్ర ఎదుగుదల కుంటుపడుతుంది. దేన్ని ఆశించి ఈ 'కుల' గురుకులాల వ్యవస్థను పటిష్ఠం చేశారో ఇప్పుడు చర్చ చేయాల్సిన అవసరం ఉంది. 'కుల' గురుకులాల్లో చదివే విద్యార్థులు 'బిస్కెట్ బ్యాచ్'గా తయారై తమ కులానికి కేటాయించిన 'పరిమిత' రిజర్వేషన్‌లోనే పోటీపడే వ్యవస్థను నిర్మించడం ఏ విధంగా సమంజసం?

ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన 'ఎడ్యుకేషన్ హబ్'లలో కుల గురుకులాలు వేటికవే వేర్వేరుగా ఉండాలా, లేక ఒకే గురుకులంగా ఉండాలా అనే స్పష్టత కోసం విద్య, సామాజిక రంగాలపై పరిశోధనలు చేస్తున్న మేధావులను చర్చలో విస్తృతంగా భాగస్వాములు చేయాలి.

నేటి గురుకులాల్లో ఒక్కోదానిలో ఒక్కో రకమైన సదుపాయాలు ఉన్నవి. ఎడ్యుకేషన్ హబ్‌లో కుల గురుకులాలు వేరువేరుగా ఉన్నట్లయితే ఒక కుల గురుకులంలో కల్పిస్తున్న సౌకర్యాలు, మరో కుల గురుకులంలో లేకపోవడం వల్ల విద్యార్థుల మధ్య అసూయా ద్వేషాలు పెంపొందడానికి కారణమౌతాయి. ఇప్పటికే మైనారిటీ గురుకులాల్లో కల్పిస్తున్న సౌకర్యాలు ఇతర గురుకులాల్లో కల్పించడం లేదనే విమర్శ ఉంది. అంతేగాకుండా వేర్వేరు శాఖల, అధికారుల పర్యవేక్షణవల్ల ఒక్కోఅధికారి తనదైన ముద్ర వేసుకోవడానికి ప్రయత్నిస్తూ చేసిన ప్రయోగాలు ఆయా అధికారులు బదిలీ కాగానే కుంటుపడి మరో కొత్త విధానానికి తెరలేపడం వల్ల గురుకుల స్ఫూర్తికి స్థానం లేకుండా పోతున్నది. ఫలితాలివ్వని ప్రయోగశాలలుగా వెక్కిరిస్తున్నాయి. గతంలో పనిచేసిన ఒక అధికారి తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఏకంగా ఒక ప్రవేటు సైన్యాన్నే తయారు చేసుకొని దాని ఆధారంగా రాజకీయాల్లోకి వెళ్ళి విఫలమయ్యాడు. ఈ కుల గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు నీట్, ఐఐటీ లాంటి ప్రవేశ పరీక్షల్లో తమ కులరిజర్వేషన్ పరిధి దాటి ఓపెన్ కేటగిరిలో రాణించకపోవడమే వీటి వైఫల్యానికి సజీవసాక్ష్యం.

దేశం గర్వించదగ్గ రాజనీతిజ్ఞుడు, బహుభాషాకోవిదుడు, సాహితీవేత్త, దక్షిణాదికి చెందిన మాజీ భారత ప్రధాని పీవీ నరసింహారావు కలలుగన్న గురుకుల విద్యను సాకారం చేయాలంటే ముందుగా నేటి కుల గురుకులాలను సమూలంగా ప్రక్షాళన చేయాలి. అణగారిన వర్గాల రిజర్వ్‌డ్ కోటాకు ఏ మాత్రం భంగం వాటిల్లకుండా కుల మత రహిత గురుకులాల హబ్ ఏర్పాటే వీటి సఫలతకు మేలైన మార్గం.

● మామిడి నారాయణ
సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రీసెర్చ్ ఫౌండేషన్

'గద్దర్ అవార్డ్'పై రౌండ్ టేబుల్ సమావేశం

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నంది అవార్డ్‌ను గద్దర్ అవార్డ్‌గా ప్రకటించారు. ఇది చాలా సముచిత నిర్ణయంగా మేం భావిస్తున్నాం. అలాగే సినీ ప్రముఖులు సైతం దీనిని స్వాగతించారు. భారతదేశ సాంస్కృతిక చరిత్రలో చెరగని ధృవతార గద్దర్. ఆయన చేసిన ఐదు దశాబ్దాల కృషికి ఇది సరైన గౌరవం. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నేటి ఉదయం పది గంటలకు కవులు, కళాకారులు, మేధావులు, సినీరంగ ప్రముఖులు, ప్రజా సంఘాలను కలుపుకొని "గద్దర్ అవార్డ్—సినీ ఇండ[illegible] అవుట్ లుక్" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నాం. పసునూరి రవీందర్ అధ్యక్షత వహించే ఈ సమావేశంలో ప్రముఖ రచయిత ప్రొ. కంచ ఐలయ్య షెపర్డ్, జేబీ రాజు, బి. నర్సింగరావు, ఎస్. శంకర్, సుద్దాల అశోక్ తేజ, పాశం యాదగిరి, గాదె ఇన్నయ్య, విమలక్క, రియాజ్, కొల్లూరి భరత్, చీమ శ్రీనివాస్, ఎం.ఎం. రహమాన్, కందుకూరి రమేష్ బాబు తదితరులు పాల్గొంటారు.

— గద్దర్ గళం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా

ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

అమాయక ప్రాణాలకు 'ఉచ్చు'

- వన్యప్రాణుల కోసం తీగలు అమర్చిన వేటగాళ్లు
- విద్యుత్ ఉచ్చుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బలి
- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో విషాదం

7



ప్రవీణ్(ఫైల్) రమేష్(ఫైల్)



పూర్తయిన కల్యాణ మండపం

7

'కల్యాణ' వైభోగమే..

- పూర్తయిన వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం పనులు
- ఈనెల 18న ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు
- కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాక
- ఏర్పాట్ల పర్యవేక్షణకు నేడు నగరానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- పద్దెనిమిదేళ్ల తర్వాత ఎట్టకేలకు పూర్వరూపం
- రూ.15కోట్ల వ్యయంతో పునరుద్ధరణ పనులు

హనుమకొండలోని వేయిస్తంభాల గుడి చారిత్రకంగా ఎంతో సుప్రసిద్ధమైంది. కాకతీయుల మహోజ్వల ఘట్టానికి నిలువెత్తు నిదర్శనమైన 850 ఏళ్లనాటి పురాతన కట్టడమిది. వేయిస్తంభాలగుడి, దానికి అనుబంధంగా నిర్మించిన కల్యాణ మండపం రమణీమైన శిల్పకళా ప్రతిభకు నిలువెత్తు నిదర్శనం. మండపం మొత్తాన్ని రాతి స్తంభాలతోనే దీనిని నిర్మించారు. ఆ కాలంలో ఈ మండపంలో ఉదయం, సాయంత్రం నాట్యప్రదర్శనలు జరుగుతుండేవని శాసనాలను బట్టి తెలుస్తోంది. అలాంటి చారిత్రక ప్రదేశం 18 ఏళ్ల కిందట కుంగుబాటుకు గురైంది. కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో మండపం పునరుద్ధరణ పనులు చేపట్టారు. మండపం పునరుద్ధరణ పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.7కోట్లను కేటాయించింది. పెరిగిన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని మరో రూ.5.50 కోట్లను కూడా మంజూరు చేసింది. పనులు పూర్తి అయి ఎట్టకేలకు ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. - హనుమకొండ, ఆంధ్రజ్యోతి

నేడు మేడిగడ్డకు సీఎం

బ్యారేజీ వద్ద ముమ్మరంగా ఏర్పాట్లు

- పార్కింగ్ ప్రదేశాలతోపాటు సభాస్థలి నిర్మాణం
- గోదావరిలో కుంగిన పిల్లరు వద్ద డీవాటరింగ్





మేడిగడ్డ బ్యారేజీ వద్ద సభావేదిక నిర్మాణం కోసం కొనసాగుతున్న పనులు

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 12: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని మేడిగడ్డకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం వస్తున్నారు. మంత్రివర్గ సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలనకు ఈ బృందం రానుంది. ఈ పర్యటనపై సీఎం ఇప్పటికే అసెంబ్లీలో ప్రకటించారు. రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సుమారు 40 బస్సుల్లో మేడిగడ్డకు రానున్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. మేడిగడ్డ బ్యారేజీ సందర్శన అనంతరం సమీపంలోని హోమశాల వద్ద పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. బ్యారేజీ నిర్మాణ లోపాలను వివరించనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు.

ఇందుకు అధికారులు వేదికను ఏర్పాటు చేస్తున్నారు. వీఐపీ పార్కింగ్, విడిది ప్రదేశాలను ఇప్పటికే సిద్ధం చేశారు. అలాగే బ్యారేజీ వంతెనపై కుంగిన పిల్లరు మీదుగా మహారాష్ట్ర వైపు నుంచి గోదావరి నదిలో పగుళ్ల తేలిన పిల్లర్ల వద్దకు రేవంత్‌రెడ్డి బృందం వెళ్లనుండగా అక్కడ సైతం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా బ్లాక్-7లోని 20వ పిల్లరును ముఖ్యమంత్రి పరిశీలించే అవకాశం ఉండటంతో ఆ ప్రదేశంలో ఊటల ద్వారా వస్తున్న నీటిని డీవాటరింగ్ చేస్తున్నారు. కుంగిన ప్రాంతంలో కాంక్రీటు పగుళ్లు తేలడంతో గోదావరి ప్రవాహాన్ని మరల్చేందుకు ఏర్పాటు చేసి మట్టి కట్టల ద్వారా ఊటలు ఉబికివస్తున్నాయి. దీంతో పెద్ద మోటార్లను ఏర్పాటు చేసి నీటిని తొలగిస్తున్నారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి వచ్చే మార్గాల్లో సైతం స్వల్ప మార్పులు చేశారు. బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, సూరారం మీదుగా మేడిగడ్డకు ముఖ్యమంత్రి బృందం చేరుకుంటుందని రూట్‌మ్యాప్ సిద్ధం చేయగా సోమవారం దానిని మార్చేశారు. కుదురుపల్లి వద్ద నుంచి మహదేవపూర్ మండల కేంద్రం, ఎల్అండ్‌టీ రోడ్డు మీదుగా నేరుగా మేడిగడ్డ బ్యారేజీకి ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేరుకోనున్నారు. తిరిగి అదేమార్గంలో హైదరబాద్‌కు వెళ్లిపోనున్నారు. మహదేవపూర్ నుంచి వెళ్లే మార్గంలో సుమారు ఐదు గ్రామాలు ఉండటంతో ట్రాఫిక్‌పరంగా ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో రూట్‌ను మార్చినట్లు సమాచారం.

బస్సులో వచ్చి.. హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు..

హైదరాబాద్ నుంచి ఏసీ బస్సుల్లో ఉదయం 9.30 గంటలకు బయల్దేరనున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మధ్యాహ్నం 2 గంటలకు మేడిగడ్డకు చేరుకోనున్నారు. బ్యారేజీ వద్ద పరిశీలన, సభ అనంతరం మంత్రులు, ఎమ్మెల్యే తిరిగి హైదరాబాద్‌కు బస్సుల్లో బయల్దేరనున్నారు. ముఖ్యమంత్రి మాత్రం మేడిగడ్డ నుంచి హెలిక్యాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు తిరిగి వెళ్లనున్నారు.



బ్యారేజీ 20వ పిల్లరు వద్ద ఊటల ద్వారా వస్తున్న నీటిని డీవాటరింగ్ కోసం ఎత్తిపోస్తున్న మోటార్లు

పర్యటన ఇలా..

- ఉదయం 9.30 గంటలకు రోడ్డు మార్గాన హైదరాబాద్ నుంచి మేడిగడ్డకు బయల్దేరుతారు.
- మధ్యాహ్నం 2గంటలకు మేడిగడ్డ బ్యారేజీకి చేరుకుంటారు..
- 2 నుంచి 3గంటల వరకు బ్యారేజీ వంతెన, కుంగిన పిల్లర్లను ఎరిశీలించనున్నారు.
- మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై సమీక్షించనున్నారు.
- సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితి, గత ప్రభుత్వ వైఫల్యాల గురించి మీడియాతో సీఎం మాట్లాడతారు.
- సాయంత్రం 5గంటలకు తిరిగి హైదరాబాద్‌కు వెళతారు.

పారిశుధ్య సేవకు సిద్ధం

- మేడారం జాతరకు బల్దియా పారిశుధ్య కార్మికులు
- భక్తుల సేవలకు 550 మంది కేటాయింపు
- ప్రస్తుతానికి 30 స్వచ్ఛ ఆటోల కేటాయింపు



జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 11: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర విధుల నిర్వహణకు వరంగల్ మహానగర పాలక సన్నద్ధమవుతోంది. ఈమేరకు అధికారగణం ప్రణాళికను రూపొందిస్తున్నారు. కోటికి పైగా వచ్చే భక్త జన సందోహ జాతరలో ప్రజారోగ్య పారిశుధ్య కార్మికుల సేవలే ప్రశంసనీయంగా ఉంటాయి.

ప్రజారోగ్య విభాగానిదే కీలక పాత్ర

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో జీడబ్ల్యూఎంసీలోని ప్రజారోగ్య విభాగానిదే కీలక పాత్ర. జాతర ప్రారంభానికి ముందు నుంచే ఈ విభాగం సేవలు ఆరంభమవుతాయి. పోస్టు జాతర సేవల్లో సైతం ప్రజారోగ్య విభాగ పాత్ర ఉంటుంది. ఈ ప్రాముఖ్యత మేరకు జీడబ్ల్యూఎంసీ కమిషనర్, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే పలుమార్లు జాతరలో పారిశుధ్య, సేవలు, ప్రజారోగ్య విభాగం పాత్రపై పలు సమావేశాలు నిర్వహించి ప్రణాళికను రూపకల్పన చర్యలు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి వన-జన జాతర February 21-24 2024

550 మంది కార్మికులు

మేడారం జాతర కోసం జీడబ్ల్యూఎంసీ ప్రజారోగ్య విభాగం చర్యలు చేపట్టింది. ప్రస్తుతానికి 550 మంది పారిశుధ్య కార్మికులను జాతర కోసం తీసుకెళ్లాలనే నిర్ణయం జరిగింది. ఆ తదుపరి అవసరాల మేరకు కార్మికుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్ల అధికారులు చెబుతున్నారు. పారిశుధ్య కార్మికులతోపాటు జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు జాతర విధులు నిర్వహిస్తారు. జాతరలో 10 మంది కార్మికులకు ఒక జవాన్ ఉంటారు. మేడారాన్ని సెక్టార్లు విభజించి ఈ మేరకు కార్మికులకు విధుల కేటాయింపు జరుగుతుంది. సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్ పర్యవేక్షణలో ప్రజారోగ్య సేవలు అందుతాయి.

30 స్వచ్ఛ ఆటోల కేటాయింపు

జాతర కోసం బల్దియా 30 స్వచ్ఛ ఆటోలను కేటాయించింది. అయితే వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త తరలింపు జరుగుతుంది. వాహనాలు మరమ్మతులకు గురైనా, మరిన్ని ఆటోలు అవసరమైనా వెంటనే సమకూర్చుకొనుటకు రిజర్వులో మరి కొన్ని స్వచ్ఛ ఆటోలను సిద్ధం ఉండేలా ప్రణాళికను రూపొందించారు.

50 ఏళ్ల లోపు ఎంపిక

జాతర విధులకు 50 ఏళ్ల వయస్సు లోపు కార్మికులనే ఎంపిక చేయాలనే నిర్ణయం జరిగింది. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా కొద్ది రోజుల కిందట ప్రజారోగ్య విభాగంతో జరిపిన సమీక్ష

మిగతా 8వ పేజీలో..

భారీగా పంచాయతీరాజ్

అధికారుల బదిలీలు

- సీఈవో, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలకు స్థానచలనం

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

- వరంగల్ అర్బన్ పరిధిలో 13 మందికి స్థానచలనం, పోస్టింగ్‌లు

వివరాలు : 7లో..

రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పులు సహించం..

- సీఎం రేవంత్ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి
- లేదంటే వరంగల్ నుంచి మరో పోరాటం చేస్తాం..
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్



విలేకర్ల సమావేశంలో వినయ్‌భాస్కర్, అరూరి రమేష్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12: రాష్ట్ర అధికారిక చిహ్నంలో పొందుపరిచిన కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడాన్ని సహించేది లేదని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ హెచ్చరించారు. సోమవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వినయభాస్కర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అధికారిక లోగో నుంచి కాకతీయ కళాతోరణం, చార్మినార్ చిహ్నాలను తొలగించాలని నిర్ణయం తీసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. కేబినెట్‌లో చర్చించనప్పుడు వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు సురేఖ, సీతక్కలు అడ్డుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇద్దరు మహిళా మంత్రులకు ఓరుగల్లు పౌరుషం లేదా అని నిలదీశారు. కాకతీయ కళాతోరణానికి, చార్మినార్‌కు గొప్ప చరిత్ర ఉందని ఆయన అన్నారు. మేధావులు, చరిత్రకారులతో సమావేశం ఏర్పాటు చేసి ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే వరంగల్ నుంచి మరో పోరాటం చేస్తామని వినయభాస్కర్ హెచ్చరించారు. ఆంధ్ర ప్రాంత నేతల డైరెక్షన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నాడని ఆయన ఆరోపించారు. తెలంగాణ చరిత్రను చెరిపేసే ప్రయత్నాలు వెనక్కి తీసుకోవాలని వినయభాస్కర్ డిమాండ్ చేశారు.

వరంగల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అరూరి రమేశ్ మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం.. రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పులు చేస్తామని నిర్ణయించి గందరగోళం సృష్టిస్తోందని ఆయన విమర్శించారు. దళితబంధు, బీసీబంధులను గాలికి వదిలేసిందని, ఆసరా పెన్షన్ల ఊసే లేదని ధ్వజమెత్తారు. కృష్ణా జలాల నిర్వహణ బాధ్యతలను కేంద్రానికి అప్పగించడాన్ని నిరసిస్తూ మంగళవారం నల్లగొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని అరూరి రమేశ్ పిలుపునిచ్చారు. ఈ విలేకర్ల సమావేశంలో హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, నేతలు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్, ఇండ్ల నాగేశ్వర్‌రావు, రత్నాకర్‌రెడ్డి, జక్కు రమేశ్, నయీమ్, పులి రజనీకాంత్, రవిందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నీళ్లను ఆంధ్రాకు తరలించిన కేసీఆర్

- కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాంనర్సింహారెడ్డి

హసన్‌పర్తి, ఫిబ్రవరి 12 : తెలంగాణ నీళ్లను ఆంధ్రోళ్లకు ఇచ్చింది మాజీ సీఎం కేసీఆర్‌యేనని కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డి అన్నారు. కృష్ణా ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలు చేస్తున్న దుష్ప్రచారానికి నిరసనగా సోమవారం హసన్‌పర్తి జాతీయ రహదారిపై మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహన చేశారు. ఈ సందర్భంగా వెంకట్రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ నీళ్ల, దొంగ ఒప్పందాలు చేసి తరలించింది కేసీఆర్‌యేనన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి నల్లగొండ సభ పెడుతున్నాడని విమర్శించారు. అసెంబ్లీ ఫలితమే లోక్ ఎన్నికల్లో పునరావృతమవుతుందన్నారు. రైతులకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగెళ్లపెల్లి తిరుపతి, 66వ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, నాయకులు ఆరెల్లి వెంకటస్వామి, బల్సుకూరి శ్రీనివాస్, పుల్ల రవిందర్, జన్ను రవిందర్, పిట్టల రాజు, తోకల లక్ష్మారెడ్డి, సంపత్‌యాదవ్, ఉదయ్‌రెడ్డి, సతీష్, గొర్రె కిరణ్, రఘు, సునిల్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ దిష్టిబొమ్మతో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పట్టు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- కలెక్టర్ సిక్తాపట్నాయక్



స్టాల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 12: పట్టు రైతులకు ప్రభుత్వం రాయితీలనిస్తూ ప్రోత్సహిస్తోందని, అధికోత్పత్తిని సాధించేందుకు సైంటిస్టుల సూచనలు రైతులు పాటించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో సోమవారం రీజినల్ సిరి కల్చరల్ రిసెర్చ్ స్టేషన్ సెంట్రల్ సిల్క్ బోర్డు, రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ సహకారంతో రాష్ట్రస్థాయి పట్టు రైతుల డీలర్ల, వీవర్స్ సమ్మేళనం నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి రైతులు, డీలర్లు, వీవర్లు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సైంటిస్టులు సూచిస్తున్న సలహాలను, సూచనలను రైతులు పాటించి అధిక దిగుబడిని సాధించి రాష్ట్రంలో పట్టు ఉత్పత్తిని అగ్రస్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. నూతన సాంకేతిక పద్ధతులను తెలుసుకొని ప్రగతిని సాధించాలని అన్నారు.

సిరి కల్చర్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఎం.లత మాట్లాడుతూ.. ఒక ఎకరం మల్బరీ తోట ద్వారా సంవత్సరం పొడవునా ఐదుగురికి ఉపాధి లభిస్తుందని అన్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే మూడు రకాల పట్టు ఇరి, దసళి, మల్బరీ ఉత్పత్తులు మన రాష్ట్రంలోనే లభిస్తున్నాయన్నారు. మల్బరీ బహువార్షిక పంట అని అన్నారు. నీటిని నిల్వగా ఉంచుకొని మల్బరీని సాగుచేస్తే అధిగ దిగుబడి సాధించుకోవచ్చని చెప్పారు. సీఎస్ఆర్‌టీఐ మైసూర్ డైరెక్టర్ డాక్టర్ గాంధీ దోస్ మాట్లాడుతూ.. మల్బరీని ఒకేసారి నాటితే 15 యేళ్ల వరకు పంట దిగుబడి సాధ్యమవుతుందని అన్నారు. సెంట్రల్ సిల్క్ బోర్డు ఇస్తున్న సూచనలను, సలహాలను పాటిస్తూ రైతులు అధిక దిగుబడిని సాధించాలన్నారు. పట్టు పురుగుల పెంపకంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు సైంటిస్టుల సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ జి.రాఘవేంద్ర, సైంటిస్టులు డాక్టర్లు భాగ్య, ఖాద్రీ, అనసూయ, వినోద్ కుమార్ యాదవ్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులు వెంటనే పరిష్కరించాలి


- అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 12: ప్రజావాణి వినతులు వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను అధికారులు కాలయాపన చేయకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 89 వినతులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వైవీ గణేష్, డీఆర్డీవో ఎ.శ్రీనివాసకుమార్, డీపీవో జగదీశ్వర్, జడ్పీ సీఈవో వెంకటేశ్వర్‌రావు, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ మేన శ్రీను, ఇండస్ట్రీస్ జీఎం హరిప్రసాద్, మైనింగ్ విభాగం ఏడీ నర్సిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీడబ్ల్యూఓ మధురిమ, మెప్మా పీడీ భద్రునాయక్ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాధిక గుప్తా





పద్మాక్షికాలనీలో ఒకరిపై దాడి

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 12: హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధి పద్మాక్షికాలనీలో ఒకరిపై దాడి చేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మాక్షి కాలనీకి చెందిన బొంత వెంకటేశ్వర్లు, అతడి భార్య, కొడుకు రాజుతో కలిసి నివాసం ఉంటున్నారు. వారు ఇంటి సమస్యలపై గొడవ పడుతుండగా ఇంటి పక్కనే ఉన్న రాజు, ప్రకాశ్, నాగరాజు, ఉమ, రమ, సమ్మక్క అనే ఆరుగురు వ్యక్తులు కలుగ జేసుకుని ఇంటిపైకి వచ్చారు. వెంకటేశ్వర్లు కుమారుడు రాజుపై ఆరుగురు వ్యక్తులు మూకుమ్మడిగా దాడికి దిగారు. దీనిపై వెంకటేశ్వర్లు హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

గడ్డిమందు తాగి యువకుడి ఆత్మహత్య

ఐనవోలు, ఫిబ్రవరి 12: గడ్డిమందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెంకటాపురంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగెం మండలం రాంచంద్రపురం గ్రామానికి చెందిన దౌతుబాజి అజయ్(22) ఇంటర్ చదివాడు. అమ్మమ్మ గ్రామమైన వెంకటాపురంలో నివసిస్తున్నాడు. ఏదైనా పనిచేసుకోవాలని కుటుంబసభ్యులు మందలించారు. దీంతో అజయ్ వారం కిందట గడ్డి నివారణ మందు తాగాడు. కుటుంబసభ్యులు గుర్తించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

మహిళా ఉద్యోగికి వేధింపులు

రూ. 8 లక్షలు కాజేసిన కారుడ్రైవర్... కేసు నమోదు చేసిన పోలీసులు


హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 12: వరంగల్ జిల్లా నర్సంపేట ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిని ఆమె కారు డ్రైవర్ డబ్బులు తీసుకుని మోసం చేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ న్యూరాయపురలో ఉంటున్న ఓ మహిళ.. నర్సంపేట ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. కుటుంబంలో విభేదాలు తలెత్తడంతో భర్తతో విడాకులు తీసుకుంది. హనుమకొండలో ఇద్దరు కుమారులతో నివాసం ఉంటోంది. కాగా, ములుగు జిల్లా బండారుపల్లి గ్రామానికి చెందిన బూజుగుండ్ల శివరాజ్ అనే వక్తి రెడ్డికాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో మహిళా ఉద్యోగితో ఫోన్‌లో పరిచయం చేసుకున్నాడు. తాను కారు డ్రైవర్‌గా పని చేస్తున్నానని నమ్మబలికాడు. ఈ మేరకు 2019లో మహిళా ఉద్యోగి ఒక కారు కొనుగోలు చేసి తాత్కాలిక డ్రైవర్‌గా శివరాజ్‌ను నియమించుకుంది. చాలాసార్లు ఆమె పిల్లల వద్దకు హైదరాబాద్‌కు తనతో తీసుకుని వెళ్లి వచ్చారు. ఆమె వద్దనే పర్మినెంట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆమెకు తన కుటుంబసభ్యులను సైతం పరిచయం చేశాడు.

కాగా, డబ్బులు అవసరం ఉన్నాయని మహిళ నుంచి రూ.8లక్షలు తీసుకున్నాడు. తర్వాత ఆమె సెల్‌ఫోన్ నుంచి పర్సనల్ ఫొటోలు తీసుకుని బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. డబ్బులు అడిగితే ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని ఫోన్ చేసి బెదిరించేవాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతోపాటు కారును కూడా ఇవ్వలేదు. ఇదేమిటని అడుగగా డబ్బులు, కారు అడిగితే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.















వేయిస్తంభాలగుడి కల్యాణ మండపానికి తుది మెరుగులు



పూర్తయిన మండపం పైకప్పు

'కల్యాణ' వైభోగమే..

● పూర్తయిన వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం పనులు ● ఈనెల 18న ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

హనుమకొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రకంగా సుప్రసిద్ధమైన కాకతీయుల కాలం నాటి శ్రీ రుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాల గుడి కల్యాణ మండపం పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. మండపం పైకప్పు పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. ఈనెల 18వ తేదీన కల్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించాలని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు ముహూర్తం నిర్ణయించారు. ఈప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హాజరుకానున్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి మండప ప్రారంత్సోవాన్ని మార్చి నెలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో నిర్వహించాలని మొదట నిర్ణయించారు. అయితే ఆలోగా లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. దీనితో ఈ లోగానే మండపం పనులు పూర్తి చేసి ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. మండపం పనులను పరిశీలించేందుకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మంగళవారం వేయిస్తంభాల గుడికి వస్తున్నారు.

పూర్తయిన పైకప్పు

కల్యాణ మండపంపైన పైకప్పు పూర్తయింది. పలకలన్నిటినీ అమర్చారు. దక్షిణ ద్వారం వైపు మూడు పకలను అమర్చాల్సి ఉన్నది. వాటిని బుధ, గురువారాల్లో అమర్చితే మండపం పునర్నిర్మాణం పనులు పూర్తయినట్టే. మండపం పనుల త్వరితగతిన పూర్తికి స్థపతి బాలక్రిష్ణన్ శివకుమార్ నేతృత్వంలో తమిళనాడుకు చెందిన సుమారు 40మంది శిల్పులు రేయింబవళ్లు పని చేశారు. విద్యుత్‌లైట్ల వెలుగుల్లో అర్ధరాత్రి వరకు పనులు కొనసాగించారు. కేంద్ర పురావస్తుశాఖ సూపరింటెండెంట్ ఎస్. సుమితా కుమారి పర్యవేక్షణలో పురావస్తు ఇంజనీర్ క్రిష్ణచైతన్య. జిల్లా పురవాస్తుశాఖ అధికారి మల్లేశం దగ్గరుండి పనులు చేయించారు. ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండు రంగారావు సాంకేతిక సహాయాన్ని అందించారు.

ప్రమాదాన్ని పసిగట్టి

వేయిస్తంభాల గుడి కట్టడం చెక్కు చెదరలేదు కానీ దీనికి ఎదురుగా ఉన్న ఈ కల్యాణ మండపం మాత్రం శిథిలావస్థకు చేరుకున్నది. ఇందుకు కారణం దానికి కింది నుంచి ప్రవహించిన నీటి పాయగా గుర్తించారు. నీటి ప్రవాహం వల్ల పునాదిలో వాడిన ఇసుక తొలగిపోవడం వల్ల ఈశాన్య దిశగా రాతి స్తంభాలు కుంగి మండపం క్రమంగా పక్కకు ఒరిగి పోవడం మొదలుపెట్టింది. దీనిని అలాగే ఒదిలేస్తే మండపం ఎప్పుడైన కూలిపోయే ప్రమాదం ఉందని గుర్తించింది. ఒకవేళ అదే జరిగితే స్తంభాలన్నీ ముక్కలుగా విరిగి పోయి పునర్‌నిర్మాణం ఏమాత్రం సాధ్యం కాదు. దీంతో మండపం పడిపోక ముందే కేంద్ర పురావస్తు శాఖ 18 ఏళ్ల కిందట దీని పునర్నిర్మాణమనే మహాఘట్టానికి శ్రీకారం చుట్టింది. దిగితేకానీ లోతు తెలియదన్నట్లుగా పునర్నిర్మాణ పనులు చేపట్టిన తర్వాత అనేక అడ్డంకులు ఎదురయ్యాయి.

ఆగుతూ సాగుతూ..

మండపం పునర్నిర్మాణ పనులు ఇన్నాళ్లు అనేక అడ్డంకుల మధ్య ఆగుతూ సాగుతూ వచ్చాయి. మండపం పునర్మిణ పనులు 2006లో మొదలయ్యాయి. ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు చొరవతో ఒకవైపు కుంగిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్న మండపాన్ని మొదట ఎక్కడికక్కడ పూర్తిగా విప్పారు. వాటికి నెంబర్లు వేసి పద్మాక్షి గుడి సమీపంలో జాగ్రత్తగా భద్రపరిచారు. ఇసుక పునాదిని పూర్తి తొలగించి ఆ స్థానంలో మరో వెయ్యేళ్లపాటు కట్టడం నిలిచి ఉండేలా తిరిగి అదే రీతిలో ఇసుకతో (సాండ్ బాక్స్ టెక్నాలజీ) పునాదిని నిర్మించారు. బేస్‌మెంట్ పూర్తయిన తర్వాత 2010లో మండపాన్ని తిరిగి నిలబెట్టే పనులు మొదలయ్యాయి. 2017వరకు పనులు సజావుగానే సాగాయి. ఆ తర్వాత స్థపతికి బిల్లుల చెల్లింపులో జరిగిన జాప్యం వల్ల పనులు కుంటుపడ్డాయి. దాదాపు ఐదేళ్లపాటు అసలు పనులే జరగలేదు.

కేంద్రమంత్రి చొరవతో..

కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మండపం పనుల్లో కదలిక వచ్చింది. గతంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడు వరంగల్‌కు వచ్చిన పలు సందర్భాల్లో ఈ మండపం పనుల పురోగతి గురించి ఆరా తీశారు. పనులు సత్వరం పూర్తయ్యేట్టు చూస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మండపం పనులపై ప్రత్యేక దృష్టిసారించారు. స్థపతికి చేసిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో ఏర్పడిన సమస్యను ఆయన పరిష్కరించారు. బిల్లుల చెల్లింపు జరిగేట్టు చూడడమే కాకుండా చివరి దశ పనుల పూర్తికి అవసరమైన రూ.5 కోట్ల నిధులను కూడా విడుదల చేయించారు. అలాగే మండపం విగిలిపోయిన పనులను చిన్న చిన్న బిట్లుగా చేసి ఒక్కోదానికి ఇంత అని నిర్ణయించి నిధులు విడుదల చేయడం ద్వారా పూర్తి చేసేందుకు కేంద్ర పురావస్తుశాఖ ముందుకు వచ్చింది. ఆ మేరకు ఏడాది కిందట పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఐదు బిట్లకు నిధులు విడుదలయ్యాయి. దీనితో పనులు వేగం పుంజుకున్నాయి. కాగా, జనవరి నెలాఖరులోగా ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తిచేయాలని, మార్చి నాటికి ప్రారంభోత్సవానికి మండపాన్ని సిద్ధంగా ఉంచాలని కిషన్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు కేంద్ర పురావస్తుశాఖ అధికారులు రంగంలోకి దిగి పనులు త్వరిత గతిన పూర్తయ్యేలా ప్రత్యక్ష పర్యవేక్షణ జరిపారు. ఎట్టకేలకు పనులు పూర్తయి మండపం పూర్వరూపాన్ని సంతరించుకున్నది.

నేడు కిషన్‌రెడ్డి రాక

పూర్తయిన వేయిస్తంభాలగుడి కల్యాణ మండపాన్ని పరిశీలించేందుకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి మంగళవారం వేయిస్తంభాల గుడికి వస్తున్నారు. మధ్యాహ్నం 1గంటలకు హనుమకొండ హంటర్‌రోడ్ విష్ణుప్రియ గార్డెన్స్‌కు ఎదురుగా బీజేపీ వరంగల్ పార్లమెంట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఇక్కడ మీడియాతో మాట్లాడతారు. మధ్యాహ్నం 3గంటలకు వేయిస్తంభాలగుడి కల్యాణ మండపాన్ని సందర్శించారు. పనుల పరిస్థితిని పరిశీలిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఖిలా వరంగల్ కోటను సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారు.

భారీగా పంచాయతీరాజ్ అధికారుల బదిలీలు

సీఈవో, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలకు స్థానచలనం

ఉమ్మడి జిల్లాలో 23మంది ఇతర ప్రాంతాలకు..

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12: రాష్ట్రవ్యాప్తంగా జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవో, డీపీవో, డీఆర్‌డీవోలను 105 మందిని బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎన్నికల బదిలీల్లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 23 అధికారులు స్థానచలనం చెందారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా శనివారం ఎంపీడీవోలను బదిలీ చేసిన పంచాయతీరాజ్ కమిషనర్.. సీఈవో, డిప్యూటీ సీఈవో, డీపీవో, డీఆర్‌డీవోలను బదిలీ చేశారు.

బదిలీలు ఇలా..

ఎం.విద్యాలత సీఈవో జడ్పీ భద్రాద్రి కొత్తగూడె జిల్లా నుంచి సీఈవో జడ్పీ హనుమకొండకు బదిలీపై వస్తున్నారు. ఎస్.వెంకటేశ్వర్‌రావు సీఈవో జడ్పీ హనుమకొండ నుంచి సీఈవో జడ్పీ ములుగు బదిలీ. ఎస్.ప్రసూనారాణి సీఈవో జడ్పీ ములుగు నుంచి సీఈవో జడ్పీ భద్రాద్రి కొత్తగూడెం బదిలీ. ఎ.శ్రీనివాస్‌కుమార్ డీఆర్‌డీవో హనుమకొండ నుంచి డీఆర్‌డీవో ములుగు బదిలీ. పి.నరేష్ డిప్యూటీ సీఈవో జగిత్యాల నుంచి డీఆర్‌డీవో జయశంకర్ భూపాలపల్లి బదిలీపై వస్తున్నారు. డి.పురుషోత్తం డీఆర్‌డీవో జయశంకర్ భూపాలపల్లి నుంచి డీఆర్‌డీవో మహబూబాబాద్ బదిలీ. ఆర్.సన్యాషయ్య డీఆర్‌డీవో మహబూబాబాద్ నుంచి డీఆర్‌డీవో ఖమ్మం బదిలీ. కె.నాగపద్మజ డీఆర్‌డీవో ములుగు నుంచి డీఆర్‌డీవో హనుమకొండకు బదిలీ. ఎం.సంపత్‌రావు డీఆర్‌డీవో వరంగల్ నుంచి డీఆర్‌డీవో జగిత్యాల బదిలీ. ఎన్.వసంత డిప్యూటీ సీఈవో జడ్పీ జనగామ నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ వికారాబాద్ బదిలీ. టి.పవన్‌కుమార్ డిప్యూటీ సీఈవో జడ్పీ కరీంగనర్ నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ వరంగల్ బదిలీపై వస్తున్నారు.

డి.సరిత డిప్యూటీ సీఈవో జడ్పీ మేడ్చల్ మల్కాజిగిరి నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ జనగామకు బదిలీపై వస్తున్నారు. బి.సాహితి మిత్ర డిప్యూటీ సీఈవో జడ్పీ వరంగల్ నుంచి డిప్యూటీ సీఈవో జడ్పీ జయశంకర్ భూపాలపల్లి బదిలీ. ఎస్.వెంకట్ అడిషన్ పీడీ పశుసంవర్ధక శాఖ మహబూబాబాద్ నుంచి మాతృసంస్థ వ్యవసాయ శాఖకు బదిలీ అయ్యారు. పి.బాలక్రిష్ణ అడిషినల్ డీఆర్‌డీవో ములుగు నుంచి అడిషినల్ డీఆర్‌డీవో సిద్దిపేటకు బదిలీ. జె.కౌసల్యాదేవి అడిషనల్ డీఆర్‌డీవో సిద్ధిపేట నుంచి డీఆర్‌డీవో వరంగల్ బదిలీపై వస్తున్నారు. ఆర్.స్టీఫెన్‌నీల్ అడిషినల్ డీఆర్‌డీవో వికారాబాద్ నుంచి అడిషినల్ డీఆర్‌డీవో ములుగు బదిలీపై వస్తున్నారు. ఎన్.వసుమతి అడిషినల్ డీఆర్‌డీవో వరంగల్ నుంచి అడిషినల్ డీఆర్‌డీవో జయశంకర్ భూపాలపల్లి బదిలీ. లక్కినేని లక్ష్మీరమాకాంత్ డీపీవో భద్రాద్రి కొత్తగూడెం నుంచి డీపీవో హనుమకొండ బదిలీపై వస్తున్నారు. వి.జగదీశ్వర్ డీపీవో హనుమకొండ నుంచి డీపీవో ములుగు బదిలీ. లత డీపీవో జయశంకర్ భూపాల్‌పల్లి నుంచి డీపీవో పెద్దపల్లి బదిలీ. కొండ వెంకయ్య డీపీవో ములుగు నుంచి డీపీవో మేడ్చల్ మల్కాజిగిరి బదిలీ. వి.నారాయణ రావు డీపీవో జయశంకర్ భూపాలపల్లి.

భారీగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

వరంగల్ అర్బన్ పరిధిలో 13 మందికి స్థానచలనం, పోస్టింగ్‌లు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 12: వరంగల్ అర్బన్ జిల్లాలో పని చేస్తున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనరేట్ ఇ.శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొద్ది రోజుల్లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీలు జరుపుతున్నట్టు ఎక్సైజ్ ఉన్నతాధికారులు వెల్లడించారు. వరంగల్ అర్బన్ జిల్లాలో 3 ఎక్సైజ్ స్టేషన్లను కలుపుకుని 13 మందికి బదిలీలు, పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే ఎక్సైజ్ స్టేషన్‌లతోపాటు ఐఎంఎల్ లిక్కర్ డిపోలు, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ విజిలెన్స్ విభాగాల్లో ఎక్కువకాలం పని చేసిన వారికి బదిలీలు జరిగినట్టు ఎక్సైజ్ సిబ్బంది తెలిపారు. బదిలీ, పోస్టింగ్‌లు పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని ఎక్సైజ్ కమిషనర్ ఆదేశించారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రదేశం
జి. దుర్గాభవాని	హుజురాబాద్	హనుమకొండ
ఎస్. ప్రభాకర్‌రెడ్డి	జగిత్యాల	వరంగల్ అర్బన్
కె. రాజు	ఖమ్మం-1	ఖిలావరంగల్
సీహెచ్‌ఎస్.ఆనంద్‌రావు	సుల్తానాబాద్	డీటీఎఫ్ వరంగల్ అర్బన్
ఎం. తిరుమలత	కరీంనగర్ రూరల్	ఐఎంఎల్ డిపో హనుమకొండ
సీహెచ్ నాగేశ్వర్‌రావు	డీటీఎఫ్ కొత్తగూడెం	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్
కె. నాగయ్య	అశ్వరావుపేట	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్
సీహెచ్ నీరజ	డీటీఎఫ్ వరంగల్ అర్బన్	డీటీఎఫ్ మహబూబాబాద్
బి. చంద్రమోహన్	ఖిలావరంగల్	ఖమ్మం -2
బి. కరుణశ్రీ	ఐఎంఎల్ డిపో హనుమకొండ	డీటీఎఫ్ ఖమ్మం
టి. శ్రీనివాసులు	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్	హుజురాబాద్
ఎం. మాధవిలత	ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్	జమ్మికుంట
ఎల్. రామకృష్ణ	హనుమకొండ	చెక్‌పోస్టు నిజామాబాద్

సీఐల బదిలీల్లో గందరగోళం

పరకాల సీఐగా వెళ్లిన అబ్బయ్య వీఆర్‌కు అటాచ్

ఇప్పటికే కేయూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నియామకం నిలిపివేత

హనుమకొండ, ఫిబ్రవరి 12: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ల పోస్టింగ్‌లు మూన్నాళ్ల ముచ్చటగానే మారుతోంది. పోస్టింగ్ పొందిన కొందరు అధికారులు డ్యూటీలో జాయిన్ కాకుండానే వెనక్కి పంపిస్తున్నారు. సీఐల పోస్టింగ్ నేడు పోస్టింగ్.. రేపు ఊస్టింగ్.. అనే పరిస్థితిలో ఉంది. ప్రధానంగా గతంలో పనిచేసిన పోలీసుస్టేషన్‌లలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులకు మాత్రమే పోస్టింగ్‌లలో ఈ మార్పు జరుగుతోందని, మిగతా వారికి ఇబ్బంది లేదని పోలీసు అధికారులు చెప్పుకొస్తున్నారు. కాగా, ఇటీవల జరిగిన బదిలీల్లో కేయూ నుంచి పరకాలకు పోస్టింగ్‌పై వెళ్లిన ఎం. అబ్బయ్యకు పోస్టింగ్ ఇచ్చినట్టే ఇచ్చి ఆర్డర్‌ను రద్దు చేశారు. విధుల్లో చేరి రెండు రోజులు గడవక ముందే సీపీకి (వీఆర్) అటాచ్ చేయడం వివాదాస్పదంగా మారింది. పరకాలకు ఇంకా ఎవరిని నియమించలేదు. అదే విధంగా ఖమ్మం నుంచి కేయూ పీఎస్‌కు పోస్టింగ్ ఇచ్చిన శ్రీధర్‌కు ఇచ్చినట్టే ఇచ్చి కొన్ని అనివార్య కారణాల వల్ల పోస్టింగ్ నిలిపి వేశారు. కేయూకు గతంలో ఏనుమాములలో పని చేసిన చేరాలును నియమించే అవకాశాలు ఉన్నాయి. అయితే పరకాలకు, కేయూకు ఒకటి, రెండు రోజుల్లో ఇన్‌స్పెక్టర్లను సీపీ నియమించనున్నారు. అలాగే ఇటీవల ములుగు నుంచి వరంగల్ కమిషనరేట్‌కు వచ్చిన మరో వివాదాస్పద ఇన్‌స్పెక్టర్‌ను కూడా వెనక్కి పంపించే అవకాశాలు మెండుగా ఉన్నాయనే పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

లూప్‌లైన్ లేకుండా పోస్టింగ్‌లు

ప్రస్తుతం వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లుగా పోస్టింగ్‌లు పొందిన వారు లూప్‌లైన్‌లో పనిచేయకుండానే పోస్టింగ్ కొట్టేయడం కొందరు సీనియర్ అధికారులకు మింగుడుపడడం లేదు. ఒక పోలీసు అధికారి ఎస్‌ఐ నుంచి ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన తర్వాత కనీసం 3 యేళ్లపాటు లూప్‌లైన్‌లో పని చేసి ఉండాలి. కానీ ప్రజాప్రతినిధుల వద్ద సిఫారసు లేఖలు తెచ్చుకుని పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నట్టు తెలుస్తోంది.



సద్దిమడుగులోకి ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఐబీ అధికారులు

మేడారానికి లక్నవరం నీటి విడుదల

సద్దిమడుగులోకి మొదలైన ప్రవాహం

రెండు రోజుల్లో జంపన్నవాగులోకి మళ్లింపు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 12: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకోసం మండలంలోని ప్రఖ్యాత లక్నవరం సరస్సు నుంచి జలాలను సోమవారం నీటిపారుదల శాఖ అధికారులు విడుదల చేశారు. ఈఈ శ్రీనివాస ఆధ్వర్యంలో సిబ్బంది తూములను ఎత్తారు. తొలుత నీటిని సమీపంలోని సద్దిమడులోకి తరలిస్తున్నారు. రెండు రోజుల తర్వాత దయ్యాలవాగు మీదుగా జంపన్నవాగులోకి ప్రవాహాన్ని మళ్లిస్తామని ఈఈ తెలిపారు. ప్రస్తుతం జంపన్న వాగులో నీటి ప్రవాహం లేకపోవడంతో భక్తులు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కిందనే పుణ్యస్నానాలు చేస్తున్నారు. పుణ్య జంపన్న వాగు నీటిలో తలారా స్నానం చేయడాన్ని సెంటిమెంట్‌గా భావించే భక్తులు ప్రవాహం లేకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. మహాజాతరకు ఎనిమిది రోజుల గడువు మాత్రమే ఉండగా ఇప్పటికే నిత్యం లక్షలాది మంది వనదేవతల దర్శనానికి తరలివస్తున్నారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎనిమిది రోజుల ముందుగానే లక్నవరం నుంచి అధికారులు నీటిని విడుదల చేశారు.

మేడారంలో కొనసాగుతున్న మొక్కులు

ముందస్తుగా దర్శించుకున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 12: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు జోరుగా కొనసాగుతున్నాయి. మహాజాతరకు ముందుగానే తరలివస్తున్న భక్తులు తల్లుల గద్దెల వద్ద నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి యాట మొక్కులు చెల్లిస్తున్నారు. సోమవారం సుమారు 50 వేల మంది వనదేవతలను దర్శించుకున్నారని దేవాదాయశాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. శివసత్తు పూనకాల నడుమ వనదేవతలకు జేజేలు పలుకుతూ అమ్మవార్ల గద్దెలకు చేరుకున్నారు. తల్లులను తాకి వడిబియ్యం పోసి పసుపు కుంకుమ, పూలు, పండ్లు, చీరెలు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగా చూడాలని వేడుకున్నారు.



మేడారంలో వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

భక్తులకు తాగునీటి కష్టాలు

వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి సోమవారం మేడారం తరలివచ్చిన భక్తులకు తాగుగునీటి కష్టాలు తప్పలేదు. తీవ్రఎండలో క్యూలైన్ల ద్వారా తల్లులను దర్శించుకున్న సందర్భంలో దాహంతో అల్లాడాల్సి వచ్చింది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వచ్చింది. వారి అవస్థలు చూసే వారే అక్కడ కరువయ్యారు.

వెడేక్కి చల్లబడి..

మేడారం మహాజాతర సందర్భంగా పరిసరాల్లో వెలిసిన దుకాణాల్లో శీతల పానీయాలు అమ్ముతున్నారు. వివిధ కంపెనీల కూల్‌డ్రింక్స్ లభ్యమవుతున్నాయి. అయితే.. ఆయా కంపెనీల డీలర్లు స్టాకును ఎండలోనే ఉంచుతున్నారు. రెండు మూడు రోజులపాటు ఎండలో ఉన్న కూల్‌డ్రింక్స్‌ను ఫ్రిజుల్లో చల్లబరిచి భక్తులకు విక్రయిస్తున్నారు. శీతల పానీయాలను ఎండలో ఉండటం ఆరోగ్యానికి అంతగా మంచిది కాదని నిపుణులు అంటున్నారు.



గద్దెల పరిసరాల్లో రద్దీ

గుడారాల మేడారం



మేడారం మహాజాతర సందర్భంగా ని చిరు వ్యాపారులు గుడారాలు వేసి దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 21 నుంచి నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జాతర జరగనుండగా మొక్కులు చెల్లించుకునేందు కోటిన్నరకు పైగా భక్తులు మేడారం తరలివస్తారని అధికారులు అంచనా వేశారు. దీంతో వ్యాపారాలు జోరందుకోనున్నాయి. అలాగే భక్తులకు ప్రభుత్వం సకల సౌకర్యాలను ఏర్పాటు చేసింది. వారికి వేలాది మంది అధికారులు సేవలు అందించనున్నారు.

లోపించిన పారిశుధ్యం



మేడారంలో పారుశుద్యం లోపించింది. దీంతో అక్కడి పరిసరాలు దుర్వాస వెదజల్లుతున్నాయి. ఆదివారం 10 లక్షలకు పైగా భక్తులు రాగా వారి వదిలిన వ్యర్థాలను పారిశుద్య కార్మికులు పూర్తిస్థాయిలు తొలగించలేక పోయారు. ఈ క్రమంలో సోమవారం గద్దెల పరిసర ప్రాంతాల్లో దుర్వాతన వెదజల్లింది. దీనిపై భక్తులు, స్థానికులు డీపీవో వెంకయ్యకు ఫిర్యాదు చేశారు.

మేడారం జాతరకు ఉత్సవ కమిటీ

● ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం ● చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్



అర్రెం లచ్చుపటేల్

ములుగు, ఫిబ్రవరి 12: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు ఉత్సవ కమిటీని ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. చైర్మన్‌గా తాడ్వాయి మండలకేంద్రానికి చెందిన అర్రెం లచ్చుపటేల్ నియమితులయ్యారు. జాతరకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ చైర్మన్ సహా 14మంది సభ్యులతో కూడిన జాబితాను ఇటీవల రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క దేవాదాయ శాఖకు సిఫారసు చేశారు. పరిశీలించిన అధికారులు అదే జాబితాతో కమిటీని ప్రకటించారు. ఈనెల 12నుంచి 25వ తేదీ వరకు కాలపరిమితితో పని చేసే ఈ ఉత్సవ కమిటీకి చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్ వ్యవహరించనుండగా డైరెక్టర్‌లుగా మిలుకూరి అయిలయ్య, కొండి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణసింగ్, ముంజాల భిక్షపతి, సుంచు షైామావతి, చామర్తి కిశోర్, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అంకం కృష్ణస్వామి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు వ్యవహరించనున్నారు.

ఈ నూతన ఉత్సవకమిటీ ఒకట్రెండు రోజుల్లో పదవీ ప్రమాణం చేసే అవకాశముంది. కాగా, తనను మేడారం జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా నియమించడంపై అర్రెం లచ్చుపటేల్ మంత్రులు సీతక్క, కొండా సురేఖలకు కృతజ్ఞతలు తెలిపారు. జాతరను విజయవంతం చేస్తామని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

అమాయక ప్రాణాలకు 'ఉచ్చు'

● విద్యుత్ ఉచ్చుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బలి ● భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో విషాదం

కాటారం/గోవిందరావుపేట, ఫిబ్రవరి 12: వన్యప్రాణులను సంహరించేందుకు వేటగాళ్లు బిగించిన విద్యుత్ ఉచ్చుకు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బలయ్యారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తుండగా విద్యుత్ ప్రసరణ జరిగే ఉచ్చు తగిలి గ్రేహౌండ్స్ జూనియర్ కమాండో బలయ్యాడు. అలాగే ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని దుంపెల్లిగూడెంలో తప్పిపోయిన గొర్రెలను వెతుకుతుండగా ఉచ్చు తగిలి ఓ వ్యక్తి మరణించాడు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.

కూంబింగ్ చేస్తుండగా..



ప్రవీణ్ మృతదేహం

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ బ్యారేజీని సందర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు మంగళవారం పర్యటించనున్న నేపథ్యంలో కాటారం శివారు అటవీప్రాంతంలో 30 మందితో కూడిన గ్రేహౌండ్స్ బలగాలు ఆదివారం రాత్రి కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని రాజోలుగూడకు చెందిన 2012 బ్యాచ్ గ్రేహౌండ్స్ జూనియర్ కమాండర్ ఆడే ప్రవీణ్ (34)తో పాటు పలువురు గ్రేహౌండ్స్ కమాండోలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో భూమికి రెండు ఫీట్ల ఎత్తులో సెంట్రింగ్ వైర్‌తో విద్యుత్ సరఫరా అయ్యేలా వన్యప్రాణుల కోసం వేటగాళ్లు తీగలను అమర్చి ఉన్నారు. అవి తగిలి ప్రవీణ్ షాక్‌కు గురై అపస్మారకస్థితికి వెళ్లారు. చేతిపై వైరు లోతుగా దిగింది. దీంతో తోటి కానిస్టేబుల్స్ తమ ఉన్నతాధికారులతోపాటు స్థానిక పోలీస్ అధికారులకు ఈ సమాచారాన్ని చేరవేశారు. స్థానిక సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి హుటాహుటిన బయల్దేరారు. అటవీ ప్రాంతం కాగా వాహనాలు అందుబాటులో లేకపోవడంతో అప్పటికే గ్రేహౌండ్స్ కమాండోలు ప్రవీణ్‌ను చేతులపై ఎత్తుకొని కొద్ది దూరం మోసుకొచ్చారు. అనంతరం 108 అంబులెన్స్ చేరగా అందులో తరలిస్తుండగానే ప్రవీణ్ మృతి చెందారు. మృతుడికి భార్య లత, కుమారులు హర్ష, వివాన్ ఉన్నారు. గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

గొర్రెలను వెతుకుతుండగా

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని దుంపెల్లిగూడెం గ్రామానికి చెందిన మాదారపు అనిల్‌కు సంబంధించిన గొర్రెలు ఆదివారం రాత్రి మంద నుంచి తప్పిపోయాయి. వాటిని వెతికేందుకు తన మిత్రుడు పిండి రమేష్ (28)తో కలిసి రాత్రి 11గంటల సమయంలో సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లారు. ముందుగా నడుస్తున్న రమేష్ అటవీ జంతువులను వేటాడేందుకు గుర్తుతెలియని వ్యక్తులు అమర్చిన విద్యుత్ ఉచ్చు తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో వెనక వస్తున్న అనిల్ అప్రమత్తమయ్యాడు. చీకటిగా ఉండటంతో కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే రమేష్ మృతిచెందాడు. అనిల్ ఇచ్చిన సమాచారంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘటనా స్థలికి చేరుకొని విగతజీవిగా పడి ఉన్న రమేష్‌ను చూసి బోరున విలపించారు. రమేష్‌కు ఆరు నెలల కిందటే వివాహమైంది. భర్త అకాల మరణంతో ఆయన భార్య అఖిల గుండెలవిసేలా రోదించింది. మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు పస్రా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రమేష్ మృతదేహం

16న జరిగే సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలి

సుబేదారి, ఫిబ్రవరి 12: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16వ తేదీన తలపెట్టిన సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల సారంగపాణి అన్నారు. బంద్‌కు సహకరించాలని సోమవారం న్యూశాయంపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. 16న జరిగే సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా సారంగపాణి అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జంపాల రమేష్, మురళీ, శిరీష, లలిత, విమల. రేణుక పాల్గొన్నారు.



బంద్‌కు సహకరించాలని ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఘనంగా భక్త మార్కండేయ జయంతి

హసన్‌పర్తి, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలోని భక్త మార్కండేయ దేవస్థానంలో మార్కండేయ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్‌రావు, 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, ఆత్మ జిల్లా మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్‌లు హాజరై స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి గురుమూర్తి భద్రదేవ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారికి పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం నవగ్రహ పూజ, విశ్వశాంతి హోమం, పూర్ణాహుతిని నిర్వహించారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ 66వ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, పద్మశాలి సేవా సంఘం నాయకులు సట్కూరి సంతోష్‌రాజ్, కేదాసి రాకేష్, బచ్చు ఆనందం, చేరాల రవిందర్, కేదాసి వెంకటేశ్వర్లు, కనుకుంట్ల ప్రశాంత్, కనుకుంట్ల సతీష్, మాటేటి కుమారస్వామి, తౌటం రవిందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- మడికొండ: భక్త మార్కండేయ జయంతిని సంఘం ఆధ్వర్యంలో సోమవారం మడికొండలోని పద్మశాలి భవనంలో ఘనంగా నిర్వహించారు. భక్త మార్కండేయ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సాయంత్రం మార్కండేయ మహా రుషి రథయాత్ర ఊరేగింపు పుర వీధుల గుండా జరిపారు. స్థానిక మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి మార్కండేయ మహారుషికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బిల్ల లింగయ్య, నల్ల ప్రభాకర్, డాక్టర్ తుమ్మ యాదగిరి, నామని రామ్మోహన్‌రావు, కేటిక సదానందం, తాటిపాముల సత్యనారాయణ, కన్నె మల్లేశం, పొట్లబత్తిని సారంగపాణి, చిదురాల వెంకటేశ్వర్లు, పొట్లబత్తిని లక్ష్మణ్, బింగి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



శ్రీ భక్త మార్కండేయకు పూజలు నిర్వహిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు



మార్కండేయ చిత్రపటానికి పూలమాలవేస్తున్న ఈగ మల్లేశం, సమ్మారావు

ఉచిత వైద్య శిబిరం

హనుమకొండ స్పోర్ట్స్: శ్రీ భక్త మార్కండేయ జయంతిని పురస్కరించుకొని శ్రీభక్త మార్కండేయ పద్మశాలి పరపతి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. హనుమకొండ 4వ డివిజన్ రెడ్డికాలనీలోని శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘ భవనంలో జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పద్మశాలీ సంఘం 4వ డివిజన్ అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, సీహెచ్, మల్లయ్య, కె.సురేష్, నటరాజు, క్రిష్ణారావు, బింగి సురేష్, బత్తుల మహేష్, రమేష్, నరేందర్, జి.రాజు, మహేందర్, సురేష్, నవీన్, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- సుబేదారి: 62వ డివిజన్ సోమిడిలో ఉన్న భక్తమార్కండేయ స్వామి దేవాలయంలో సోమవారం భక్త మార్కండేయ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గుర్రపు కోటేశ్వర్ ఆధ్వర్యంలో స్వామి వారికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోయిని కుమార్, సుంచు శ్రీహరి, జక్కుల మల్లేష్, చంద్రశేఖర్, నాగరాజు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.
- వరంగల్ కలెక్టరేట్ : పద్మశాలీల వంశ మూల పురుషుడు మార్కండేయుడి జయంతిని పద్మశాలీలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ పద్మశాలీ క్లబ్ ప్రాంగణంలో మార్కండేయ చిత్రపటానికి పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం నూలు పోగులతో తయారు చేసిన దండలను వేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇటీవల మృతిచెందిన రాష్ట్ర పద్మశాలీ ప్రముఖులు రామా శ్రీనివాస్, మచ్చ ప్రభాకర్‌రావులకు నివాళులర్పించిన వారి ఆశయాలను కొనసాగిస్తామని మల్లేషం అన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, డబ్ల్యూపీసీ సభ్యులు కూరపాటి సుదర్శన్, మంతెన రమేష్, మార్గం కుమారస్వామి, బేతి అశోక్ బాబు, చందా మల్లయ్య, దుస్స శివశంకర్, అశోక్, చిప్ప వెంకటేశ్వర్లు, వడిచర్ల బాస్కర్, ప్రసాద్, బిట్ల సమ్మయ్య, రవి, రామా ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి ప్రణాళికలు సిద్ధం చేయండి

▸▸ అధికారులతో మేయర్ గుండు సుధారాణి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 12: వేసవిలో తాగునీటి ప్రణాళికలు సిద్ధం చేయాలని జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్ అధికారులను మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. సోమవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్ష జరిపారు. 15వ ఫైనాన్స్ నిధులతో నగరంలో జరుగుతున్న తాగునీటి సరఫరా పనులను త్వరగా ముగించాలన్నారు. లీకేజీలను అరికట్టాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. చేతి పంపుల మరమ్మతు పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో చలి వేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈఈలు శ్రీనివాసరావు, రాజయ్య, సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

భారతదేశం సంప్రదాయాలకు నిలయం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 12: భారతదేశం సంస్కృతీ, సాంప్రదాయాలకు నిలయమని ప్రముఖ సామాజికవేత్త, మోటివేషనల్ స్పీకర్ అప్పాల ప్రసాద్ అన్నారు. సోమవారం ఎల్లాపూర్ వద్ద గల ఎస్సీఆర్ స్కూల్‌లో పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితం తరగతి గదిలో నిర్మితమవుతుంది కనుక విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. భారతదేశం కుటుంబ వ్యవస్థకు మూలమని, అలాంటి వ్యవస్థ బలంగా ఉంటే ఎలాంటి కష్టాలైనా దరిచేరవన్నారు. భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను స్వామి వివేకానందుడు ప్రపంచ దేశాలకు ఎలా విస్తరింపజేశాడో విద్యార్థులు కూడ దేశ ఔన్నత్యం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం రమేశ్ గురూజీచే తల్లిదండ్రుకు విద్యార్థులచే పాదపూజ చేయించారు. తల్లిదండ్రుల ఔన్నత్యాన్ని, విషిష్ఠతను వివరించారు. అనంతరం విద్యార్థులచే ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రామకిషన్‌రాజు, వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు రవిందర్ రావు, ఎస్సీఆర్ స్కూల్స్ చైర్మన్ శ్రీపతిరెడ్డి, డైరెక్టర్ గౌరిశెట్టి జగన్‌మోహన్, ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్

డ్రంకెన్ డ్రైవ్‌లో 18 మందికి జరిమానా

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 12: హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 18 మందికి జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి రమేష్ సోమవారం తీర్పు వెల్లడించారు. హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి హనుమకొండ పరిధిలోని కుమార్‌పల్లి, కేయూ జంక్షన్, అశోక జంక్షన్, పెద్దమ్మగడ్డ ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో 18 మందిని మద్యం తాగినట్టు గుర్తించి సోమవారం కోర్టుకు తరలించారు. మందుబాబులకు రూ.22.100 జరిమాన విధించారు. ఇంకా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఏడుగురికి రూ. 6.600 జరిమానా విధించారు. ఇకపై డ్రంకెన్‌డ్రైవ్, వాహనపత్రాలు లేకుండా పట్టుబడితే జైలుకు తరలిస్తామని సీఐ సీతారెడ్డి హెచ్చరించారు.

సుబేదారి సీఐగా వాసుదేవరావు బాధ్యతల స్వీకరణ



నయీంనగర్, ఫిబ్రవరి 12 : ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో భాగంగా రామగుండం కమిషనరేట్ పరిధిలోని చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్న ఎస్.వాసుదేవరావు వరంగల్ కమిషనరేట్ పరిధిలోని సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సోమవారం సుబేదారి పోలీస్‌స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. 2004 ఎస్ఐ బ్యాచ్‌కి చెందిన ఎస్.వాసుదేవరావు లింగాలగణపురం, ఏటూరునాగారం, హసన్‌పర్తి, మంగపేట పోలీస్‌స్టేషన్‌లలో ఎస్ఐగా పనిచేశారు. 2014లో సీఐగా పదోన్నతి పొందిన తర్వాత నర్సంపేట, భైంసా, రామగుండం, గోదావరిఖని, భూపాలపల్లి, చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లలో పనిచేసి ప్రస్తుతం సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా విధుల్లో చేరారు. సుబేదారీ పోలీస్‌స్టేషన్ నూతన సీఐ వాసుదేవరావును సుబేదారీ ఎస్ఐలు రవికిరణ్, సుమన్, సాంబయ్య, మహేందర్‌రెడ్డి, గాలీబ్‌లతో పాటు సిబ్బంది, పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా జరగాలి

▸▸ బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ రాధిక గుప్తా

▸▸ వరంగల్‌లోని పలు డివిజన్లలో క్షేత్రస్థాయి తనిఖీ

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 12 : పారిశుధ్య పనులు పకడ్బందీగా జరగాలని బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ కలెక్టర్ రాధిక గుప్తా అధికారులను ఆదేశించారు. వరంగల్ నగరంలోని పలు డివిజన్లలో పారిశుధ్య పనులను సోమవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. 18, 27, 28 డివిజన్లలో పర్యటించి పనులను చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రెయినేజీలు క్రమం తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. వరంగల్ ఓల్డ్ బీట్ బజారు, అండర్ రైల్వే బ్రిడ్జి ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణంలో దుకాణాలను నిర్వహిస్తున్న ఉల్లిగడ్డల వ్యాపారులకు జరిమానా విధించారు. 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల సునీల్ పలు సమస్యలను రాధిక గుప్తా దృష్టికి తీసుకొచ్చారు. అబ్బనికుంటలో పర్యటించి తాగునీటి సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. హనుమకొండ నయీంనగర్‌లో పన్ను వసూళ్ల తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్, ఈఈ శ్రీనివాస్, డీఈ సారంగం పాల్గొన్నారు.



వరంగల్‌లో పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న రాధిక గుప్తా

ఆస్తి పన్ను వసూళ్లపై సమీక్ష

ఆస్తి పన్ను వసూళ్ల అంశంపై ఇన్‌చార్జి కమిషనర్ రాధిక గుప్తా హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో సమీక్ష జరిపారు. రానున్న పది రోజులు వసూళ్లకు కీలకమైనవిగా రెవెన్యూ విభాగానికి సూచించారు. ప్రతీ రోజు పన్నుల వసూళ్ల నివేదికను అందచేయాలన్నారు. భారీ బకాయిల జాబితాను సిద్ధం చేసుకొని ఈ మేరకు వసూళ్లు చేయాలని, రెడ్ నోటీసులు అందచేయాలని ఆదేశించారు.

ఈవీఎంల తనిఖీ పూర్తి

• నేడు మాక్ పోలింగ్ నిర్వహణ • కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 12: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాములో ఈవీఎంల తనిఖీ ప్రక్రియను పారదర్శకంగా చేపడుతునట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల మొదటి దశ తనిఖీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో ఎల్.రమేశ్‌లతో కలిసి కలెక్టర్ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈవీఎంల మొదటిదశ తనిఖీ ప్రక్రియ పూర్తికావడంతో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈసీఐఎల్ ఇంజనీర్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాజీపేట, నడికూడ, దామెర తహసీల్దార్లు ఇస్లావత్ బావ్‌సింగ్, గుండాల నాగరాజు, జ్యోతి వరలక్ష్మీదేవి, ఏవో సత్యనారాయణ, నాయబ్ తహసీల్దార్‌లు సంతోష్, రామకృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఏటూరునాగారం ఐటీడీఏ పీవో బదిలీ

▸▸ నూతన పీవోగా చిత్రామిశ్రా

ములుగు, ఫిబ్రవరి 12: ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ బదిలీ అయ్యారు. నిజామాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయన స్థానంలో నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న చిత్రామిశ్రాను నియమించింది. వీరిద్దరూ 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. 2022 జూన్ 13న ఏటూరు నాగారం ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించిన అంకిత్ సమర్థవంత అధికారిగా మన్ననలు పొందారు. గోదావరి వరదల సమయంలో సహాయక చర్యలను చేపట్టడంలో కృషి చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. మేడారం మహాజాతర కోసం ఐటీడీఏ ద్వారా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తూ చాలా వరకు పనులను ఇప్పటికే పూర్తిచేయించారు.



చిత్రామిశ్రా

ఆర్ట్స్ కళాశాలకు అనుబంధంగా హాస్టల్ వసతి కల్పించాలి

▸▸ కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ఆందోళన

సుబేదారి, ఫిబ్రవరి 12 : హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు అనుబంధంగా హాస్టల్ వసతి కల్పించాలని కళాశాల విద్యార్థులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఎన్నో ఏళ్ల కింద ఏర్పడిన ఆర్ట్స్ కళాశాలలో ఇంతవరకు హాస్టల్ సౌకర్యం కల్పించలేదని, రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి చదువుకుంటున్నామని, కళాశాలకు హాస్టల్ వసతి లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదను వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఈ సందర్భంగా సుబేదారి పోలీసులకు నచ్చచెప్పి ఆందోళన విరమింపచేశారు. అనంతరం విద్యార్థులు సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న సుబేదారి పోలీసులు

పారిశుధ్య సేవకు సిద్ధం

5వ పేజీ తరువాయి

సమావేశంలో అధికారులకు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. 40 ఏళ్ల లోపు వయస్సు ఉన్న కార్మికులను ఎంపిక చేసేందుకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అంతే కాకుండా కార్మికుల ఆరోగ్య పరిస్థితులు, గత జాతరల్లో విధులు నిర్వహించిన వారి అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజారోగ్య అధికారులు

మేడారం జాతరలో పారిశుధ్య కార్మికుల విధుల నిర్వహణ, కార్మికులకు వసతి ఇతరత్రా సౌకర్యాల ఏర్పాటు తదితర అంశాల పరిశీలన కోసం జీడబ్ల్యూఎంసీ ప్రజారోగ్య అధికారులు ఒకటి రెండు రోజుల్లో మేడారం వెళ్లనున్నారు. జాతర ప్రారంభానికి ముందుగానే అధికారులు, కార్మికుల సేవలు ఆరంభమవుతాయి. ఇప్పటికే భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో ఈ సారి పారిశుధ్య సేవలు విస్తృతం అవుతాయనే అంచనాల్లో అధికారులు ఉన్నారు. పోస్టు జాతర సేవలను దృష్టిలో ఉంచుకొని పారిశుధ్య కార్మికులు 25వ తేదీ వరకు మేడారంలోనే ఉంటారు.

కార్మికులను సిద్ధం చేస్తున్నాం : సీఎంహెచ్‌వో రాజేశ్



మేడారం జాతర కోసం కార్మికులను సిద్ధం చేస్తున్నాం. ఈ మేరకు సమావేశాలు ఇప్పటికే నిర్వహించాం. మరిన్ని సమావేశాల నిర్వహణతో కార్మికులను సంసిద్ధులను చేసే ప్రణాళికతో ఉన్నాం. ముఖ్యంగా కార్మికుల ఎంపికలో వారి ఆరోగ్య పరిస్థితిని ప్రధానంగా తీసుకుంటున్నాం. వాహనాలు సిద్ధం చేసుకున్నాం. జాతరలో కార్మికులకు వసతి, భోజన సౌకర్యం, మహిళలకు ప్రత్యేకంగా వసతుల కల్పన తదితర అంశాలను పరిశీలించేందుకు ఒకటి రెండు రోజుల్లో మేడారానికి వెళ్లనున్నాం.

వీధి కుక్క దాడిలో పలువురికి గాయాలు

▸▸ భయాందోళనలో ప్రశాంత్‌నగర్ వాసులు

కాజీపేట టౌన్, ఫిబ్రవరి 12: కాజీపేటలోని 61వ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్‌లో వీధి కుక్క పలువురిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన సోమవారం జరిగింది. ప్రశాంత్‌నగర్ రహదారిపై రాకపోకలు సాగించే వారిపై అకస్మాత్తుగా దాడులు చేయడంతో ఒక మహిళ, ఒక పురుషుడు, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీధి కుక్క దాడి నుంచి తన కూతురును కాపాడడానికి వెళ్లిన ఆ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన నుంచి తేరుకున్న బాధితులు ఆస్పత్రులకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. ప్రశాంత్‌నగర్ మెయిన్‌రోడ్డులోని ఒక ప్రైవేట్ పాఠశాల పక్క వీధిలో కొద్ది రోజులుగా వీధి కుక్కలు దాడులకు దిగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను బడులకు పంపించాలన్నా భయానకమైన పరిస్థితి నెలకొందని వాపోయారు. అటు కుక్కలు, ఇటు కోతులతో ప్రశాంత్‌నగర్‌లో ప్రశాంతత కరువైందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రాంగం వీధి కుక్కల దాడుల నుంచి కాపాడేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.





ప్రశాంత్‌నగర్‌లో వీధికుక్కల దాడిలో గాయపడిన బాధితులు

స్వీప్ పోటీల విజేతలను అభినందనలు

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 12: సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్)-2023 పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను బల్దియా ఇన్‌చార్జి కమిషనర్ రాధిక గుప్తా అభినందించారు. ఎన్నికలు, ఓటు హక్కు వినియోగం, అవకతవకల నివారణ తదితర అంశాలపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు సోమవారం రాధిక గుప్తాను కలిశారు. హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజేతలను అభినందించడంతో పాటు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులను రాధిక గుప్తా అందచేశారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి హరిప్రసాద్, జిల్లా విద్యాధికారి డాక్టరు అబ్దుల్ హై తదితరుల పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 12 : గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్‌లోని స్నేహ నగర్‌లో గల ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సప్త మ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి ప్రపత్తులతో నేత్ర పర్వంగా సోమవారం ప్రారంభమయ్యాయి. ఆల య అర్చకులు కాందూరి అనంత వెంకటేశ్వర్లు, యజ్ఞిక బ్రహ్మ వీఎస్.దేశికన్ స్వామి పర్యవేక్షణలో రు త్వికులు ఉదయం ప్రసన్నాంజనే య స్వామికి నవకలశస్నపవన ము, అంకురారోహణ, అగ్నిప్రతిష్ఠను నిర్వహించారు. సాయంత్రం సంధ్యావేళ ఖమ్మం జిల్లా అవధూతేంద్ర భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కీర్తనలు, హనుమాన్ చాలీసా పారాయణంతో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం నిత్య హోమాలతో పాటు తీర్థ ప్రసాద గోష్ఠిని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కుసుంబ వెంకట్రాం నర్సింహరావు, ఆలయ ప్రధాన కార్యదర్శి గుండా వాసుదేవ్, కోశాధికారి మంగు నవీన్, స్నేహ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఖండేరావు నర్సింహరావు (చిన్న), భట్టు శశికాంత్‌రెడ్డి, ధర్మ తిరుపతిరెడ్డి, యెన్నమనేని చలపతిరావు, తంగళ్లపల్లి రామబ్రహ్మంతో పాటు మహిళా భక్తు లు పాల్గొని ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని అభిషేకాలు, అర్చనలు చేశారు.

ప్రమాద రహిత సమాజాన్ని నెలకొల్పాలి



రోడ్డు భద్రతా అవగాహన సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న డ్రైవర్లు

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 12: ప్రమాద రహిత సమాజాన్ని నెలకొల్పడంలో అందరూ భాగస్వాములు కావాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పురుషోత్తం కోరారు. రోడ్డు భద్రతా మాసోత్సవం ముగింపు సందర్భంగా సోమవారం హనుమకొండ చింతగట్టులోని రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతా అవగాహన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కాజీపేట ఆటో యూనియన్ డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలని ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. బస్సు డ్రైవర్లు తమ వాహనాలను అమిత వేగంతో నడుపొద్దని అన్నారు. సమావేశంలో పాల్గొన్న బస్సు డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో రోడ్డు రవాణా శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న మోటారు వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

మడికొండ, ఫిబ్రవరి 12: పైప్‌లైన్ లీకేజీ కావడంతో సోమవారం నల్లా నీరు వృథాగా డ్రైనేజీలలో కలుస్తోంది. మడికొండలోని ధర్మసాగర్ రోడ్డులో మూలమలుపు సమీపంలో కొన్ని నెలలుగా నీరు వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని, పలుమార్లు జీడబ్ల్యూఎంసీ అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ నీరు పూర్తి స్థాయిలో అన్ని కాలనీలకు సరిపడా కావడం లేదని, పైప్ లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టి కనీసం ఉన్న కనెక్షన్లకైనా సక్రమంగా నీటి సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మడికొండ ధర్మసాగర్ మూల సమీపంలో పైప్‌లైన్ లీకై వృథాగా పోతున్న నల్లా నీరు

డీఆర్‌డీవోగా నాగ పద్మజ

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 12: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నూతన అధికారిగా కె.నాగ పద్మజను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ డీఆర్‌డీవోగా పనిచేస్తున్న ఎ.శ్రీనివాస్ కుమార్ ములుగుకు బదిలీ కాగా, ములుగు డీఆర్‌డీవోగా పని చేస్తున్న కె.నాగ పద్మజ హనుమకొండకు బదిలీపై వచ్చారు. మంగళవారం డీఆర్‌డీవోగా బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

సీపీని కలిసిన బాధ్యతలు చేపట్టిన ఇన్‌స్పెక్టర్లు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 12: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీసు స్టేషన్‌లలో బాధ్యతలు చేపట్టిన పోలీసు అధికారులు సోమవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝూను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీపీని కలిసిన వారిలో ఇన్‌స్పెక్టర్లు వాసుదేవరావు, ప్రతాప్, రవికుమార్, పుల్యాల కిషన్, రంజీత్‌రావు, శ్రీనివాస్, గుజ్జేటి వేణు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

డాక్టర్

హెయిర్ కేర్

జుట్టు తెల్లబడకుండా...

తెల్లబడే జుట్టును ఆపడం ఎవరి తరం కాదు. అయితే ఆ క్రమాన్ని వాయిదా వడేలా చేయవచ్చు. అదెలాగంటే...

చిన్న వయసులోనే జుట్టు తెల్లబడడమనేది జన్యువుల మీదే ఆధారపడి ఉన్నప్పటికీ, విటమిన్ బి12, బయోటిన్, విటమిన్ డి, ఇల లోపం కూడా ఈ సమస్యను పెంచుతూ ఉంటుంది. ఈ లోపాలను సరిదిద్దుకోగలిగితే, జుట్టు తెల్లబడే వేగాన్ని నెమ్మదించేలా చేయవచ్చు. గుడ్లు, చేపలు, చికెన్‌లలో విటమిన్ బి12 పుష్కలంగా ఉంటుంది కాబట్టి తరచూ వీటిని తింటూ ఉండాలి. ఒకవేళ శాకాహారులైతే ఈ విటమిన్లు కలిసి ఉండే ఫోర్టిఫైడ్ ఫుడ్స్‌ను ఎంచుకుంటూ ఉండాలి. విటమిన్ డి మోతాదును పెంచుకోవడం కోసం సప్లిమెంట్లు, పాలు, పాల ఉత్పత్తులు తీసుకోవాలి. అలాగే ఎండకు బహిర్గతమవుతూ ఉండాలి. బయోటిన్ (విటమిన్ బి7) కోసం చిలగడ దుంపలు, గుడ్లు, నట్స్, సీడ్స్ తినాలి. విటమిన్ బి6 కోసం బంగాళాదుంపలు, బఠాణీలు, అరటిపండ్లు తీసుకోవాలి. అలాగే వెంట్రుకల ఆరోగ్యం కోసం ట్రేస్ మినరల్స్ కూడా సరిపడా అందేలా చూసుకుంటూ ఉండాలి. జింక్, కాపర్, మెగ్నీషియం, సెలీనియంలు వెంట్రుకల పెరుగుదలకూ, మరమ్మత్తుకూ తోడ్పడతాయి. ధూమపానంతో వెంట్రుకలు తెల్లబడే వేగం పెరుగుతున్నట్టు పరిశోధనల్లో తేలింది. వెంట్రుకల కుదుళ్లలో పేరుకునే నికోటిన్ మెలనిన్ ఫార్మేషన్‌ను అస్థవ్యస్థం చేసి, చిన్న వయసులోనే వెంట్రుకలు తెల్లబడేలా చేస్తుంది. కాబట్టి ధూమపానానికి దూరంగా ఉండాలి. ఒత్తిడి వల్ల కూడా వెంట్రుకలు తెల్లబడతాయి. ఒత్తిడితో విడుదలయ్యే నోరిపైన్‌ఫ్రైన్ అనే రసాయనం వెంట్రుకల కుదుళ్ల దగ్గరకు చేరుకుని పిగ్మెంటేషన్ లాస్‌కు పెంచుతుంది. దాంతో వెంట్రుకలు తెల్లబడడం మొదలుపెడతాయి. కాబట్టి ఒత్తిడిని తగ్గించే యోగా, ధ్యానం, వ్యాయామం అలవాటు చేసుకోవాలి.



వెయిట్ లాస్

బరువు తగ్గించే ఆహారం

బరువు తగ్గడం కోసం తినే ఆహార పరిమాణాన్ని తగ్గించడంతో పాటు, బరువు తగ్గించే పదార్థాలను కూడా అదనంగా తీసుకోవాలి. అవేంటంటే...

- **బ్లాక్ కరెంట్స్:** వీటిలో విటమిన్ సి, పొటాషియం పుష్కలంగా ఉంటుంది. క్యాలరీలు, కొవ్వులు కూడా తక్కువే! కాబట్టి బరువు తగ్గాలనుకునేవాళ్లు బ్లాక్ కరెంట్స్‌ను తరచూ తింటూ ఉండాలి.
- **అంజీర్:** ఫైబర్, పొటాషియం, మెగ్నీషియం ఎక్కువగా చక్కెర తక్కువగా ఉండే అంజీర్ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పైగా వీటిలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ కాబట్టి మధుమేహులు సైతం ఈ పండ్లను నిరభ్యంతరంగా తినవచ్చు.
- **ప్రూన్స్:** వీటిలో పొటాషియం, ఫైబర్ ఎక్కువ. దీన్లో ఉండే షుగర్ ఆల్కహాల్ అయిన సార్బిటాల్ మలబద్ధకాన్ని వదిలిస్తుంది. వీటిలో కూడా గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువే కాబట్టి బరువు తగ్గాలనుకునే మధుమేహులు వీటిని నిస్సందేహంగా ఎంచుకోవచ్చు.
- **ఎండు ద్రాక్ష:** వీటిలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ కాబట్టి రక్తంలో చక్కెరలు వెంటనే పెరగవు. అయితే వీటిలో క్యాలరీలు ఎక్కువ కాబట్టి పరిమితంగా తినాలి.
- **అప్రికాట్స్:** వీటిలో పీచు, విటమిన్ ఎ ఎక్కువ. వీటిలో ఖర్జూరాల కంటే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. కాబట్టి బరువు తగ్గాలనుకునేవాళ్లు వీటిని తింటూ ఉండాలి.



బ్లడ్ ప్రెషర్

రక్తపోటు అదుపు తప్పితే?

అధిక రక్తపోటుకు సైలెంట్ కిల్లర్ అని పేరు. నిశ్శబ్దంగా అంతర్గత అవయవాలను నాశనం చేసే ఈ రుగ్మతను వీలైనంత త్వరగా కనిపెట్టి, మందులతో అదుపులో పెట్టుకోవడం అవసరం. లేదంటే అధిక రక్తపోటుతో ఎన్నో ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి.

గుండెకు చేటు

హైపర్‌టెన్షన్‌తో గుండె మీద భారం పడుతుంది. బలంగా రక్తాన్ని సరఫరా చేయవలసి రావడం మూలంగా గుండె కండరాలు మందంగా మారతాయి. ఫలితంగా హార్ట్ ఫెయిల్యూర్ అవకాశాలు పెరుగుతాయి. నిరంతర ఒత్తిడి మూలంగా రక్తనాళాలు దెబ్బతిని, అథెరోస్క్లెరోసిస్ తలెత్తుతుంది. ఫలితంగా గుండెపోటుకు గురయ్యే పరిస్థితి నెలకొంటుంది.

మెదడుకు నష్టం

సెరెబ్రోవ్యాస్క్యులర్ ఆరోగ్యం మీద కూడా హైపర్‌టెన్షన్ ప్రభావం చూపిస్తుంది. పెరిగిన రక్తపోటు వల్ల మెదడులోని సూక్ష్మ రక్తనాళాలు దెబ్బతిని స్ట్రోక్ అవకాశాలు పెరుగుతాయి. అలాగే వ్యాస్క్యులర్ ఎడీమా తలెత్తి జ్ఞాపకశక్తి కుంటుపడుతుంది.

మూత్రపిండాల మీద ప్రభావం

రక్తపోటును నియంత్రించడంలో మూత్రపిండాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే రక్తపోటు అదుపు తప్పితే, మూత్రపిండాల పనితీరు దెబ్బతింటుంది. క్రానిక్ కిడ్నీ డిసీజ్‌కు దారి తీసి, వ్యర్థాలను వడకట్టలేని పరిస్థితి తలెత్తి, ఎలక్ట్రొలైట్ సంతులనం దెబ్బతింటుంది.

కంటి చూపు తగ్గుతుంది

అధిక రక్తపోటు కళ్లలోని సూక్ష్మ రక్తనాళాలను దెబ్బ తీస్తుంది. ఫలితంగా హైపర్‌టెన్సివ్ రెటినోపతి తలెత్తి చూపు సమస్యలు మొదలవుతాయి. చికిత్స అందించకపోతే, ఆ సమస్య క్రమేపీ శాశ్వత అంధత్వానికి దారి తీస్తుంది.

పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్

అధిక రక్తపోటు అథెరోస్క్లెరోసిస్‌కు దారి తీస్తుంది. ప్లేక్ పేరుకుపోవడం మూలంగా ధమనులు ఇరుకుగా, గట్టిగా మారిపోయే పరిస్థితి ఇది. ఈ సమస్యతో కరొనరీ ఆర్టెరీలతో పాటు చేతులు, కాళ్లలోకి ప్రయాణించే ధమనులు కూడా దెబ్బతిని పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్ మొదలవుతుంది. అవయవాలకు రక్తసరఫరా తగ్గడం వల్ల నొప్పి మొదలవుతుంది. అలాగే గాయాలు మానే వేగం నెమ్మదిస్తుంది. ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలు పెరుగుతాయి.





కోలన్ కేర్

పెద్ద పేగు సమస్యల లక్షణాలను తేలికగానే కనిపెట్టవచ్చు. కానీ మలవిసర్జనతో ముడిపడి ఉన్న ఈ సమస్యల గురించి లోలోపలే మథన పడడం వినహా త్వరపడి వైద్యులను సంప్రతించే వాళ్లు తక్కువే! కానీ నిర్లక్ష్యం చేస్తే, కేన్సర్‌గా పరిణమించే పెద్ద పేగు సమస్యలను కొలనోస్కోపీతో ముందుగానే కనిపెట్టి, చికిత్సతో సరిదిద్దుకోవాలంటున్నారు వైద్యులు.

పెద్ద పేగు పదిలంగా...

పోషకాలను శోషించుకుని, విసర్జకాలను శరీరం నుంచి బయటకు పంపించే పెద్ద పేగులో పాలిప్స్ తలెత్తవచ్చు. పూతకు గురి కావచ్చు. మలద్వారం దగ్గర పైల్స్, ఫిషర్స్ లాంటి ఇబ్బందులు కూడా మొదలు కావచ్చు. ఈ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే, అవి కేన్సర్‌గా కూడా మారవచ్చు. కాబట్టి ఈ సమస్యల్లో తలెత్తే లక్షణాలను గమనిస్తూ ఉండడం అవసరం.



పెద్ద పేగు కేన్సర్

పెద్ద పేగుల్లో చిన్న చిన్న బుడిపెలు ఏర్పడుతూ ఉంటాయి. ఇవి కాలక్రమేణా కేన్సర్‌గా మారతాయి. ఇలా కేన్సర్‌గా మారకముందే ఆ పాలిప్స్‌ను తొలగిస్తే, కోలన్ కేన్సర్ నుంచి తప్పించుకోవచ్చు. అయితే ఈ పాలిప్స్ ఉనికికి సంబంధించి ఎలాంటి లక్షణాలూ బహిర్గతం కాకపోవచ్చు. కాబట్టి 55 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కొలనోస్కోపీ పరీక్ష చేయించుకుని పాలిప్స్ లేవని నిర్ధారించుకోవాలి. ఒకవేళ ఉంటే, వాటిని తొలగించుకోవాలి. 30 ఏళ్ల క్రితం ప్రపంచవ్యాప్తంగా అన్ని కేన్సర్లలో కోలన్ కేన్సర్ మొదటి స్థానంలో ఉండేది. ఇప్పుడది ఎనిమిదవ స్థానానికి పడిపోయింది. పెద్దపేగులోని పాలిప్స్‌ను కొలనోస్కోపీతో ముందుగానే కనిపెట్టి వాటిని తొలగించడమే అందుకు కారణం. కాబట్టి కనీసం 55 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ పెద్ద పేగు కేన్సర్ నుంచి రక్షణ కోసం కొలనోస్కోపీ పరీక్ష చేయించుకోవాలి. పరీక్షలో పాలిప్స్ లేవని నిర్ధారణ అయితే, ఐదేళ్లకు మరోసారి పరీక్ష చేసుకోవాలి. ఒకవేళ ఆ పరీక్షలో కూడా పాలిప్స్ లేవని నిర్ధారణ అయితే ఆ తర్వాత పరీక్ష చేయించుకోవలసిన అవసరం లేదు.

- **చికిత్స ఇలా:** కేన్సర్ దశను కనిపెట్టడం చికిత్సలో కీలకం. పక్కలకు పాకకుండా ఒక ప్రదేశానికే పరిమితమైన మొదటి దశలో సర్జరీ చేసి, కేన్సర్ సోకిన భాగాన్ని తొలగిస్తారు. తొలగించిన భాగాన్ని పరీక్షించినప్పుడు, జీన్ మ్యుటేషన్స్ ఉన్నట్టు నిర్ధారణ అయితే, వాళ్లకు మాత్రమే కీమోథెరపీ అవసరమవుతుంది. వ్యాధి లింఫ్ నోడ్స్‌కు కూడా పాకితే అది రెండు, మూడవ దశ కోలన్ కేన్సర్‌గా వైద్యులు నిర్ధారిస్తారు. పెద్దపేగు కేన్సర్ కాలేయానికి పాకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నాల్గవ దశలో ఇలా జరుగుతూ ఉంటుంది. ఇలా కాలేయానికి పాకినప్పటికీ ఆ కేన్సర్‌ను సైతం నిర్మూలించే సమర్థమైన చికిత్సలు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. సర్జరీ, కీమోథెరపీలతో పాటు అదనంగా అందించే టార్గెటెడ్ ఇమ్యునోథెరపీ వల్ల సమర్థమైన ఫలితాలను సాధించవచ్చు. ఈ చికిత్సతో లైఫ్ ఎక్స్‌పెక్టెన్సీ 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువకు పెరుగుతోంది. కాబట్టి కోలన్ కేన్సర్‌కు భయపడవలసిన అవసరం లేదు.

45, 50 ఏళ్లు దాటిన వాళ్లు, బోవెల్ హ్యాబిట్స్‌లో మార్పు కనిపిస్తే అప్రమత్తం కావాలి. మలబద్ధకం ఉన్నవాళ్లకు అకస్మాత్తుగా సాధారణ విసర్జన జరుగుతున్నా, సాధారణ విసర్జన జరుగుతున్న వాళ్లలో అకస్మాత్తుగా మలబద్ధకం తలెత్తినా... ఇలా మలవిసర్జన క్రమం తప్పి, బోవెల్ హ్యాబిట్స్‌లో తలెత్తే మార్పులను వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి. అలాగే మలంలో రక్తం పడుతున్నా, అకారణంగా బరువు తగ్గినా, అనీమియా తలెత్తినా కోలన్ కేన్సర్ ఉందేమోనని అనుమానించి కొలనోస్కోపీ చేయించుకోవాలి. కచ్చితంగా కోలన్ కేన్సర్ సోకి ఉండకపోయినా, ఇతరత్రా సమస్యలు ఏవైనా ఉన్నా అవన్నీ ఈ పరీక్షతో బయటపడతాయి.

పేగులో పూత

దీన్నే ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్ అంటారు. దీనికి అల్సరేటివ్ కొలైటిస్, క్రోన్స్ డిసీజ్ అనే మరో రెండు పేర్లు కూడా ఉన్నాయి. 30 ఏళ్ల క్రితం మన దేశంలో ఈ సమస్య ఎంతో తక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు ఈ సమస్య విపరీతంగా పెరుగుతోంది. ప్రాసెస్ చేసిన పదార్థాలతో కూడిన వెస్టర్న్ డైట్ పేగులో పూతకు ప్రధాన కారణం. అలాగే కొంతమందికి జన్యుపరమైన లోపాలు ఉంటాయి. ఈ లోపాలకు తోడు పర్యావరణ ప్రభావాలు కూడా తోడైతే పేగు పూత వచ్చే అవకాశాలు మరింత ఎక్కువగా ఉంటాయి. ఆటో ఇమ్యూన్ డిజార్డర్ మూలంగా తలెత్తే ఈ పేగు పూత కొద్ది రోజుల పాటు మందులు వాడితే తగ్గే సమస్య కాదు. మధుమేహం లాగే ఇదొక తీవ్ర ఆరోగ్య సమస్య. ఈ సమస్యకు జీవిత కాలం మందులు వాడక తప్పదు. లేదంటే పూత పెరిగి, ఇన్‌ఫెక్షన్లు పెరిగి, పేగుకు రంధ్రం పడే అవకాశం ఉంటుంది. పేగు, పోషకాలను శోషించుకునే సామర్థ్యాన్ని కూడా కోల్పోతుంది. కాబట్టి శరీరం బలహీనపడి, పలు రకాల ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశాలు కూడా పెరుగుతాయి. దీర్ఘకాలంలో ఇదే సమస్య కేన్సర్‌గా మారే అవకాశాలు 25 నుంచి 30% ఎక్కువ.

- **లక్షణాలు ఇవే:** మలవిసర్జన క్రమం తప్పడం, పలుచని విరోచనాలు, మలంలో రక్తం, పొట్టలో నొప్పి, విరోచనాన్ని ఆపుకోలేకపోవడం, బరువు తగ్గడం ప్రధాన లక్షణాలు. సాధారణంగా 15, 20, 30, 40 వయస్కుల్లో ఈ సమస్య ఎక్కువ. పైగా ఇది మలవిసర్జనకు సంబంధించిన సమస్య కాబట్టి నలుగురితో పంచుకోడానికి ఇబ్బంది పడుతూ, జీవనశైలి దెబ్బతిని, మానసిక కుంగుబాటుకు కూడా లోనవుతారు.
- **చికిత్స సులువే:** పూత ఏర్పడిన ప్రదేశం మీద చికిత్స ఆధారపడి ఉంటుంది. పెద్ద, చిన్న రెండు పేగుల్లో ఉందా? పెద్ద పేగులో ఎడమ వైపు ఉందా లేక కుడి వైపు ఉందా లేక పేగు మొత్తం వ్యాపించిందా? వ్యాధి ఎంత తీవ్రంగా ఉంది అనే అంశాల ఆధారంగా వైద్యులు తగిన చికిత్సను ఎంచుకుంటారు. స్వల్ప పూతకు నోటి మాత్రలతో సమస్య మధ్యస్థంగా ఉంటే మందులు, ఇంజెక్షన్లతో, పూత తీవ్రంగా ఉండి, పేగుకు రంధ్రం పడే అవకాశాలుంటే, సర్జరీ చేసి ఆ పేగు భాగాన్ని తొలగించవలసి ఉంటుంది. పేగు పూత ఒకసారి మొదలైన తర్వాత చికిత్స తీసుకుంటూనే క్రమం తప్పక వైద్యులను కలుస్తూ, పూత పరిస్థితిని గమనించుకుంటూ, తగినట్టు చికిత్సను మార్చుకుంటూ ఉండాలి.
- **నివారణ ఉంది:** వంశపారంపర్యంగా జన్యుపరమైన లోపాల వల్ల వచ్చే పేగు పూతను నియంత్రించలేకపోయినా, ఆహారపుటలవాట్ల వల్ల వచ్చే ఈ సమస్యను ఆ పదార్థాలకు దూరంగా ఉండడం ద్వారా నియంత్రించుకోవచ్చు. కాబట్టి ప్రాసెస్డ్ ఫుడ్స్ మానేయాలి. కొందర్లో జన్యు పరివర్తన జరిగి ఉండవచ్చు. అలాంటి వాళ్లు ప్రాసెస్డ్ ఫుడ్స్ తినడం వల్ల ఈ సమస్య ప్రేరేపితం కావచ్చు. కాబట్టి ఆహారపుటలవాట్ల పట్ల జాగ్రత్తగా వ్యవహరిస్తూ, లక్షణాలు తలెత్తిన వెంటనే వైద్యులను కలిస్తే పేగు పూతను సమర్థంగా అదుపులోకి తెచ్చుకోవచ్చు.

ఏది సహజం - ఏది అసహజం

కొందరికి రోజులో ఒకసారి మలవిసర్జన జరిగితే, ఇంకొందరికి రెండుసార్లు జరగవచ్చు. కొందరికి మూడు రోజులకోసారి లేదా ఐదు రోజులకోసారి మలవిసర్జన జరుగుతూ ఉండవచ్చు. మలవిసర్జన సమయంలో ఇబ్బందికి లోను కాకుండా, సాఫీగా జరుగుతున్నంత కాలం ఈ అలవాట్లను ఆరోగ్యకరమైనవిగానే భావించాలి. ఇలా వ్యక్తుల్లో మలవిసర్జన వ్యవధులు భిన్నంగా ఉండడం కూడా సహజమే! అయితే ఈ ప్యాటర్న్ మారకుండా అలాగే కొనసాగుతున్నంత వరకూ భయపడవలసిన అవసరం లేదు. అలా కాకుండా ఈ బోవెల్ హ్యాబిట్ ప్యాటర్న్‌లో అకస్మాత్తుగా మార్పులు చోటు చేసుకుంటే వెంటనే అప్రమత్తమై వైద్యులను కలవాలి.



మొలల సమస్య

అస్తవ్యస్థమైన ఆహారపుటలవాట్లు, తగినన్ని నీళ్లు తాగకపోవడం, మలబద్ధకం మొలలు, ఫిషర్‌లకు ప్రధాన కారణాలు. మలద్వారం దగ్గర వాపు, నొప్పి, రక్తస్రావం, అసౌకర్యం ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులకు చూపించుకోవాలి. మొలల సమస్య ఉన్నప్పుడు అన్నిటికంటే ప్రధానంగా పెద్ద పేగు కేన్సర్ లేదని నిర్ధారించుకోవడంతో పాటు, మొలలు, ఫిషర్‌లు ఏ దశలో ఉన్నాయనేది కూడా తెలుసుకోవాలి. ఆ గ్రేడ్‌ల మీద చికిత్స ఆధారపడి ఉంటుంది. చికిత్స తర్వాత ఈ సమస్యలు తిరగబెట్టకుండా పీచు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. నీళ్లు ఎక్కువగా తాగుతూ ఉండాలి.

డాక్టర్ నవీన్ పోలవరపు,
చీఫ్ ట్రాన్స్‌ప్లాంట్ హెపటాలజిస్ట్ అండ్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ,
హైదరాబాద్.



ఎమోషనల్ ఈటింగ్

మనసు బాగోకపోతే ఆహారం మీదకు మనసు మళ్లదు. కానీ కొందరికి ఇలాంటప్పుడే ఆహారం మీద వ్యామోహం పెరుగుతుంది. దీన్నే ఎమోషనల్ ఈటింగ్ అంటారు.



తిండితో తృప్తి

తినడం వల్ల మెదడులోని రివార్డ్ సిస్టమ్ ప్రేరేపితమై సంతృప్తికరమైన భావనకు లోనవుతాం. కాబట్టి భావోద్వేగాలకు లోనయినప్పుడు కొందరు ఆహారంతో ఆ భావనల నుంచి బయటపడుతూ ఉంటారు. తినడం వల్ల మెదడులో డోపమైన్ అనే హ్యాపీ హార్మోన్ రిలీజ్ అవుతుంది. దాంతో తెలియకుండా మనం మన భావోద్వేగాలకూ, ఆహారానికీ ముడిపెట్టేసుకుంటాం! పైగా అన్ని వేళలా, అన్ని చోట్లా తేలికగా అందుబాటులో ఉంటుంది కాబట్టి ఆహారంతో సంతృప్తి పొందడం అలవాటు చేసుకుంటాం! ఇలా తినే పదార్థాలన్నీ సాధారణంగా చక్కెర, పిండిపదార్థాలు, కొవ్వులతో నిండి ఉంటూ ఉంటాయి. దాంతో శరీరంలో క్యాలరీలు పెరిగిపోయి, ఒబేసిటీ, తత్ఫలితంగా మధుమేహం, అధిక రక్తపోటు లాంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. పైగా ఇలాంటి ఎమోషనల్ ఈటింగ్ అలవాటు వల్ల అందుకు దారి తీసిన పరిస్థితులతో పోరాడే మెలకువలను, వ్యూహాలను అలవరుచుకోవడం మానేస్తాం.

అది నిజమైన ఆకలేనా?

పని ఒత్తిడి, ఆర్థికపరమైన ఆందోళనలు, ఆరోగ్య సమస్యలు, అనుబంధాల సమస్యలు మొదలైన ఎన్నో రకాల బాహ్య అంశాలు ఎమోషనల్ ఈటింగ్‌ను ప్రేరేపిస్తాయి. ఇవే కాకుండా తనెలాంటి భావనకు లోనవుతున్నానో స్వతఃసిద్ధంగా గ్రహించలేని వ్యక్తులు, భావోద్వేగాలను వ్యక్తీకరించలేని వ్యక్తులు, భావోద్వేగాలను నియంత్రణలో పెట్టుకోలేని వాళ్లు ఎమోషనల్ ఈటింగ్ బారిన పడుతూ ఉంటారు. ఈ అలవాటు క్రమేపీ ఒక వ్యసనంగా కూడా మారుతుంది. సమస్య నుంచి బయట పడడం కోసం ఎంత ఎక్కువ ఆహారం తింటూ ఉంటే, అంతే ఎక్కువగా ఎమోషనల్ ఈటింగ్‌కు అలవాటు పడిపోతూ ఉంటారు. అయితే కొన్నిసార్లు ఎమోషనల్ ఈటింగ్‌కూ, భౌతికపరమైన ఆకలికీ వ్యత్యాసాన్ని కూడా గ్రహించలేని పరిస్థితి తలెత్తుతుంది. ఈ రెండింటి మధ్యా తేడాను కనిపెట్టడం కష్టంగా మారుతుంది. కొందర్లో ఈ రెండూ ఉంటాయి. అలాంటప్పుడు రెండింటి మధ్యా తేడాను తెలుసుకోవడానికి ఈ చిట్కాలు పాటించవచ్చు.

ఫిజికల్ హంగర్

- ఈ ఆకలి క్రమేపీ పెరుగుతుంది
- తినడం మొదలుపెట్టిన కొద్ది సేపటికి ఆకలి తీరిన భావన కలుగుతుంది.
- తిరిగి తర్వాతి భోజనం వరకూ ఆహారం మీదకు మనసు మళ్లదు

ఎమోషనల్ ఈటింగ్

- హఠాత్తుగా మొదలవుతుంది
- తింటున్నప్పటికీ సంతృప్తి కలగదు. ఇంకా తినాలనే కోరికను నియంత్రించుకోలేరు
- కంఫర్ట్ కోసం, స్వాంతన కోసం తినాలనిపిస్తుంది

ఇలా నియంత్రించవచ్చు

- ఆహారం మీద వ్యామోహం పెరిగడానికి కారణమైన భావోద్వేగాలను ప్రేరేపించే అంశాలను ఎవరికి వారు తెలుసుకోవాలి. ఈ ప్యాటర్న్‌ను కనిపెట్టడం కోసం ఫుడ్, ఎమోషన్ డైరీని నిర్వహించాలి.
- వ్యతిరేక భావాలతో సానుకూలంగా వ్యవహరించగలగడం కోసం వ్యాయామం, ధ్యానం చేయడం లేదా స్నేహితులు, కుటుంబసభ్యులతో వాటిని పంచుకోవడం అలవాటు చేసుకోవాలి.
- ఎందుకు తింటున్నాం, ఏం తింటున్నాం అనే దాని మీద దృష్టి పెట్టాలి.
- ఎమోషనల్ ఈటింగ్‌లో భాగంగా ఐస్‌క్రీమ్, చాక్లెట్స్‌కు బదులుగా పండ్లు, కీరా, సెలరీ స్టిక్స్ లాంటి ఆరోగ్యకరమైన స్నాక్స్‌ను తినడం అలవాటు చేసుకుంటే క్యాలరీలు తగ్గి బరువు పెరగకుండా ఉంటారు.
- ఎమోషనల్ ఈటింగ్ సమస్య పదే పదే వేధిస్తూ ఉంటే, మానసిక నిపుణుల సహాయం తీసుకోవాలి. అలాగే ఎమోషనల్ ఈటింగ్ పర్యవసానంగా తలెత్తే అధిక బరువు, మధుమేహాలను తగ్గించుకోవడం కోసం ఎండోక్రైనాలజిస్ట్‌లను కలవాలి.

డాక్టర్ శ్రీ నగేష్
కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్ అండ్ డయాబెటాలజిస్ట్,
శ్రీ నగేష్ డయాబెటిస్ అండ్ ఎండోక్రైన్ క్లినిక్,
హైదరాబాద్.



ఫిట్‌నెస్

ఇది కూడా వ్యాయామమే!

వ్యాయామం కోసం జిమ్‌కే వెళ్లవలసిన అవసరం లేదు. కొన్ని అలవాట్లను అలవరుచుకోవడం ద్వారా వ్యాయామ ఫలాన్ని పొందవచ్చు. అవేంటంటే...

నడక: నడకతో ఎన్నో ఆరోగ్య ఫలాలను పొందవచ్చు. నడకతో గుండె వేగం పెరగడంతో పాటు, క్యాలరీలు కూడా ఖర్చవుతాయి. క్రమం తప్పకుండా నడవడం వల్ల అధిక రక్తపోటు అదుపులోకొస్తుంది. అలాగే మధుమేహం, రక్తపోటులు నియంత్రణలో ఉంటాయి. బరువు కూడా తగ్గుతారు.

డాన్స్: ఫిట్‌గా ఉండడం కోసం డాన్స్‌ను కూడా ఎంచుకోవచ్చు. క్యాలరీలు ఖర్చు చేయడానికీ, బరువు తగ్గడానికి ఇదొక అద్భుతమైన ప్రత్యామ్నాయం. డాన్స్‌తో కండరాలు బలపడతాయి, నమ్యత పెరుగుతుంది. సంతులనం, రక్తసరఫరా, మానసికోల్లాసాలు కూడా పెరుగుతాయి.

మెట్లు ఎక్కండి: అదే పనిగా మెట్లు ఎక్కడం కీళ్లకు హానికరమే! కానీ అవకాశం దొరికినప్పుడు చకచకా మెట్లు ఎక్కడానికి సందేహించకండి. మెట్లు ఎక్కడం వల్ల రక్తప్రసరణ పెరుగుతుంది. గుండె వేగం పెరుగుతుంది. కండరాలు బలపడతాయి. బరువు తగ్గుతారు.

క్రీడలు ఆడొచ్చు: బ్యాడ్మింటన్, వాలీబాల్, సైక్లింగ్ లాంటి క్రీడలు కూడా శరీరానికి సరిపడా వ్యాయామాన్ని అందిస్తాయి. ప్రతి రోజూ ఈ క్రీడల్లో పాల్గొనడం వల్ల రక్తంలోని కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. రక్తపోటు కూడా పెరగకుండా ఉంటుంది. కండరాలు బలపడతాయి. రక్తప్రసరణ పెరిగి శరీరం చురుగ్గా ఉంటుంది.

ఇంట్లోనే వ్యాయామం: ఎక్సర్‌సైజ్ మ్యాట్ నేల మీద వేసుకుని తేలికపాటి వ్యాయామాలు చేయవచ్చు. కార్డియో, బర్పీస్ లేదా స్కిప్పింగ్ లాంటివి ప్రాక్టీస్ చేయవచ్చు. ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌ల్లో భాగంగా యాబ్స్, క్రంచెస్, ప్లాంక్స్ లాంటివి చేయవచ్చు. ఇంటి పట్టున వ్యాయామంచేయడం వల్ల జిమ్ ఖర్చు, సమయం ఆదా అవుతాయి.



ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
మంగళవారం • 13 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com

రుహానీ.. డైనమిక్ లుక్



వరుణ్‌తేజ్ తొలిసారిగా నటిస్తున్న బాలీవుడ్ చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో వరుణ్‌తేజ్ ఐఎఎఫ్ ఆఫీసర్‌గా నటిస్తుండగా, మానుషీ చిల్లర్ రాడార్ ఆఫీసర్‌గా కనిపిస్తారు. ఈ సినిమాకు మరో గ్లామర్ రుహానీ శర్మ. ఇందులో ఈమె ఎయిర్ ఫోర్స్ పైలెట్‌గా నటిస్తున్నారు. పాత్ర పేరు తాన్యా శర్మ. ఆమె లుక్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. పైలెట్ యూనిఫామ్‌లో ఆమె



ఇంత అద్భుతంగా నటించానా అనిపించింది

రవితేజ

'ఈగల్' చిత్రానికి ప్రేక్షకుల స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. కాళికాదేవి ఎపిసోడ్ చూస్తుంటే నేనేనా ఇంత అద్భుతంగా నటించింది అనిపించింది' అని రవితేజ అన్నారు. ఆయన కథానాయకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన 'ఈగల్' చిత్రం సక్సెస్‌మీట్ ఇటీవలే జరిగింది. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ 'నాకు అవకాశం ఇచ్చిన రవితేజ గారికి ధన్యవాదాలు. ఆయన వల్లే ఇంత గొప్ప విజయం సాధ్యమైంది' అని చెప్పారు. నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ 'రవితేజతో 'ధమాకా' తర్వాత 'ఈగల్'తో మరో బ్లాక్‌బస్టర్ కొట్టాం. కార్తిక్‌తో మరిన్ని సినిమాలు చేయబోతున్నాం' అని తెలిపారు.

పెగ్ కలిపారా?స్టఫ్ ఇచ్చారా?

తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా డిజిటల్ మీడియాలో వస్తున్న వార్తలపై దర్శకుడు హరీష్ శంకర్ 'ఈగల్' సక్సెస్ మీట్‌లో ఘాటుగా స్పందించారు. 'నేను నిర్మాత ఇంట్లో పడి రేయింబవళ్లు తాగుతున్నానంటూ, నా షాడో ఫొటో పెట్టి ఓ వెబ్‌సైట్‌లో వార్తలు రాస్తున్నారు. నేను తాగుతుంటే మీరొచ్చి పెగ్ కలిపారా? స్టఫ్ ఇచ్చారా? మీకు నిజంగా దమ్ము ఉంటే నా ఫొటో పెట్టి ఆ వార్త రాయండి. అప్పుడు నా ప్రతిస్పందన చూద్దురు. 'ఇకపైనా ఇలానే చేస్తాం' అంటే చేసుకోండి. నా వెంట్రుక కూడా పీకలేరు' అని అన్నారు. 'నాకు గ్యాప్ వచ్చిందంటున్నారు, ఇప్పుడు ఒకేసారి ఐదు సినిమాలు చేస్తున్నా. ఇవన్నీ మీకు చెప్పి చేయాలా?, మా నాన్నలాగా



స్కూల్ ఫీజు కట్టావా? నీకు చూపించడానికి' అని ప్రశ్నించారు. రివ్యూల్లో విమర్శ కనిపిస్తే సరే గానీ అది హేళన స్థాయికి వెళ్లడం చూస్తుంటే బాధేస్తోందన్నారు. సినీ జర్నలిస్టులు కూడా ఇండస్ట్రీలో భాగమే, కానీ మనలో మనం కలహించుకోవడం వల్ల బయటివారికి లోకువవుతున్నామని గుర్తెరగాలి అని హరీష్ శంకర్ హితవు పలికారు.

వీరమల్లు రాక అప్పుడే...



క్రిష్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ సినిమా చిత్రీకరణ ఆగిపోయిందంటూ కొన్ని రోజులుగా మీడియాలో వస్తున్న వార్తలకు చెక్ పెడుతూ చిత్ర నిర్మాణ సంస్థ మెగా సూర్య ప్రొడక్షన్స్ కీలకమైన అప్డేట్‌ను ఇచ్చింది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న విడుదల చేస్తున్నట్లు సోమవారం సోషల్ మీడియాలో ప్రకటించింది. త్వరలో ప్రోమోను కూడా విడుదల చేస్తున్నట్లు అందులో తెలిపారు. అసత్యాలు నమ్మవద్దు, భారీ హంగులు, అత్యున్నత ప్రమాణాలతో సినిమాను తీర్చిదిద్దాలనే ప్రయత్నం వల్ల చిత్రీకరణకు ఎక్కువ సమయం పడుతోంది అని మేకర్స్ పేర్కొన్నారు. ఇందులో పవన్‌కు జోడీగా నిధి అగర్వాల్ నటిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పణలో ఏ. దయాకర్‌రావు నిర్మిస్తున్నారు.

ఆ సమయం వచ్చింది



అనారోగ్యం వల్ల దాదాపు ఏడాది కాలంగా సినిమా షూటింగ్స్‌కు దూరమయ్యారు సమంత. 'ఖుషి' చిత్రం పూర్తి చేశాక సినిమాలకు బ్రేక్ ఇచ్చి మయోసైటిస్ వ్యాధికి చికిత్స తీసుకుంటున్నారు. త్వరలోనే సినిమా షూటింగ్స్‌లో పాల్గొనబోతున్నట్లు సమంత సోమవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలిపారు. 'మళ్లీ సినిమా షూటింగ్స్ ఎప్పుడు మొదలుపెడతారు? అని నన్ను చాలామంది అడుగుతున్నారు. ఇక దానికి సమయం వచ్చింది. త్వరలోనే షూటింగ్స్ మొదలుపెడతాను' అని ప్రత్యేకంగా విడుదల చేసిన వీడియోలో పేర్కొన్నారు.


గామి సినిమా కోసం ఎదురుచూస్తున్నా

- నాగ్ అశ్విన్



విష్వక్‌సేన్ కథానాయకుడిగా విద్యాధర్ కాగిత దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'గామి'. ఈ సినిమా ప్రచార చిత్రాలను చూసిన ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్ 'గామి' చిత్రబృందంపై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్రంలో హీరో మానవ స్పర్శను అనుభవించలేని అరుదైన వ్యాధితో బాధపడే అఘోరాగా కనిపించడమనే కాన్సెప్టును ఆయన అభినందించారు. చాలా ఓపిగ్గా, ఎంతోకాలం శ్రమించి, సాధించారు, మీ సినిమా కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా అని ఇన్‌స్టాగ్రామ్‌లో నాగ్ అశ్విన్ తెలిపారు. 'గామి' మార్చి 8న థియేటర్లలో విడుదలవుతోంది.

21న గోవాలో రకుల్ వివాహం



హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. తన ప్రియుడు, నిర్మాత జాకీ భగ్నానీని ఆమె పెళ్లాడనున్నారు. వివాహ ముహూర్తం నిశ్చయమైంది. ఈనెల 21న ఈ ప్రేమజంట గోవాలో ఒక్కటవబోతున్నారు. ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కొద్దిమంది కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే ఈ పెళ్లికి హాజరవుతున్నారు.

16న టైటిల్ ప్రకటన



శివ కార్తికేయన్ కథానాయకుడిగా కమల్‌హాసన్, ఆర్ మహేంద్రన్‌తో కలసి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. 'ఎస్‌కే 21' అనేది వర్కింగ్ టైటిల్. ఈ చిత్రం టైటిల్ టీజర్‌ను ఈ నెల 16న విడుదల చేయనున్నట్లు మేకర్స్ సోమవారం ప్రత్యేక వీడియోను విడుదలచేసి తెలిపారు. ఈ చిత్రానికి రాజ్‌కుమార్ పెరియసామి దర్శకుడు. సాయ పల్లవి కథానాయిక. సంగీతం: జీవీ ప్రకాశ్

యూత్, ఫ్యామిలీ ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు

దర్శకుడు విఐ ఆనంద్



సందీప్‌కిషన్ హీరోగా నటించిన 'ఊరు పేరు భైరవకోన' ఈ నెల 16న విడుదల కానుంది. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా ఈ చిత్రాన్ని నిర్మించారు. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ హీరోయిన్లుగా నటించగా విఐ ఆనంద్ దర్శకత్వం వహించారు. ఆయన సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్ర విశేషాలు వెల్లడించారు.

- 'టైగర్' చిత్రం తర్వాత మరో సినిమా చేయాలని నేను, సందీప్ అనుకున్నాం. నా దగ్గరున్న రెండు ఐడియాల గురించి ఆయనకు చెప్పినప్పుడు 'ఊరు పేరు భైరవకోన' కథ విని చాలా ఎక్సయిట్ అయ్యాడు. ఒక ట్రెండ్ సెట్ చేసేలా ఉంటుందని ఆ కథను ఫిక్స్ చేశాం. సందీప్ ఇంతవరకూ సూపర్ నేచురల్ ఫాంటసీ జోనర్ చేయలేదు. విజువల్స్, సౌండ్ పరంగా ఒక గొప్ప అనుభూతినిచ్చే సినిమా ఇది. నిర్మాత రాజేశ్‌గారు కూడా ఈ కథ బాగుందన్నారు. మా మంచి కోరే వ్యక్తి అనిల్ సుంకర్ కూడా ఈ ప్రాజెక్ట్‌లోకి రావడంతో జర్నీ మొదలైంది.
- కర్మ సిద్ధాంతం, గురించి చెప్పే సినిమా ఇది. గరుడ పురాణంలోని కొన్ని అంశాలు తీసుకున్నాం. ముఖ్యంగా ఆత్మ ప్రయాణం గురించి గరుడ పురాణంలో వివరంగా ఉంది.
- ఈ రోజుల్లో ప్రేక్షకుల్ని థియేటర్‌కు రప్పించాలంటే కంటెంట్ బలంగా ఉండాలి. విజువల్స్ కొత్త అనుభూతి కలిగించాలి. అందుకే నిర్మాణపరంగా ఎక్కడా రాజీ పడకుండా నిర్మాత రాజేశ్‌గారు ప్రతిదీ సమకూర్చారు. సినిమాలో రెండు పెద్ద ట్విస్టులు ఉన్నాయి. ప్రతి పది నిమిషాలకు ప్రేక్షకులు ఊహించని మలుపులు కథలో ఉంటాయి. యూత్, ఫ్యామిలీతో పాటు అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది. అలాగే వెన్నెల కిశోర్ కామెడీ ట్రాక్ అలరిస్తుంది. అలాగే వైవా హర్ష పాత్ర కూడా నవ్విస్తుంది.
- చిత్ర పరిశ్రమకు వచ్చి పదేళ్ల అవుతోంది. ఇంకో మూడు చిత్రాలు ఫిల్మోగ్రఫీలో యాడ్ అయి ఉంటే బాగుండేదనిపిస్తోంది. ప్రస్తుతం నిఖిల్‌తో ఓ సినిమా చర్చల్లో ఉంది.

అందుకే 'డ్రిల్' పేరు పెట్టాం

డాక్టర్ హరనాథ్ పొలిచెర్ల



అమెరికాలో డాక్టర్‌గా పని చేస్తున్న హరనాథ్ పొలిచెర్ల హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'డ్రిల్' ఈ నెల 16న విడుదల కానుంది. కారుణ్య చౌదరి హీరోయిన్‌గా నటించారు. సినిమా విడుదల సందర్భంగా డాక్టర్ హరనాథ్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ 'నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. అమెరికాలో డాక్టర్‌గా పని చేస్తున్నాను. ఆ వృత్తిలో ఎంతో బిజీగా ఉంటాను. ఒక రోజు 'మన లక్ష్యం ఏమిటి, వెళుతున్న దారి ఏమిటి అని అనిపించింది. దాంతో నటన వైపు మళ్లాను. తెలుగులో ఎనిమిది చిత్రాలు తీశా. కన్నడంలో నటించా. చాలా రోజుల తర్వాత మళ్లీ 'డ్రిల్' చిత్రం చేశా' అని చెప్పారు. ఈ చిత్రం గురించి ఆయన మాట్లాడుతూ 'ఇదొక క్రైమ్ బేస్డ్ మూవీ. లవ్ జిహాద్ అనేది ఒక అంశం మాత్రమే. నేను పోలీస్ ఆఫీసర్‌గా నటించా. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను. తొలి కాపీ చూసిన తర్వాత ఆ కష్టం మరిచిపోయాను. 'డ్రిల్' అనేది ఒక ఆయుధం. మా సినిమాలో హంతకుడు డ్రిల్లింగ్ మిషన్ వాడి అందరినీ చంపుతుంటాడు. ప్రేక్షకుల్లో ఆసక్తి కలిగించడం కోసం సినిమాకు 'డ్రిల్' అని టైటిల్ పెట్టాం' అన్నారు. ఇలాంటి క్రైమ్ థ్రిల్లర్స్‌కు ఫొటోగ్రఫీ, సంగీతం చాలా కీలకం అని చెబుతూ ఛాయాగ్రాహకుడు వంశీకృష్ణ, సంగీత దర్శకుడు డిఎస్‌ఎస్‌కె అద్భుతంగా పని చేశారని హరనాథ్ చెప్పారు.

మళ్లీ మనీషా చిత్రం!



'మాయలోడు', 'రాజేంద్రుడు గజేంద్రుడు' 'యమలీల', 'వినోదం' వంటి వినోదాత్మక చిత్రాలను ప్రేక్షకులకు అందించిన మనీషా సంస్థ అధినేత కిశోర్ రాఠి చాలా కాలం గ్యాప్ తర్వాత మళ్లీ చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శ్రీహర్ష, కషిక కపూర్ హీరో హీరోయిన్లుగా ఆయన నిర్మించే 'లవ్ యువర్ ఫాదర్' చిత్రం షూటింగ్ సోమవారం మల్లారెడ్డి కాలేజీలో ప్రారంభమైంది. పవన్ కేతరాజు ఈ చిత్రానికి దర్శకుడు. హీరో శ్రీహర్ష, గాయకుడు ఎస్పీ చరణ్‌పై చిత్రీకరించిన తొలి షాట్‌కు సీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గోపాలరెడ్డి క్లాప్ ఇవ్వగా, కామకూర శాలిని కెమెరా స్విచ్‌ఆన్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాతల్లో ఒకరైన మహేశ్ రాఠి మాట్లాడుతూ 'తండ్రీకొడుకుల మధ్య ఉండే బంధాన్ని, ఎమోషన్‌ను చూపించే సినిమా ఇది. మణిశర్మగారు సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. మా నాన్నగారి ఆశీస్సులతో ఈ సినిమా నిర్మిస్తున్నాను' అన్నారు. మల్లారెడ్డి కాలేజ్ ప్రిన్సిపాల్ ఎ.రామస్వామి రెడ్డి మాట్లాడుతూ మా అబ్బాయి శ్రీహర్షను హీరోగా పరిచయం చేయడం ఆనందంగా ఉంది. సినిమాలో అన్ని రకాల ఎలిమెంట్స్ ఉంటాయి. వినోదాత్మకంగా కూడా ఉండే ఈ సినిమా సక్సెస్ కావాలని కోరుకుంటున్నా' అన్నారు. దర్శకుడు పవన్ కేతరాజు మాట్లాడుతూ 'ఎన్నో హిట్ చిత్రాలు అందించిన మనీషా సంస్థలో పని చేయడం ఆనందంగా ఉంది. మా నిర్మాత కిశోర్ రాఠి జీవితంలో జరిగిన ఓ సంఘటన తీసుకుని కథని తయారు చేశాం. తండ్రీ కొడుకుల ఎమోషనల్ జర్నీ ఈ సినిమా' అన్నారు. నవాబ్ షా, ప్రవీణ్, భద్రం, అంజన్ శ్రీవాస్తవ్, అమన్ వేమ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఫొటోగ్రఫీ: మణీంద్ర కుమార్, సంగీతం: మణిశర్మ, నిర్మాతలు: కిశోర్ రాఠి, హేశ్ రాఠి, అన్నపురెడ్డి సామ్రాజ్యలక్ష్మి.

ఈ గడ్డ కోసం పోరాడిన వాళ్ల కథ



'ఎంతో మంది త్యాగాలు చేస్తే మనం ఈ రోజు ప్రశాంతంగా ఉన్నాం. ముఖ్యంగా సర్దార్ వల్లభ బాయ్ పటేల్ లేకపోతే మనం ఈ రోజు ఇలా ఉండేవాళ్లం కాదు. చరిత్రను ఇలా దృశ్యరూపంలో చూపిస్తే మరింత అర్థమవుతుంది. ఈ ట్రైలర్ చూస్తే రోమాలు నిక్కబొడుచుకున్నాయి. నా శిష్యుడు సత్యనారాయణ అద్భుతంగా సినిమా తీశాడు. సుద్దాల అశోక్ తేజ రక్తంతో పాటలు రాస్తారా అనిపిస్తుంది. 'రజాకార్' చిత్రం విజయం సాధించాలి' అన్నారు సీనియర్ దర్శకుడు కె.రాఘవేంద్రరావు. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణరెడ్డి నిర్మించిన 'రజాకార్' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. దర్శకుడు యాటా సత్యనారాయణ మాట్లాడుతూ 'ఇటువంటి సినిమాలు తీస్తున్నప్పుడు బెదిరింపు కాల్స్, నెగెటివ్ కామెంట్స్ వస్తుంటాయి. అయినా లెక్క చేయకుండా మా చరిత్ర, మా పూర్వీకుల బాధలు, త్యాగాలు, ఈ గడ్డ కోసం పోరాడిన వాళ్ల గురించి చెప్పడానికే ఈ సినిమా తీశాను. ప్రపంచంలో అణిచివేతకు గురైన ప్రతి ఒక్కరికీ 'రజాకార్' చిత్రం అంకితం. రజాకార్లు చేసిన అన్యాయాన్ని చెప్పడానికే ఈ సినిమా తీశాం' అన్నారు. 'సెప్టెంబర్ 17 ప్రాముఖ్యం గురించి చాలా మందికి తెలీదు. మళ్లీ రజాకార్లు పుట్టొద్దు. అందుకే ఆ చరిత్రను చరిత్రగానే తీశాం. ఈ సినిమా కోసం ఎంతో ఖర్చు పెట్టాం. మూడు రెట్లు బడ్జెట్ పెరిగినా, నా ఆస్తులు అమ్మి అయినా మన చరిత్రను అందరికీ చూపించాలని 'రజాకార్' చిత్రాన్ని తీశాం' అని తెలిపారు నిర్మాత గూడురు నారాయణరెడ్డి. ఇటువంటి చిత్రంలో నటించినందుకు ఆనందంగా ఉందని అనసూయ చెప్పారు. బాబీ సింహా, వేదిక, అనుష్య త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే తదితరులు నటించిన 'రజాకార్' చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, మరాఠి భాషల్లో విడుదల చేస్తున్నారు.

సైరన్‌కు డేట్ ఫిక్స్



తమిళ హీరో జయం రవి కథానాయకుడిగా నటించిన చిత్రం 'సైరన్'. ఆంథోనీ భాగ్యరాజ్ దర్శకుడు. ఈనెల 23న ఈ చిత్రం విడుదలవుతోంది. గంగ ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై మహేశ్వర్ రెడ్డి మూలీ తెలుగులో విడుదల చేస్తున్నారు. కీర్తి సురేశ్, అనుపమా పరమేశ్వరన్ కథానాయికలు. ఫ్యామిలీ, కమర్షియల్ ఎలిమెంట్స్ కుదిరేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు దర్శకుడు చెప్పారు.

నవ్వించే గూఢచారి



వెన్నెల కిశోర్ హీరోగా నటించిన చిత్రం 'చారి 111'. సంయుక్తా విశ్వనాథన్ హీరోయిన్. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో అదితీ సోనీ నిర్మించారు. మార్చి 1న విడుదలవుతోంది. సోమవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. సీరియస్‌గా కనిపిస్తూ, నవ్వించే గూఢచారిగా ట్రైలర్‌లో వెన్నెల కిశోర్ అలరించారు. ఈ ట్రైలర్ జస్ట్ శాంపిల్ మాత్రమే, సినిమాలో ఇంతకు మించి వినోదం ఉంటుంది అని దర్శకుడు తెలిపారు.

వాల్యుయేషన్‌లో ప్రైవేట్ సత్తా



హురున్ ఇండియా-యాక్సిస్ బ్యాంక్ నివేదిక వెల్లడి

హైదరాబాద్: వాల్యుయేషన్‌లో దేశీయ ప్రైవేట్ కంపెనీలు దూసుకుపోతున్నాయి. గత ఏడాది అక్టోబరు నాటికి రూ.6,700 కోట్ల కంటే ఎక్కువ విలువ (వాల్యుయేషన్) ఉన్న ప్రైవేట్ కంపెనీలు మన దేశంలో 500 వరకు ఉన్నట్టు హురున్ ఇండియా-యాక్సిస్ బ్యాంక్ 2023 నివేదిక వెల్లడించింది. ఈ టాప్-500 ప్రైవేట్ కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ వరుసగా మూడో ఏడాదీ అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాది అక్టోబరు నాటికి ఈ జాబితాలోని కంపెనీల మార్కెట్ విలువ 2.8 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.231 లక్షల కోట్లు) చేరింది. ఇది గత ఏడాది దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 71 శాతానికి సమానం. సౌదీ అరేబియా, స్విట్జర్లాండ్, సింగపూర్ జీడీపీల కంటే కూడా.. గత ఏడాది భారత్‌లోని అగ్రశ్రేణి 500 ప్రైవేట్ కంపెనీల వాల్యుయేషన్ ఎక్కువగా ఉన్నట్టు ఆ నివేదిక పేర్కొంది. ప్రభుత్వ రంగ కంపెనీలతో పాటు దేశంలోని విదేశీ కంపెనీలను మినహాయించి ఈ నివేదికను రూపొందించారు.

వరుసగా మూడో ఏడాది టాప్‌లో రిలయన్స్

దేశంలో అత్యంత విలువైన కంపెనీలపరంగా చూస్తే గత ఏడాది అక్టోబరు నాటికి రూ.15.65 లక్షల కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ వరుసగా మూడో ఏడాదీ అగ్రస్థానంలో నిలిచింది. రూ.12.4 లక్షల కోట్లతో టీసీఎస్, రూ.11.3 లక్షల కోట్లతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. గత ఏడాది రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి వేరు పడిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ 28వ స్థానంలో నిలిచింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్ మళ్లీ టాప్-10లో స్థానం సంపాదించాయి.

70 లక్షల కొలువులు

ఈ టాప్-500 ప్రైవేట్ కంపెనీలు ఉద్యోగాల కల్పనలోనూ ముందున్నాయి. ఒక్కో కంపెనీలో సగటున 15,211 మంది పని చేస్తున్నారు. ఈ 500 కంపెనీలు మొత్తాన్ని తీసుకుంటే వీటిల్లో పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య 70 లక్షల మంది వరకు ఉంటుందని నివేదిక తెలిపింది. ఇందులో 437 కంపెనీల డైరెక్టర్ల బోర్డుల్లో మహిళలకు స్థానం ఉంది. మరో 179 కంపెనీల పాలన, నిర్వహణ పగ్గాలు ప్రమోటర్లకు బదులు వృత్తి నిపుణులైన సీఈఓల చేతుల్లో ఉంది.

హైదరాబాద్ కంపెనీల హవా

హురున్ ఇండియా-యాక్సిస్ బ్యాంక్ జాబితాలో 29 హైదరాబాద్ కంపెనీలకు చోటు లభించింది. 2022తో పోలిస్తే ఒక కంపెనీ తగ్గింది. అయితే విలువపరంగా ఈ కంపెనీల మార్కెట్ విలువ గత ఏడాది 18 శాతం పెరిగి రూ.5,93,718 కోట్లకు చేరింది. రూ.6,700 కోట్ల కంటే ఎక్కువ విలువైన కంపెనీల జాబితాలో హైదరాబాద్ గత ఏడాది ఆరో స్థానంలో నిలిచింది. రూ.90,350 కోట్లతో దివీస్ ల్యాబ్ హైదరాబాద్ కంపెనీల్లో అగ్రస్థానంలో నిలిచింది. తర్వాత రూ.84,150 కోట్లతో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, రూ.67,500 కోట్లతో మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

నివేదికలో ఇతర ప్రధానాంశాలు

- గత ఏడాది ఈ టాప్-500 కంపెనీల నికర లాభం రూ.6.8 లక్షల కోట్లు
- రూ.74,088 కోట్లతో అత్యధిక నికర లాభం సాధించిన కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్
- 2023లో ఈ కంపెనీల సగటు అమ్మకాలు రూ.19,396 కోట్లు
- టాటా గ్రూప్‌లోని 15 కంపెనీల మార్కెట్ విలువ రూ.23,49,683 కోట్లు
- 2022తో పోలిస్తే జాబితా నుంచి 61 కంపెనీలు ఔట్
- 2023లో అత్యధికంగా రూ.2,92,319 కోట్ల వాల్యుయేషన్ పెంచుకున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్
- 500 కంపెనీల జాబితాలో అత్యధికంగా ఆర్థిక సేవల నుంచి 76 కంపెనీలు
- ముంబై నుంచి అత్యధికంగా 156 కంపెనీలకు చోటు
- టాప్-10 అన్‌లిస్టెడ్ కంపెనీల్లో మేఘా ఇంజనీరింగ్‌కు మూడో స్థానం
- 2023లో రూ.4 లక్షల కోట్ల విలువ కోల్పోయిన స్టార్టప్‌లు
- అదానీ గ్రూప్‌లోని ఎనిమిది కంపెనీల విలువ రూ.9.9 లక్షల కోట్లు
- జాబితాలోని 44 శాతం కంపెనీలు సేవలు, 56 శాతం కంపెనీలు వస్తూత్పత్తి కంపెనీలు.

విలువ పరంగా టాప్-10 హైదరాబాద్ కంపెనీలు

కంపెనీ	విలువ
దివీస్ ల్యాబ్స్	రూ.90,350 కోట్లు
డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్	రూ.84,150 కోట్లు
మేఘా ఇంజనీరింగ్	రూ.67,500 కోట్లు
అరబిందో ఫార్మా	రూ.50,470 కోట్లు
హెటిరో ల్యాబ్స్	రూ.24,100 కోట్లు
లారస్ ల్యాబ్స్	రూ.19,464 కోట్లు
సైయెంట్	రూ.17,600 కోట్లు
ఎంఎస్ఎన్ ల్యాబ్స్	రూ.17,500 కోట్లు
కిమ్స్ హాస్పిటల్స్	రూ.15,190 కోట్లు
దక్కన్ ఫైన్ కెమికల్స్	రూ.15,400 కోట్లు
సువెన్ ఫార్మా	రూ.14,360 కోట్లు
నాట్కో ఫార్మా	రూ.14,240 కోట్లు

భారత్‌లో టాప్ బిజినెస్ స్కూల్ ఐఎస్‌బీ

అంతర్జాతీయంగా 31వ ర్యాంకింగ్

హైదరాబాద్: దేశంలోని బిజినెస్ స్కూల్స్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) అగ్రస్థానంలో నిలిచింది. ఫైనాన్షియల్ టైమ్స్ (ఎఫ్‌టీ) గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్ 2024 విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడించింది. కాగా ప్రపంచంలోని అగ్రశ్రేణి బిజినెస్ స్కూల్స్‌లో ఐఎస్‌బీ 31వ ర్యాంకింగ్‌ను దక్కించుకుంది. గత ఏడాది ఐఎస్‌బీ 39వ స్థానంలో ఉండగా ఈసారి ఏకంగా 31 స్థానానికి దూసుకుపోయింది. మరోవైపు ఆసియాలోని టాప్ బీ స్కూల్స్‌లో 6 నుంచి 5వ స్థానానికి చేరుకుంది. రీసెర్చ్ పరంగా భారత్‌లో నంబర్‌వన్ ర్యాంకింగ్‌ను దక్కించుకోగా అంతర్జాతీయంగా 52వ స్థానంలో నిలిచింది.

స్పైస్‌జెట్‌లో 1,350 మంది ఔట్ !

న్యూఢిల్లీ: విమానయాన రంగంలోనూ కొలువుల కోత ప్రారంభమైంది. లో బడ్జెట్ క్యారియర్ స్పైస్‌జెట్ 1,000 నుంచి 1,350 మంది ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధమవుతోంది. ఎంతమందిని ఇంటికి పంపించాలనే విషయంపై ఈ వారంలోనే నిర్ణయం తీసుకుంటామని స్పైస్‌జెట్ అధికార వర్గాలు చెప్పాయి. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడాలంటే కొంత మంది ఉద్యోగులను ఇంటికి పంపించక తప్పదని స్పైస్‌జెట్‌కు చెందిన అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ తీసివేతలతో ఏటా కనీసం రూ.100 కోట్లు ఆదా అవుతాయని కంపెనీ భావిస్తోంది.

డిసెంబరు పారిశ్రామికోత్పత్తి 3.8 శాతం

న్యూఢిల్లీ: గనులు, విద్యుదుత్పత్తి రంగాల్లో ఉత్పత్తి తగ్గడంతో దేశంలో పారిశ్రామికోత్పత్తి గత ఏడాది డిసెంబరు నెలలో మందగించి 3.8 శాతంగా నమోదైంది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ఆధారితంగా మదింపు చేసే పరిశ్రమల ఉత్పత్తి 2022 డిసెంబరులో 5.1 శాతం ఉంది. అయితే ఏప్రిల్-డిసెంబరు నెలల మధ్య కాలంలో మాత్రం ముందు ఏడాదితో పోల్చితే ఐఐపీ వృద్ధి రేటు 5.5 శాతం నుంచి 6.1 శాతానికి పెరిగింది.

పేటీఎంపై పునరాలోచన లేదు

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్



న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై (పీపీబీఎల్) తీసుకున్న చర్య విషయంలో పునఃసమీక్షించే అవకాశం లేనేలేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. అన్ని కోణాల నుంచి ఎంతో ఆలోచించిన తర్వాతనే ఆ నిర్ణయం తీసుకున్నామని ఆయన చెప్పారు. ఆర్‌బీఐ ఏ ఫిన్‌టెక్ కంపెనీకి వ్యతిరేకం కాదని, ఆ రంగానికి మద్దతు ఇవ్వడంతో పాటు అది వేగంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన సహకారం అందిస్తుందని ఆయన అన్నారు. అదే సమయంలో డిపాజిటర్లు, కస్టమర్ల ప్రయోజనాలు కాపాడడం తమ ప్రధాన బాధ్యత అని దాస్ గుర్తు చేశారు. ఏ సంస్థ అయినా నియంత్రణలను పదేపదే ఉల్లంఘిస్తూ, ఎన్నిసార్లు హెచ్చరించినా తన వైఖరి మార్చుకోని సందర్భంలో మాత్రమే ఆర్‌బీఐ చర్యలకు పాల్పడుతుందని దాస్ స్పష్టం చేశారు. అన్ని కోణాల నుంచి పేటీఎం వ్యవహారాన్ని సమగ్రంగా పరిశీలించిన అనంతరం మాత్రమే తాము చర్య తీసుకున్నట్టు తెలిపారు. ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు 606వ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఫిబ్రవరి 29వ తేదీ నుంచి పీపీబీఎల్ ఎలాంటి డిపాజిట్లు స్వీకరించరాదని, కస్టమర్ ఖాతాలు, వ్యాలెట్లు, ఫాస్టాగ్‌లలో టాప్ అప్‌లు చేయరాదని ఆదేశిస్తూ గత నెల 31వ తేదీన ఆర్‌బీఐ నిషేధం విధించింది. పేటీఎంకు ఎన్నో సార్లు నిబంధనల ఉల్లంఘన విషయంలో హెచ్చరికలు చేశామని, అయినా అదే స్థితి కొనసాగుతూ ఉండడంతో చర్యకు పాల్పడక తప్పలేదని ఆ ప్రకటనలో స్పష్టంగా తెలియచేసింది. దీనిపై విలేకరుల ప్రశ్నలకు స్పందిస్తూ ఆ నిర్ణయానికి ఎలాంటి సడలింపులు ఇచ్చే అవకాశం ప్రస్తుతానికి లేదని అన్నారు.

త్వరలో ఎఫ్ఏక్యూల జారీ: తమ నిర్ణయం వల్ల అసౌకర్యానికి గురవుతున్న డిపాజిటర్లు, కస్టమర్లు, వ్యాలెట్ యూజర్లు, ఫాస్టాగ్ హోల్డర్లకు గల సందేహాలు తీర్చడం లక్ష్యంగా త్వరలో ఎఫ్ఏక్యూలు జారీ చేయనున్నట్టు దాస్ స్పష్టం చేశారు. కస్టమర్ల ప్రయోజనాలన్నింటినీ ఈ ఎఫ్ఏక్యూలలో పరిగణనలోకి తీసుకుంటామన్నారు. కస్టమర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నదే ఆర్‌బీఐ వైఖరి అని ఆయన చెప్పారు. అందుకే ఆ ఎఫ్ఏక్యూల్లో అన్ని రకాల వివరణలు ఉంటాయని ఆర్‌బీఐ గవర్నర్ దాస్ అన్నారు.

లాభాల స్వీకారంతో మార్కెట్ డౌన్

న్యూఢిల్లీ/ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన మిశ్రమ సంకేతాలతో పాటు మెటల్, బ్యాంకింగ్ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకారానికి దిగడంతో సోమవారం ఈక్విటీ మార్కెట్ నష్టాల్లోకి జారుకుంది. ట్రేడింగ్ ప్రారంభంలో అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తూ 71,756.58 పాయింట్ల ఇంట్రాడే గరిష్ఠ స్థాయిని తాకిన సెన్సెక్స్ లాభాల స్వీకారంతో 70,922.57 పాయింట్ల ఇంట్రాడే కనిష్ఠ స్థాయి వరకు కూడా దిగజారింది. చివరికి 523 పాయింట్ల నష్టంతో 771072.49 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని షేర్లలో 22 నష్టాల్లోనే ముగిశాయి. నిఫ్టీ కూడా 166.45 పాయింట్ల నష్టంతో 21,616.05 వద్ద క్లోజైంది.

బుల్లిష్ సెంటిమెంట్ డౌన్: నిఫ్టీ అవర్లీ (గంట గంటకు పరిస్థితిని తెలియచేసే) చార్టుల్లో కన్సాలిడేషన్ బ్రేక్‌డౌన్ కావడం మార్కెట్లో గూడుకట్టుకున్న నిరాశావాద వైఖరికి నిదర్శనమని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ టెక్నికల్ అనలిస్ట్ రూపక్ డే అన్నారు. అలాగే డెయిలీ చార్టుల్లో లోయర్ టాప్ ఏర్పడడం కూడా బుల్లిష్ సెంటిమెంట్ దిగజారిందనేందుకు సంకేతమని చెప్పారు.

చల్లారిన ధరల మంట

జనవరిలో ద్రవ్యోల్బణం 5.1% ● 3 నెలల కనిష్ఠం

న్యూఢిల్లీ: సగటు జీవికి ధరల మంట నుంచి జనవరిలో కొంత ఉపశమనం లభించింది. జనవరి నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా నమోదైంది. ఇది మూడు నెలల కనిష్ఠస్థాయి. కూరగాయలు, పళ్లు, ఇతర ఆహార వస్తువుల ధరలు అదుపులోకి రావడం ఇందుకు దోహదపడింది. గత ఏడాది అక్టోబరులో 4.9 శాతానికి దిగివచ్చిన తర్వాత రిటైల్ ద్రవ్యోల్బణం పెరుగుతూ డిసెంబరులో 5.69 శాతానికి చేరింది. కేంద్ర గణాంకాల కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం జనవరి నెలలో ఆహార ద్రవ్యోల్బణం డిసెంబరుతో పోల్చితే 9.53 శాతం నుంచి 8.3 శాతానికి దిగివచ్చింది. ప్రాంతాలవారీగా చూసినట్టయితే పట్టణ ప్రాంతాల్లో ధరల కాటు అధికంగా 9.02 శాతం ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో 7.91 శాతం ఉంది. గత ఏడాది జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,960 ▲	57,710 ▲	77,000 ▲
ముంబై	62,301 ▼	57,067 ▼	71,140 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ		విజయవాడ	533
హైదరాబాద్	545	విశాఖపట్నం	555
13వ తేదీ		వరంగల్	547
చిత్తూరు	588		
గోదావరి	533	దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	124	గోదావరి	129
వరంగల్	124	విజయవాడ	129
కరీంనగర్	124	గుంటూరు	129
మహబూబ్‌నగర్	124	ఒంగోలు	129
కర్నూలు	124	చిత్తూరు	133
విశాఖపట్నం	122		

స్పోర్ట్స్



రోడ్డు ప్రమాదంలో స్టార్ అథ్లెట్ కెల్విన్ దుర్మరణం

నైరోబీ: మారథాన్‌లో ప్రపంచ రికార్డు సృష్టించిన కెన్యా అథ్లెట్ కెల్విన్ కిప్టమ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం వెస్టర్న్ కెన్యాలో జరిగిన ఈ దుర్ఘటనలో 24 ఏళ్ల కెల్విన్‌తో పాటు కోచ్ హకిజిమన కూడా మరణించాడు. అలాగే వారితో ప్రయాణించిన యువతి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతోంది. ప్రమాద సమయంలో కారును కెల్విన్ నడుపుతున్నాడని, అతివేగం కారణంగానే వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొందని పోలీసులు తెలిపారు. గతేడాది అక్టోబరులో జరిగిన షికాగో మారథాన్ (35 కి.మీ)లో 2:00:35 సె. టైమింగ్‌తో కెల్విన్ చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో తన దేశానికే చెందిన ఎలియుడ్ కిప్చోగె (2:01:09) నెలకొల్పిన రికార్డును అధిగమించడం విశేషం. అలాగే ఇది తన ప్రొఫెషనల్ కెరీర్‌లో మూడో రేసు మాత్రమే. త్వరలో జరగబోయే పారిస్ ఒలింపిక్స్‌లోనూ కెల్విన్ స్వర్ణం సాధించగలడని భావించినా.. అంతలోనే ఈ ఘోర ప్రమాదం జరగడంతో క్రీడాలోకం దిగ్భ్రాంతికి లోనైంది.

ఆంధ్ర-యూపీ రంజీ డ్రా

విజయనగరం: ఆంధ్రప్రదేశ్-ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య జరిగిన రంజీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆటకు ఆఖరి రోజైన సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 271/5తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర 429/9 స్కోరు చేసింది. రికీ భుయ్ (129), రషీద్ (85), నితీష్ కుమార్ (53 నాటౌట్) రాణించారు. సౌరభ్ కుమార్ 5 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 261 పరుగులు చేయగా.. యూపీ 198 రన్స్‌కు ఆలౌటైంది. మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకొన్న ఆంధ్రకు 3 పాయింట్లు, యూపీకి ఒక పాయింట్ లభించాయి. గ్రూప్-బిలో ఆడిన ఆరు మ్యాచ్‌ల నుంచి 3 విజయాలతో 25 పాయింట్లు సాధించిన ఆంధ్ర పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉంది.

15 స్థానాలు కిందికి...

ఫిఫా ర్యాంకుల్లో మన స్థానం 117

న్యూఢిల్లీ: ఆసియా కప్‌లో పేలవ ప్రదర్శన.. భారత ఫుట్‌బాల్ జట్టు ర్యాంకింగ్స్‌ను తీవ్రంగా ప్రభావితం చేసింది. తాజాగా విడుదల చేసిన ఫిఫా ర్యాంకుల జాబితాలో భారత్ 15 స్థానాలు దిగజారి 117వ స్థానంలో నిలిచింది. 2017 తర్వాత టీమిండియా ర్యాంక్ ఇంతగా పతనం కావడం ఇదే తొలిసారి. ఆసియాకో ఎ లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచుల్లోనూ భారత్ ఓటములను చవిచూసింది. అంతేకాకుండా ఒక్క గోల్ కూడా నమోదు చేయలేదు. దీంతో మొత్తం 35.57 పాయింట్లను కోల్పోవాల్సి వచ్చింది.

నిరుడు ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరపున ధనాధన్ బ్యాటింగ్‌తో దేశ వ్యాప్తంగా క్రేజ్ దక్కించుకున్న తిలక్ వర్మ అంతర్జాతీయ క్రికెట్‌లోనూ సత్తా చాటుతున్నాడు. దేశం తరపున టెస్టు క్రికెట్ ఆడేందుకు ఉవ్విళ్లూరుతున్నానని, అదే జరిగితే తన కల సాకారం అయినట్టేనని చెబుతున్న తిలక్ వర్మ ప్రస్తుతం రంజీల్లో బిజీగా ఉన్నాడు. అవమానకర రీతిలో ప్లేట్ స్థాయికి దిగజారిన హైదరాబాద్‌ను తన కెప్టెన్సీలో మళ్లీ ఎలిట్ స్థాయికి తీసుకెళ్లిన తిలక్.. జట్టుకు రంజీ ట్రోఫీని సైతం అందిస్తానని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపాడు. తిలక్ ఇంకా ఏమన్నాడో అతని మాటల్లోనే తెలుసుకుందాం..



ఆ అవకాశం కోసం శ్రమిస్తా!

తిలక్ వర్మ

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

ఎందరో దిగ్గజ క్రికెటర్లు ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్ జట్టు రంజీ ట్రోఫీ ఎలిట్ గ్రూప్‌లో స్థానం కోల్పోయినప్పుడు నాతో పాటు జట్టులోని అందరం తీవ్ర నిరాశకు లోనయ్యాం. ప్లేట్ గ్రూప్‌లోని జట్లతో ఏ విధంగా ఆడాలనే దానిపై రంజీ ట్రోఫీ ప్రారంభానికి ముందు చర్చించుకున్నాం. కేవలం విజయాలు సాధిస్తే సరిపోదు, ప్రతి మ్యాచ్‌లోనూ మన జట్టులో వచ్చిన మార్పును ప్రస్ఫుటంగా తెలియజేయాలనుకున్నాం. దీనిని ఒక సవాల్‌గా తీసుకొని బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడింట్లోనూ మా అత్యుత్తమ ఆటను ప్రదర్శించాం. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ 2-3 రోజుల్లోనే విజయం సాధించాం. రంజీ ప్లేట్ గ్రూప్ ఫైనల్లో గెలిచాక హైదరాబాద్ కథ మారనుంది. జట్టుకు రంజీ ట్రోఫీని అందించేదాకా విశ్రమించను.

టెస్టులు ఆడేందుకు ఎదురు చూస్తున్నా..

రెడ్‌బాల్ ఫార్మాట్ అంటే బాగా ఇష్టం. ఇందులో రాణించడంతోనే నాకు టీ20, వన్డే ఫార్మాట్లలో అవకాశాలు దక్కాయి. రెడ్ బాల్ ఫార్మాట్‌లో ప్రస్తుతం మంచి స్కోర్లు సాధిస్తున్నా. ఇలాగే నిలకడగా రాణిస్తే త్వరలో భారత టెస్టు జట్టులోనూ స్థానం లభించవచ్చు. వైట్ జెర్సీ వేసుకునేందుకు ఆత్రుతగా ఎదురు చూస్తున్నా. టెస్టు జట్టులో అవకాశం వస్తే నాకల సాకారమైనట్టే. ఆ అవకాశం వచ్చే వరకు తీవ్రంగా శ్రమిస్తా.

ముంబై ఫార్ములా..

వేలాది మంది అభిమానుల కోలాహలం నడుమ, కిక్కిరిసిన స్టేడియాల్లో, ఐపీఎల్ మ్యాచుల్లో ఆడడం భిన్నమైన అనుభూతి. అలాంటి సమయాల్లో ఒత్తిడికి లోనుకాకుండా ఎలా ఆడాలో ముంబై ఇండియన్స్ డ్రెస్సింగ్ రూమ్‌లో పాఠాలు నేర్చుకున్నా. ఆటలో జట్టు క్లిష్టమైన పరిస్థితిలో ఉన్నప్పుడు సమష్టిగా ఎలాంటి వ్యూహాలు అమలు చేయాలి, ప్రత్యర్థిపై ఎలా పైచేయి సాధించాలనే విషయాల్లో నేను గడించిన అనుభవాన్ని ఇప్పుడు హైదరాబాద్ జట్టుకు ఉపయోగిస్తున్నా. అవి సత్ఫలితాలను ఇస్తున్నాయి.

సీనియర్ల మద్దతు అమోఘం

సీనియర్లతో కలిసి టీమిండియా, ఐపీఎల్‌లోని ముంబై ఇండియన్స్ జట్ల డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకోవడం నా జీవితంలోని మధురమైన ఘట్టాల్లో ఒకటి. ఆటలో కఠినమైన పరిస్థితులు ఎదురైనప్పుడు సీనియర్లు ఇచ్చిన సలహాలు, సూచనలు అమోఘం. ఐపీఎల్‌లో ఆడుతున్నప్పుడు కొందరు విదేశీ ప్లేయర్లు కూడా బాగా ప్రోత్సహించారు.

బ్రెజిల్‌కు షాక్

అర్జెంటీనాకు ఒలింపిక్ బెర్త్



కారకాస్: డిఫెండింగ్ చాంపియన్ బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టు ఈ ఏడాది పారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. చివరి నాలుగు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన ఈ టీమ్‌ను అర్జెంటీనా దెబ్బకొట్టింది. దక్షిణ అమెరికా క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బ్రెజిల్‌ను 1-0తో ఓడించింది. దీంతో అర్జెంటీనాకు పారిస్ బెర్త్ దక్కగా.. టోక్యో గేమ్స్‌లో స్వర్ణం సాధించిన బ్రెజిల్ ఇంటిముఖం పట్టింది. అండర్-23 విభాగాలకు చెందిన ఫుట్‌బాల్ జట్లే ఒలింపిక్స్‌లో పాల్గొంటాయి. 2004 తర్వాత తొలిసారి బ్రెజిల్ సాకర్ టీమ్ లేకుండా ఒలింపిక్స్ జరుగనున్నాయి. అటు 2004, 2008 ఈవెంట్స్‌లో అర్జెంటీనా స్వర్ణాలు సాధించింది.

రాజ్‌కోట్ చేరిన ఇంగ్లండ్ జట్టు

రాజ్‌కోట్: రెండో టెస్టు ముగిశాక సుదీర్ఘ విరామం లభించడంతో ఇంగ్లండ్ జట్టు అబుధాబికి వెళ్లింది. వారం రోజులపాటు అక్కడి తమ శిబిరంలో సేద తీరడంతో పాటు క్రికెటర్లు గోల్ఫ్ సైతం ఆడారు. అయితే ఈనెల 15 నుంచి జరిగే మూడో టెస్టు కోసం స్టోక్స్ సేన తిరిగి భారత్‌లో అడుగుపెట్టింది. సోమవారం సాయంత్రం వీరంతా రాజ్‌కోట్‌కు చేరుకున్నారు. అలాగే మంగళవారం నుంచి ఇక్కడి ఎస్‌సీఏ స్టేడియంలో సాధన ఆరంభించనుంది.

విరాట్ దూరం కావడం సిరీస్‌కే అవమానం



కేప్‌టౌన్: విరాట్ కోహ్లీ దూరం కావడంతో.. ఇంగ్లండ్ టెస్టు సిరీస్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆ జట్టు మాజీ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ అభిప్రాయపడ్డాడు. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లండ్ మధ్య తొలి రెండు మ్యాచ్‌లు ఎంతో రసవత్తరంగా జరిగాయన్నాడు. 'ఈ రెండుజట్ల మధ్య నేను చూసిన సిరీస్‌ల్లో ఇదే ఎంతో పోటాపోటీగా సాగుతోంది. రెండో టెస్టులో నెగ్గిన భారత్ సిరీస్ సమం చేసినా.. ఇంగ్లండ్ దూకుడైన ఆటతో అదరగొడుతోంది. కానీ, ఈసారి కోహ్లీ లేకపోవడం సిరీస్, క్రికెట్‌కు అవమానమ'ని బ్రాడ్ అన్నాడు.

మూడో టెస్టుకు రాహుల్ దూరం





దేవ్‌దత్‌కు చోటు

రాజ్‌కోట్: ఇంగ్లండ్‌తో మూడో టెస్టు ఆరంభానికి ముందే భారత జట్టుకు ఝలక్ తగిలింది. స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ మోకాలి గాయంతో ఈ మ్యాచ్‌కు కూడా దూరమయ్యాడు. అతడి స్థానంలో తొలిసారిగా దేవ్‌దత్ పడిక్కళ్‌ను జట్టులోకి తీసుకున్నారు. రాహుల్ తొడ కండరాల నొప్పితో రెండో టెస్టులోనూ ఆడలేకపోయాడు. ఇటీవల మిగిలిన మూడు టెస్టుల కోసం ప్రకటించిన జట్టులో రాహుల్ పేరును చేర్చినా.. అతడి ఫిట్‌నెస్ బట్టి నిర్ణయం తీసుకుంటామని సెలెక్టర్లు తెలిపారు. దీనికి తగ్గట్టుగానే ఫిట్‌నెస్ టెస్టులో రాహుల్ విఫలమైనట్టు బోర్డు మెడికల్ టీమ్ తెలిపింది. వారం తర్వాత రాహుల్‌కు మరోసారి పరీక్ష నిర్వహిస్తారు. కోహ్లీ వ్యక్తిగత కారణాలతో సిరీస్‌కు దూరమవగా.. తాజాగా రాహుల్ గైర్హాజరీ ప్రభావం బ్యాటింగ్ ఆర్డర్‌పై పడనుంది. ఇక, తొడకండరాల నొప్పితోనే బాధపడుతున్న ఆల్‌రౌండర్ జడేజా ఫిట్‌నెస్ విషయంలోనూ స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుత రంజీ ట్రోఫీలో కర్ణాటక బ్యాటర్ పడిక్కళ్ పరుగుల వరద పారిస్తున్నాడు. తానాడిన నాలుగు మ్యాచుల్లో 3 సెంచరీలతో అతను 556 పరుగులు సాధించడం విశేషం.

భరత్ స్థానంలో ధ్రువ్?: ఇంగ్లండ్‌తో జరిగిన రెండు టెస్టుల్లో విఫలమైన వికెట్ కీపర్ కేఎస్ భరత్‌పై వేటు పడేలా ఉంది. ఈనెల 15 నుంచి రాజ్‌కోట్‌లో జరిగే మూడో టెస్టులో అతడి స్థానంలో ధ్రువ్ జురెల్‌కు బెర్త్ దక్కవచ్చు. కారు ప్రమాదంతో రిషభ్ పంత్ జట్టుకు దూరమైనప్పటి నుంచి భరత్ కీపర్‌గా కొనసాగుతున్నాడు. అయితే కీపింగ్ విషయంలో తను చురుగ్గానే ఉంటున్నా బ్యాటింగ్ వైఫల్యం మేనేజ్‌మెంట్‌కు ఆందోళన కలిగిస్తోంది. ఆడిన ఏడు టెస్టుల్లో కనీసం అర్ధసెంచరీ సాధించలేకపోగా సగటు 20.09గా ఉంది. దీంతో యువ కీపర్ జురెల్‌ను ప్రోత్సహించే అవకాశం ఎక్కువగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

పతకంపైనే గురి





బరిలో భారత పురుషులు, మహిళల జట్లు

నేటినుంచి ఆసియా టీమ్ బ్యాడ్మింటన్

షా ఆలమ్ (మలేసియా): బ్యాడ్మింటన్ ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ మంగళవారం ఇక్కడ మొదలవనుంది. పారిస్ ఒలింపిక్స్‌కు కీలకమైన పాయింట్లు లభించనుండడంతో టాప్ స్టార్లంతా ఈ టోర్నీ బరిలో దిగుతున్నారు. ఈ టోర్నీలో 2016, 2018లో కాంస్యాలు గెలిచిన భారత పురుషుల జట్టు.. ఈసారి పతకం రంగు మార్చాలన్న పట్టుదలతో ఉంది. హెచ్ఎస్ ప్రణయ్ సారథ్యంలోని లక్ష్యసేన్, కిడాంబి శ్రీకాంత్, డబుల్స్ స్టార్లు సాత్విక్, చిరాగ్ తదితరులతో కూడిన భారత జట్టు గ్రూప్ 'ఎ'లో బలమైన చైనా, హాంకాంగ్ జట్లతో తలపడనుంది. ఇప్పటిదాకా పతకమే సాధించని భారత మహిళల బృందం.. ఈసారైనా ఆ లోటును భర్తీ చేయాలన్న లక్ష్యంతో ఉంది. పీవీ సింధు ఆధ్వర్యంలో భారత మహిళల జట్టు గ్రూప్ 'డబ్ల్యూ'లో తలపడుతోంది. ఈ గ్రూపులో భారత్, చైనా మాత్రమే ఉండడంతో.. మనకు ఇప్పటికే నాకౌట్ బెర్త్ ఖాయమైంది. సింగిల్స్‌లో సింధుతో పాటు అన్మోల్, తన్వీ శర్మ, అష్మిత, డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా, అశ్విని/తనీషా ఆడనున్నారు. గాయంతో గతేడాది అక్టోబరు నుంచి ఆటకు దూరంగా ఉన్న సింధు ఈ టోర్నీ ద్వారా ఫామ్‌లోకి రావాలనుకుంటోంది. బుధవారం జరిగే తొలి పోరులో హాంకాంగ్‌తో భారత పురుషుల జట్టు.. చైనాతో సింధు బృందం తలపడతాయి.

ఐసీసీ అండర్-19జట్టులో ఉదయ్, సచిన్

బెనోని (సౌతాఫ్రికా): ఐసీసీ అండర్-19 వరల్డ్‌కప్ జట్టులో నలుగురు భారత ఆటగాళ్లకు చోటు దక్కింది. సోమవారం ప్రకటించిన టీమ్ ఆఫ్ టోర్నీలో టీమిండియా కెప్టెన్ ఉదయ్ సహరన్, సచిన్ దాస్‌తోపాటు ముషీర్ ఖాన్, స్పిన్నర్ సౌమీ పాండేలు స్థానం సంపాదించారు. ప్రపంచకప్ విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టు కెప్టెన్ హగ్ వీబ్జెన్‌ను ఐసీసీ ప్యానెల్ ఈ టీమ్‌కు కూడా సారథిగా ఎంపిక చేసింది. టోర్నీలో అదరగొట్టిన సౌతాఫ్రికా పేసర్ క్వెనా మఫాకాకు కూడా చోటు లభించింది.

మీ ఏజెంట్ల తట్టాబుట్టా సర్ది పంపిస్తాం


- అధికారులతో తప్పులు చేయించింది మీరే
- కేసీఆర్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్



హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): "రిటైర్ అయిన తర్వాత కూడా మురళీధర్ ఈఎన్సీగా పని చేశారు. అప్పటి సీఎం కేసీఆర్‌కు ఏజెంటులా మారి అడ్డగోలుగా ప్రాజెక్టుల్లో అవినీతికి పాల్పడ్డారు. రాష్ట్రానికి నష్టం కలిగేలా వ్యవహరించారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించినట్లు మీ ఏజెంటుతో మాట్లాడించి, ఆ వీడియో, ఆడియోలను సభలో చూపించి.. ప్రభుత్వాన్ని బద్‌నాం చేస్తారా?" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. శాసన సభలో ప్రాజెక్టులపై చర్చ సందర్భంగా భట్టి మాట్లాడుతూ తెలంగాణకు నష్టం కలిగించి, కేసీఆర్‌కు ఏజెంటులా పనిచేసినందుకే మురళీధర్ తట్టాబుట్టా సర్ది పంపించేశామని వ్యాఖ్యానించారు. మరి కొందరు కూడా కేసీఆర్‌కు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని, వారినీ త్వరలోనే పంపిస్తామని చెప్పారు. తాము అధికారులపై నెపం నెట్టడంలేదని... అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు అధికారులతో తప్పులు చేయించారని విమర్శించారు. రాష్ట్రానికి జీవన్మరణ సమస్యగా మారిన ప్రాజెక్టుల అంశంపై అసెంబ్లీలో చర్చ జరుగుతుంటే.. మాజీ ముఖ్యమంత్రి సభకు రావాలి కదా? చర్చలో పాల్గొనాలి కదా? ప్రతి పక్ష నేత సభలో లేకుండా... ఎక్కడెక్కడో తిరిగితే ఎలా? అని ప్రశ్నించారు. తమతో కలిసి ఢిల్లీకి వస్తారా? లేదా? స్మిత సబర్వాల్ లేఖ రాశారా? లేదా? తీర్మానానికి మద్దతిస్తారా? లేదా? చెప్పాలని నిలదీశారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు సరిదిద్దడానికి నెల రోజులుగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చస్తా ఉన్నారని అన్నారు.

నీళ్ల కోసమే తెలంగాణ ఉద్యమం

నీళ్ల కోసమే తెలంగాణ ఉద్యమం పుట్టిందని, కాంగ్రెస్ కూడా నీళ్ల కోసమే ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ అన్నారు. గోదావరి జలాలు కొన్ని సముద్రంలో కలుస్తున్న విషయం నిజమే అయినప్పటికీ... ఇప్పుడు ముందున్న కర్తవ్యం కృష్ణా జలాల్లో వాటాను కాపాడుకోవటమేనన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ టెండర్ల దశలో ఉన్నపుడే అపెక్స్ కమిటీకి ప్రభుత్వ వైఖరిని వివరిస్తే సరిపోయేదని, టెండర్లు పూర్తయి పనులు జరగటానికి పరోక్షంగా కేసీఆర్ సహకరించారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులు, వాటిలో అవినీతిపై చర్చకు సిద్ధమంటే... సభ మరి కొద్దిరోజులు నడపడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ హక్కుల కోసం ఢిల్లీతో పోరాడటానికి బీఆర్ఎస్ కలిసి రావాలని కోరారు. అసెంబ్లీకి హాజరుకాకుండా... రాజకీయం చేయటానికే నల్లగొండ సభకు కేసీఆర్ వెళ్తున్నారని విమర్శించారు.



వైఎస్సార్ హయాంలోనే సమస్యకు బీజం

- పదేళ్ల పాటు బీఆర్ఎస్ మౌనంగానే ఉంది: కూనంనేని



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆనాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే పోతిరెడ్డిపాడును 11 వేల క్యూసెక్కుల నుంచి 44 వేలకు పెంచినప్పుడే నదీ జలాల సమస్యకు బీజం పడిందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై పదేళ్ల నుంచి బీఆర్ఎస్ మౌనంగానే ఉందని విమర్శించారు. శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. '2014 విభజన చట్టంలోనే ప్రాజెక్టుల అప్పగింతపై నిబంధనలున్నాయి. అనాడే టీఆర్ఎస్ గట్టిగా వ్యతిరేకించాల్సింది. వైఎస్సార్ 44 వేల క్యూసెక్కులకు పెంచితే జగన్ 96 వేల క్యూసెక్కులకు పెంచారు..? దీనిపై గత ప్రభుత్వం ఎందుకు మౌనం వహించింది. రాయలసీమ ప్రాజెక్టు 66 శాతం నిర్మాణం పూర్తయ్యాక గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పుతో ఆగిందే తప్ప గత ప్రభుత్వం చేసిందేమీ లేదు' అని పేర్కొన్నారు.

యాదాద్రి ప్లాంట్‌పై 'ఆంధ్రజ్యోతి' హెడ్డింగ్ చూశా

- మంత్రి కోమటిరెడ్డిని ఉద్దేశిస్తూ హరీశ్‌రావు వ్యాఖ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కేఆర్ఎంబీపై అసెంబ్లీలో నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం బీఆర్ఎస్ తరఫున మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించబోమంటున్న ప్రభుత్వం తీర్మానంపై ఇంకా అభ్యంతరాలున్నాయని హరీశ్ అనగా, ఆయన ప్రసంగాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనిపై హరీశ్ స్పందిస్తూ.. "ఆంధ్రజ్యోతి' హెడ్డింగ్ చూశా.. మీదే కదా" అని అన్నారు. బీపీ లేసినట్లుంది గోలీలేసుకుని రా అంటూ కోమటిరెడ్డిని ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. కాగా, యాదాద్రి థర్మల్ కేంద్రం పనులపై 'మాకేంటి' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాజకీయ క్రీనీడ పడి మార్చిలో జరగాల్సిన రెండు ప్లాంట్ల ప్రారంభోత్సవంలో అనివార్య జాప్యం నెలకొందని అందులో ఉంది. గత ప్రభుత్వం తరహాలోనే తమతోనూ 'వ్యవహారాలు' జరపాలని డిమాండ్ చేస్తుండడంతో నాలుగు నెలలుగా రూ.2వేల కోట్ల బిల్లులూ పెండింగ్ పడి కాంట్రాక్టు సంస్థలు లబోదిబో అంటున్నాయని పేర్కొంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే హరీశ్ వ్యాఖ్యలు చేశారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కేసీఆర్

- ప్రతిపక్ష నేత అయ్యుండి చర్చకు రారా?: మల్లు రవి

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి మల్లు రవి మండిపడ్డారు. అసెంబ్లీలో కృష్ణా జలాల గురించి చర్చ జరుగుతుంటే ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యుండి.. ఆయన హాజరు కాక పోవడం ప్రజలను అవమానించడమేనన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్రానికి కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతపై ప్రజల్ని తప్పుదోవ పట్టించాలని చూసిన కేసీఆర్‌ను ఎవరూ నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను నెరవేర్చిన సోనియాగాంధీ లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి నుంచే పోటీ చేయాలని టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి కోరారు. ఆమెను తెలంగాణ నుంచి పోటీ చేయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేయాలని ఓ ప్రకటనలో కోరారు.

కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేది లేదు

- తెలంగాణ, ఏపీ మధ్య నీటి వాటా తేలేదాకా ఒప్పుకోం
- అసెంబ్లీలో సర్కారు తీర్మానం... ఏకగ్రీవంగా ఆమోదం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నీటి వాటాలు తేలే దాకా కృష్ణా ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు అప్పగించేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈమేరకు శాసనసభలో సోమవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రభుత్వ తీర్మాన కాపీని అసెంబ్లీలో చదివి వినిపించారు. "దక్షిణ తెలంగాణలో తాగు, సాగు నీటికి కృష్ణా జలాలే ప్రాణాధారం. గతంలో బచావత్ ట్రిబ్యునల్ అవార్డు మేరకు 811 టీఎంసీల నీటిని గంపగుత్తగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. దీంతో గత ప్రభుత్వాలు ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా నీటిపారుదల సామర్థ్యాన్ని గణనీయంగా సృష్టించాయి. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత కృష్ణా బేసిన్ అవసరాలకు గత ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు. తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి కేసీఆర్ సర్కారు అంగీకరించింది. పునర్విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య నీటి భాగస్వామ్యాన్ని నియంత్రించేందుకు కృష్ణా బోర్డు(కేఆర్ఎంబీ)ను ఏర్పాటు చేశారు. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్‌ను కూడా కేఆర్ఎంబీకే అప్పగించాలని కేసీఆర్ సర్కారు ప్రతిపాదించింది. ఇది తెలంగాణ ప్రయోజనాలకు పూర్తిగా విఘాతం కలిగించడమే. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కూడా కేఆర్ఎంబీ అధికార పరిధిని నోటిఫై చేసింది. దీనిపై గత ప్రభుత్వం ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. గత ఏడాది నవంబరు 29న రాత్రి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాయుధ పోలీసులను పంపి, బలవంతంగా సాగర్ డ్యామ్ కుడివైపు భాగాన్ని స్వాధీనం చేసుకుంది. అప్పటి వరకు సాగర్ డ్యామ్ తెలంగాణ ఆధీనంలో ఉంది. ఈ ఘటన తర్వాత కేంద్రం రంగంలోకి దిగి సీఆర్పీఎఫ్ బలగాలను మోహరించి, ఏపీ పోలీసులను వెనక్కి పంపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన షరతులను పట్టించుకోని పక్షంలో కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించేది లేదు. పరీవాహక ప్రాంతం, కరువు పీడిత ప్రాంతం, బేసిన్ జనాభా, సాగు చేయదగిన ప్రాంతాల ఆధారంగా ఏపీ, తెలంగాణ మధ్య నీటి భాగస్వామ్యం ఉండాలి. నాగార్జున సాగర్‌కు 264 టీఎంసీల నీటిని కేటాయించేందుకే 1962లో శ్రీశైలం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టును ప్రణాళిక సంఘం మంజూరు చేసింది. కృష్ణా వాటర్ డిస్ప్యూట్-1 అవార్డు ప్రకారం శ్రీశైలం రిజర్వాయర్ అవుట్ సైడ్ బేసిన్‌కు 34 టీఎంసీలు (చెన్నై నీటి అవసరాలకు 15 టీఎంసీలు, మరో 19 టీఎంసీలు ఎస్ఆర్‌బీసీకి) మాత్రమే కేటాయించారు. మొత్తం వినియోగంలో 20శాతం తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలి. కేంద్ర జల సంఘం ఆమోదిస్తే తప్ప కృష్ణా జలాలను బయట బేసిన్‌కు మళ్లించేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదు" అని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. అనంతరం ఈ అంశంపై చర్చ జరిగింది. ఈ తీర్మానానికి సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

పదేళ్లలోనే ఎక్కువ నష్టం

(మొదటిపేజీ తరువాయి)



గత పదేళ్లలోనే తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగింది. ప్రాజెక్టుల నిర్మాణంలో గత పదేళ్లలో జరిగినంత అవినీతి.. స్వతంత్ర భారతదేశంలోనే జరగలేదు. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి గంపగుత్తగా 811 టీఎంసీలు కేటాయించింది. అయితే పరివాహక ప్రాంతం, కరువు పీడిత ప్రాంతాలు, బేసిన్ వెంట నివసిస్తున్న జనాభా, సాగు ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకొని 65 శాతం నుంచి 70 శాతం నీటి వాటాకు పట్టుబట్టాల్సి ఉండగా.. 2015లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీలను పంచుకోవడానికి వీలుగా కేసీఆర్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. 1983లో తెలుగు గంగ ప్రాజెక్టుకు తాగునీటి కోసం నీటిని తరలించడానికి వీలుగా 11 వేల క్యూసెక్కులతో పనులు జరిగాయి. అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 44 వేల క్యూసెక్కులను తరలించేలా విస్తరించారు. అయితే విభజిత ఏపీకి వైఎస్ జగన్ సీఎం అయ్యాక కేసీఆర్ ఆమోదంతో 92,500 క్యూసెక్కులను తరలించేలా పనులు జరిగాయి. అంతేకాకుండా రోజుకు 3 టీఎంసీల నీటిని తరలించే రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం ఫ్లడ్ లైట్ల వెలుగులతో జరిగింది. ముచ్చుమర్రి నుంచి 5600 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 1000 క్యూసెక్కులు, 6300 క్యూసెక్కులతో మల్యాల వంటివన్నీ కేసీఆర్ మౌనాంగీకారంతోనే జరిగాయి" అని ఆరోపించారు.

కేసీఆర్ నేతృత్వంలో శాశ్వత నష్టం..

2004 నుంచి 2014 దాకా 10,665 టీఎంసీల వరద శ్రీశైలానికి రాగా.. ఆ కాలంలో 727 టీఎంసీలను పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి నుంచి తరలించారని ఉత్తమ్ చెప్పారు. 2014-15 నుంచి 2023-24 (నవంబరు 2వ తేదీ 2024) వరకు శ్రీశైలానికి 8,993 టీఎంసీల వరద వస్తే.. పోతిరెడ్డిపాడు, మల్యాల, ముచ్చుమర్రి నుంచి 1201 టీఎంసీలు తీసుకెళ్లారని వివరించారు. 2015లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీ 512 టీఎంసీలు తరలించడానికి కేసీఆర్ నేతృత్వంలో తీసుకున్న నిర్ణయం రాష్ట్రానికి శాశ్వతంగా నష్టం చేసిందని ఆరోపించారు. తెలంగాణలో అప్పటికే ఉన్న ప్రాజెక్టులకు 225 టీఎంసీల నీటి వినియోగం ఉండగా.. మరో ఏడు ప్రాజెక్టులకు 206 టీఎంసీల జలాలు అవసరం ఉండేదని గుర్తు చేశారు. అయితే 299 టీఎంసీలే అడిగి.. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీశారని ఆక్షేపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులతోపాటు నిర్మాణంలో ఉన్నవి, నిర్మాణం చేపట్టదలిచిన ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల బాధ్యతను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు బాధ్యతలు అప్పగించారని గుర్తు చేశారు. అయితే 2015లో చేసుకున్న ఒప్పందాన్ని పలు వేదికల్లో ఏపీ చూపించిందని పేర్కొన్నారు.

జగన్, కేసీఆర్ ఒప్పందాలతో ఏపీలో ప్రాజెక్టులు..

ఏపీ సీఎం జగన్, తెలంగాణ అప్పటి సీఎం కేసీఆర్ కలిసి బిర్యానీలు తిని.. ఏకాంత చర్చలు జరిపిన ఫలితంగానే శ్రీశైలం బ్యాక్‌వాటర్‌పై ఏపీ ప్రాజెక్టుల నిర్మాణానికి అంగీకారం కుదిరిందని ఉత్తమ్ ఆరోపించారు. 2019 మే 25న, 2020 జనవరి 13న ప్రగతిభవన్‌లో జగన్, కేసీఆర్ సమావేశమయ్యారని, అప్పుడు తీసుకున్న నిర్ణయాల ఫలితంగానే శ్రీశైలంలో 797 అడుగుల నుంచి నీటిని తరలించేలా 2020 మే 5న రాయలసీమ ఎత్తిపోతల పథకం జీవో నెం.203 విడుదలయిందని తెలిపారు. 2014 దాకా శ్రీశైలం నుంచి 47,850 క్యూసెక్కులను తరలించగా.. కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో 1,11,400 క్యూసెక్కుల నీటిని తరలించేలా సామర్థ్యం పెరిగిందన్నారు. మొత్తంగా రోజుకు 9.6 టీఎంసీలు, ఏకంగా నదినంతా మళ్లించేలా పనులు జరగాయని ఆరోపించారు. ఇక 2020 ఆగస్టు 5న రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరగాల్సి ఉండగా.. సరిగ్గా రాయలసీమ ఎత్తిపోతల పథకం టెండర్లు ఆగస్టు 10న తెరుచుకునే అవకాశం ఉండడంతో ఆగస్టు 20వ తేదీ తర్వాత సమావేశం పెట్టాలని తెలంగాణ లేఖ రాసిందని ఆక్షేపించారు. సమావేశం జరిగితే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఎక్కడ ఆపేయాల్సి వస్తుందోననే కారణంతోనే వాయిదా కోరిందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆ పథకానికి అంగీకారం తెలిపిందన్నారు. రేవంత్‌రెడ్డి చొరవతో రాయలసీమ ఎత్తిపోతలపై కేసులు వేయడం జరిగిందన్నారు. ఇక పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2013 ఆగస్టు 8న పరిపాలన పరమైన అనుమతి ఇవ్వగా.. రూ.27,500 కోట్లు వెచ్చించినా ఒక్క ఎకరా ఆయకట్టును కూడా సృష్టించలేదని ఉత్తమ్ ఆక్షేపించారు. చిత్తశుద్ధి లేనందువల్లే పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తికాలేదని విమర్శించారు. ట్రిబ్యునల్ నీటి పంపిణీ చేపట్టేదాకా 66:34 నిష్పత్తికి కేసీఆర్ రెండో అపెక్స్ కౌన్సిల్‌లోనే ఆమోదం తెలిపారన్నారు. 2021 జూలై 15న ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాలనే జీవో రాగా.. అప్పగింత ప్రక్రియను బీఆర్ఎస్ ముందుకు తీసుకెళ్లిందని ఆరోపించారు. 2023-24 బడ్జెట్ పద్దులో కృష్ణాలో శ్రీశైలం, సాగర్‌తోపాటు దాని పరిధిలో ఉన్న కాంపోనెంట్లు, గోదావరి పరిధిలో పెద్దవాగు కామన్ ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించి, సీడ్‌మనీగా చెరో రూ.200 కోట్లను అప్పగించనున్నట్లు గత ప్రభుత్వం చెప్పిందన్నారు.

కేసీఆర్ ఓడిపోతాడని తెలిసే సాగర్ ఆక్రమణ..

తెలంగాణలో కేసీఆర్ ఓడిపోతున్నారని తెలిసి, ఇద్దరు సీఎంల అనుబంధంతో పోలింగ్‌కు ఒకరోజు ముందు నాగార్జున సాగర్‌పైకి 500 మంది పోలీసులను జగన్ పంపించారని ఉత్తమ్ ఆరోపించారు. నాటి నుంచి నేటి దాకా సాగర్ ఆక్రమణపై కేసీఆర్ ఒక్క మాట కూడా మాట్లాడలేదని గుర్తు చేశారు. దీనిని గుర్తించి.. కేంద్రం డిసెంబరు 1న (కేసీఆర్ సీఎంగా, హరీశ్‌రావు ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు) సీఆర్పీఎఫ్‌ను పంపించిందని తెలిపారు. కృష్ణా ప్రాజెక్టులను అప్పగించేదాకా యథాతథ స్థితిని కొనసాగించాలని తెలంగాణ సీఎంవో కార్యదర్శి, నీటిపారుదల శాఖ ఇన్‌చార్జి కార్యదర్శి స్మితా సబర్వాల్ లేఖ రాశారని గుర్తు చేశారు. కాగా, జనవరి 17న ఢిల్లీలో జరిగిన సమావేశంలో ప్రాజెక్టులను అప్పగించడానికి అంగీకరించామనే మాటల్లో వాస్తవం లేదని, మినిట్స్‌పై ఎలాంటి సంతకాలు చేయలేదని స్పష్టం చేశారు. కృష్ణా జలాలను ఏపీ దొంగిలించడానికి ప్రత్యక్ష సహకారం అందించిన కేసీఆర్.. నల్లగొండకు వెళ్లేముందు క్షమాపణ చెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. ఇక కృష్ణా ప్రాజెక్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ అప్పగించే ప్రసక్తే లేదన్నారు. కాగా, కృష్ణా జలాలను ఏపీకి తరలించడానికి కేసీఆర్ అందించిన సహకారంపై ఏపీ శాసనసభలో సీఎం జగన్ చేసిన ప్రసంగం క్లిప్‌ను తెలంగాణ శాసనసభలో ప్రభుత్వం ప్రసారం చేసింది. "తెలంగాణ నుంచి కిందికి వారు వదిలితే తప్ప కృష్ణా జలాలు రాలేని పరిస్థితి ఉందని గుర్తించే.. కేసీఆర్ గారు ఒక అడుగు ముందుకేసి మెగ్నానిమిటీ చూపించారు" అంటూ జగన్ చేసిన వ్యాఖ్యల క్లిప్‌ను పీపీటీలో ప్రదర్శించారు.

మంత్రులు X హరీశ్!

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తర్వాత... బీఆర్ఎస్ తరపున హరీశ్‌రావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు.. హరీశ్‌రావు వ్యాఖ్యలతో విభేదించారు. ఉత్తమ్ స్పందిస్తూ.. హరీశ్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, సభను తప్పుదోవ పట్టిస్తున్నారని, నాన్‌సెన్స్ మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గ్రామపంచాయతీలో మాట్లాడినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు రూ.లక్షల కోట్లు దోచుకున్నారని, కాళేశ్వరం సహా అన్ని ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని ఆరోపించారు. ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో లాలూచీ పడినందుకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పుట్టు కాంగ్రెస్‌వాది అని, ఆరేడుసార్లు గెలిచినా ముఖ్యమంత్రి పదవి రాలేదనే ఫ్రస్టేషన్‌లో ఏవేవో మాట్లాడుతున్నారని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. దీనిపై ఉత్తమ్ స్పందిస్తూ.. ఏపీ సీఎం జగన్‌తో కేసీఆర్ కొల్యూట్ అయ్యారా? లేదా? చెప్పాలన్నారు. ప్రాజెక్టుల వారీగా కూడా నీటి కేటాయింపులు చేశారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చెప్పగా.. నీటి కేటాయింపులు జరిపితే రాష్ట్రం విడిపోయినప్పుడు రాష్ట్ర వాటా గురించి కేంద్రాన్ని ఎందుకు అడగలేదని ఉత్తమ్ ప్రశ్నించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ... బీఆర్ఎస్ ఆత్మవంచన చేసుకోవద్దని, తెలంగాణ ఉద్యమం నీళ్ల కోసం పుట్టిందని, కాంగ్రెస్ కూడా నీళ్ల కోసమే ఇచ్చిందని అన్నారు. కాగా, గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులు, వాటిలో అవినీతిపై చర్చకు సిద్ధమంటే.. సభను మరికొద్ది రోజులు నడపటానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణ హక్కుల కోసం ఢిల్లీతో పోరాడటానికి బీఆర్ఎస్ కలిసిరావాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. అసెంబ్లీకి హాజరు కాకుండా.. రాజకీయం చేయడానికే నల్లగొండ సభకు కేసీఆర్ వెళ్తున్నారని ఆరోపించారు.

నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులపై కేంద్రాన్ని కలుస్తాం..

నిర్మాణంలో ఉన్న అనేక ప్రాజెక్టులకు అనుమతులు లేకపోయినా.. గత ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చుచేసిందని ఉత్తమ్ ఆరోపించారు. అనుమతిలేని ప్రాజెక్టులను కట్టకూడదని కృష్ణా బోర్డు నిబంధనల్లో స్పష్టంగా పేర్కొన్నందున.. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల సంగతి ఏమిటని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రశ్నించగా.. మంత్రి సమాధాన మిచ్చారు. "ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి, డిండి, కాంతనపల్లి, జె.చొక్కారావు ప్రాజెక్టు, తుమ్మిళ్ల, నెట్టెంపాడు, సీతారామసాగర్, భక్తరామదాసు ప్రాజెక్టులకు అనుమతి లభించలేదు. దీంతో వీటికి బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు కూడా ఇవ్వకపోవడంతో గత ప్రభుత్వం సొంత నిధులతోనే వీటిని చేపట్టింది. ఇప్పటికే వీటిపై చాలా ప్రజాధనం ఖర్చయింది. ఈ విషయంపై సీఎంతో కలిసి కేంద్ర జలశక్తి మంత్రిని కలుస్తాం. హైడ్రాలజీ క్లియరెన్స్ ఇవ్వాలని కోరుతాం" అని ఉత్తమ్ వివరించారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న ప్రాజెక్టునూ వ్యతిరేకిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు విపక్ష ఎమ్మెల్యేలంతా రావాలని, రూ.94 వేల కోట్లు ఖర్చుచేసిన ప్రాజెక్టును చూడాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. కేఆర్ఎంబీపై కేంద్రం తెచ్చిన కొత్త నిబంధనలను స్వాగతిస్తున్నామని, దీనిప్రకారం కృష్ణా నదీ జలాలపై రాష్ట్ర హక్కుల కోసం పోరాడి తప్పకుండా సాధిస్తామని స్పష్టం చేశారు.

పార్టీని చీల్చి పాపాలు కడుక్కో!

- 26 మందిని తెస్తే దేవాదాయ శాఖ!
- హరీశ్‌కు రాజగోపాల్‌రెడ్డి బంపర్ ఆఫర్
- మామ, బామ్మర్దిని నమ్ముకోకంటూ హితవు
- పార్టీ సమావేశాలకు వెళ్తారు
- అసెంబ్లీకి రమ్మంటే కాలు నొప్పంటారు
- బీఆర్ఎస్ అధినేతపై చురకలు



హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌ను చీల్చి 26 మంది ఎమ్మెల్యేలను తీసుకొని అధికార పార్టీలోకి వస్తే దేవాదాయ శాఖ కట్టబెడతామని హరీశ్‌రావుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రతిపాదించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పాపాలను కడుక్కోవడానికి ఈ మంత్రి పదవి ఉపయోగపడుతుందన్నారు. అసెంబ్లీ లాబీల్లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హరీశ్‌రావుకు బీఆర్ఎస్ సరైన పార్టీ కాదన్నారు. కేసీఆర్ నల్లగొండ సభ అట్టర్ ఫ్లాప్ అవుతుందని, సభకు జనం వచ్చే అవకాశమే లేదని రాజగోపాల్ వ్యాఖ్యానించారు. హరీశ్‌రావుకు మేనమామ సాలు వచ్చిందని, అబద్ధాలు చెప్పడంలో మామను మించిపోయాడని అన్నారు. రాజగోపాల్ అంతకు ముందు అసెంబ్లీలో మాట్లాడుతూ, ఇంతటి కీలకమైన సమావేశాలు జరుగుతుంటే కేసీఆర్ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఆయనకు ముఖ్యమంత్రి సీటు మాత్రమే కావాలా? ప్రతిపక్ష నేత సీటు అక్కర్లేదా? అని నిలదీశారు. తెలంగాణ నా రాజ్యం.. నేను రాజ్యానికి రాజు అన్నట్టుగా కేసీఆర్ భావిస్తున్నారని, ప్రజాస్వామ్యం అన్న సంగతి మరచిపోయారని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు పార్టీ మీటింగ్‌లకు, పోరుబాటకు వెళ్లడానికి కుదురుతుందని, ప్రజాసమస్యలపై అసెంబ్లీకి రావాలంటే మాత్రం కాలునొప్పి వస్తుందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ కోసమే కొండపోచమ్మ రిజర్వాయర్ కట్టుకున్నారని ఆరోపించారు. సభకు రానప్పుడు ప్రతిపక్ష నేత పదవి ఎందుకని ప్రశ్నించారు. హరీశ్‌రావు ఎంత కష్టపడ్డా క్రెడిట్ కేసీఆర్‌కే దక్కుతుందని, మామను, బామ్మర్దిని నమ్ముకోకుండా కాంగ్రెస్‌కు మద్దతు తెలపాలని సూచించారు.

జయశంకర్ మాటనే వినలేదు

కృష్ణా జలాలపై అనవసరంగా కోర్టుకు వెళ్లి ఎనిమిదేళ్ల సమయాన్ని కేసీఆర్ వృథా చేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. కేంద్రానికి అన్ని కీలక బిల్లుల్లో సహకరించి కేసీఆర్ సాధించిందేంటని ప్రశ్నించారు. ఎలాంటి అనుమతులు లేకుండా కృష్ణాపై ఏపీ రాయలసీమ ప్రాజెక్టు కడుతుంటే పదేళ్లుగా కేసీఆర్ సర్కారు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో నీటి పారుదల శాఖను విద్యాసాగర్‌కు ఇవ్వమని ప్రొఫెసర్ జయశంకర్ చెబితే కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. అప్పుడే ఇచ్చి ఉంటే కృష్ణా జలాల విషయంలో తెలంగాణ పరిస్థితి ఇలా ఉండేది కాదన్నారు. చంద్రబాబును బలహీన పరచేందుకే కేసీఆర్ జగన్‌కు మద్దతు పలికారని చెప్పారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక కేసీఆర్ రాయలసీమకు తెలంగాణ జలాలు సమర్పించారన్నారు. ఎంఐఎం నేత అక్బరుద్దీన్ కృష్ణా జలాలపై ప్రభుత్వ తీర్మానానికి మద్దతు ప్రకటించారు. తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని ఒప్పుకొని 2016లో చంద్రబాబు సమక్షంలో కేసీఆర్ సంతకాలు చేశారని, దీనికి ఆయన వివరణ ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టులో కేసు అప్పట్లోనే వాపస్ తీసుకుని ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. జగన్‌కు లబ్ధి చేకూర్చేందుకే కేసీఆర్ నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. 811 టీఎంసీల పంపకం మీదే ప్రభుత్వం పట్టుబట్టాలని, కేటాయింపులు లేని ప్రాజెక్టుల గురించి మాట్లాడి, ఇతర రాష్ట్రాలకు ఆయుధం ఇవ్వొద్దని బీఆర్ఎస్ నేత కడియం శ్రీహరి సూచించారు. తనకు అడ్డు తగిలిన రాజగోపాల్‌రెడ్డిని కడియం తిప్పికొడుతూ, "నువ్వు హోంమంత్రి అయ్యేది లేదు.. చచ్చేది లేదు" అన్నారు.

నేడు మేడిగడ్డకు సీఎం, ఎమ్మెల్యేలు

మంత్రులు, ఎమ్మెల్సీలు కూడా..

- అసెంబ్లీ నుంచి ఉదయం 10.15 గంటలకు బయలుదేరనున్న బస్సులు



మేడిగడ్డ బ్యారేజీ వద్ద సీఎం సభావేదిక ఏర్పాట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మంగళవారం మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు వెళ్లనున్నారు. సీఎంతో పాటు కాంగ్రెస్, మజ్లిస్, సీపీఐ సభ్యులు అసెంబ్లీ నుంచే మేడిగడ్డ పర్యటనకు బయల్దేరి వెళ్తారు. ఉదయం 10 గంటలకు శాసనసభ ప్రారంభమైన వెంటనే వాయిదా పడనుంది. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి సహా ప్రజాప్రతినిధులందరూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో ఉదయం 10.15 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 3 గంటలకల్లా మేడిగడ్డకు చేరుకుంటారు. అక్కడ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, సాగులోకి వచ్చిన కొత్త ఆయకట్టు తదితర అంశాలపై సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రజాప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ప్రజాప్రతినిధుల మేడిగడ్డ సందర్శన రెండు గంటల పాటు కొనసాగనుంది. సాయంత్రం 5 గంటలకు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మేడిగడ్డ పర్యటన అసెంబ్లీ రికార్డుల్లో నమోదు కావడం కోసమే మంగళవారం శాసనసభ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. అక్కడి నుంచి మేడిగడ్డకు తరలి వెళుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కాగా.. మేడిగడ్డ సందర్శనకు రావాలంటూ కేసీఆర్ సహా 119 మంది సభ్యులనూ ఆహ్వానించినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు.

బీఆర్ఎస్, బీజేపీలు దూరం

మేడిగడ్డ పర్యటనకు కాంగ్రెస్ పార్టీకి చెందిన అందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలూ వెళుతుండగా.. బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు మాత్రం వెళ్లడం లేదు. మేడిగడ్డ పర్యటనకు తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లడం లేదంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. కేఆర్ఎంబీకి కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతపై బీఆర్ఎస్ పార్టీ నల్లగొండలో భారీ బహిరంగసభ పెట్టుకున్న నేపథ్యంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు అక్కడికి వెళ్లనున్నారు. మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలు మాత్రం ప్రభుత్వ ఆహ్వానం మేరకు మేడిగడ్డ వెళుతున్నారు. అయితే ఏడుగురు ఎమ్మెల్యేల్లో ముగ్గురు, ఇద్దరు ఎమ్మెల్సీల్లో ఒక్కరు వెళ్తున్నారు. ఇక సీపీఐ ఏకైక సభ్యుడు కూనంనేని సాంబశివరావు కూడా వెళుతున్నారు. అధికార, ప్రతిపక్షాలు మంగళవారమే నదీ జలాలకు సంబంధించి పోటీ కార్యక్రమాలు తలపెట్టడంతో రాష్ట్ర రాజకీయం వేడెక్కింది. కృష్ణా జలాలపై నల్లగొండలో కేసీఆర్ సభను తలపెడితే.. సీఎం రేవంత్ మేడిగడ్డ పర్యటన పెట్టడం చర్చనీయాంశమైంది.

పర్యటన ఏర్పాట్లు పూర్తి

మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు సీఎం రేవంత్, ప్రజాప్రతినిధులు రానున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసింది. ముఖ్యమంత్రి బృందం హైదరాబాద్ నుంచి బస్సుల్లో వస్తున్నందున పోలీస్, ఇంటెలిజెన్స్ బృందాలు భద్రతా చర్యలను ముమ్మరం చేశాయి. నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో భూపాలపల్లి నుంచి పంకెన, పలిమెల వరకు భారీగా బలగాలను మోహరించారు. గ్రేహౌండ్స్ బృందాలను రంగంలోకి దించి ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు.

నేడు బీఆర్ఎస్ 'చలో నల్లగొండ'

- కృష్ణా జలాల హక్కుల పరిరక్షణ పేరిట భారీ సభ.. హాజరుకానున్న కేసీఆర్

హైదరాబాద్/నల్లగొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలపై నల్లగొండ జిల్లాలో రాజకీయం వేడెక్కింది. కృష్ణా జలాల సాధనలో వైఫల్యానికి మీరే కారణమంటే.. మీరే కారణమంటూ పరస్పర నిందలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ అసెంబ్లీలో, బయట మాటల యుద్ధానికి తెరలేపాయి. ఇదే అంశంపై ఇరు పార్టీలు పోటాపోటీ సభలు, నిరసనలకు సిద్ధమయ్యాయి. కృష్ణా జలాల హక్కుల పరిరక్షణ సభ పేరుతో బీఆర్ఎస్ మంగళవారం భారీ బహిరంగ సభ నిర్వహించనుండగా.. అధికార కాంగ్రెస్ కూడా పోటీ సభను నిర్వహించేందుకు సిద్ధమైంది. జిల్లా కేంద్ర సమీపంలోని నార్కట్‌పల్లి- అద్దంకి జాతీయ రహదారిని ఆనుకొని చర్లపల్లి బైపాస్ రోడ్డులో సుమారు 50 ఎకరాల్లో బీఆర్ఎస్ బహిరంగసభ నిర్వహించనుంది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ ఈ సభకు హాజరు కానున్నారు. సభ ఏర్పాట్లను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. కృష్ణాజలాల్లో హక్కుల కోసం, ప్రాజెక్టుల కోసం తాము గతంలో చేసిన పోరాటాలు, ఉద్యమాలను కేసీఆర్ వివరించనున్నారు. కేంద్రం చేతికి ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు వెళ్లకుండా తామేం చేశామనే అంశాలను ప్రజలకు వివరిస్తారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగంతో పాటు, ఖమ్మం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల నుంచి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు సభకు హాజరయ్యేలా సన్నాహాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతారని పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నల్లగొండలో కాంగ్రెస్ పోటీ నిరసన సభను నిర్వహించనుంది. గతంలో కేసీఆర్ ఇచ్చిన హామీలను విస్మరించిన విషయాన్ని ప్రజలకు తెలియజేప్పేందుకు జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్ వద్ద గులాబీ రంగు కుర్చీ, గులాబీ కండువాతో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయనున్నారు. దానిపై కేసీఆర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నిరసన తెలపాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఇలా.. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకే రోజు పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో ఏం జరుగుతుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.



శ్రీకాంతాచారిని చంపింది నువ్వే!

పెట్రోల్ దొరికింది గానీ అగ్గిపెట్టె దొరకదా?

హరీశ్‌పై మంత్రి కోమటిరెడ్డి ధ్వజం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): "హరీశ్‌రావు.. నీకు పెట్రోల్ దొరుకుతది గానీ అగ్గిపెట్టె దొరకదా? మా శ్రీకాంతాచారిని నువ్వే చంపినవ్!మలిదశ తెలంగాణ ఉద్యమంలో దొంగ దీక్షలు చేసి, నాటకాలు ఆడటం తప్ప కేసీఆర్ చేసిందేముంది?తెలంగాణ ప్రజలు, నిరుద్యోగులు, ఉద్యోగులు.. ఇలా అన్ని వర్గాలు కలిసి ఉద్యమం చేస్తే... కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందని, ఇందులో కేసీఆర్‌కు సంబంధమే లేదు" అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ 25 పార్లమెంటు స్థానాలు ఉన్న ఏపీలో పార్టీ నష్టపోయినా పర్లేదనుకొని.. ప్రత్యేక తెలంగాణను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల కల నెరవేర్చిన దేవత సోనియాగాంధీ అని ఒక సందర్భంలో కేసీఆరే అన్నారని గుర్తు చేస్తూ.. తెలంగాణ తెచ్చింది కేసీఆరేనంటూ హరీశ్ మాట్లాడడం సరికాదన్నారు. సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని కేసీఆర్ అన్నారో? లేదో? ఆయన్నే అడిగి తెలుసుకోవాలని హరీశ్‌కు సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో కేసీఆర్ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నప్పుడే... 41 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలంగాణ ఏర్పాటు చేయాలని కోరూతూ అప్పటి ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీకి లేఖ ఇచ్చారని గుర్తుచేశారు. కేసీఆర్ కంటే ముందే తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలు పోరాటాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేసుకుంటే మంచిదని అన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లవి నాటకాలు: బీజేపీ

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కొత్త నాటకాలు మొదలుపెట్టాయని బీజేపీ ఎమ్మెల్యేలు శంకర్, వెంకటరమణారెడ్డి మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రాబోతుంది. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ ప్రాజెక్టుల పేరుతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యాయి. వీరి మాటలను ప్రజలు ఎప్పటికీ నమ్మరు.. కేసీఆర్ పదేళ్ల అధికారంలో ఉండి ఏ అభివృద్ధి చేయలేదు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఏం చేయబోదు. ఈ ఇరు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడం, నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ప్రజలను నయవంచనకు గురిచేయడం తప్ప మరొకటి లేదు' అని విమర్శించారు.



హుక్కా బార్లపై నిషేధం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హుక్కా బార్లను నిషేధిస్తూ ప్రవేశపెట్టిన బిల్లును సోమవారం శాసనసభ, శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదించాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరఫున శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం-2003 సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని యువత, విద్యార్థులు పెడదారి పట్టడానికి కారణమవుతున్న హుక్కా బార్లపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించినట్టు తెలిపారు. సిగరెట్‌తో పోలిస్తే హుక్కా దుష్ప్రభావం100 రెట్లు అధికంగా ఉంటుందన్నారు. ఒక గంట హుక్కా పీలిస్తే 200 సిగరెట్లు తాగడంతో సమానమన్నారు. హుక్కాలో అధిక స్థాయి ఆర్సెనిక్, సీసం, నికెల్, 36 రెట్ల అధిక తారు, 15 రెట్ల అధిక కార్బన్ మోనాక్సైడ్ ఉంటాయన్నారు. హుక్కా తాగే వారితో పాటు పక్కన ఉన్న వారికీ హాని జరుగుతుందన్నారు. హుక్కా బార్లపై నిషేధాన్ని పోలీసు, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా అమలు చేస్తాయన్నారు. దీంతో పాటు దుర్వ్యసనాల నుంచి యువతను రక్షించేందుకు చర్యలు తీసుకుంటాయన్నారు. స్కూళ్లు, కాలేజీల్లో అవగాహన తరగతులు నిర్వహించడంతో పాటు దుర్వ్యసనాలకు గురైన వారి కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మాదకద్రవ్యాలు వినియోగించినా, సరఫరా చేసినా విధించే శిక్షను మూడేళ్ల నుంచి ఏడేళ్లకు పెంచినట్టు వివరించారు. చట్ట సవరణకు ఆమోదం తెలిపిన తర్వాత సభను 14వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

పాడి రైతులకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలి

- శాసనమండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న పాడిపరిశ్రమ రైతులకు ఉచిత విద్యుత్తు సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ సభ్యుడు జీవన్‌రెడ్డి కోరారు. సోమవారం శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావనలో భాగంగా జీవన్‌రెడ్డి పాడి రైతులను ఆదుకోవాలన్నారు. గత ప్రభుత్వం పాలకు లీటర్‌కు ప్రోత్సాహకంగా రూ.4 చొప్పున అందించనున్నట్టు ప్రకటించి.. కేవలం విజయ డైరీ పరిధిలోని రైతులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చిందన్నారు. నల్లగొండ, కరీంనగర్ ప్రాంత పాడి రైతులకు ప్రోత్సాహకం అందలేదన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని పాడి రైతులకు ఉచిత విద్యుత్తుతో పాటు పాల ఉత్పత్తులపై లీటర్‌కు రూ.5 చొప్పున ప్రోత్సాహకాలను అందించాలని కోరారు.

నియామకాల్లో రాష్ట్ర యువతకు అన్యాయం: కవిత


ఉద్యోగ నియామకాల్లో తెలంగాణ యువతకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇటీవల కారుణ్య నియామకాల పేరిట కర్నూలు వాసిని ఉద్యోగంలో నియమించడంపై అభ్యంతరం తెలిపారు. సవరించని పక్షంలో న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సభ్యుడు తాతా మధు మాట్లాడుతూ.. శంషాబాద్ విమానాశ్రయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రొటోకాల్ అమలు చేసేందుకు తగిన ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. మరో బీఆర్ఎస్ సభ్యుడు యాదవరెడ్డి మాట్లాడుతూ.. కొండపోచమ్మ, మల్లన్నసాగర్ నుంచి హల్దీవాగుకు నీటిని విడుదల చేయాలని కోరారు.

పాపాల భైరవుడు రావాల్సిందే

గత పదేళ్లలో కేసీఆర్ పాపాలపై చర్చ జరగాల్సిందే.. పద్మారావుకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలి

- కేసీఆర్ సీట్లో ఆయన కూర్చోవడంతో సీఎం సూచన

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాన ప్రతిపక్ష (బీఆర్ఎస్ఎల్పీ) నేతగా సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు బాధ్యత అప్పగించాలని ఆ పార్టీ నాయకత్వానికి సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రతిపక్ష నాయకుడిగా పద్మారావు అర్హుడని, నిజమైన ఉద్యమకారుడు, తెలంగాణ కోసం నిజంగా కొట్లాడే వ్యక్తి అని అన్నారు. అలాంటి వారిని ప్రతిపక్ష నేతగా నియమిస్తే తెలంగాణ సమాజానికి మేలు జరుగుతుందన్నారు. సోమవారం కృష్ణా ప్రాజెక్టులు, కేఆర్ఎంబీకి అప్పగింత అంశంపై శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా.. కేసీఆర్‌కు కేటాయించిన సీట్లో పద్మారావు కూర్చోవడాన్ని గమనించిన రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. "మొన్న చూసినప్పుడు ఆ కుర్చీ ఖాళీగా ఉండె. ఆ కుర్చీలో ఇప్పుడు పద్మన్న కూర్చున్నడు. ఆయనకు బాధ్యత ఇస్తే.. ఆయనైనా ప్రతిపక్ష నేత బాధ్యత నెరవేరుస్తడు" అని రేవంత్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడు సభకు ఎందుకు రాలేదని, ఎందుకు మొహం చాటేశారని ప్రశ్నించారు. "కృష్ణా జలాల గురించి ముఖ్యమైన చర్చ జరుగుతుంటే.. బీఆర్ఎస్ పార్టీ యజమాని, ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి కదా? తెలంగాణ ప్రజల జీవితాలపై మరణశాసనం రాసే పరిస్థితులు ఉత్పన్నమైతే సభలోకి రాకుండా, సభలో జరుగుతున్న చర్చలో అభిప్రాయం చెప్పకుండా ఎటెటో పోతున్నడు. చంద్రశేఖరరావును సభలోకి రమ్మనండి.. చర్చలో పాల్గొనమనండి. ఈ పదేండ్లలో జరిగిన పాపాలకు కేసీఆరే కారణం. పాపాల భైరవుడు కేసీఆర్ సభలోకి వచ్చి చర్చ చేస్తే.. మేం సమాధానం చెప్తాం. కేసీఆర్ సభకు వస్తే ఎంత సమయమైనా చర్చ చేద్దాం" అని రేవంత్ అన్నారు. ప్రాజెక్టులను అప్పగించేది లేదనేదే తీర్మానం సారాంశమని, దానికి అనుకూలమో, వ్యతిరేకమో బీఆర్ఎస్ తొలుత స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష సభ్యుల మాటల వల్ల శత్రువులకు బలం చేకూరుతుందని, శత్రువులకు, దొంగలకు సద్దిమూట మోసే విధానం మంచిది కాదని హితవు పలికారు.



ఇప్పటికైనా బుద్ధి మార్చుకోవాలని సూచించారు.

కరీంనగర్‌లో తరిమితే పాలమూరుకు..

2009లో కేసీఆర్‌ను కరీంనగర్ నుంచి అక్కడి ప్రజలు తరిమితే పాలమూరుకు వచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అలాంటి సమయంలో పాలమూరు ప్రజలు ఆదరించి గెలిపిస్తే.. ఆ జిల్లాకు సంబంధించి కృష్ణా జలాలపై చర్చ జరుగుతున్నప్పుడు సభకు రాకుండా ఫాంహౌస్‌లో దాక్కున్నారని విమర్శించారు. "దక్షిణ తెలంగాణ ప్రజలు కృష్ణా జలాల మీదే ఆధారపడి జీవిస్తున్నారు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 10 లక్షల మంది వలస వెళ్లి.. బొగ్గుబాయిలో, ముంబైలో తట్టపని చేసుకుంటూ బతుకుతున్నారు. కేసీఆర్‌ను 2009లో కరీంనగర్ జిల్లా ప్రజలు తరిమితే.. అక్కడి నుంచి పారిపోయి పాలమూరుకు వలస వచ్చిండు. ప్రజలు అయ్యో పాపం వలస వచ్చాడని ఆదరించి ఎంపీగా గెలిపిస్తే అటే పోయిండు. ఇవ్వాళ అలాంటి జిల్లాకు సంబంధించి కృష్ణా జలాలపై చర్చ జరుగుతుంటే ఆ మహానుభావుడు ఇక్కడికి రాకుండా ఫాంహౌస్‌లో దాక్కొని తెలంగాణ సమాజాన్ని అవమానిస్తుండు. ఇంత కీలకమైన చర్చ జరుగుతున్నప్పుడు, సభ మొత్తం ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించేది లేదని, కృష్ణా జలాల్లో 68 శాతం వాటా ఇవ్వాలని తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు హుందాగా, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు ఇక్కడ కూర్చొని ఈ తీర్మానానికి మద్దతు పలికి, తెలంగాణ హక్కుల మీద, తెలంగాణ నీళ్ల విషయంలో ఒకేమాట మీద నిలబడ్డామని ఏపీ నుంచి కేంద్ర ప్రభుత్వం వరకు ఒక సందేశాన్ని పంపాల్సిన సందర్భంలో సభకు రాకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి వారిని (హరీశ్‌రావు)ను పంపించి పచ్చి అబద్ధాలు మాట్లాడిస్తున్నారు" అని రేవంత్ ధ్వజమెత్తారు.

తెలంగాణకు అన్యాయం చేసింది.. కృష్ణా జలాల్లో రావాల్సిన వాటాను తెగనమ్ముకున్నది ఎవరని సీఎం రేవంత్ ప్రశ్నించారు. తెలంగాణ నీళ్ల దోపిడీకి.. చేపల పులుసుకు అలుసిచ్చిందెవరో చర్చలో తేలాలన్నారు. ముఖ్యమంత్రిగా, నీటి పారుదలశాఖ మంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలో.. అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ, నీటి పారుదలశాఖ సెక్రటరీగా ఉన్న స్మితా సబర్వాల్ అధికారికంగా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారని తెలిపారు. స్మితా సబర్వాల్ లేఖ రాశారని ఒక్క రోజైనా చెప్పారా? అని ప్రశ్నించారు. ఈరోజు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ తీసుకొచ్చి

నీటి వాటాను అమ్ముకున్నదెవరు?

బయట పెట్టిన తర్వాత.. లేఖ రాసింది నిజమేనంటూ ఇప్పుడు మాట్లాడుతున్నారని, అప్పటి ముఖ్యమంత్రి ఆలోచన విధానంతోనే రాసినట్లు చెబుతున్నారని విమర్శించారు. "అసలు మీ బాధ ఏంది? కేఆర్ఎంబీకి అప్పజెప్పాలనా? వద్దనా? వద్దని మేము తీర్మానం పెట్టినపుడు చర్చలకు తావెక్కడిది? ప్రభుత్వం ప్రతిపాదించిన తీర్మానానికి బేషరతుగా మద్దతు ఇస్తున్నామని ఎందుకు చెప్పడంలేదు? పదండి ఢిల్లీకి పోదామనే మాట నోటికి ఎందుకు వస్తలేదు?" అని రేవంత్‌రెడ్డి నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీలో ఎవరికీ విలువలేదని, మాటకు మనుషులకు, అభిప్రాయానికి కూడా విలువలేదని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావు మాట్లాడటానికి కూడా ఏమీ లేదన్నారు.

చట్టసభలకు రాకుండా

అక్కడికెలా వెళ్తావ్..

నల్లగొండలో కేసీఆర్ సభ పెట్టడంపై కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో సభ పెట్టే నైతిక హక్కు మాజీ సీఎం కేసీఆర్‌కు లేదని.. ఆయన అక్కడ సభ పెట్టడం సిగ్గుచేటని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి, రాందాస్ నాయక్, ఆది శ్రీనివాస్, సంజీవరెడ్డి, లక్ష్మణ్‌కుమార్, రాంచంద్రనాయక్ మండిపడ్డారు. ప్రజల సొమ్మును దోచుకున్నది కాక నల్లగొండ సభలో ప్రజలకు ఏం చెప్తావ్.. అని ప్రశ్నించారు. చట్టసభలకు రాని కేసీఆర్ నల్లగొండ సభకు మాత్రం ఎలా వెళ్తారని నిలదీశారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడారు. ప్రపంచంలోనే గొప్ప ప్రాజెక్టు కాళేశ్వరమని చెప్పి ప్రజలను మాజీ సీఎం కేసీఆర్ మోసం చేశారని.. ఇప్పుడు ఆ ప్రాజెక్టు కూలిపోయే పరిస్థితికి వచ్చిందని చెప్పారు. 'ఏ ఇంజనీర్ చెప్పినా వినకుండా కాళేశ్వరం ప్రాజెక్టు కట్టించాడు. తానే గొప్ప ఇంజనీర్‌నని చెప్పుకొని ప్రాజెక్టు నిర్మాణంలో రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారు. కేసీఆర్ నువ్వు నిజమైన తెలంగాణ వాదివి కాదు. రాజకీయ స్వార్థం కోసం కృష్ణా జలాలు కేంద్రానికి అప్పగించావ్.. కాళేశ్వరం కింద లక్ష ఎకరాలకు నీళ్లు ఇచ్చానన్నావ్.. సభకు వచ్చి ఎక్కడ ఇచ్చావో చెప్పాలి. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలే మిమ్మల్ని చెప్పుతో కొట్టినట్లు సమాధానం ఇస్తారు. కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన అవినీతిని తెలియజేసేందుకే మంగళవారం రేవంత్, భట్టి, ఉత్తమ్ నేతృత్వంలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలను తీసుకెళ్లేందుకు ప్రాజెక్టు పర్యటనను ఏర్పాటు చేశారు' అని చెప్పారు. సభలో నీళ్ల గురించి కాంగ్రెస్ సభ్యులు అడుగుతుంటే.. బీఆర్ఎస్ సభ్యులు నీళ్లు నములుతున్నారని ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కింద ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎకరం భూమి కూడా పారట్లేదని కాంగ్రెస్ మరో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రాజెక్టులు కేంద్రానికి అప్పగించబోమని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తీర్మానానికి ధన్యవాదాలు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో నియోజకవర్గానికో లక్ష ఎకరాలకు సాగు నీరు ఇస్తానని చెప్పిన కేసీఆర్.. ఇప్పుడెక్కడ ఉన్నారని ప్రశ్నించారు.

నల్లగొండ సభ దెబ్బకే కేఆర్ఎంబీ తీర్మానం!

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ, ఏపీ ఈఎన్‌సీల మాటలను వినిపించారు. పోతిరెడ్డిపాడుపై అప్పటి కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు పెదవులు మూసుకుంటే, తాము పేగులు తెగేదాక కొట్లాడామని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం తెచ్చిన తీర్మానంపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని.. అయినా మద్దతు ఇస్తున్నామని హరీశ్ చెప్పారు. ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేయాలని ట్రిబ్యునల్‌కు లేఖ రాయలని, ఆరు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని సూచించారు. కాగా, పీపీటీకి తమకు కూడా అవకాశం ఇవ్వాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను హరీశ్ కోరారు. అయితే, స్పీకర్ అనుమతివ్వలేదు.



భట్టన్నా ఓపిక పట్టు..

కేసీఆర్ పాలనలో ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించే పనులేమీ చేయలేదని హరీశ్ అన్నారు. నిర్వహణ విధానం (ఆపరేషన్ ప్రొటోకాల్) తేలేదాకా ఇవ్వబోమని తేల్చి చెప్పామని, జలాలను 50:50 నిష్పత్తితో పంచాలని 27 దాకా లేఖలు రాశామని గుర్తు చేశారు. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి జోక్యం చేసుకోబోయారు. 'ఉన్నది అంటే ఉలుకెందుకే భట్టన్న..? ఓపిక పట్టు. నువ్వెపుడు ఉప ముఖ్యమంత్రివి. ఓపిక తెచ్చుకో' అని హరీశ్ వ్యాఖ్యానించారు. కాగా, భట్టి కల్పించుకుంటూ 'స్మితా సబర్వాల్‌ను తప్పుపట్టడం లేదు. ప్రభుత్వం చెబితేనే ప్రాజెక్టులను బోర్డుకు అప్పగిస్తామని ఆమె లేఖ రాశారు' అని అన్నారు. ఇంతలో ఉత్తమ్ స్పందించి 'అసెంబ్లీని పంచాయతీ స్థాయికి దిగజార్చొద్దు. పదేళ్లపాటు మాకు 299 టీఎంసీలు సరిపోతాయని చెప్పి, ఇప్పుడు సభను పక్కదారి పట్టించవద్దు. తెలంగాణకు ద్రోహం చేసింది, మోసం చేసింది బీఆర్ఎస్ వారే. అబద్ధాలు ప్రచారం చేస్తే మీపై ప్రివిలేజ్ మోషన్ మూవ్ చేస్తా' అని హెచ్చరించారు. ప్రాజెక్టులను అప్పగించేది లేదని కేంద్రానికి తేల్చిచెప్పామని, కేంద్రం మినిట్స్‌పై సంతకాలు చేయలేదని స్పష్టం చేశారు. దీనిపై హరీశ్ స్పందిస్తూ ఉత్తమ్ పుట్టు కాంగ్రెస్ వాది అని, ఆరేడుసార్లు గెలిచినా సీఎం పదవి రాలేదనే అసహనంలో ఏవేవో మాట్లాడుతున్నారని అన్నారు.

రేవంత్ తెలంగాణ ఉద్యమంపై మాట్లాడడమా?

హరీశ్ తన ప్రసంగంలో కేసీఆర్‌పై విమర్శలు, తెలంగాణ ఉద్యమం గురించి ప్రస్తావించారు. 'రేవంత్‌రెడ్డి కూడా తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంటది. కేసీఆర్‌ను కరీంనగర్‌లో తరిమితే మహబూబ్‌నగర్‌కు వచ్చిండని చెబుతున్రు. నిన్ను కొడంగల్‌లో తరిమితే మల్కాజ్‌గిరి వచ్చినవా?, ఒక వేలు మమ్మల్ని చూపిస్తే రెండు వేళ్లు విమ్మల్ని చూపిస్తాయి. సభలో సీఎం, మంత్రులు గాంధీభవన్‌లోలా మాట్లాడుతున్నారు. ఇదేం భాష? అని ప్రజలు అనుకుంటున్నారు. కేసీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. ఆయన లేనిదే తెలంగాణ లేదు. సీఎం రేవంత్‌రెడ్డి కుర్చీలో కూర్చునేవారు కాదు" అని అన్నారు

11 సీట్లలో చెప్పుతో కొట్టారు.. మీకూ సున్నా వచ్చాయిగా?

కేంద్రానికి లేఖ రాయడం ద్వారానైనా దారికొచ్చారని అనుకుంటే ఫిబ్రవరి 1న కృష్ణా బోర్డు సమావేశంలో ప్రాజెక్టులను అప్పగిస్తామని తెలంగాణ ఈఎన్‌సీ ఒప్పుకొన్నారని హరీశ్ వ్యాఖ్యానించిన సందర్భంలో మంత్రి కోమటిరెడ్డి స్పందించారు. నల్లగొండ సభకు వచ్చే ముందు ఏపీ సీఎం జగన్ స్టేట్‌మెంట్‌ను చూడాలని కోరారు. మీ తలకాయ ఎక్కడ పెట్టుకుంటారని అన్నారు. బీఆర్ఎస్‌ను నల్లగొండ జిల్లాలో 11 సీట్లలో ప్రజలు చెప్పుతో కొట్టారని, కేసీఆర్, హరీశ్, జగదీశ్‌రెడ్డి అన్యాయం చేశారని దక్షిణ తెలంగాణను మోసం చేశారని, నల్లగొండలో కాలుమోపే అర్హత మీకు లేదని, ముక్కునేలకు రాశాకే రావాలని మండిపడ్డారు. హరీశ్ స్పందిస్తూ గతంలో 'ఆ జిల్లాలో కాంగ్రెస్ సున్నా వచ్చాయి. బండ్లు ఓడలైతయ్.. ఓడలు బండ్లవుతాయ్. రాహుల్ గాంధీని అమేథీ ప్రజలు చెప్పుతో కొట్టినట్లేనా? రాష్ట్రాన్ని సాధించి, పదేళ్లు సీఎంగా చేసిన కేసీఆర్ పట్ల ఈ విధంగా మాట్లాడతారా?' అని నిలదీశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలను తొలగించే వరకు మాట్లాడబోమని హరీశ్ చెప్పగా రికార్డుల నుంచి తొలగించనున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

కాంగ్రెస్ చెప్పినవన్నీ అబద్ధాలే!

- కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతకు మేం ఒప్పుకోలేదు
- వాస్తవాలు ఇవేనంటూ పీపీటీ విడుదల చేసిన బీఆర్ఎస్

హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కృష్ణానదీ జలాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నవన్నీ.. అబద్ధాలేనని, వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని బీఆర్ఎస్ పేర్కొంది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా సోమవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వంతో జరిగిన చర్చలతోపాటు పలు అంశాలను కూలంకషంగా తెలిపింది. కాంగ్రెస్ చెబుతున్న అంశాలను ప్రస్తావిస్తూ.. తమ ప్రభుత్వ పాలనలో జరిగిన వాస్తవం ఇదేనంటూ వివరణ ఇచ్చింది.

కాంగ్రెస్ ఆరోపణ: కేంద్ర జలశక్తి మంత్రి అధ్యక్షతన 2020అక్టోబరు 6న జరిగిన రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వమే కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ అధికార పరిధిని నోటిఫై చేస్తుందని నిర్ణయించారు. పునర్విభజన చట్టం ప్రకారమే కేఆర్ఎంబీ అధికార పరిధి నిర్దేశించబడుతుందని కేంద్ర మంత్రి అప్పుడే స్పష్టం చేశారు. ఈ సమావేశానికి కేసీఆరే స్వయంగా హాజరయ్యారు.

బీఆర్ఎస్ వివరణ: రెండో అపెక్స్ కమిటీ మీటింగ్‌లో కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించలేదు. ఈ అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉందని అప్పటి సీఎం కేసీఆర్ స్పష్టంగా చెప్పారు.

కాంగ్రెస్ ఆరోపణ: కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ప్రాజెక్టులను అప్పగించేందుకు అప్పటి ప్రభుత్వం మొగ్గు చూపే చర్యలు చేపట్టింది. 2022 మే6న జరిగిన 16వ కేఆర్ఎంబీ సమావేశంలో పాల్గొన్న స్పెషల్ సీఎస్ రజత్‌కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్..నిర్వహణ నియమావళి ఖరారు చేసిన వెంటనే ప్రాజెక్టులను అప్పగించేందుకు అవసరమైన ఉత్తర్వులను తెలంగాణ ప్రభుత్వం జారీ చేస్తుందని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్ వివరణ: ఇందులో వాస్తవం లేదు. ఇటీవల నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా కేంద్రానికి రాసిన లేఖలో ఆపరేషన్ ప్రొటోకాల్‌పై నిర్ణయం తీసుకోనందున ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించేందుకు గత ప్రభుత్వం ఒప్పుకోలేదని చెప్పారు. అప్పటి స్పెషల్ సీఎస్ రజత్‌కుమార్ చెప్పిన విషయాన్నే ప్రస్తుత కార్యదర్శి రాహుల్ బొజ్జా ధ్రువీకరించారు.

కాంగ్రెస్ ఆరోపణ: తొమ్మిదిన్నరేళ్లలో కృష్ణా ప్రాజెక్టులను కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఉమ్మడి ప్రాజెక్టులను అప్పగించేందుకు రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఉన్న నిబంధనలను వ్యతిరేకించలేదు. తెలంగాణ ఏర్పడిన తొలి ఏడాది నుంచే నీటి వాటాల విషయంలో ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణపై లోపభూయిష్ట విధానాలను అనుసరించింది. 2015 ఆగస్టులోనే శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించే ముసాయిదాను ఆమోదిస్తూ కేంద్రానికి లేఖ రాసింది.

బీఆర్ఎస్ వివరణ: ఇదంతా పచ్చి అబద్ధం. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చాలని కేసీఆర్ అడిగినట్లు మినిట్స్ ఆఫ్ మీటింగ్‌లో కేంద్రం పేర్కొంది. కేఆర్ఎంబీ 16, 17 సమావేశాల్లో తెలగాణకు 50 శాతం కృష్ణా జలాలు కేటాయించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం డిమాండ్ చేసింది. కృష్ణా జలాల్లో నీటివాటా కోసం కేంద్రానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాసిన లేఖలు ఇవేనంటూ.. వాటిని విడుదల చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన సమావేశంలోనే ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించే నిర్ణయం తీసుకున్నారు.

కాంగ్రెస్ ఆరోపణ: కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ తెలంగాణకు అన్యాయం చేసి ఆంధ్రప్రదేశ్‌కు సహకరించారు.

బీఆర్ఎస్ వివరణ: ఇందులో వాస్తవం లేదు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై జీవో రాకముందే బీఆర్ఎస్ ప్రభుత్వం పలు ఫిర్యాదులు చేసింది. రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనూ కేసీఆర్ ఈ అంశాన్ని లేవనెత్తారు. ఇదే విషయంపై జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో గట్టిగా ఫైట్ చేయడంతో 2021 ఫిబ్రవరి 24న స్టే వచ్చింది.

కేసీఆర్ పాపాలు కడగాలంటే బ్యారెళ్ల ఫినాయిల్ కావాలి

- ఒక్కొక్కటిగా ధరణి లోపాలు అవకతవకలన్నీ బయటికి రావాలి
- అధికారం ఇస్తేనే కేసీఆర్ సభకు వస్తడా?: జగ్గారెడ్డి



విలేకరుల సమావేశంలో పాల్గొన్న జగ్గారెడ్డి, కోదండరెడ్డి తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ధరణిలో లోపాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని.. ఇందులో అవకతవకలన్నీ బయటికి రావాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. కేసీఆర్ చేసిన పాపాలు, లోపాలు కడగాలంటే లీటర్, రెండు లీటర్ల ఫినాయిల్ సరిపోదని, బ్యారెళ్లకు బ్యారెళ్ల ఫినాయిల్ పడుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఖజానా మొత్తం ఫినాయిల్ కొనడానికే పోయేట్టుందని ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, ఫిషర్మెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెట్టు సాయికుమార్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రీతంలతో కలిసి ఆయన మాట్లాడారు. ధరణి సమస్యలపైన అప్పటి సీఎస్ సోమేశ్ కుమార్‌కు ఎంత చెప్పినా చెవిటోడి ముందు శంఖం ఊదినట్లుగా ఏమీ పట్టించుకోలేదని ఆరోపించారు. ధరణి సమస్యలపైన కోదండరెడ్డి తిరుగుతూ ఉండేవారని, ఫార్మా సిటీ భూముల సమస్యలపైనా కొట్లాడారని చెప్పారు. రైతులకు మేలు జరగనప్పుడు ధరణి ఎందుకని చెప్పి దాన్ని రద్దు చేస్తామంటూ ఎన్నికల సందర్భంగా రాహుల్‌గాంధీ ప్రకటించారని గుర్తు చేశారు. కాగా.. కేటీఆర్ మంత్రిగా పనిచేసిన శాఖల్లో జరిగిన అవినీతికి కేటీఆరే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తొమ్మిదేళ్ల తర్వాత మూడున్నర గంటల పాటు ఏకధాటిగా ఒక అంశంపైన చర్చ జరిగిందని పేర్కొన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో శాసనసభలో ప్రతిపక్ష సభ్యులు మాట్లాడంగ చూడలేదని, కానీ అది ఇవాళ కనిపించిందన్నారు. "బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు.. శాసనసభలో ప్రతిపక్షం నోరు నొక్కేవారు. సభ నుంచి పో.. పొమ్మనే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను.. సభకు రా.. రా అని సీఎం రేవంత్‌రెడ్డి అడిగే పరిస్థితి వచ్చింది" అన్నారు. సభా మర్యాదలు పాటించని పార్టీ బీఆర్ఎస్ అయితే.. పాటించే సీఎం.. రేవంత్ రెడ్డి అన్నారు. "అధికారం ఇస్తే సభకు వస్తవు.. ఇవ్వక పోతే రావా?" అంటూ కేసీఆర్‌ను నిలదీశారు.

ఆ అంశాలపైనా విచారణ జరగాలి: కోదండరెడ్డి

ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఎక్కడా అని ఓ మాజీ మంత్రి అడుగుతున్నారని, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లు ఎఫ్‌సీఐకి ఇవ్వకుండా అమ్ముకుంటుంటే అప్పటి సివిల్ సప్లయ్స్ మంత్రి ఏం చేశారని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఇది పెద్ద కుంభకోణమని, దీనికి ఆ మాజీ మంత్రే బాధ్యత వహించాలన్నారు. ధరణి లోపాలూ పెద్ద కుంభకోణమన్నారు. రెవెన్యూ శాఖనూ నిర్వహించిన కేసీఆర్ దీనికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శివబాలకృష్ణ వ్యవహారంపై కేటీఆర్ బాధ్యత అని, ఈ మూడు అంశాలపైనా సమగ్ర విచారణ జరగాలని ఆయన అన్నారు.

ముఖ్యమంత్రి, మంత్రులను..

హరీశ్ ఒంటి చేత్తో ఎదుర్కొన్నారు

- కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టారు: కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో తన అద్భుత ప్రసంగంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులందరినీ ఒంటి చేత్తో ఎదుర్కొన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కృష్ణా ప్రాజెక్టులు, కేఆర్ఎంబీ సంబంధిత అంశాలపై అసెంబ్లీలో జరిగిన చర్చపై సోమవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. కృష్ణా జలాలు కేఆర్ఎంబీకి సంబంధించి కాంగ్రెస్ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారం, అబద్ధాలను హరీశ్ రావు తిప్పి కొట్టారన్నారు. బీఆర్ఎస్ నిర్వహించే చలో నల్లగొండ సభకు హరీశ్‌రావు సరైన టోన్ సెట్ చేశారని, కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని సభా వేదికగా కేసీఆర్ తనదైన శైలిలో ఎండగడతారని కేటీఆర్ వెల్లడించారు. శాసనసభలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్(పీపీపీ)పై కేటీఆర్ స్పందించారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ప్రజెంటేషన్ అంతా ఇంగ్లిషులోనే ఉందన్నారు. ఆయన తెలుగులో మాట్లాడకపోవడంతో.. ఆ ప్రజెంటేషన్ తమకే అర్థం కాలేదని, ఇక తెలంగాణ ప్రజలకు ఏం అర్థమవుతుందని ఎద్దేవా చేశారు.

ఎవరా ప్రజాప్రతినిధులు..?

- 'మాకేంటి?' కథనంపై సర్వత్రా చర్చ.. ఇంటెలిజెన్స్ వర్గాల ఆరా

నల్లగొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో నిర్మితమవుతున్న యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం ప్లాంటు ఇసుక, కంకర, డస్టు కాంట్రాక్టులపై గత ప్రభుత్వం తరహాలోనే తమతోనూ 'వ్యవహారాలు' జరపాలని డిమాండ్ చేస్తున్న ఆ ప్రజా ప్రతినిధులు ఎవరంటూ స్థానికంగా చర్చనీయాంశమైంది. యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రంపై రాజకీయ క్రీనీడ.. నిలిచిన పనుల నేపథ్యంలో 'మాకేంటి?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో సోమవారం ప్రచురితమైన కథనంపై ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చర్చ జరిగింది. యాదాద్రి పవర్‌ప్లాంటులో కాంట్రాక్టర్లతో సమావేశమైన నేత ఎవరు? కాంట్రాక్టర్లను ఒత్తిడి చేస్తున్న కీలక, స్థానిక ప్రజాప్రతినిధులెవరు? అనే అంశంపై ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ నేతలు ఒకరికొకరు ఆరా తీశారు. పవర్ ప్లాంటుపై రాజకీయాధిపత్యంతో పాటు, తమ పార్టీకి చెందినవారికే ఇసుక, కంకర సరఫరా ఒప్పందాలు చేసుకోవాలని డిమాండ్ చేస్తున్న నేతల వ్యవహారం బయటకు ఎలా పొక్కిందనే అంశంపై అధికారవర్గాలు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులను ఆరా తీసినట్లు తెలిసింది. మరోవైపు పోలీస్ ఇంటెలిజెన్స్ వర్గాలు సైతం ఈ కథనంపై ఆరా తీసినట్లు సమాచారం. ప్లాంటులో పనులు నిలిచిపోవడానికి దారి తీసిన పరిస్థితులు, కారణాలతో పూర్తిస్థాయి నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిసింది.

సూర్యాపేటలో బీఆర్ఎస్‌కు 15మంది కౌన్సిలర్లు గుడ్‌బై

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 12: సూర్యాపేట జిల్లాలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. జిల్లా కేంద్రం సూర్యాపేట మునిసిపాలిటీలో 15 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేశారు. మునిసిపాలిటీలో అనమ్మతి తీర్మానానికి కారణమైన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలదిలీప్‌రెడ్డిని ఆదివారం పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో నిఖిలకు మద్దతుగా బీఆర్ఎస్‌కు చెందిన 15 మంది కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తమ భవిష్యత్ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని సోమవారం విలేకరుల సమక్షంలో తెలిపారు.

మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ కాంగ్రెస్ వశం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12: మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ కాంగ్రెస్ వశమైంది. గతంలో బీఆర్ఎస్ నుంచి మునిసిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నికైన వారిపై జనవరి 17న కాంగ్రెస్ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో.. ఆయా పదవులకు సోమవారం ఎన్నికలు నిర్వహించారు. 49మంది సభ్యులతో పాటు ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డికి ఎక్స్‌అఫీషియో ఓటు ఉండటంతో 50మంది సభ్యులు ఎన్నికకు హాజరయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆనంద్‌కుమార్‌గౌడ్‌కు మద్దతుగా 33 మంది చేతులెత్తడంతో ఆయన చైర్మన్‌గా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ అభ్యర్థి వనజకు 14 మంది మద్దతు ప్రకటించారు.

హిమాచల్‌ప్రదేశ్‌లో పారాగ్లైడింగ్ ప్రమాదం

- జహీరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దుర్మరణం



జహీరాబాద్, ఫిబ్రవరి 12: హిమాచల్‌ప్రదేశ్‌లో పారాగ్లైడింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు సంగారెడ్డి జిల్లాకు చెందిన మహిళ దుర్మరణం చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. జహీరాబాద్ పట్టణం రంజోల్‌కు చెందిన పేరురి నవ్య (27) చండీగఢ్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ రెండేళ్ల నుంచి భర్త సాయిమోహన్‌తో కలిసి అక్కడే ఉంటోంది. కంపెనీ టూర్‌లో భాగంగా ఆమె భర్తతో కలిసి హిమాచల్‌ప్రదేశ్‌లోని కులుమనాలికి వెళ్లారు. ఆదివారం మనాలికి సమీపంలో ఉన్న దోబీ గ్రామంలో పారాగ్లైడింగ్ చేస్తూ కిందపడి ఆమె మృతి చెందారు. పారాగ్లైడింగ్ పైలట్ సెఫ్టీ బెల్ట్‌ను సరిగ్గా అమర్చకపోవడం వల్ల ఈ దుర్ఘటన జరిగి ఉండవచ్చని అక్కడి పోలీసులు అధికారులు చెబుతున్నారు.

గవర్నర్ రబ్బరు స్టాంపు కాదు

- నామినేటెడ్ ఎమ్మెల్సీల నియామకంపై హైకోర్టులో వాదనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ ఎమ్మెల్సీల నియామకంపై సోమవారం హైకోర్టులో వాదనలు కొనసాగాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం సిఫార్సులకు విరుద్ధంగా గవర్నర్ తమ నామినేషన్‌లను తిరస్కరించడాన్ని వ్యతిరేకిస్తూ దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణ పిటిషన్‌లు దాఖలు చేశారు. ప్రభుత్వం మారిన తరువాత తమకు బదులుగా కోదండరాం, అమీర్‌అలీఖాన్‌లను నామినేట్ చేయడాన్ని అడ్డుకోవాలని కోరారు. వీటిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం వాదనలు ఆలకించింది. ప్రతివాదులు కోదండరాం, అమీర్‌అలీ ఖాన్ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపిస్తూ మంత్రివర్గం చేసే సిఫార్సులను యథాతథంగా ఆమోదించడం కాకుండా విచక్షణ ప్రదర్శించే అధికారం గవర్నర్‌కు ఉంటుందని తెలిపారు. గవర్నర్ రబ్బరు స్టాంపు కాదని చెప్పారు. గవర్నర్ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వం, ఇతర ప్రతివాదుల వాదనలు ముగియడంతో విచారణ బుధవారానికి వాయిదా పడింది.

సీఎం రేవంత్‌ను కలిసిన షర్మిల



హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. సోమవారం రేవంత్ నివాసంలో వారిద్దరు భేటీ అయ్యారు. ఈ భేటీ మర్యాద పూర్వకమే అయినా.. తెలుగు రాష్ట్రాల్లోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. సినీ హీరో అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి సీఎం చాంబర్‌లో ముఖ్యమంత్రిని కలిశారు. బీఆర్ఎస్ నుంచి నాగార్జున సాగర్ టిక్కెట్టును ఆశించిన ఆయన.. రేవంత్‌రెడ్డిని కలవడం చర్చనీయాంశంగా మారింది.

ఆత్మహత్యలపై అసెంబ్లీలో చర్చించాలి:ప్రవీణ్

కార్వాన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లో జరుగుతున్న వరుస ఆత్మహత్యలకు సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని, విద్యార్థుల బలవన్మరణాలపై అసెంబ్లీలో చర్చించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాదులోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్ ఎదుట బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖలకు మంత్రులను ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. ఆత్మహత్యల్ని నియంత్రించేందుకు ప్రతి గురుకుల పాఠశాలలో పిల్లలకు కౌన్సిలింగ్ ఇచ్చేందుకు గానూ సైకాలజిస్టును నియమించాలని సూచించారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలుగానే భావించాలని ఎంవీఎఫ్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్ రెడ్డి అన్నారు.



అబుదాబిలో తెలుగోడి సాహసం

- మోదీ కోసం 13 వేల అడుగుల ఎత్తు నుంచి స్కైడైవ్

నంగునూర్, ఫిబ్రవరి 12: మోదీ కోసం అబుదాబిలో ఓ తెలుగు వ్యక్తి వినూత్న సాహసం చేశారు. యూఏఈలోని అబూదాబిలో నిర్మించిన ప్రపంచంలోనే మూడో అతిపెద్ద హిందూ దేవాలయం అయిన అక్షర్ పురుషోత్తం స్వామి ఆలయ ప్రారంభోత్సవానికి ఈ నెల 24న మోదీ అక్కడకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెటకు చెందిన హిందూ వాహిని కార్యకర్త నాగిళ్ల శ్రీకాంత్‌గౌడ్ భారత త్రివర్ణ పతాకాన్ని చేతబూని ఆకాశంలో 13వేల అడుగుల ఎత్తు నుంచి స్కై డైవ్ చేస్తూ మోదీకి ముందస్తు స్వాగతం పలికారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న నాగిళ్ల శ్రీకాంత్‌గౌడ్ తన మిత్ర బృందంతో కలిసి అబుదాబికి వెళ్లి ఇన్‌స్పెక్టర్ కార్ల థామస్ దిశానిర్దేశంలో ఈ సాహస విన్యాసం చేసినట్లు చెప్పారు.

మెట్రోకు వెయ్యి కోట్లు!

- ఎంయూడీ కేటాయింపుల్లోంచే అందజేత!
- రెండు, మూడు రోజుల్లో ప్రకటన
- మరో 15 శాతం కేంద్ర సాయం.. 5 శాతం పీపీపీకి అప్పగింత?

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ)కు కేటాయించిన రూ.11వేల కోట్లలోంచి మెట్రో విస్తరణకు రూ.1000 కోట్లు కేటాయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విషయాన్ని హైదరాబాద్ మెట్రో అధికారులు రెండు, మూడు రోజుల్లో వెల్లడించనున్నారు. నగరంలో మొదటి దశ కింద ఎల్‌బీనగర్- మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోలు-రాయదుర్గం కారిడార్లలో 70 కిలోమీటర్లను ప్రతిపాదిస్తే.. 69.2 కిలోమీటర్లను పూర్తిచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండో దశ కింద రాయ దుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు (31 కిలోమీటర్లు), బీహెచ్ఈఎల్-లక్డీకపూల్ (26 కిలోమీటర్లు), నాగోలు-ఎల్‌బీనగర్ (5 కిలోమీటర్లు) ప్రతిపాదించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం ప్రతిపాదించిన పనులను పక్కన పెట్టింది. ప్రజా రవాణాను పెంపొందించే మార్గాలను పరిశీలించారు. ఇందులో భాగంగా మొదటి దశలో మిగిలిన ఎంజీబీఎస్-ఫలక్‌నుమా (5.5 కిలోమీటర్లు)తోపాటు



ఫలక్‌నుమా-చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్డు (1.5 కిలోమీటర్లు), నాగోలు-శంషాబాద్ ఎయిర్‌పోర్టు (29 కిలోమీటర్లు), మైలార్‌దేవ్‌పల్లి-న్యూ హైకోర్టు (4 కిలోమీటర్లు), రాయదుర్గం-అమెరికన్ కాన్సులేట్ (8 కిలోమీటర్లు), మియాపూర్-పటాన్‌చెరు (14 కిలోమీటర్లు), ఎల్‌బీనగర్-హయత్‌నగర్ (8 కిలోమీటర్లు) పనులను ఖరారు చేశారు. మొత్తంగా రెండో దశ విస్తరణ కింద 70 కిలోమీటర్లను పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉండగా... మరో 15 శాతం కేంద్రం నుంచి తీసుకోనుందని, జైకా సంస్థ నుంచి 45 శాతం రుణాలు సేకరించనుందని ఓ అధికారి తెలిపారు. మిగతా 5 శాతం పీపీపీకి ఇవ్వనుందని చెప్పుకొచ్చారు. రూ.17,500 కోట్లతో చేపట్టనున్న భారీ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రుణాల సేకరణ చేయడం తప్పదని, ఇలా చేయడం ద్వారా ప్రభుత్వంపై భారం తగ్గుతోందన్నారు. సకాలంలో పనులను కూడా పూర్తి చేసే అవకాశం ఉంటుందన్నారు. వచ్చేనెలలోపు డీపీఆర్‌ను పూర్తి చేసేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. డీపీఆర్‌కు రాష్ట్ర కేబినెట్ ఆమోదం పొందాక అనుమతి కోసం కేంద్రానికి పంపిస్తారని, అనుమతి వచ్చిన తర్వాత క్షేత్రస్థాయిలో పనులు మొదలవుతాయని తెలిపారు.

స్థిరాస్తుల లావాదేవీలు బంద్!

శివ బాలకృష్ణ కేసులో యాదాద్రి కలెక్టర్‌కు ఏసీబీ లేఖ.. తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్లకు కలెక్టర్ నుంచి ఆదేశాలు

- యాదాద్రి జిల్లాలో రెరా మాజీ కార్యదర్శికి 57 ఎకరాలు!
- మార్కెట్ ధర ప్రకారం రూ.35కోట్ల విలువైన భూమి
- వలిగొండ, బీబీనగర్, మోత్కురు మండలాల్లో గుర్తింపు
- అన్నీ కుటుంబసభ్యుల పేరిటే.. చాలామటుకు 2021-23 మధ్య కొన్నవే
- లావాదేవీలు చేపట్టొద్దు.. జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసిన ఏసీబీ
- నేడు ఏసీబీ విచారణకు బినామీలు శివ బాలకృష్ణకు బెయిల్ నిరాకరణ

యాదాద్రి, హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయిన తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా-హెచ్ఎండీఏ) మాజీ కార్యదర్శి శివ బాలకృష్ణ స్థిరాస్తులకు సంబంధించి లావాదేవీలు నిలిపివేయాలని యాదాద్రి జిల్లా కలెక్టర్‌కు ఏసీబీ అధికారులు ఈనెల 9న లేఖ రాశారు. శివ బాలకృష్ణతో పాటు ఆయన కుటుంబ సభ్యుల పేరిట ఉన్న భూముల్లో ఎలాంటి లావాదేవీలు చేపట్టొదని, ఉంటే వెంటనే ఆపేయాలని ఏసీబీ అధికారులు లేఖలో పొందుపర్చినట్లు తెలిసింది. అటు.. కలెక్టర్ కూడా.. శివబాలకృష్ణకు సంబంధించిన భూముల్లో రిజిస్ట్రేషన్లు, ధరణిలో మ్యూటేషన్లు, పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ నిలిపివేయాలని సంబంధిత తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్‌లకు ఆదేశాలు జారీచేశారు. ఏసీబీ అధికారుల విచారణలో యాదాద్రి భువనగిరి జిల్లాలో శివ బాలకృష్ణకు ఎనిమిదెకరాల వరకు వ్యవసాయ భూమి ఉందని ప్రాథమికంగా అంచనా వేసినా.. ఆయన కుటుంబసభ్యుల పేరుపై జిల్లాలోని వలిగొండ, బీబీనగర్, మోత్కురు మండలాల్లో రూ.35కోట్లకు విలువచేసే సుమారు 57ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్నట్లు సర్వే నంబర్లవారీగా గుర్తించారు. ఈ భూముల్లో కొంతమేరకు పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా జారీ అయ్యాయి. వలిగొండ మండలం నర్సాపూర్‌లో సర్వే నెంబర్లు 96, 98, 99 బై నంబర్లలో 8ఎకరాలు భూమి ఎస్.హరిప్రసాద్ అనే వ్యక్తిపై ఉంది. అదేవిధంగా సర్వే నంబర్లు 100, 101, బై నంబర్లలో 11.3ఎకరాల భూమి ఎస్.రఘుదేవిపై రిజిస్ట్రేషనైంది. వలిగొండ మండలం చిత్తాపూర్‌లో సర్వే నంబర్లు 32, బై నంబర్లలో ఎస్.పద్మావతి పేరు మీద 3.31ఎకరాలు, బీబీనగర్ మండలం చిన్నరావుపల్లిలో సర్వే



నంబరు 44ఈ1/2లో శివ అరుణ పేరుపై 20గుంటలు, మోత్కురు మండలం పొలడుగులో సర్వే నంబరు 31, 32, 33, బై నంబర్లలో శివ నవీన్‌కుమార్ పేరుతో 26.08ఎకరాలు, వలిగొండ మండలం రెడ్ల రేపాకలో సర్వే నంబరు 500, 503, 504, 505, 506, 527 బై నంబర్లలో శివ కుమార్ పేరు మీద 8.84 ఎకరాలు రిజిస్ట్రేషనైంది. రెడ్లరేపాకలో 2009లో భూములు కొనుగోలు చేయగా మిగతా భూములన్నీ కూడా 2021-2023 మధ్య కొన్నారు. ఈ భూముల్లో ఎలాంటి లావాదేవీలు(ఫ్రీజ్) చేపట్టొదని, వెంటనే ఆపేయాలని ఏసీబీ అధికారులు యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్‌కు ఈ నెల 9వ తేదీన లేఖ రాశారు.

రెరా మాజీ కార్యదర్శి బెయిల్‌కు నో

హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. బాలకృష్ణకు బెయిల్ ఇచ్చేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టు నిరాకరించింది. సోమవారం విచారణ అనంతరం ఆయన బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు తిరస్కరించింది. కేసులో ఏసీబీ కస్టడీ ముగిసిందని, కొత్తగా ఎలాంటి సమాచారం రాబట్టే అవకాశం లేదని బెయిల్ మంజూరు చేయాల్సిందిగా బాలకృష్ణ న్యాయవాది కోర్టుకు నివేదించారు. అయితే కస్టడీలో ఇచ్చిన సమాచారం మేరకు మరికొందరిని విచారించాల్సి ఉందని, కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నందున బెయిల్ ఇవ్వరాదని ఏసీబీ తరఫు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. వాదనల అనంతరం న్యాయస్థానం బాలకృష్ణ బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఇదే కేసులో అరెస్టయి జుడిషియల్ రిమాండ్‌లో ఉన్న బాలకృష్ణ తమ్ముడు నవీన్ కుమార్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. శివబాలకృష్ణకు బినామీలుగా వ్యవహరించిన భరత్, సత్యనారాయణ, భరణిని మరింత లోతుగా విచారించేందుకు ఏసీబీ సిద్ధమవుతోంది. మంగళవారం తమ ఎదుట విచారణకు హాజరుకావాల్సిందిగా కొందరు బినామీలకు ఏసీబీ నోటీసులు జారీ చేసింది. దర్యాప్తులో లభించిన ఆధారాలు, సోదాల్లో దొరికిన పత్రాలు, విచారణలో బినామీలు ఇచ్చే సమాచారం ఆధారంగా చట్టప్రకారం తదుపరి చర్యలకు ఏసీబీ సిద్ధమవుతోంది. కస్టడీలో శివబాలకృష్ణ వెల్లడించిన ఐఏఎస్ అధికారి విషయంలో ప్రభుత్వ అనుమతి మేరకు కేసులో ఏసీబీ తదుపరి ముందడుగు వేయనుంది.

సచివాలయ నిర్మాణ ఖర్చెంత?

(మొదటి పేజీ తరువాయి)

గమనార్హం. నూతన సచివాలయం నిర్మాణం, అందుకు వెచ్చించిన నిధుల గురించి వివరాలు తెలపాలంటూ యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఆర్ అండ్ బీ శాఖను సమాచార హక్కు కింద కోరగా.. గత ప్రభుత్వం జీవో ఎం ఎస్ నెం 47 ద్వారా రూ.617 కోట్లను మంజూరు చేసిందని, వాటిలో ఇప్పటివరకు రూ.588 కోట్లు ఖర్చు చేశామని సమాధానమిచ్చింది. కొత్త సచివాలయ శంకుస్థాపన 2019లో జరిగింది. 2020లో కొవిడ్ వల్ల.. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోయి, ఆమేరకు సచివాలయ నిర్మాణ వ్యయం అంచనాలు కూడా పెరిగాయని గత ప్రభుత్వంలో ఆర్ అండ్ బీ శాఖ మంత్రిగా వ్యవహరించిన వేముల ప్రశాంత్ రెడ్డి పలుమార్లు తెలిపారు. నిర్మాణం కోసం మంజూరు చేసిన రూ.617 కోట్లకు అదనంగా మరో 20-30 శాతం మేర ఖర్చు పెరగొచ్చని భావిస్తున్నట్లు.. సచివాయలం ప్రారంభోత్సవం సందర్భంగా 2023 ఏప్రిల్ 27న 'ఆంధ్రజ్యోతి'కి ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. కానీ ఇప్పుడు అధికారులు మాత్రం.. అంతకన్నా తక్కువ ఖర్చే అయిందని చెబున్నారు. దీంతో సచివాలయ నిర్మాణం ఖర్చులో ఉన్న మతలబు ఏంటనే చర్చ మొదలైంది. ఇదే కాదు.. ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన నిర్మాణాలు, అందుకు వెచ్చించిన నిధులపై ప్రస్తుత సర్కారు నజర్ వేసింది. కానీ అధికారులు పూర్తిస్థాయిలో ఖర్చు వివరాలను వెల్లడించడంలేదని సమాచారం.

ఈఎన్‌సీ మురళీధర్‌రావు రాజీనామాకు ఆమోదం

నీటిపారుదల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్(ఈఎన్‌సీ-జనరల్) సి.మురళీధర్‌రావు రాజీనామాను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. కృష్ణా ప్రాజెక్టుల వ్యవహారంలో ప్రభుత్వ విధానానికి విరుద్ధంగా మురళీధర్‌రావు వైఖరి ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాజీనామా చేయాలని ఈ నెల 7వ తేదీన ప్రభుత్వం ఆయన్ను ఆదేశించింది. దాంతో 8వ తేదీనే ఆయన తన రాజీనామాను సమర్పించారు. ఆయన రాజీనామా ఈ నెల 8వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది.

ఉద్యోగ అర్హత వయసు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దాంతో అభ్యర్థులు అర్హత వయసును రెండేళ్లు పెంచుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంతకు ముందు ప్రకటించారు. ఈ మేరకు తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 34 ఏళ్లుగా ఉన్న ఉద్యోగాలకు గరిష్ఠ అర్హత వయసును గత ప్రభుత్వం పదేళ్లు పెంచింది. ఈ మేరకు 2022 మార్చి 19న (జీవో నంబరు ఎంఎస్-42) ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఉత్తర్వుల ప్రకారం మరో రెండేళ్లు పెరిగింది. దాంతో మొత్తం 12 ఏళ్లు పెరిగినట్లు అయింది. రిజర్వేషన్ అమలయ్యే కేటగిరీ అభ్యర్థులకు ఈ గరిష్ఠ వయసు విషయంలోనూ కొంత వెసులుబాటు ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 ఏళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్, ఎన్‌సీసీ అభ్యర్థులకు 3 ఏళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల పాటు సడలింపు ఉంది. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన రెండేళ్ల పెంపుతో గరిష్ఠ అర్హత వయసు ప్రభుత్వ ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 51 ఏళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్, ఎన్‌సీసీ అభ్యర్థులకు 49 ఏళ్లు, దివ్యాంగులకు 56 ఏళ్లు అయింది. అయితే ఈ పెంపు నిర్ణయం యూనిఫాం ఉద్యోగాలకు వర్తించదు.

అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల తుది కీ విడుదల

మునిసిపల్ శాఖలోని అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులు, గ్రౌండ్ వాటర్ విభాగంలోని గెజిటెడ్ అధికారుల పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షల తుది కీని విడుదల చేశారు. దీన్ని టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చినట్టు అధికారులు ప్రకటించారు.

సమాంతర మహిళా రిజర్వేషన్ అమలుకు వివరాల సేకరణ

ప్రభుత్వం నిర్ణయించిన మేరకు సమాంతర మహిళా రిజర్వేషన్ అమలుకు అధికారులు చర్యలు చేపట్టారు. రోస్టర్ పాయింట్లలో మార్పు లేకుండా ఈ రిజర్వేషన్ అమలు చేయనున్నారు. ఆయా పోస్టుల వివరాలు ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ అధికారులు అన్ని విభాగాలకు లేఖ రాశారు.

తాజాగా రెండేళ్ల పెంపుతో కేటగిరీల వారీగా వయో పరిమితి ఇలా..

అభ్యర్థి కేటగిరీ	గరిష్ఠ వయసు
జనరల్	46
ఎక్స్ సర్వీస్‌మెన్, ఎన్‌సీసీ	49
ప్రభుత్వ ఉద్యోగులు	51
ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్	51
దివ్యాంగులు	56

రాచకొండ సీపీగా తరుణ్ జోషి

(మొదటి పేజీ తరువాయి)

సీపీగా ఉన్న సుధీర్ బాబు మల్టీ జోన్-1 ఐజీగా బదిలీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలోనే సుధీర్ బాబును ప్రభుత్వం రాచకొండ సీపీ బాధ్యతల నుంచి తప్పించింది. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రాచకొండ సీపీగా సుధీర్‌బాబు కొనసాగే అవకాశం లేదు. జాయింట్ సీపీగా, అదనపు కమిషనర్ హోదాలోనూ సుధీర్‌బాబు గతంలో ఇక్కడ పని చేయడంతో నిబంధనల మేరకు కొనసాగించే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వం ఆ బాధ్యతల నుంచి తప్పించింది. జోగులాంబ జోన్ డీఐజీగా ఎల్ఎస్ చౌహాన్‌ను నియమించింది. గత బదిలీల్లో చౌహాన్‌ను రామగుండం సీపీగా బదిలీ చేసినా ఆ ఉత్తర్వుల్ని రద్దు చేస్తూ తాజా బదిలీల్లో తిరిగి పాత పోస్టులో నియమించింది. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఇంటి విషయంలో పోలీస్ విచారణ ఎదుర్కొన్న వివాదాస్పద అధికారి నవీన్ కుమార్‌ను ప్రభుత్వం డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేసింది. నవీన్ కుమార్ స్థానంలో పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా డి.మురళీధర్ నియమితులయ్యారు. ప్రభుత్వ ఆదేశాలతో 12 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న ఇద్దరికి పోస్టింగ్‌లు లభించాయి.

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జి.సుధీర్ బాబు	సీపీ రాచకొండ	ఐజీ మల్టీజోన్-1
తరుణ్ జోషి	ఐజీ మల్టీజోన్-1	సీపీ రాచకొండ
ఎం.శ్రీనివాసులు	వెయిటింగ్	సీపీ రామగుండం
ఎల్.ఎస్.చౌహాన్	గత పోస్టింగ్ రద్దు	డీఐజీ జోగులాంబ జోన్
డి. జోయల్ డేవిస్	డీఐజీ జోగులాంబ జోన్	జాయింట్ సీపీ ట్రాఫిక్, సైబరాబాద్
నారాయణ్ నాయక్	జాయింట్ సీపీ ట్రాఫిక్ సైబరాబాద్	డీఐజీ ఎస్‌సీఆర్‌బీ
కె.అపూర్వరావు	ఎస్పీ సీఐడీ	ఎస్పీ విజిలెన్స్, ఆర్టీసీ
డి.ఉదయ్ కుమార్ రెడ్డి	ఎస్పీ, ట్రాన్స్‌కో	డీసీపీ, సౌత్ వెస్ట్ జోన్
ఆర్.గిరిధర్	మల్కాజ్‌గిరి ఎస్ఓటీ డీసీపీ	డీసీపీ ఈస్ట్‌జోన్ హైదరాబాద్
డి.మురళీధర్	వెయిటింగ్	పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్
బి.నవీన్ కుమార్	డిప్యూటీ డైరెక్టర్ అకాడమీ	డీజీపీ కార్యాలయం
సాధనా రష్మి పెరుమాల్	అడిషనల్ డీసీపీ రాజేంద్రనగర్	డీసీపీ టాస్క్‌ఫోర్స్, హైదరాబాద్

నాన్ కేడర్ ఎస్పీలు, ఏఎస్పీల బదిలీ

నలుగురు నాన్ కేడర్ ఎస్పీలతో పాటు 39 మంది అడిషనల్ ఎస్పీలు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 110 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి, గత ప్రభుత్వ హయాంలో పోస్టింగులు పొందిన వారిని తాజా బదిలీల్లో అప్రాధాన్యత పోస్టుల్లోకి మార్చారు.

నలుగురు ఐఏఎస్‌ల బదిలీ

నలుగురు ఐఏఎస్‌లు కూడా బదిలీ అయ్యారు. చిత్రా మిశ్రాను ఏటూరునాగారం ఐటీడీఏ పీఓగా నియమించారు. ఆ పోస్టులో ఉన్న అంకితను నిజామాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా బదిలీ చేశారు. కుష్బూ గుప్తాను ఉట్నూర్ ఐటీడీఏ పీఓగా నియమించారు. ఆ పోస్టులో ఉన్న ఛాత్‌బాజ్‌పాయ్‌ని జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

కొత్త నోటిఫికేషన్లకు జీవో 46 రద్దుపై పరిశీలన

- హైపవర్ కమిటీతో సీఎం సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎంపిక ప్రక్రియ పూర్తయిన పోస్టుల విషయంలో ముందుకు సాగేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా జారీ చేసే నోటిఫికేషన్లలో జీవో నం.46 రద్దుపై పరిశీలన చేయాలని నిర్ణయించింది. పోలీస్ నియామకాల్లో జీవో నం.46 రద్దు సాధ్యాసాధ్యాలపై సీఎం రేవంత్ రెడ్డి సోమవారం తన నివాసంలో హైపవర్ కమిటీతో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. మంత్రి శ్రీధర్ బాబు, ఏజీ సుదర్శన్ రెడ్డి, ఏఏజీ రంజిత్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి, నియామక బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఇతర ముఖ్య అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. చట్టపరమైన అనేక అంశాలపై చర్చించారు. గతంలో నోటిఫికేషన్ జారీ చేసి, సెలక్షన్ ప్రాసెస్ పూర్తయిన పోస్టులతోపాటు, కొత్త నోటిఫికేషన్‌పై ముందుకెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. 2022 మార్చిలో పోలీస్ నోటిఫికేషన్ జారీ అయింది. 2023 అక్టోబరులో 15,750 పోస్టులకు సెలక్షన్ ప్రాసెస్ పూర్తయింది. కోర్టు కేసుల వల్ల నియామకాలు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. సెలక్షన్ ప్రాసెస్ పూర్తైన పోస్టులకు నియామక పత్రాలు అందించాలని హైకోర్టు ఇటీవల తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో సెలక్షన్ ప్రాసెస్ పూర్తైన 15,750 పోస్టులకు నియామక పత్రాలు అందించడం తప్ప వేరే మార్గం లేదని ఉన్నతాధికారులు సీఎంకు వివరించారు. కొత్తగా ఇచ్చే నోటిఫికేషన్లకు జీవో నెం.46 రద్దు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. అసెంబ్లీలో చర్చించి కేబినెట్ సబ్‌కమిటీతో కొత్త నోటిఫికేషన్లలో జీవో రద్దుపై నిర్ణయం తీసుకుంటామని సీఎం వెల్లడించారు.

జీవో 46 అంటే..

జనాభా ప్రాతిపదికన జిల్లాల వారీ పోస్టులకు సంబంధించిన జీవో ఇది. 2022 ఏప్రిల్ 4న ఈ ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లాల వారీగా ఉండే 9 శాఖల పోస్టులను ఇందులో చేర్చారు. కానిస్టేబుల్ పోస్టులు కూడా ఈ జీవో కిందే భర్తీ చేయాల్సి వచ్చింది. దీంతో ఆ పరీక్ష రాసిన అభ్యర్థులు ఈ జీవో అంశాన్ని తెరమీదకు తెచ్చారు. జనాభా ప్రాతిపదికన తీసుకుంటుండడం, హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల పరిధిలోనే ఎక్కువ జనాభా ఉండడంతో వీరికే అవకాశాలు ఎక్కువగా వస్తున్నాయని మిగతా జిల్లాల అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ జీవోను రద్దు చేసి కానిస్టేబుల్ పోస్టులను రాష్ట్రస్థాయి పోస్టులుగా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడు కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థుల ఖరారు!

- ఏఐసీసీ కోటా సీటుకు సుబ్బరామిరెడ్డి, సుప్రియా శ్రీనాథే పేర్ల పరిశీలన
- మరో సీటుకు రేసులో చిన్నారెడ్డి, రేణుకాచౌదరి, వీహెచ్
- ఎంపికైన వారు రేపే నామినేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు సంబంధించి ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ సీట్లకు నామినేషన్లు దాఖలు చేయడానికి గడువు ఈ నెల 15న ముగియనుండడంతో అభ్యర్థుల ఎంపికను కాంగ్రెస్ అధిష్ఠానం ఒక కొలిక్కి తెచ్చింది. శాసనసభలో ఆ పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి రెండు సీట్లు దక్కనున్న సంగతి తెలిసిందే. వీటిలో ఒక సీటును ఏఐసీసీకి కేటాయించారు. ఈ కోటాలో కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బరామిరెడ్డి, ఏఐసీసీ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాథేల పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. మరో సీటుకు టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావుతో పాటు ఇటీవలే పార్టీలో చేరిన మరో నేత రేసులో ఉన్నట్లు చెబుతున్నారు. మంగళవారమే ఆ రెండు సీట్లకు అభ్యర్థులను ఖరారు చేసే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలోనే ఎంపికైన వారు బుధవారం నామినేషన్లు దాఖలు చేస్తారని చెబుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

diksuchi@andhrajyothy.com

హైదరాబాద్ ● మంగళవారం 13 ఫిబ్రవరి 2024

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్‌ఏఓయూ)- 2024 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో పలు స్టడీసెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో అకడమిక్ కోర్సులు

డిగ్రీ

● బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. ఏపీ/తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఓపెన్ స్కూల్ నుంచి ఇంటర్ ఉత్తీర్ణులు; పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో ఒకటి ఎంచుకోవాలి.

● బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు; ప్రొఫెషనల్ డిగ్రీ(లా/ఇంజనీరింగ్/ఫార్మసీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

పీజీ

● ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

● **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

● **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

● **అర్హత:** ద్వితీయశ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ(మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు బీఈ/బీటెక్ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

● మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ డిప్లొమా

● కోర్సు వ్యవధి ఏడాది. ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చార్టర్డ్ అకౌంటెన్సీ/కాస్ట్ అకౌంటెన్సీ/కంపెనీ సెక్రటరీ కోర్సులు పూర్తిచేసిన వారు కూడా అర్హులే.

డిప్లొమా

● కోర్సు వ్యవధి ఏడాది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

● **స్పెషలైజేషన్‌లు:** సైకలాజికల్ కౌన్సెలింగ్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, రైటింగ్ ఫర్ మాస్ మీడియా ఇన్ తెలుగు, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం, ఉమన్ స్టడీస్.

● రైటింగ్ ఫర్ మాస్ మీడియా ఇన్ తెలుగు విభాగానికి మాత్రం ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు మాస్ మీడియాలో కనీసం మూడేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సైకలాజికల్ కౌన్సెలింగ్ విభాగానికి(డిగ్రీ/ఎంఏ/ఎమ్మెస్సీ)(సైకాలజీ) పూర్తిచేసినవారు మాత్రమే అప్లయ్ చేసుకోవాలి.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

● కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

● **విభాగాలు:** ఫుడ్ అండ్ న్యూట్రిషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్.

● ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ కోర్సును ఇంగ్లీష్ మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

● **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29

● **వెబ్‌సైట్:** www.braouonline.in



ఆర్‌జీఐపీటీలో ఎంబీఏ

అమేథీలోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ(ఆర్‌జీఐపీటీ)కి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్)- ఎంబీఏ, ఎంబీఏ(బిజినెస్ అనలిటిక్స్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. జాతీయ పరీక్ష స్కోర్ ఉన్నవారు, లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దేశిత వెయిటేజీ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు. పార్ట్ టైం ప్రోగ్రామ్, స్పాన్సర్డ్ కేటగిరీ అడ్మిషన్స్ కూడా ఉన్నాయి.

ఎంబీఏ

స్పెషలైజేషన్‌లు: ఎనర్జీ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి, ఇంటర్, ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. క్యాట్ 2023/ జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఏటీ) 2024/సీమ్యాట్ 2024/జీమ్యాట్ 2022/జీమ్యాట్(2023/2024)/మ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి. ఈ అర్హత లేని పక్షంలో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ స్థాయుల్లో కనీసం 65 శాతం మార్కులు ఉండాలి.

ఎంబీఏ(బిజినెస్ అనలిటిక్స్)

ఇది మల్టీ డిసిప్లినరీ ప్రోగ్రామ్. ఇందులో అనలిటికల్ టూల్స్, టెక్నిక్స్, మెథడాలజీలకు సంబంధించిన కోర్సులు ఉంటాయి.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి, ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ/బీకాం/బీసీఏ/బీఏ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఏటీ) 2024/ సీమ్యాట్ 2024/జీమ్యాట్ (2023/2023)/మ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి. ఈ అర్హత లేని పక్షంలో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ స్థాయుల్లో కనీసం 65 శాతం మార్కులు ఉండాలి.

ఎంపిక

● నిర్దేశిత జాతీయ పరీక్షలో అభ్యర్థులు సాధించిన స్కోర్‌కు 65 శాతం, అకడమిక్ ప్రతిభకు 20 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 10 శాతం, అనుభవానికి 5 శాతం వెయిటేజీ ఇస్తూ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

● జాతీయ పరీక్ష అర్హత లేని పక్షంలో అకడమిక్ ప్రతిభకు 85 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 10 శాతం, అనుభవానికి 5 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

● పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో చేరేవారిని, స్పాన్సర్డ్ అభ్యర్థులను జాతీయ పరీక్ష స్కోర్‌నుంచి మినహాయించారు. వీరికి కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. వీరు సంస్థ నిర్వహించే ఎబిలిటీ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. అకడమిక్ ప్రతిభకు 30 శాతం, అనుభవానికి 15 శాతం, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌నకు 40 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వీరు పనిచేస్తున్న సంస్థ నుంచి రికమండేషన్ లెటర్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, లీవ్ అప్రూవల్ లెటర్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

● **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.400; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200

● **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 1

● **పర్సనల్ ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 5న

● **ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 8, 9

● **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 15న

● **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఏప్రిల్ 26

● **తరగతులు ప్రారంభం:** జూలై 29 నుంచి

● **వెబ్‌సైట్:** rgipt.ac.in



(నిన్నటి తరువాయి)

ఐరాసలో సంస్కరణలు

అవరోధాలు-పరిష్కారాలు

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

భారత్-భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి కృషి

ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశం భారత్. పటిష్ట అతిపెద్ద ప్రజాస్వామ్యయుత దేశం. ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఉంది. ఐక్యరాజ్య సమితి పీస్ కీపింగ్ ఫోర్స్‌లోనూ ఇతర సహాయ దళాల్లోనూ, అనేక ఒప్పందాల్లోనూ భారత్ సుదీర్ఘ భాగస్వామిగా సేవలందిస్తోంది. ఈ నేపథ్యంతోనే భద్రతా మండలిలో శాశ్వత సభ్య హోదాకు కొంతకాలంగా భారత దేశం ప్రయత్నిస్తోంది. భారత్ గతంలో ఎనిమిదిసార్లు భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యదేశంగా సేవలందించింది. ఆసియా-పసిఫిక్ కేటగిరీ నుంచి ఎన్నికైనప్పుడు 192కి 184 ఓట్లు సాధించింది. ఆ భారీ గెలుపు భారత్‌కు గల ప్రపంచ దేశాల మద్దతును మరోసారి ప్రతిఫలించింది. అయితే భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి పీ-5 దేశాలైన అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్ మద్దతు ప్రకటిస్తున్నప్పటికీ, చైనా అనేకసార్లు మోకాలు అడ్డుపెట్టింది.

భద్రతామండలిలో సంస్కరణల ఆవసరం

1. భద్రతామండలి ఏర్పాటైన తరవాత కేవలం 1963లో ఒక్కసారే విస్తరించారు. అది కూడా కొత్తగా నాలుగు తాత్కాలిక సభ్యదేశాలకు ఈ విస్తరింపు పరిమితమైంది. శాశ్వత సభ్యదేశాల సంఖ్యలో ఎలాంటి మార్పు లేదు.

2. భద్రతామండలి శాశ్వత సభ్య దేశాలుగా కేవలం కొన్ని ప్రాంతాలకు మాత్రమే ప్రాతినిధ్యం లభించింది. అన్ని ప్రాంతాలకు సమ ప్రాతినిధ్యం లేదు. లాటిన్ అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా వంటి కొన్ని ఖండాలకు సైతం ప్రాతినిధ్యం దక్కలేదు. అదేవిధంగా ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన భారత్, పీ-5 దేశాలతో అన్నివిధాలా సమఉజ్జీలైన జపాన్, జర్మనీ వంటి దేశాలకూ భద్రతా మండలిలో శాశ్వతస్థానం విస్తరించలేదు.

3. కేవలం రెండో ప్రపంచయుద్ధ విజేతలనే కారణంతో, అణ్వాయుధశక్తి గల దేశాలన్న స్థాయితో మాత్రమే అప్పుడు పీ-5 దేశాలకు శాశ్వత సభ్యత్వం దక్కింది. కానీ ప్రపంచ పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకున్న ఇంత సుదీర్ఘకాలం తరవాత కూడా అధికారం ఆ కొద్ది దేశాల చేతిలోనే కేంద్రీకృతమవడం ఏమంత ప్రజాస్వామికం కాదు. పైగా ఇప్పటికే అవి తమ వీటో పవర్‌ను తమ స్వలాభాలకు, రాజకీయ వ్యూహాత్మక లక్ష్యాల కోసం వినియోగిస్తున్నాయి.

4. భద్రతామండలి విస్తరణ లేకపోవడం, అధికారం కేంద్రీకృతం అవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా దీనికి ప్రత్యామ్నాయంగా అనేక దేశాలు కలిసి ఇప్పటికే సైనిక, ఆర్థిక, వ్యూహాత్మక సహకారాల కోసం వివిధ కూటములను ఏర్పాటు చేసుకున్నాయి. ఈ చర్యల ఫలితంగా భద్రతామండలి ప్రాబల్యం క్రమంగా తగ్గిపోయి అది ఒక క్రియాశూన్య సంస్థగా పరిణమించే అవకాశాలు లేకపోలేదు.

5. టెర్రరిజం, సైబర్ భద్రత, ప్రాదేశిక జలాలకు వెలుపల ఉన్న సముద్ర ప్రాంతంపై అజమాయిషీ, వాతావరణ మార్పులపై క్రియా విధానాలు వంటి కొన్ని నేటి ప్రధాన సమస్యలపై పటిష్ఠ విధానాలను అమలుచేయడంలో ఐక్యరాజ్య సమితి భద్రతామండలి విఫలమైంది. అత్యధిక వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్న దేశాలు, సముద్రాల్లో వ్యూహాత్మకంగా ఆక్రమణ చేపడుతోన్న దేశాలు, సైబర్ దాడులను ఆయుధాలుగా వినియోగిస్తున్న దేశాలు భద్రతామండలిలో శాశ్వత సభ్యదేశాలుగా ఉండటంతో అవి తమ ప్రయోజనాలకు భంగం కలిగేలా ఎలాంటి సంస్కరణలకూ పూనుకోవడం లేదు. ఇది భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వ విస్తరణ అవసరాన్ని తెలుపుతోంది.



6. చైనా వంటి శాశ్వత సభ్యదేశాలు తమ చేతుల్లో కేంద్రీకృతమైన అధికారాన్ని వదులుకోవడానికి ఇష్టపడటం లేదు. శాశ్వత సభ్యదేశాల విస్తరణను వీటో పవర్‌తో అడ్డుకుంటున్నాయి. అందువల్ల వీటో పవర్‌కు సంబంధించి సైతం కుదింపులు, సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

7. ఉత్తర-దక్షిణార్ధగోళ భౌగోళికతల పరంగానూ భద్రతామండలి శాశ్వత సభ్యత్వం కేంద్రీకృతంగానే ఉంది. దక్షిణార్ధగోళానికి ఎలాంటి ప్రాతినిధ్యం దక్కడంలేదు.

8. భద్రతామండలి శాశ్వత సభ్యదేశాలు రెండు కూటములుగా(అమెరికా దాని మిత్రదేశాలు వర్సెస్ రష్యా, చైనా)గా మోహరించి పరస్పర వ్యతిరేక ఎజెండాలను ఆశ్రయిస్తున్నాయి. అందువల్ల భద్రతామండలిపరంగా ఎలాంటి సకారాత్మక చర్యలూ పట్టాలెక్కడంలేదు. ఈ వైరుధ్యాల స్థానంలో సహకారం, సమతౌల్యతలను తీసుకురావడానికి, బాధ్యతాయుత ప్రవర్తనకూ భద్రతామండలి శాశ్వత సభ్యత్వ విస్తరణ, వీటో అధికారాల్లో సంస్కరణ అవసరం.

భారత్‌కు శాశ్వత సభ్యత్వం వల్ల ప్రయోజనాలు

● శాంతి సామరస్యాలు కోరుకొనే భారతదేశం - ఉగ్రవాదం, అక్రమ చొరబాట్లు, అంతర్జాతీయ సముద్ర జలాల భద్రత, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా ఆధిపత్య ధోరణి, కరోనా వైరస్ వంటి జీవాయుధాల సృష్టి, అంతర్జాతీయంగా కమ్ముకుంటున్న యుద్ధ పరిస్థితులు వంటి అనేక సమస్యలపరంగా భద్రతామండలి పటిష్ఠ చర్యలు తీసుకొనేవిధంగా అంతరంగిక ఒత్తిడి తీసుకురావచ్చు.

● భారత్ వంటి తటస్థ దేశం భద్రతామండలి శాశ్వత సభ్యత్వం, వీటో అధికారాలను కలిగి ఉండటం ద్వారా పీ-5 దేశాల నిర్ణయాల్లో ఆశ్రితపక్షపాతం, స్వప్రయోజనాలను నిలువరించవచ్చు.

● భారత్‌కు ప్రాతినిధ్యం దక్కడం ద్వారా ప్రపంచంలో 17.50% ప్రజలకు ప్రాతినిధ్యం దక్కినట్లవుతుంది.

● పాకిస్థాన్, చైనా వంటి సరిహద్దు దేశాల చొరబాట్లను, దుశ్చర్యలను మరింత సమర్థంగా నిలువరించే స్థాయి భారత్‌కు వస్తుంది.

● ఇప్పటికే ఐక్యరాజ్యసమితికి చెందిన అనేక ఒప్పందాల్లో, పీస్ కీపింగ్ మిషన్‌లో భాగస్వామిగా విస్తృత సేవలు అందిస్తున్న భారత్ మానవాళి సంక్షేమానికి వాటిని మరింత విస్తృతంగా చేపట్టవచ్చు.

భారత్ శాశ్వత సభ్యత్వానికి, భద్రతామండలి సంస్కరణలకు గల ప్రతిబంధకాలు

● కాంప్రహెన్సివ్ టెస్ట్ బ్యాన్ ట్రీటీ(సీటీబీటీ), న్యూక్లియర్ నాన్ ప్రొలిఫిరేషన్ ట్రీటీ(ఎన్‌పీటీ) వంటి ఒప్పందాలపై భారత్ సంతకం చేయకపోవడాన్ని చైనా వంటి దేశాలు ఒక సాకుగా చూపడం.

● భద్రతామండలికి సంబంధించి ఏ సంస్కరణలు తీసుకురావాలన్నా యూఎన్ చార్టర్ 'ఆర్టికల్ 108'లో చెప్పినవిధంగా ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను సవరించాల్సి ఉంటుంది. దీని ప్రకారం ఏ సంస్కరణనైనా కనీసం 2/3వ వంతు ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు ఆమోదించాల్సి ఉంటుంది. అదేవిధంగా అన్ని శాశ్వత సభ్యదేశాలూ ఏకగ్రీవంగా ఒప్పుకోవాల్సి ఉంటుంది. ఏ ఒక్క శాశ్వత సభ్యదేశమైనా ఒప్పుకోకుండా వీటో అధికారాన్ని ప్రయోగిస్తే అలాంటి సంస్కరణలు పట్టాలెక్కవు. కాబట్టి ఈ సంస్కరణలకు పీ-5 దేశాల వీటో అధికారం ప్రధాన అవరోధంగా ఉంది.

● అంతర్జాతీయ వ్యవహారాలు, తీర్మానాలు, ఆంక్షలు, సైనిక చర్యలపరంగా శాశ్వత సభ్యదేశాలు తమకే దత్తం అయిన ప్రత్యేక అధికారాల కట్టడికి, పంపకానికి అంగీకరించడం లేదు.

● తనకు సమ ఉజ్జీగా నిలువ గల భారత్‌కు తనతో సమానంగా శాశ్వత సభ్యదేశ హోదా, తద్వారా వీటో అధికారం లభించడం చైనాకు సుతరామూ ఇష్టంలేక భారత్ ప్రయత్నాలకు గండికొడుతోంది.

భారత్ కింకర్తవ్యం, ముందున్న ప్రత్యామ్నాయాలు

1. భారత్ సభ్యదేశంగా ఉన్న అనేక కూటముల ద్వారా భద్రతామండలి సంస్కరణల ఆవసరాలపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచి, ఒత్తిడి తీసుకురావడం.

2. భద్రతామండలి, ఐక్యరాజ్యసమితికి ప్రత్యామ్నాయ ప్రపంచ కూటమి దిశగా ఆలోచనలు చేస్తున్న భారత్ వంటి దేశాలు వాటిని మరింత ముందుకు తీసుకువెళ్లి ఒక సమగ్ర రూపాన్ని ఇవ్వడం. అయితే భద్రతామండలిలో సంస్కరణలు, భారత్‌కు ఇతర ఆశావహ దేశాలకు శాశ్వత సభ్యత్వం లభించడమనేది ప్రస్తుతమున్న అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో అంత సులువైన పనికాదు. శాశ్వత సభ్యదేశాల అనుచిత వర్గ ప్రయోజన చర్యలు, వ్యూహాత్మక ఎత్తుగడలకు అవి భద్రతామండలిలో తమ అధికారాన్ని వినియోగించడం(ఉదాహరణకు ఇజ్రాయెల్- పాలస్తీనా వివాదపరంగా భద్రతా మండలి ఇజ్రాయెల్‌ను నియంత్రిస్తూ చేసిన రిజల్యూషన్స్‌ను అమెరికా 16సార్లు తన వీటో అధికారం ప్రయోగించడం ద్వారా అడ్డుకుంది) ఒకటి. ఇలాంటి చర్యలను ప్రపంచ దృష్టికి విస్తృతంగా తీసుకురావడం ద్వారా, భద్రతామండలి సంస్కరణలపై ఆలోచనలు రేకెత్తి, భారత్‌కు మార్గం సుగమం అవుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

లిటిల్స్



బీర్బల్ తెలివి


అక్బర్ ఆస్థానంలో బీర్బల్ గొప్పతనం అందరికీ తెలుసు. ఎంతటి క్లిష్టసమస్యలైనా ఇట్టే పరిష్కరించగల మేధావి. ఏదీ కోప్పడకుండా నవ్వుతో సమస్యను విప్పి చెప్పి అందరినీ నవ్వించే తత్వం అతనిది. దీంతో అతనికి అక్బర్ ఆస్థానంలో మంచి పేరుంది. పైగా చక్రవర్తి అక్బర్ కూడా బీర్బల్‌కు మంచి స్నేహితుడు.

ఒక రోజు అక్బర్ కొలువులో ఉండగా కొందరు పర్షియా సైనికులు వచ్చారు. వారు ఓ ఆహ్వానాన్ని తీసుకొచ్చారు. 'బీర్బల్ మా దేశానికి రావాలి' అని అందులో ఉంది. బీర్బల్ కొలువుకు రాలేదు ఇంకా ఆ సమయంలో. సైనికులను పంపించాడు. ఓ సమస్యను ఊరిలో పరిష్కరిస్తున్న బీర్బల్ దగ్గరకు పోయి సైనికులు విషయం చెబుతూనే హుటాహుటిన బయలుదేరాడు. రాజ్యానికి వచ్చిన తర్వాత విషయం చెప్పారు అక్బర్. అతన్ని అభినందించాడు. పర్షియా చక్రవర్తి పిలుపు వచ్చింది.. ఆయన ఎందుకో నిన్ను తీసుకురమ్మన్నాడట.. మాకూ తెలీదు అన్నాడు అక్బర్.




ఆ సైనికులతో మరుసటి రోజు వస్తానని చెప్పాడు బీర్బల్. అనుకున్నట్లే పర్షియా రాజ్యానికి సైనికులతో వెళ్తానే రాచమర్యాదలు అందాయి. అక్కడి సైనికులు వారి రాజు దగ్గరకు తీసుకెళ్తున్నారు. ఇందులో ఏదో కిటుకు ఉందేమో అనుకున్నాడు బీర్బల్. రాజ్యంలోకి కొలువులోకి వెళ్తానే నీలం రంగు దుస్తుల్లో.. అందునా ఎర్రటోపీల్లో ఉన్నారు. సభలో అంతా ఆశీనులై ఉన్నారు. వంద కుర్చీలకు పైగా రాజులంతా ఒకేలా ఉన్నారు. ఇది కలయా? నిజమా? అనుకున్నాడు.ఆ తర్వాత రాజులు కూర్చున్న వారి సింహాసనాలవైపు చూశారు. అవి అచ్చు అన్నీ అలానే ఉన్నాయి. వెంటనే ఓ మంత్రి వచ్చి 'మీరు తెలివైన వారట.. మా రాజును కనుక్కోండి చూద్దాం.. ఈ సభలో' అన్నాడు. 'ఇంతటి మాయా?' అనుకున్నాడు బీర్బల్. సభనంతా తేరిపార చూసి ఓ వ్యక్తి దగ్గరకు వెళ్లాడు. 'జహాపనా.. ప్రణామాలు' అంటూ మూడు సార్లు అన్నాడు. 'మీకెలా తెలుసు' అని చక్రవర్తి అడిగారు. 'తెలిసిపోయింది' అన్నాడు. 'ఇది అసంభవం. అందరం ఒకే దుస్తులు ధరించాం. సింహాసనాలు కూడా ఒకే విధంగా ఉన్నాయి. మీకు ముందే మేము తెలుసా' అన్నాడు అక్కడి చక్రవర్తి. 'ఇది చాలా సులువు జహాపనా. అంతా బావుంది కానీ.. అందరూ మీ వైపు చూస్తున్నారు. మీరే చక్రవర్తినని సులువుగా తెలిసిపోయింది' అన్నాడు. వెంటనే చక్రవర్తి బీర్బల్‌ను అభినందించారు. రాచమర్యాదలతో దగ్గరుండి భోజనానికి తీసుకెళ్లారు. వెయ్యి వరహాలు బహుమతిగా ఇచ్చారు ఆ చక్రవర్తి.

6 తేడాలను గుర్తించండి





సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 228

3		7			6			
8	9		7	1				6
	5			4				
	3	9			5			
		6	4		9	5		
			2			6	3	
				5			8	
5				7	1		4	2
			3			7		5

సుడోకు - 227 సమాధానం

9	7	8	5	2	3	6	1	4
6	2	1	8	7	4	5	3	9
4	5	3	6	9	1	2	8	7
2	8	4	9	6	7	1	5	3
5	6	7	1	3	2	9	4	8
1	3	9	4	5	8	7	2	6
3	9	6	2	8	5	4	7	1
8	1	2	7	4	9	3	6	5
7	4	5	3	1	6	8	9	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.